www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సోమవారం | 23-12-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 | సంచిక (Issue) : 265

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, బహుళపక్షం; తిథి: అష్టమి సా. 5.08 తదుపరి నవమి; నక్షత్రం: ఉత్తర ఉ. 9.09 తదుపరి హస్త; వర్జ్యం: రా.6.38-8.27; దుర్ముహూర్తం: ఉ.12.36-1.20, ఉ.2.47-3.31; అమృతఘడియలు: తె.5.30 మొదలు; రాహుకాలం: ఉ.7.30-9.00, సూర్యోదయం: 6.45, సూర్యాస్తమయం: 5.43

వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

నిఘాసస్ నిజమే!

- అమెరికా చట్టాలను, వాట్సాప్ నిబంధనలను ఉల్లంఘించారు
- ఇజ్రాయెల్ కంపెనీ ఎన్ఎస్‌వో పెగాసస్‌పై అమెరికా కోర్టు నిర్ధారణ
- హర్షం వ్యక్తం చేసిన వాట్సాప్.. ఐదేళ్ల న్యాయపోరాటం ఫలించిందని వ్యాఖ్య
- నిఘాకు గురైన వారి పేర్లను కేంద్రం చెప్పాలి: కాంగ్రెస్ నేత రణ్‌దీప్ సుర్జేవాలా
- ఈ అంశంపై సుప్రీంకోర్టు చర్యలు తీసుకుంటుందా అని ప్రశ్న

2



చక్కెర కూడా వ్యసనమే

చిన్నారులు చక్కెరను ఎక్కువగా తినడం ఓ వ్యసనమే. కొకైన్‌తో పోలిస్తే.. చక్కెర 8 రెట్లు అధికంగా వ్యసనంగా మారుతుంది. 'నో యాడెడ్ షుగర్' అనే దాంట్లో వాస్తవం కొంత వరకే ఉంటుంది.

ఎలా తినాలంటే...

పిల్లలకు పోషకాహారాన్నే అందించాలి. ప్యాకేజ్డ్ ఆహారాన్ని వీలైనంత వరకు దూరం పెట్టాలి. దీని వల్ల చిన్నారుల్లో రోగ నిరోధకశక్తి పెరిగి, మెదడు అభివృద్ధి, శారీరక ఎదుగుదల సవ్యంగా ఉంటుంది. సమతుల, పోషకాహారాలతో దీర్ఘకాలిక అనారోగ్యాలు/ రుగ్మతలు/ వ్యాధులను నివారించవచ్చు.

ప్యాకేజ్డ్ విషం!

- ప్యాకేజ్డ్ ఆహారంతో చిన్నారులకు ఊబకాయం, మధుమేహం ముప్పు
- మెదడు మీద దుష్ప్రభావం
- ఆస్తమా, ఎలర్జీ వంటి రుగ్మతలు కూడా..
- ఫ్లేవర్డ్ మిల్క్, సెరల్స్‌లోనూ చక్కెర పరిమితికి మించి..
- చక్కెర తింటున్న చిన్నారులు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాము, వాసంతి (పేర్లు మార్చాం) దంపతులిద్దరూ ఉద్యోగస్తులే..! ఆరోగ్యం, ముఖ్యంగా తినే ఆహారం గురించి శ్రద్ధ ఎక్కువే..! కానీ, ఉన్న ఒక్కగానొక్క కొడుక్కి ఊబకాయం. వెంటనే ప్యాకేజ్డ్ ఫుడ్‌ని ఆపేయాలని డాక్టర్ హెచ్చరించారు. నిజానికి ఆ బాలుడికి ఉదయం అల్పాహారంగా కార్న్‌ఫ్లేక్స్ లేదా బ్రెడ్-జామ్, హెల్త్‌డ్రింక్ ఇస్తారు. మధ్యాహ్న భోజనం స్కూల్‌లోనే ఉంటుంది. సాయంత్రం స్నాక్స్ ఫ్లేవర్డ్ మిల్క్ ఇస్తారు. రాత్రి భోజనం ఇంట్లో వండినది గానీ, బయట ఆర్డర్ చేసింది గానీ పెడతారు. ప్యాకేజ్డ్ ఫుడ్ మాన్పించకపోతే కష్టమని డాక్టర్ చెప్పడంతో కంగుతిన్నారు. తాము ఆరోగ్య ఆహారాన్నే అందిస్తున్నామని చెప్పినా.. ప్యాకేజీ ఆహారంలో ఉండే అధిక చక్కెర, పిండిపదార్థాల

మిగతా 12వ పేజీలో...



లేబుల్‌ని చదవాల్సిందే

ప్యాకేజ్డ్ ఆహార పదార్థాల లేబుల్స్‌ని చదవాల్సిందే. వాటిల్లో నిల్వ కారకాలు, ఎడిటివ్స్, హిడెన్ షుగర్‌తోపాటు.. ఆహారం సమతుల్యమైనదేనా? కొవ్వుపదార్థాలు, పిండిపదార్థాలు, పీచుపదార్థాలు, మాంసకృత్తులు ఎంతమొత్తంలో ఉన్నాయో తెలుస్తుంది.

తగ్గేదే లే!



హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్



తొక్కిసలాట ఘటనపై మీడియాకు వీడియో ప్రజెంటేషన్ ఇస్తున్న పోలీసు అధికారులు

ముదురుతున్న తొక్కిసలాట వివాదం

పుష్ప-2 ప్రీమియర్ షో రోజు సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట వ్యవహారం రోజురోజుకూ ముదురుతోంది! ఆ సినిమాలోని 'తగ్గేదేలా' అన్న డైలాగ్ తరహాలో ఇరు వర్గాల మధ్య మాటల మంటలు రాజుకుంటున్నాయి! ఆరోజు జరిగిన ఘటనల క్రమాన్ని అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి వివరించడం.. దానిని ఖండిస్తూ సినీ నటుడు అల్లు అర్జున్ విలేకరుల సమావేశం నిర్వహించడం తాజా వివాదానికి కారణమైంది! 'ఓ మహిళ చనిపోయింది.. థియేటర్ నుంచి వెళ్లిపోవాలి' అంటూ పోలీసులు తనకు చెప్పలేదని అర్జున్ చెప్పడం వివాదాస్పదమైంది! దాంతో, పోలీసులు ఆదివారం స్పందించారు. ఆరోజు జరిగిన ఘటనల తాలూకు వీడియోలను విలేకరుల సమావేశంలో ప్రదర్శించారు! అల్లు అర్జున్‌ను థియేటర్ నుంచి ఏసీపీ, డీసీపీ బయటకు తీసుకువస్తున్న వీడియోను విడుదల చేశారు!

13

అల్లు అర్జున్ బెయిల్ రద్దు చేయండి!

- హైకోర్టులో నేడు పిటిషన్ వేయనున్న పోలీసులు
- కేసు విచారణ దశలో మీడియా సమావేశం పెట్టడంపై సీరియస్
- ఏ పోలీసు అధికారీ తనతో మాట్లాడలేదన్న అల్లు అర్జున్ వ్యాఖ్యలపైనా పూర్తి ఆధారాల సేకరణ

అల్లు అర్జున్ ఇంటిపై దాడి

- ముట్టడించిన ఓయూ జేఏసీ
- పూలకుండీల ధ్వంసం
- జేఏసీ నేతల అరెస్టు
- దాడిని ఖండిస్తున్నా: సీఎం

13



నిర్లక్ష్యానికి సాక్ష్యాలివిగో!

- అల్లు అర్జున్‌ను థియేటర్‌కు రానివ్వొద్దని ఆదేశిస్తూ సీఐ లేఖ.. అయినా పట్టించుకోని యాజమాన్యం
- మహిళ చనిపోయిందన్నా స్పందించని అర్జున్
- డీసీపీ వచ్చిన తర్వాత బయటకొచ్చారు
- సంధ్య థియేటర్ ఘటనపై ప్రజెంటేషన్ ఇచ్చిన హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్
- మేనేజర్ మమ్మల్ని అల్లు అర్జున్ వద్దకు వెళ్లనివ్వలేదు
- అతి కష్టం మీద వారిని నెట్టుకుంటూ వెళ్లాం
- సినిమా చూశాకే అర్జున్ వెళ్తానన్నారు: ఏసీపీ
- రేవతిని కాపాడేందుకు ప్రయత్నించాం
- ఆమె మృతితో 15 రోజులుగా మనశ్శాంతి లేదు: సీఐ
- పౌరుల భద్రతే మాకు ముఖ్యం: డీజీపీ జితేందర్

రేవతి మృతికి హీరోనే కారణం

- పోలీసులు చెప్పినా పట్టించుకోలే.. పరామర్శించడానికి లీగల్ సమస్య ఉంటుందా?
- సీఎంకు అర్జున్ క్షమాపణ చెప్పాలి: కోమటిరెడ్డి.. సీఎంపై ఆరోపణలు తగవు: మహేశ్‌గౌడ్
- అర్జున్ ఇంటిపై దాడి శాంతి భద్రతల వైఫల్యమే: కిషన్‌రెడ్డి.. కక్ష సాధింపు సరికాదు: బండి



2024 ముగిసిపోవచ్చింది. మరికొద్దిరోజుల్లో కొత్త ఏడాదిలోకే కాదు.. కొత్త ప్రమాదంలోకీ అడుగు పెట్టబోతున్నాం. పారిశ్రామిక విప్లవానికి ముందున్న ఉష్ణోగ్రతలతో పోలిస్తే భూతాపం 1.5 డిగ్రీలకు మించకుండా చూసుకుందామంటూ 2015లో ప్రపంచదేశాలు పారిస్‌లో కుదుర్చుకున్న ఒప్పందం అమలు కాలేదని.. ఆ పరిమితిని 2023లోనే దాటేశామని శాస్త్రజ్ఞులు ఇటీవల హెచ్చరించారు. భారత్ సహా చాలా దేశాల్లో ఇప్పటికే ఆ ప్రభావం కనపడుతోంది! ఎండాకాలంలో మును పెన్నడూ ఎరగని ఉష్ణోగ్రతలు.. వానాకాలంలో ముంచెత్తుతున్న వరదలు.. చలిదేశాల్లో నదులు ఎండిపోవడం.. ఎడారుల్లో వరదలు.. కార్చిచ్చు ఘటనలు పెరిగిపోవడం వంటి విపరీత పరిణామాలు సంభవిస్తున్నాయి. ఇకనైనా మానవాళి మేలుకుని భూతాపానికి చెక్‌పెట్టే సమర్థమైన చర్యలు తీసుకోకపోతే ప్రమాదమని శాస్త్రజ్ఞులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

1.5 డిగ్రీల ముప్పు

- భూమి సగటు ఉష్ణోగ్రతలు అంతకు మించి పెరగకూడదని 2015లో పారిస్‌లో ఒప్పందం
- భూతాప నియంత్రణలో విఫలం.. 2023లోనే దాటేశాం
- ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ప్రకృతి వైపరీత్యాలు

(సెంట్రల్ డెస్క్)

ఎండాకాలంలో భరించలేనంత వేడి. బయటికెళ్తే నెత్తి మాడ్చేసేంత ఎండ. చలికాలంలో భయంకరమైన చలి. వానాకాలంలో ఆనకట్టలు తెగిపోతాయేమో అన్నంత స్థాయిలో వరదలు.. ఇదీ కొన్నేళ్లుగా మన దేశంలో పరిస్థితి! ఒక్క భారత్‌లోనే కాదు.. ప్రపంచంలో చాలా దేశాల్లో ఇటీవల ప్రకృతి వైపరీత్యాలు సర్వసాధారణంగా మారాయి. దీనికి కారణం.. భూతాపం. నానాటికీ పెరుగుతున్న భూ ఉపరితల ఉష్ణోగ్రతలు మానవాళి మనుగడకే ప్రమాదకరంగా మారుతున్నాయి. భూమి సగటు ఉష్ణోగ్రత.. నాసా లెక్కల ప్రకారం 15 డిగ్రీలు. కానీ, పారిశ్రామికీకరణవల్ల వాతావరణంలోకి విడుదలయ్యే కర్బన ఉద్గారాలు, మానవ జీవనశైలిలో భారీ మార్పుల (ఏసీలు, ఫ్రిజ్‌లు, జనరేటర్లు, ఇన్వర్టర్ల వంటివాటి వాడకం పెరిగిపోవడం) కారణంగా భూమి

మిగతా 2వ పేజీలో...

వజ్రధూళితో భూతాపానికి చెక్!

- ఏటా 50 లక్షల టన్నుల వజ్రాల పొడి
- స్ట్రాటో ఆవరణంలోకి విడుదల చేయాలి
- జర్మనీ వాతావరణ శాస్త్రజ్ఞుల ప్రతిపాదన

2



రైతు భరోసా ఎగవేతపై ఎదిరించండి


- పంట పెట్టుబడి కోసం సర్కారును పట్టుబట్టండి
- అన్నదాతలకు కేటీఆర్ బహిరంగ లేఖ
- కృష్ణా జలాల్లో వాటా కోసం సీఎం రేవంత్ నోరు విప్పట్లేదని ఫైర్

హైదరాబాద్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): 'కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి చూస్తే.. కోతలు, కొర్రీలు పెట్టి రైతు భరోసాను ఎగవేసే ఎత్తుగడతో ఉన్నట్లు అర్థమవుతోంది. సంక్రాంతి తర్వాత రైతు భరోసా వేస్తామని.. అసెంబ్లీలో ఒక మాట చెప్పి తప్పించుకున్నారు. రైతన్నలారా.. పెట్టుబడి సాయం అందించకుండా రైతు భరోసా ఎగవేసే ప్రయత్నం చేస్తున్న కాంగ్రెస్ సర్కారును ఎదిరించండి' అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. ఆదివారం తెలంగాణలోని అన్నదాతలకు ఆయన బహిరంగ లేఖ రాశారు. 'రియల్ ఎస్టేట్ ప్లాట్లకు, క్వారీలకు రూ.22 వేల కోట్లు రైతు బంధు పేరిట ఇచ్చారని కాంగ్రెస్ సర్కారు దుర్మార్గ ప్రచారంతో రైతులను అవమానిస్తోంది. రైతాంగం మోసపోకుండా జాగ్రత్త పడాల్సిన సందర్భమిది.. స్థానిక సంస్థల

మిగతా 12వ పేజీలో...

మెడికల్ పీజీ ప్రవేశాలు ఆలస్యం

- హైకోర్టు తీర్పుపై సుప్రీంను ఆశ్రయించిన రాష్ట్ర సర్కారు
- స్టే కోసం యత్నం.. జనవరి 7న విచారణ
- ఫిబ్రవరి 5లోగా ప్రవేశాల పూర్తి తప్పనిసరి
- ఇప్పటికే అన్ని రాష్ట్రాల్లో రెండో రౌండ్ కౌన్సెలింగ్ పూర్తి
- జనవరిలో తరగతులు షురూ.. ఆందోళనలో విద్యార్థులు



హైదరాబాద్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఈఏడాది వైద్యవిద్య పోస్టు గ్రాడ్యుయేట్ ప్రవేశాల ప్రక్రియ మరింత ఆలస్యం కానుంది. ఇప్పటికే అఖిల భారత కోటా రెండో విడత కౌన్సెలింగ్ ప్రక్రియ నడుస్తోంది. ఈ కోటాతో సమానంగా అన్ని రాష్ట్రాలు తమ కోటా కౌన్సెలింగ్‌ను జరుపుతున్నాయి. పీజీ వైద్యవిద్య ప్రవేశాల్లో స్థానికతపై హైకోర్టులో కేసులు పడ్డాయి. తెలంగాణలో

మిగతా 14వ పేజీలో...



సాఫ్ట్‌వేర్‌పై తగ్గిన క్రేజ్.. సివిల్స్‌పై మోజు!

- తెలుగు రాష్ట్రాల్లో అభ్యర్థుల సంఖ్య పెరుగుదల
- ఏటా 40 వేల మంది వరకు పరీక్షలకు హాజరు
- మొత్తం పోస్టుల్లో 10% తెలుగువారి సొంతం

హైదరాబాద్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో ఏటా సివిల్స్ రాసే వారి సంఖ్య పెరుగుతోంది. ముఖ్యంగా ఇంజనీరింగ్ వంటి కోర్సులు చేసిన వారు సైతం సివిల్స్ వైపు మొగ్గు చూపుతున్నారు. ఐటీ రంగంలో ఇబ్బందులు, ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల్లో అస్థిరత.. అభ్యర్థులను సివిల్స్ వైపు వెళ్లేలా చేస్తున్నాయి. రెండేళ్ల నుంచి సాఫ్ట్‌వేర్ రంగంలో కొంత మందగమనం నెలకొంది. దాంతో ఇంజనీరింగ్ చదివిన అభ్యర్థులకు కూడా సరైన ఉద్యోగావకాశాలు లభించడం లేదు. ఒకవేళ ఉద్యోగం వచ్చినా నచ్చిన ప్యాకేజీ దక్కకపోవడం పాటు

మిగతా 14వ పేజీలో...

నేటి నుంచి ట్రాన్స్‌జెండర్లు ట్రాఫిక్ విధుల్లోకి

- దేశంలో ఎక్కడా లేని విధంగా శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పించాం
- బాధ్యతగా పనిచేస్తే మరిన్ని అవకాశాలు ఉంటాయి
- ఈ ప్రయోగం ఫలిస్తే వివిధ రాష్ట్రాలు ఇదే బాటలో..: సీవీ ఆనంద్



కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ట్రాఫిక్ శిక్షణ పొందిన ట్రాన్స్‌జెండర్లు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): శారీరక మార్పుల కారణంగా ట్రాన్స్‌జెండర్లను కుటుంబసభ్యులు, సమాజం చిన్నచూపు చూస్తోందని, వారికి తగిన అవకాశం కల్పిస్తే వారు కూడా ప్రతిభ చూపుతారని హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ అన్నారు. కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శిక్షణ పొందిన ట్రాన్స్‌జెండర్ల ప్రదర్శనను పరిశీలించారు. ఈ సందర్భంగా

మిగతా 12వ పేజీలో...

కువైత్‌తో భారత్‌కు చారిత్రక సంబంధాలు

- 1961 వరకూ భారత కరెన్సీ చలామణి
- వివిధ రంగాల్లో 10 లక్షల మంది భారతీయులు
- కువైత్‌లో ప్రధాని నరేంద్ర మోదీ ఇంటర్వ్యూ
- మోదీకి ఆ దేశ అత్యున్నత పురస్కారం

2



చెస్‌లో దేవాన్ష్ ప్రపంచ రికార్డు

- 175 క్లిష్టమైన పజిల్స్ 11.59 నిమిషాల్లో పూర్తి
- వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ నుంచి సర్టిఫికెట్
- భారత చెస్ క్రీడాకారులే దేవాన్ష్‌కు ప్రేరణ: లోకేశ్
- గర్విస్తున్నా! లిటిల్ గ్రాండ్ మాస్టర్: చంద్రబాబు

3

లంచం మింగిన అధికారి

- నోట్లు కక్కించిన లోకాయుక్త
- కర్ణాటకలోని కొప్పళ జిల్లాలో ఘటన
- ఎన్జీవోకు అనుమతి కోసం రూ.2 వేలు లంచం అడిగిన డిప్యూటీ రిజిస్ట్రార్
- రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న అధికారులు

2

చకచకా నడకతో.. బీపీ, షుగర్‌కు చెక్!

జపాన్ పరిశోధకుల తాజా అధ్యయనంలో వెల్లడి

న్యూఢిల్లీ, డిసెంబరు 22: మీకు వేగంగా నడిచే అలవాటుందా? పెద్ద పెద్ద అంగలు వేస్తూ మీ పక్కనున్నవారి కన్నా స్పీడుగా దూసుకుపోతారా? అయితే మీకో శుభవార్త. అలా వేగంగా నడిచేవారు మధుమేహం, అధిక రక్తపోటు, హృద్రోగాల బారిన పడే ముప్పు తక్కువని తాజా అధ్యయనంలో వెల్లడైంది. జపాన్‌కు చెందిన దోషీషా యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు.. స్థూలకాయం, నడుము చుట్టుకొలత ఎక్కువగా ఉన్న 25 వేల మందిపై ఈ అధ్యయనం చేశారు. ఆ పాతికవేల మందిలో.. తమను తాము 'వేగంగా నడిచేవారు'గా అభివర్ణించుకున్న వారికి మధుమేహం వచ్చే ముప్పు 30 శాతం తక్కువగా ఉన్నట్టు వెల్లడైంది. అలాగే రక్తపోటు, డిస్‌లిపిడెమియా (రక్తంలో కొవ్వు స్థాయులు అసాధారణంగా ఉండడం) ముప్పు కూడా తక్కువేనని తేలింది. వేగంగా నడిచేవారిలో కార్డియోరెస్పిరేటరీ ఫిట్‌నెస్ మెరుగ్గా ఉండడమే ఇందుకు కారణమని పరిశోధకులు తెలిపారు. కార్డియోరెస్పిరేటరీ ఫిట్‌నెస్ (సీఆర్‌ఎఫ్) అంటే.. వ్యాయామం చేస్తున్నప్పుడు, వేగంగా నడుస్తున్నప్పుడు మన శరీరంలోని రక్తప్రసరణ, శ్వాస వ్యవస్థలు స్కెలెటల్ మజిల్ మైటోకాండ్రియాకు అవసరమైన ప్రాణ వాయువును ఇవ్వగలిగే సామర్థ్యం. అవసరమైనంత ఆక్సిజన్‌ను ఈ రెండు వ్యవస్థలూ సరఫరా చేయగలిగితే సీఆర్‌ఎఫ్ మెరుగ్గా ఉన్నట్టు. అది బాగా ఉంటే.. శరీరంలో ఇన్‌ఫ్లమేషన్ (వాపు), ఆక్సిడేటివ్ స్ట్రెస్ (ఒత్తిడి) వంటివి తగ్గిపోతాయి. టైప్-2 మధుమేహం, హృద్రోగాల వంటి మెటబాలిక్ వ్యాధులు రావడానికి ఈ రెండే మూలం. వేగంగా నడిచేవారిలో సీఆర్‌ఎఫ్ మెరుగ్గా ఉండడంతో.. వారిలో ఈ రెండూ నియంత్రణలో ఉండి జీవనశైలి జబ్బులు వచ్చే ప్రమాదం తగ్గిపోతుందని పరిశోధకులు వివరించారు. కాబట్టి.. ఊబకాయంతో బాధపడేవారు కూడా వేగంగా నడవగలిగితే వారికి ఆ వ్యాధులు వచ్చే ముప్పు తగ్గుతుందని పేర్కొన్నారు.

నోట్లు మింగిన అవినీతి అధికారి

» కక్కించిన లోకాయుక్త బృందం


దస్తగిరి అలీ

బెంగళూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): లోకాయుక్త అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకోవడంతో ఓ అవినీతి అధికారి చేతిలోని కరెన్సీ నోట్లను గుటుక్కున మింగేశాడు. కర్ణాటకలోని కొప్పళ జిల్లా సహకార సంఘాల డిప్యూటీ రిజిస్ట్రార్ దస్తగిరి అలీ.. ఓ స్వచ్ఛంద సంస్థకు అనుమతి పత్రం ఇచ్చేందుకు రూ.2వేలు లంచం డిమాండ్ చేశాడు. ఆ సంస్థకు చెందిన భీమనగౌడ అనే వ్యక్తి లోకాయుక్త అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈ నెల 21న భీమనగౌడ రూ.500 నోట్లు నాలుగు దస్తగిరి అలీకి ఇవ్వగా అవి చేతిలో ఉన్న సమయంలోనే లోకాయుక్త అధికారులు పట్టుకున్నారు. అంతలోనే ఆ నోట్లను దస్తగిరి ఉండలా చుట్టి నోట్లో వేసుకున్నాడు. గొంతులో ఇరుక్కోవడంతో గాబరాపడ్డాడు. లోకాయుక్త అధికారులు ఆ నోట్లను కక్కించి కేసు నమోదు చేశారు.

లోకం తీరు



మెడికల్ కోర్సుల్లో మిగిలిన సీట్లకు ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించండి

» విలువైన సీట్లు వృథా కాకూడదు.. ఎంసీసీకి సుప్రీం ఆదేశాలు

న్యూఢిల్లీ, డిసెంబరు 22: వైద్య కళాశాలల్లో ప్రవేశాలకు సంబంధించి సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు ఇచ్చింది. నీట్ అయిదో విడత కౌన్సెలింగ్ తరువాత కూడా అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో సీట్లు మిగిలితే వాటి భర్తీకి ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించాలని ఆదేశించింది. ఈ నెల 30న అయిదో విడత కౌన్సెలింగ్ ముగియనుండడం గమనార్హం. దేశంలో వైద్యుల కొరత ఉందని, విలువైన సీట్లు వృథా కాకూడదన్న ఉద్దేశంతోనే ఈ ఆదేశాలు ఇస్తున్నట్టు తెలిపింది. ఈ ఒక్కసారికి ప్రత్యేక సందర్భంగా పరిగణించి ఈ ఆదేశాలు ఇస్తున్నట్టు పేర్కొంది. ఈ మేరకు జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ కె.వి.విశ్వనాథన్‌ల ధర్మాసనం మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ (ఎంసీసీ)కి ఆదేశాలు ఇచ్చింది. మిగిలిన సీట్లకు కూడా విడి/ప్రత్యేక (స్ట్రే/స్పెషల్) కౌన్సెలింగ్ నిర్వహించాలంటూ దాఖలైన పిటిషన్లపై జరిపిన ధర్మాసనం ఈ నిర్ణయాన్ని వెలువరించింది. కేవలం వెయింటింగ్ లిస్టులో ఉన్న అభ్యర్థులనే కౌన్సెలింగ్ చేసి సీట్లు కేటాయించాలని పేర్కొంది. ఏ కళాశాల కూడా అభ్యర్థులను నేరుగా చేర్చుకోకూడదని తెలిపింది. ఎన్‌ఆర్‌ఐ సీట్లలో ఖాళీలు ఉంటే వాటిని జనరల్ కోటా సీట్లుగా మార్చాలని తెలిపింది.

రాజీ ద్వారా పొందిన ఆస్తికి స్టాంప్ డ్యూటీ అక్కర్లేదు

న్యూఢిల్లీ, డిసెంబరు 22: తనకు హక్కుగా ఉన్న ఆస్తిని న్యాయస్థానంలో కుదిరిన రాజీ ద్వారా తిరిగి పొందితే, దాన్ని రిజిస్ట్రేషన్/మ్యుటేషన్ చేసేందుకు ఎలాంటి స్టాంపు డ్యూటీ చెల్లించాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఆ ఆస్తి కొత్త హక్కులనేమీ కల్పించలేదని, అందువల్ల స్టాంప్ డ్యూటీ వర్తించదని తెలిపింది. 'కాంప్రమైజ్ డిక్రీ'గా వ్యవహరించే ఈ లావాదేవీని రిజిస్ట్రేషన్ చట్టం-1908 ప్రకారం రిజిస్టర్ చేయించాల్సిన అవసరం లేదని పేర్కొంది. ఇది ఇండియన్ స్టాంప్స్ యాక్ట్-1899లోని సెక్షన్-3లో పేర్కొంటున్న విక్రయం/అన్యాక్రాంతం (కన్వేయాన్స్) అన్న నిర్వచనం పరిధిలోకి కూడా రాదని తెలిపింది. ఆ కారణంగా స్టాంప్ డ్యూటీ వసూలు చేయకూడదని వివరించింది. రాజీ మార్గం ద్వారా పొందిన ఆస్తి రిజిస్ట్రేషన్ నిమిత్తం రూ.6,67,500 స్టాంప్ డ్యూటీని చెల్లించాలంటూ మధ్యప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను కొట్టివేస్తూ జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌ల ధర్మాసనం ఈ మేరకు తీర్పు ఇచ్చింది. ఆ ఆస్తిని పిటిషనర్ ముఖేశ్ పేరున మార్చుతూ మ్యుటేషన్ చేయాలని అధికారులను ఆదేశించింది.

క్లైమాక్స్‌లో దొరికిన 'రియల్ పుష్ప'

» అర్ధరాత్రి పుష్ప-2 చూస్తుండగా గ్యాంగ్‌స్టర్ అరెస్టు

నాగ్‌పూర్, డిసెంబరు 22: నాగ్‌పూర్‌లోని ఓ మల్టీప్లెక్స్‌లో సినిమాను తలదన్నే సన్నివేశం. రీల్ రియల్‌గా మారిన వైనం. 'పుష్ప2: ద రూల్' సినిమా క్లైమాక్స్ సన్నివేశం సమీపించే సమయంలో పోలీసులు వచ్చారు. ఊహకే అందని విధంగా... ఉత్కంఠగా సినిమా చూస్తున్న 'రియల్ పుష్ప'ను అరెస్టు చేశారు. ఆ రియల్ పుష్ప పేరు విశాల్ మేశ్రం. కరుడుగట్టిన నేరగాడు. పది నెలలుగా తప్పించుకొని తిరుగుతున్నాడు. అతడిపై 27 కేసులు ఉన్నాయి. ఇందులో రెండు హత్య కేసులు. పోలీసులపై దాడులు చేసిన సంఘటనలూ ఉన్నాయి. మాదక ద్రవ్యాల స్మగ్లింగ్‌లో కీలక పాత్ర అతడిదే. సినిమాలో లీనమైపోయి చూస్తుండాన్ని గమనించిన పోలీసులు ప్రతిఘటించడానికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా పట్టుకున్నారు. సైబర్ నిఘా పరికరాల సాయంతో మేశ్రం రాకపోకలను పోలీసులు గుర్తించారు. కొత్త ఎస్‌యూవీలో సినిమాకు వచ్చినట్టు తెలుసుకున్నారు. థియేటర్ వద్దకు వచ్చారు. ముందుగా ఆ వాహనం టైర్లలోని గాలిని తీసేశారు. సినిమా హాల్లోకి వెళ్లి మేశ్రంను చూసి, పట్టుకొని వెళ్లిపోయారు.

ఆందోళనకరంగా రైతు నేత దల్లేవాల్ ఆరోగ్యం

న్యూఢిల్లీ, డిసెంబరు 22: నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న పంజాబ్ రైతు నేత జగ్జిత్ సింగ్ దల్లేవాల్(70) ఆరోగ్యం ఆందోళనకరంగా ఉందని ఆదివారం వైద్యులు తెలిపారు. ఆయనకు గుండెపోటు, పలు అవయవాల వైఫల్యం వంటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండు చేస్తూ ఆయన చేస్తున్న ఆందోళన 27వ రోజుకు చేరుకుంది. పంజాబ్, హరియాణ సరిహద్దు అయిన కనౌడీ సరిహద్దు వద్ద ఆయన నవంబరు 26 నుంచి ఆయన నిరాహార దీక్ష చేస్తున్నారు. ఆయన కాళ్లు, చేతులు చల్లబడ్డాయని, నరాల వ్యవస్థ, కాలేయం వంటి కీలక భాగాలు దెబ్బతిన్నాయని వైద్యులు తెలిపారు.

అమెరికా నిప్పుతో చెలగాటమాడుతోంది: చైనా


బీజింగ్, డిసెంబరు22: తైవాన్‌కు 571 మిలియన్ డాలర్ల రక్షణ సాయం ప్రకటించడం ద్వారా అమెరికా నిప్పుతో చెలగాటమాడుతోందని చైనా మండిపడింది. తైవాన్ జలసంధిలో శాంతి, స్థిరత్వాన్ని దెబ్బతీసే ప్రమాదకరమైన చర్యలు నిలిపివేయాలని హెచ్చరించింది. మరికొద్ది రోజుల్లో గద్దె దిగనున్న అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ తైవాన్‌కు ప్రకటించిన భారీ రక్షణ సాయంలో 295 మిలియన్ డాలర్ల విలువైన మిలిటరీ ఆయుధాలు విక్రయిస్తారు. అంతే కాదు తైవాన్ రక్షణ వ్యవస్థను మెరుగుపరిచేందుకు సైనిక విద్యతో పాటు శిక్షణ కోసం కూడా ఈ నిధులను ఖర్చు చేస్తారు. 2 కోట్ల 30 లక్షల జనాభా ఉన్న తైవాన్ ద్వీపాన్ని తన భూభాగమని చైనా వాదిస్తోంది.

విస్కీ ఫ్లేవర్లను పసిగట్టే కృత్రిమ మేధ!

లండన్, డిసెంబరు 22: ప్రోగ్రాములు రాయడానికి ఏఐ.. ఆరోగ్య సంరక్షణ రంగంలో ఏఐ.. ఈ-కామర్స్‌లో ఏఐ.. వ్యవసాయంలో, పరిశ్రమల్లో.. ఒకటా, రెండా ఇలా పలు రంగాల్లో కీలకపాత్ర పోషిస్తున్న కృత్రిమ మేధ ఇప్పుడు విస్కీ వాసనల్లో తేడాలను ఇట్టే పసిగట్టేస్తోంది! ఈ పని కోసం డిస్టిలరీలు బోలెడంత జీతాలిచ్చి పెట్టుకునే విస్కీ మాస్టర్లతో సరిసమానంగా పనిచేస్తోంది!! విస్కీ సీసా తీసుకొచ్చి, ఇలా మూత తీసి, అలా గ్లాసులో ఒంపేసి తాగేసే మందుబాబులకు విస్కీ రుచుల్లో, వాసనల్లో పెద్దగా తేడా తెలియకపోవచ్చుగానీ.. వాటిలో చాలా ఫ్లేవర్లుంటాయి. డిస్టిలరీలు రకరకాల వ్యక్తుల రుచులకు అనుగుణంగా రకరకాల ఫ్లేవర్ల విస్కీలను తయారుచేస్తుంటాయి. ఆ ఫ్లేవర్ సరిగా వచ్చిందా లేదా గుర్తించేందుకు విస్కీ మాస్టర్లను నియోగించుకుంటాయి. ఇలా మనుషుల అవసరం లేకుండా.. విస్కీ ఫ్లేవర్లను కృత్రిమ మేధ పసిగట్టగలదా లేదా? తెలుసుకునేందుకు.. జర్మనీలోని 'ఫ్రాన్‌హోఫెర్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ప్రాసెస్ ఇంజనీరింగ్ అండ్ ప్యాకేజింగ్' సంస్థకు చెందిన ఆండ్రియాస్ గ్రాస్‌కాంప్ అనే డేటా ఎనలిస్ట్, ఆయన బృందం కలిసి ఒక మెషీన్ లెర్నింగ్ అల్గారిథమ్‌ను రూపొందించారు. 16 రకాల విస్కీల మాలిక్యులార్ కాంపొజిషన్‌లను దానికి అనుసంధానం చేశారు. ఆ అల్గారిథమ్ తనకున్న ఇన్‌పుట్‌ల ఆధారంగా.. 16 విస్కీల్లోని 5 టాప్ ఫ్లేవర్లను విస్కీ మాస్టర్లతో సమానంగా కనుగొనగలిగింది.

బెజోస్ రెండో పెళ్లి ఖర్చు రూ.5,096కోట్లు

కొలరాడోలో ఈ నెల 28న వేడుక



వాషింగ్టన్, డిసెంబరు 22: అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ ఈ నెల 28న తన ప్రేయసి లారెన్ శాంచెజ్‌ను పెళ్లిచేసుకోబోతున్నారు. కొలరాడోలోని ఆస్పెన్‌లో దాదాపు 180 మంది సన్నిహితులు, కుటుంబ సభ్యులు, ప్రముఖుల సమక్షంలో బెజోస్-శాంచెజ్ వివాహం జరగనుంది. 60ఏళ్ల బెజోస్ తన రెండో పెళ్లికి ఏకంగా రూ.5,096కోట్లు ఖర్చు చేయనున్నట్లు సమాచారం. గతేడాది మే నెలలోనే బెజోస్-శాంచెజ్‌ల నిశ్చితార్థం జరిగింది. అప్పుడు బెజోస్ రూ.21కోట్ల విలువైన వజ్రాల ఉంగరంతో బెజోస్ ప్రపోజ్ చేశారని కథనాలు వెలువడ్డాయి. శాంచెజ్‌కు ఇది మూడో వివాహం. బెజోస్ తన మొదటి భార్య మెకంజీ స్కాట్‌కు 2019లో విడాకులు ఇచ్చారు.

కువైత్‌తో చారిత్రక సంబంధాలు

1961 వరకూ చలామణిలో భారత కరెన్సీ.. గల్ఫ్ కౌన్సిల్ దేశాల్లో భారతీయుల సేవలు

» కువైత్‌లోనే 10 లక్షల మంది ఇండియన్లు

» కువైత్‌లో ప్రధాని మోదీ ఇంటర్వ్యూ

(సెంట్రల్ డెస్క్)

గల్ఫ్ దేశం కువైత్‌తో భారతదేశానికి చారిత్రక సంబంధాలున్నాయని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. ఫైలకా ద్వీపంతో ఇరుదేశాల మధ్య ఉన్న బలమైన వ్యాపార సంబంధాల గురించి చరిత్ర వివరిస్తోందని.. 1961 వరకు కూడా కువైత్‌లో భారత కరెన్సీ చట్టబద్ధంగా చలామణిలో ఉండేదని గుర్తుచేశారు. ఇది ఇరు దేశాల మధ్య సమైక్యతకు నిదర్శనం కాగా.. ఇప్పుడు కూడా కువైత్‌కు భారతదేశం సహజ వాణిజ్య భాగస్వామిగా ఉందన్నారు. ఇరుదేశాల మైత్రీబంధాన్ని మరింత బలోపేతం చేసేందుకు సాంకేతికత మొదలు రక్షణ దాకా.. ద్వైపాక్షిక ఒప్పందాలు కుదుర్చుకుంటున్నట్లు వివరించారు. రెండ్రోజుల పర్యటనలో భాగంగా శనివారం కువైత్ చేరుకున్న ప్రధాని మోదీ, ఆదివారం కువైత్ రాజు, యువ రాజుతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కువైత్ వార్తా సంస్థ(కునా)కు ప్రత్యేకంగా ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూలోని ముఖ్యాంశాలు..

భారతీయులే గొప్ప వనరులు

కువైత్‌తోపాటు.. గల్ఫ్ సహకార దేశాల్లోనూ అభివృద్ధిలో 90 లక్షల మంది భారతీయులు పాలుపంచుకుంటున్నారు. ఒక్క కువైత్‌లోనే 10 లక్షల మందితో అతి పెద్ద భారతీయ కమ్యూనిటీ ఉంది. మౌలిక సదుపాయాల రంగంలో ప్రాజెక్టుల అమలులో వీరి పాత్ర కీలకం. కువైత్ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ కూడా భారత్‌లో పెద్దఎత్తున (2023లో 10 బిలియన్ డాలర్లు) పెట్టుబడులకు ఆసక్తి చూపుతోంది. ఇప్పుడు ద్వైపాక్షిక వాణిజ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లే విధంగా చర్చలు జరిగాయి. భారత్ విజన్-2047 (అమృత్‌కాల్ మహోత్సవ్), న్యూ కువైత్-2035 దార్శనిక లక్ష్యాలను సాధించేందుకు ఇరుదేశాలు పరస్పర సహకారాన్ని అందించుకుంటాయి. భారతీయ వ్యాపారులు, ఇంజనీర్లు, నర్సులు.. ఇలా వివిధ రంగాల వారు కువైత్‌కు గొప్ప వనరులుగా ఉన్నారు. ఇప్పటికే భారత అవసరాల్లో 3% ఇంధనాన్ని కువైత్ సరఫరా చేస్తోంది. ఈ రంగంలో గత ఏడాది 10 బిలియన్ డాలర్ల మేర దిగుమతులు జరిపాం. మాకు చమురు దిగుమతి పరంగా కువైత్ ఆరో అతిపెద్ద దేశం. లిక్విఫైడ్ పెట్రోలియం గ్యాస్ సరఫరా విషయంలో నాలుగో అతిపెద్ద దేశం. 2040 నాటికి కువైత్ తన ఎనర్జీ ప్రాజెక్ట్ వ్యూహం కింద ప్రతిష్ఠాత్మక పెట్రోకెమికల్ విజన్‌లో ఉమ్మడి పెట్టుబడుల దిశగా సాగుతున్నాం. సాంస్కృతికంగానూ ఇరుదేశాలు పరస్పర సహకారంతో ముందుకు సాగుతున్నాయి. గల్ఫ్ దేశాల్లో.. ముఖ్యంగా కువైత్‌లో భారతీయ సినిమాలకు విశేష ఆదరణ ఉంది. కువైత్ టీవీలో కూడా వారంలో మూడు షోలు భారతీయ సినిమాలు, నటులకు సంబంధించి ఉంటున్నాయని ఇక్కడి అధికారులు నాకు వివరించారు. 'నమస్తే కువైత్' పేరుతో కువైత్ నేషనల్ రేడియో హిందీ కార్యక్రమాలను ప్రసారం చేయడం, నా 'మన్ కీ బాత్' కార్యక్రమానికి ప్రాధాన్యత ఇవ్వడం సంతోషకరం.


ప్రధాని మోదీకి తమ దేశ అత్యున్నత పురస్కారం 'ది ఆర్డర్ ఆఫ్ ముబారక్ అల్-కబీర్'తో సత్కరిస్తున్న కువైత్ రాజు షేక్ మిశాల్

యుద్ధాల్లో శాంతిమంత్రం

రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలోనూ.. ఇజ్రాయెల్-హమాస్, హిజ్బుల్లా ఘర్షణల్లోనూ భారత్ శాంతిని కోరుకుంది. పశ్చిమాసియాలోని ఆయా దేశాల్లో శాంతి పునరుద్ధరణకు చేసే ప్రయత్నాలకు భారత్ మద్దతు ఎప్పటికీ ఉంటుంది. గాజాలో 70 టన్నులకు పైగా మానవతా సాయాన్ని పంపించాం. గత నెలలో 65 టన్నుల ఔషధాలను అందజేశాం. రెండేళ్లలో యూఎన్‌ఆర్‌డబ్ల్యూఏకు 10 మిలియన్ డాలర్ల మేర విరాళాలిచ్చాం. పర్యావరణ పరిరక్షణలోనూ భారత్ ముందుంటుంది.

ప్రధాని సభలో టీడీపీ జెండా రెపరెపలు

ప్రధాని మోదీ కువైత్ పర్యటనలో భాగంగా శనివారం జరిగిన సభలో టీడీపీ కార్యకర్తలు తమ పార్టీ పతాకాన్ని ప్రముఖంగా ప్రదర్శించారు. ప్రధాని ప్రసంగించిన శేఖ్ సాద్ అబ్దుల్లా స్టేడియంపైభాగంలోని గ్యాలరీలో ఒక చేత్తో త్రివర్ణ పతకాన్ని, మరో చేత్తో తెలుగుదేశం పార్టీ పతాకాన్ని రెపరెపలాడించారు.

మోదీకి కువైత్ అత్యుత్తమ పురస్కారం

ప్రధాని మోదీని కువైత్ ప్రభుత్వం తమ దేశ అత్యున్నత పురస్కారం 'ది ఆర్డర్ ఆఫ్ ముబారక్ అల్-కబీర్'తో సత్కరించింది. కువైత్ రాజు షేక్ మిశాల్ అల్-అహ్మద్ అల్-జాబేర్ అల్-సబా ఆదివారం మోదీకి ఈ అవార్డును అందజేశారు. స్నేహానికి చిహ్నంగా దేశాధినేతలకు, రాజ కుటుంబ సభ్యులకు కువైత్ ఈ పురస్కారాన్ని అందజేస్తుంది. కాగా.. కువైత్ పర్యటనలో భాగంగా రాజు షేక్ మిశాల్, యువరాజు షేక్ సబా అల్-ఖాలెద్ అల్-సబాతో వేర్వేరుగా భేటీ అయినట్లు ప్రధాని నరేంద్ర మోదీ ఎక్స్‌లో వెల్లడించారు. సమాచార సాంకేతికత(ఐటీ), ఫార్మా, ఫిన్‌టెక్, మౌలిక సదుపాయాలు, రక్షణ, వాణిజ్యం, అంతరిక్షం, క్రీడలు(2025-28 ఫ్రేమ్‌వర్క్), తదితర రంగాలపై ఇరుదేశాల మధ్య ఒప్పందాలు జరిగినట్లు విదేశాంగ శాఖ ట్వీట్ చేసింది. 2025-29 అంతర్జాతీయ సౌరకూటమి ఫ్రేమ్‌వర్క్ పైనా ఇరుదేశాల విదేశాంగ మంత్రులు సంతకాలు చేశారు.

ఈసీ సమగ్రతను దెబ్బతీసే కుట్ర

» సీసీటీవీ ఫుటేజ్, వీడియోలు ఇవ్వొద్దనడంపై ఖర్గే ఆగ్రహం



న్యూఢిల్లీ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ఎన్నికల కమిషన్ (ఈసీ) సమగ్రతను మోదీ ప్రభుత్వం నాశనం చేస్తోందని ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే ఆరోపించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఎలక్ట్రానిక్ సమాచారమైన సీసీటీవీ ఫుటేజీ, అభ్యర్థుల వీడియో రికార్డులను ప్రజల తనిఖీ నిమిత్తం ఇవ్వాల్సిన పనిలేదంటూ కేంద్ర న్యాయశాఖ నిబంధనలను సవరించడాన్ని రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపై దాడిగా అభివర్ణించారు. 'తొలుత ఎన్నికల కమిషనర్ల నియామక ప్యానెల్ నుంచి వారు భారత ప్రధాన న్యాయమూర్తిని తొలగించారు. ఇప్పుడు హైకోర్టు ఆదేశాలున్నా.. ఎన్నికలకు సంబంధించిన సమాచారం ఇవ్వకుండా అడ్డుకున్నారు. క్వాసీ-జ్యుడీషియల్ సంస్థ అయిన ఈసీ.. స్వతంత్రంగా వ్యవహరించడం లేదనడానికి ఇది మరో రుజువు' అని ఖర్గే పేర్కొన్నారు. కేంద్రం నిర్ణయాన్ని కోర్టులో సవాల్ చేస్తామని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ తెలిపారు.

71 వేల మందికి కేంద్ర కొలువులు

న్యూఢిల్లీ, డిసెంబరు 22: కేంద్ర ప్రభుత్వ శాఖల్లో సోమవారం కొలువుల జాతర జరగనుంది. 'రోజ్‌గార్ మేళా'లో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ 71 వేల మంది యువకులకు నియామక పత్రాలను ఇవ్వనున్నారు. దేశవ్యాప్తంగా 45 కేంద్రాల్లో జరిగే రోజ్‌గార్ మేళా కార్యక్రమంలో ప్రధాని వర్చువల్‌గా పాల్గొని ప్రసంగిస్తారు. అనంతరం ఆయా ప్రాంతాల్లో కేంద్ర మంత్రుల ద్వారా నియామక పత్రాలను పంపిణీ చేస్తారు. కేంద్ర హోంశాఖ, పోస్టల్ శాఖ, ఉన్నత విద్య, వైద్య ఆరోగ్యం-కుటుంబ సంక్షేమం, ఆర్థిక సేవలు తదితర శాఖల్లో 71 వేల మందిని ఒకేసారి భర్తీ చేయనున్నట్లు ప్రధాన మంత్రి కార్యాలయం(పీఎంవో) ఒక ప్రకటనలో తెలిపింది.

ఆ థంబ్‌నెయిల్స్‌పై ఇక నిషేధం

యూట్యూబ్‌లో అలాంటి వీడియోల తొలగింపు

న్యూఢిల్లీ, డిసెంబరు 22: మన దేశంలో కోట్లాది మందికి యూట్యూబ్ ఆదాయ మార్గంగా మారింది. అలాంటి యూట్యూబ్‌లో కొందరు కంటెంట్ క్రియేటర్లు వారి వార్తలు, వీడియోలకు వీక్షణలు(వ్యూస్), వినియోగదారులు (సబ్‌స్క్రైబర్ల) కోసం 'క్లిక్ బెయిట్ థంబ్‌నెయిల్స్' లాంటి అడ్డదారులు తొక్కుతున్నారు. అంటే వీడియోలో లేని అంశాన్ని దాని థంబ్‌నెయిల్‌లో రాయడం/శీర్షిక పెట్టడం లేదా థంబ్‌నెయిల్‌లో తప్పుడు ఫొటోలు పెట్టడం చేస్తున్నారు. ఇలా తప్పుదోవ పట్టించే థంబ్‌నెయిల్స్‌పై చాలా మంది వినియోగదారులు యూట్యూబ్ సంస్థకు ఫిర్యాదు చేశారు. దీన్ని తీవ్రంగా పరిగణించిన యూట్యూబ్ యజమాన్యం.. కఠిన చర్యలు చేపట్టింది. వీక్షకులను తప్పుదోవ పట్టించేలా ఉండే ఇలాంటి థంబ్‌నెయిల్స్‌పై నిషేధం విధించింది. వీటిని నిర్ధారించేందుకు కొన్ని నిబంధనలు పెట్టింది. ముఖ్యంగా బ్రేకింగ్ న్యూస్, ట్రెండింగ్ అంశాలకు సంబంధించిన వీడియోలపై దృష్టి సారించింది. ఈ విభాగాల్లో వీడియోలు పెట్టే కంటెంట్ క్రియేటర్లు లేదా చానెళ్లకు యూట్యూబ్ కొత్త విధానాన్ని అమలు చేయనుంది. తప్పుడు సమాచారం ఇచ్చే చానెళ్లకు తొలి హెచ్చరికగా వీడియోలు మాత్రమే తొలగిస్తారు. పదేపదే అలాంటి థంబ్‌నెయిల్స్ పెడితే జరిమానా విధిస్తారు. ఇలాంటి థంబ్‌నెయిల్స్‌ను గుర్తించేందుకు 'క్రియేటివ్ ఆర్టిస్ట్స్ ఏజెన్సీ (సీఏఏ)' సంస్థతో కలిసి పనిచేస్తున్నట్లు వెల్లడించింది.

నిఘా సస్ నిజమే

» అమెరికా చట్టాలను, వాట్సాప్ నిబంధనలను ఉల్లంఘించారు

» ఇజ్రాయెల్ కంపెనీ ఎన్‌ఎస్ఓ పాత్రపై అమెరికా కోర్టు నిర్ధారణ



వాషింగ్టన్, డిసెంబరు 22: పెగాసస్ సాఫ్ట్‌వేర్ ద్వారా వాట్సాప్ వినియోగదారులపై నిఘా నిజమేనని అమెరికాలోని ఓ కోర్టు నిర్ధారించింది. పెగాసస్ సాఫ్ట్‌వేర్ తయారీ సంస్థ అయిన ఎన్‌ఎస్ఓ గ్రూప్ టెక్నాలజీస్..అమెరికా హ్యాకింగ్ చట్టాలనేగాక వాట్సాప్ నియమ నిబంధనలను కూడా ఉల్లంఘించిందని కోర్టు స్పష్టం చేసింది. ఇజ్రాయెల్‌కు చెందిన ఎన్‌ఎస్ఓ గ్రూప్ టెక్నాలజీస్‌పై వాట్సాప్ యాజమాన్య సంస్థ మెటా.. కాలిఫోర్నియాలోని ఓక్లాండ్ న్యాయస్థానంలో ఐదేళ్ల క్రితం దావా వేసింది. తన వినియోగదారుల్లో 1400 మంది (వీరిలో 300 మంది భారతీయులు) ఫోన్లపై 2019 మే నెలలో రెండు వారాలపాటు ఎన్‌ఎస్ఓ నిఘా పెట్టిందని ఆరోపించింది. దీనిపై విచారణ కొనసాగించిన మహిళా న్యాయమూర్తి ఫిలిస్ హామిల్టన్ శుక్రవారం తీర్పును వెలువరించారు. ఎన్‌ఎస్ఓ కంపెనీ ఉల్లంఘనలకు పాల్పడిన విషయం వాస్తవమేనని నిర్ధారించారు. దీనిపై వాట్సాప్ హర్షం వ్యక్తం చేసింది. 'ఐదేళ్ల న్యాయపోరాటం ఫలించింది. వాట్సాప్, జర్నలిస్టులు, మానవ హక్కుల కార్యకర్తలు, పౌరసమాజంపై చట్టవ్యతిరేక దాడులకు పాల్పడిన ఎన్‌ఎస్ఓ ఆ తప్పుల నుంచి ఇక ఎంతమాత్రం తప్పించుకోలేదు. స్పైవేర్ కంపెనీలకు ఈ తీర్పు ఒక హెచ్చరికలాంటిది' అని పేర్కొంది. కాగా, వాట్సాప్‌కు ఎన్‌ఎస్ఓ సంస్థ ఎంత నష్టపరిహారం చెల్లించాలన్న దానిపై వచ్చే ఏడాది మార్చిలో మరో కోర్టు విచారణ చేపట్టనుంది.

వారి పేర్లను కేంద్రం వెల్లడించాలి:సుర్జేవాలా

పెగాసస్ స్పైవేర్‌ను ఉపయోగించి 300 మంది భారతీయుల వాట్సాప్ నెంబర్లపై నిఘా పెట్టినట్లు అమెరికా కోర్టు నిర్ధారించిన నేపథ్యంలో.. కేంద్రానికి, సుప్రీంకోర్టుకు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రణ్‌దీప్ సుర్జేవాలా ఆదివారం పలు ప్రశ్నలు సంధించారు. నిఘాకు గురైన ఆ 300 మంది ఎవరన్న వివరాలను మోదీ ప్రభుత్వం వెల్లడించాలని డిమాండ్ చేశారు. పెగాసస్ సాఫ్ట్‌వేర్‌తో పలు రంగాలకు చెందిన వారి ఫోన్లపై నిఘా పెట్టారని వచ్చిన ఆరోపణలను ప్రస్తావిస్తూ.. 'నిఘాకు గురైన ఆ ఇద్దరు కేంద్రమంత్రులు ఎవరు? ముగ్గురు ప్రతిపక్ష నేతలు ఎవరు? జర్నలిస్టులు, వ్యాపారవేత్తలు ఎవరు? ఈ నిఘా ద్వారా బీజేపీ ప్రభుత్వం, దాని సంస్థలు ఏ వివరాల్ని సేకరించాయి? ఆ సమాచారాన్ని ఎలా వినియోగించారు?' అంటూ ప్రశ్నలు గుప్పించారు. ఈ పనికి పాల్పడిన ప్రభుత్వ అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తారా అని నిలదీశారు. 'పెగాసస్ స్పైవేర్‌పై 2021-22లో సాంకేతిక నిపుణుల కమిటీ సమర్పించిన నివేదికను సుప్రీంకోర్టు ఇకనైనా బహిరంగపరుస్తుందా?' అని రణ్‌దీప్ సుర్జేవాలా ప్రశ్నించారు. కాగా, పెగాసస్ ద్వారా పలు దేశాల ప్రభుత్వాలు తమ సొంత పౌరుల మీదే నిఘా పెట్టాయని 2021లో ఓ అంతర్జాతీయ మీడియా వేదిక వెల్లడించటంతో ఈ వ్యవహారం బయటపడింది. అయితే, పెగాసస్ నిఘా అవాస్తవమంటూ పెగాసస్‌పై కేంద్రం ఏర్పాటు చేసిన సాంకేతిక నిపుణుల కమిటీ తేల్చిందని సుప్రీంకోర్టు పేర్కొంది.

1.5 డిగ్రీల ముప్పు

(మొదటి పేజీ తరువాయి)



సగటు ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరిగాయి. పారిశ్రామిక యుగం మొదలైన తర్వాత భూ ఉపరితల ఉష్ణోగ్రతలు పెరగడం మొదలై ఆ ప్రభావం ప్రకృతిపై పడింది. దీనివల్ల హిమనీనదాలు, ఆర్కిటిక్ ప్రాంతంలో మంచు భారీగా కరిగి ప్రపంచవ్యాప్తంగా సముద్రమట్టాలు పెరిగాయి. సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతల్లో సైతం పెనుమార్పులు సంభవించి.. రుతువులు గతి తప్పడం మొదలైంది. సకాలంలో వానలు కురవకపోవడం.. కురిస్తే కుంభవృష్టిగా ముంచెయ్యడం.. ఎండాకాలంలో రికార్డుస్థాయి ఉష్ణోగ్రతలు నమోదు కావడం.. ఒక ఏడాది అతివృష్టి, మరో ఏడాది అనావృష్టి.. ఇలా తీవ్రస్థాయి ప్రకృతి విపత్తులు భయపెడుతున్నాయి. ఈ పరిస్థితిని ఊహించే.. ప్రపంచ దేశాల ప్రతినిధులు 2015లో దాదాపు రెండువారాలపాటు పారిస్‌లో సమావేశమై పర్యావరణ ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. భూమి సగటు ఉష్ణోగ్రతలు 1850-1900 నాటికి ఎంత ఉన్నాయో.. దానికి 1.5 డిగ్రీలకు మించి పెరగకుండా చూసుకోవాలన్నది ఆ ఒప్పందం సారాంశం. ఈ మేరకు కర్బన ఉద్గారాలను దశలవారీగా తగ్గించుకునేందుకు ప్రపంచదేశాలకు వెసులుబాటు కల్పించారు. కానీ.. ఒక్క 2023లోనే ప్రపంచదేశాల చర్యలు భూతాపాన్ని 1.49 డిగ్రీల మేర పెంచాయని, ఇప్పుడు ఆ పరిమితిని కూడా దాటేశామని లీడ్స్, లాంకస్టర్ వర్సిటీల పరిశోధకుల అధ్యయనంలో వెల్లడైంది. పారిస్ ఒప్పందంలో విధించుకున్న 1.5 డిగ్రీల పరిమితిని దాటకూడదనుకుంటే ప్రపంచదేశాలు 2019తో పోలిస్తే.. 2030 నాటికి 43% మేర తమ కర్బన ఉద్గారాలను తగ్గించుకోవాల్సి ఉంటుంది. కానీ.. 2023 గడిచిపోయే నాటికి కూడా కర్బన ఉద్గారాల స్థాయుల్లో తగ్గుదల నమోదు కాలేదు సరికదా.. ఉద్గారాలు ఇంకా పెరుగుతూనే ఉన్నాయి.

రెండు కారణాలు..

భూతాపానికి రెండు కారణాలుంటాయి. ఒకటి ప్రకృతి సహజమైనది, రెండోది మానవ కారకం. మానవుల నిర్లక్ష్యం కారణంగా పర్యావరణంలో మార్పులు కలగడం మొదలైంది 1850ల నుంచి అని శాస్త్రజ్ఞులు ఇన్నాళ్లుగా భావిస్తున్నారు. కానీ లీడ్స్, లాంకస్టర్ వర్సిటీల పరిశోధకులు.. ప్రాచీన మంచు ఫలకాలపై చిక్కుకుపోయిన వాయువులను విశ్లేషించి, మానవ కారక పర్యావరణ మార్పులు 1700 నుంచే ప్రారంభమైనట్టు తమ అధ్యయనంలో తేలిందని వెల్లడించారు. 2015లో పారిస్‌లో జరిగిన కాప్ 21 సదస్సులో సమావేశమైన ఐపీసీసీ లెక్కల ప్రకారం మానవుల వల్ల పెరిగిన ఉష్ణోగ్రతలు 1.31 డిగ్రీల సెల్సియస్ అయితే.. లీడ్స్, లాంకస్టర్ వర్సిటీ పరిశోధకుల లెక్కల ప్రకారం అది ఎప్పుడో 1.5 డిగ్రీలు దాటిపోయింది!! కోపర్నికస్ క్లైమేట్ చేంజ్ సర్వీస్ (సీ3ఎస్) కూడా 2024 ముగిసేనాటికి భూమి సగటు ఉష్ణోగ్రత ఆ 1.5డిగ్రీలను దాటబోతున్నట్టు అంచనా వేసింది. .

అగ్రదేశాలు డబ్బులిచ్చేనా?

కోపెన్‌హ్యాగన్‌లో 2009లో జరిగిన కాప్ సదస్సులో కుదుర్చుకున్న ఒక ఒప్పందం ప్రకారం.. పారిశ్రామికీకరణతో లాభపడ్డ అమెరికా, యూరోపియన్ దేశాలు, కర్బన ఉద్గారాలను తగ్గించుకోవాలనుకునే దేశాలకు పదిహేనేళ్లపాటు ఏడాదికి 100 బిలియన్ డాలర్ల ఆర్థిక సాయం చేయాల్సి ఉంది. కానీ, ఆ హామీని అవి నిలబెట్టుకోలేకపోయాయి. 2020 నుంచి మొదలుపెట్టి నాలుగేళ్ల మాత్రమే ఇచ్చాయి. ఈ నేపథ్యంలో.. కిందటి నెలలో (నవంబరు 11-22 నడుమ) అజర్‌బైజాన్‌లోని బకులో జరిగిన కాప్-29 సదస్సులో ఇది ప్రధాన అంశంగా మారింది. ఏడాదికి 100 బిలియన్ డాలర్లు కాదని.. అభివృద్ధి చెందిన దేశాలు 'క్లైమేట్ ఫైనాన్స్' కింద ఏడాదికి లక్ష కోట్ల డాలర్ల చొప్పున ఇవ్వాలని అభివృద్ధి చెందుతున్న దేశాలు డిమాండ్ చేశాయి. కానీ.. చివరికి ఏటా 300 బిలియన్ డాలర్లు ఇవ్వడానికి ఆ సదస్సులో ఒప్పందం కుదిరింది. అయితే.. 2015 నుంచి 2024 నడుమ ఏడాదికి 100 బిలియన్ డాలర్లే ఇవ్వని దేశాలు ఇకపై ఏటా 300 బిలియన్ డాలర్లు ఇస్తాయా? అన్నది.. ట్రిలియన్ డాలర్ల ప్రశ్న!!

1.5 డిగ్రీల పరిమితి దాటితే?

భూతాపం 1.5 డిగ్రీల పరిమితి దాటితే సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సైతం పెరిగి కొన్నిరకాల సముద్ర జీవులు వేరే ప్రాంతాలకు వలసవెళ్లిపోతాయి. దీనివల్ల సముద్ర జీవావరణం దెబ్బతింటుంది. అలా వేరే ప్రాంతాలకు వలస వెళ్లలేని జీవులు, పగడపు దీవులు అంతరించిపోతాయి. పసిఫిక్ మహాసముద్రంలో కొన్ని దీవులు మునిగిపోతాయి. సముద్ర పర్యావరణం దెబ్బతినడంతో ఆహార సరఫరా శృంఖలానికి (ఫుడ్ సప్లై చైన్) విఘాతం కలుగుతుంది. ధ్రువపు మంచు కరిగి సముద్రమట్టాలు పెరగడంతో తీరప్రాంతాలు మునిగిపోతాయి. వీటన్నింటివల్లా ఏడాదికి దాదాపు 11 ట్రిలియన్ డాలర్ల నష్టం వాటిల్లుతుంది. అభివృద్ధి చెందిన దేశాల్లో సైతం.. కార్చిచ్చు ఘటనలు పెరిగి వాయుకాలుష్యం ప్రబలుతుంది. సమయం సందర్భం లేకుండా.. రుతువులతో సంబంధం లేకుండా.. వానలు కురుస్తాయి. కరువులు వేధిస్తాయి. ఫలితంగా పేదరికం పెచ్చరిల్లుతుంది.

వజ్రధూళితో భూతాపానికి చెక్!

కర్బన ఉద్గారాలకు చెక్ పెట్టాలంటే ఏం చేయాలన్న అంశంపై శాస్త్రజ్ఞులు చాలాకాలంగా పరిశోధనలు చేస్తూనే ఉన్నారు. ఈ క్రమంలోనే.. జ్యూరిక్ (జర్మనీ)లోని 'ఇన్‌స్టిట్యూట్ ఫర్ అట్మాస్ఫియరిక్ అండ్ క్లైమేట్ సైన్స్' శాస్త్రజ్ఞులు 'స్ట్రాటోస్ఫియరిక్ ఏరోసాల్ ఇంజెక్షన్ (ఎస్ఏఐ)' అనే విధానంపై రిసెర్చ్ చేశారు. అర్థమయ్యే భాషలో చెప్పుకోవాలంటే.. భూమిపై ఉండే స్ట్రాటో ఆవరణంలో రేణువులను వెదజల్లడం. అప్పుడు సూర్యకాంతి వాటిపై పడి ఎక్కువ భాగం పైకే ప్రతిఫలిస్తుంది. ఫలితంగా భానుడి తీక్షణత తగ్గి భూతాపం తగ్గుతుంది. ఇందుకు సల్ఫర్ డయాక్సైడ్‌ను ఉపయోగించాలనుకున్నారు. కానీ, దానివల్ల ఆమ్ల వర్షాలు కురిసే ముప్పుండడం, ఓజోన్ పొర దెబ్బతింటుందని తెలియడంతో.. మరో ఆరు రకాల పదార్థాలపై దృష్టి సారించారు. అవి.. వజ్రాల పొడి, క్యాల్సైట్, అల్యూమినియం, సిలికాన్ కార్బైడ్, అనటేజ్, రుటైల్. 45 ఏళ్లపాటు ఏటా స్ట్రాటో ఆవరణంలో ఈ పార్టికల్స్‌ను వెదజల్లితే దేని ప్రభావం ఎలా ఉంటుందో కంప్యూటర్ నమూనాల ద్వారా విశ్లేషించి, చివరికి వజ్రధూళే అన్నింటికన్నా ఉత్తమం అని తేల్చారు. దానివల్ల భూతాపం 1.6 డిగ్రీల మేర తగ్గిపోతుందని వారి విశ్లేషణలో వెల్లడైంది. కానీ.. దానికి అయ్యే ఖర్చు ఏకంగా ఏడాదికి 200 ట్రిలియన్ డాలర్లు. ఒక ట్రిలియన్ డాలర్ అంటేనే మన కరెన్సీలో దాదాపు రూ.84.4 లక్షల కోట్లు! ఇక 200 ట్రిలియన్ డాలర్లంటే ఎంత ఖర్చో ఊహించుకోండి!!

వచ్చేనెల దావోస్‌కు రేవంత్

- ప్రపంచ ఆర్థిక వేదిక వార్షిక సదస్సుకు హాజరు
- భారత్ నుంచి చంద్రబాబు సహా ముగ్గురు సీఎంలు
- నారా లోకేశ్‌తోపాటు పలు రాష్ట్రాల మంత్రులూ హాజరు



న్యూఢిల్లీ, డిసెంబరు 22: దాదాపు 100 మందికిపైగా సీఈవోలు హాజరుకానున్న ప్రపంచ ఆర్థిక వేదిక(వరల్డ్ ఎకనమిక్ ఫోరం) వార్షిక సదస్సుకు తెలుగురాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్ రెడ్డి సహా భారత్ నుంచి కనీసం ముగ్గురు సీఎంలు హాజరుకానున్నారు. వచ్చే నెల 20 నుంచి దావోస్‌లో ఐదు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్, ఏపీ మంత్రి నారా లోకేశ్, కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, తమిళనాడు మంత్రి టీఆర్‌బీ రాజా, యూపీ మంత్రి సురేశ్ ఖన్నా తదితరులు పాల్గొననున్నారు. స్విస్ స్కై రిసార్ట్‌లో జరిగే ఈ సదస్సుకు పలువురు కేంద్ర మంత్రులు కూడా హాజరయ్యే అవకాశం ఉంది. ఈ ఏడాది 'కొలాబరేషన్ ఫర్ ది ఇంటెలిజెంట్ ఏజ్' అనే ప్రధాన థీమ్‌తో సదస్సును నిర్వహిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా సుమారు 50 మంది దేశాధినేతలు, ప్రభుత్వాల ప్రతినిధులు హాజరయ్యే అవకాశం ఉంది. భారత్ నుంచి అదానీ, రిలయన్స్, టాటా, బిర్లా, భారతీ, మహీంద్రా, గోద్రెజ్, జిందాల్, బజాజ్, వేదాంత గ్రూపులు సహా పలు వాణిజ్య సమూహాల టాప్ ఎగ్జిక్యూటివ్‌లు, పౌర సమాజాల సభ్యులు కూడా హాజరుకానున్నారు. 'ఇండియాస్ ఎకనమిక్ బ్లూప్రింట్' సహా పలు సెషన్లలో భారత ప్రతినిధులు పాల్గొనే అవకాశం ఉంది.

ప్రాణాలు తీసిన అప్పులు!

- ముగ్గురు రైతుల బలవన్మరణం



శ్రీను, ప్రవీణ్ (ఫైల్)

సీరోలు, హవేళిఘణపూర్, మల్లాపూర్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సాగు చేసిన పంటలు చేతికిరాక, అప్పులు తీర్చే మార్గం కనిపించక ముగ్గురురైతులు బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ ఘటనలు మహబూబాబాద్, మెదక్, జగిత్యాల జిల్లాల్లో జరిగాయి. మహబూబాబాద్ జిల్లా సీరోలు మండలం కాంపల్లి శివారు సక్రాంనాయక్ తండాకు చెందిన రైతు తేజావత్ శ్రీను(38) రెండు లక్షలు అప్పుచేసి మిరపతోట వేయగా చీడపీడలతో తీవ్రనష్టం వాటిల్లింది. మనస్తాపంతో ఈనెల 21న పురుగు మందుతాగాడు. ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మెదక్ జిల్లా హవేళిఘణపూర్ మండలం కూచన్‌పల్లికి చెందిన రైతు ఈర్ల ప్రవీణ్ (35) వ్యవసాయంతో పాటు కూలి పనులు చేసుకుంటూ జీవించేవాడు. రూ.3 లక్షల అప్పు చేసి ఎకరం పొలంలో వరి సాగు చేయగా దిగుబడి సరిగ్గా రాలేదు. దీంతో అప్పులు తీర్చలేక శనివారం రాత్రి పొలంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. జగిత్యాల జిల్లా మల్లాపూర్‌లోని వెంకట్రావుపేట గ్రామానికి చెందిన మిట్టపల్లి జీవన్‌రెడ్డి(38) వరి, మొక్కజొన్న, మిర్చి పంటలను సాగు చేయగా నష్టాలు వచ్చాయి. అప్పులు పెరిగిపోవడంతో శనివారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

అతివేగంగా వచ్చిన కంటైనర్ ఢీకొని ఇద్దరి మృతి

పటాన్‌చెరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కంటైనర్ అతివేగం ఇద్దరి ప్రాణాలను బలిగొంది. ఆదివారం సంగారెడ్డి జిల్లా ఇస్నాపూర్ వద్ద జాతీయ రహదారిపై ఈ ఘటన జరిగింది. మచిలీపట్నానికి చెందిన అశోక్‌కుమార్ సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో ఉంటూ హైదరాబాద్‌లోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్నారు. ఆదివారం ఆయన.. భార్య శ్యామల(27), అన్న కొడుకు గణేశ్(17)తో కలిసి సంగారెడ్డిలోని బంధువుల ఇంటికి స్కూటీపై బయలుదేరారు. ఈ క్రమంలో అతివేగంగా దూసుకొచ్చిన ఓ భారీ కంటైనర్ ఇస్నాపూర్ సమీపంలో స్కూటీని ఢీకొట్టింది. ముగ్గురూ రోడ్డుపై పడిపోగా శ్యామల, గణేశ్ పైనుంచి కంటైనర్ చక్రాలు వెళ్లడంతో వారిద్దరూ మృతి చెందారు. స్కూటీ నడుపుతున్న అశోక్‌కుమార్ స్వల్పగాయాలతో బయటపడ్డారు. డ్రైవర్ పరారీలో ఉన్నాడని, త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

చెస్‌లో దేవాన్ష్ ప్రపంచ రికార్డు



చెస్ బోర్డులో పావులను కదుపుతున్న నారా దేవాన్ష్

- 175 క్లిష్టమైన పజిల్స్ 11.59 నిమిషాల్లో పూర్తి
- వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ నుంచి సర్టిఫికెట్

అమరావతి, హైదరాబాద్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు మనవడు, మంత్రి లోకేశ్ తనయుడు.. నారా దేవాన్ష్ చెస్‌లో ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. తొమ్మిదేళ్ల దేవాన్ష్.. చదరంగంలో 175 క్లిష్టమైన పజిల్స్‌ను రికార్డు స్థాయిలో 11 నిమిషాల 59 సెకన్లలోనే పూర్తిచేసి 'ఫాస్టెస్ట్ చెక్‌మేట్ సాల్వర్'గా వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నాడు. ప్రసిద్ధ చెస్ సంకలనం నుంచి ఎంపిక చేసిన 5,334 సమస్యలు, కలయికల ద్వారా ఈ పోటీని ఏర్పాటు చేశారు. ఈ నెల 18న హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ భవన్‌లో ఈ పోటీ నిర్వహించగా.. ఆదివారం లండన్‌కు చెందిన ప్రతిష్ఠాత్మక వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ నుంచి సర్టిఫికెట్ అందింది. కాగా.. ఇటీవల దేవాన్ష్ చెస్‌లో మరో రెండు ప్రపంచ రికార్డులు కూడా సాధించాడు. 7 డిస్కటవర్ ఆఫ్ ఆఫ్ హనోయిని కేవలం 1.43 నిమిషాల్లో పూర్తిచేశాడు. 9 చెస్ బోర్డులను కేవలం ఐదు నిమిషాల్లో అమర్చి.. 32పావులను వేగంగా సరైన స్థానాల్లో పెట్టాడు. దీన్ని న్యాయనిర్ణేతలు, లండన్‌లోని వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. కాగా, చిన్న వయసులోనే తనయుడు సాధించిన విజయంపై లోకేశ్ స్పందించారు. దేవాన్ష్ లేజర్ షార్ప్ ఫోకస్‌తో శిక్షణ పొందడం తాను ప్రత్యక్షంగా చూశానని చెప్పారు. అంతర్జాతీయ స్థాయిలో భారత చెస్ క్రీడాకారుల అద్భుత ప్రదర్శనల నుంచి ప్రేరణ పొందాడని అన్నారు. కాగా... ఈ ఈవెంట్ కోసం దేవాన్ష్ కొన్ని వారాలుగా రోజుకు ఐదారు గంటల శిక్షణ తీసుకున్నాడు. అతని కోచ్ కె.రాజశేఖర్‌రెడ్డి స్పందిస్తూ.. సృజనాత్మకంగా చెస్ నేర్చుకునే డైనమిక్ విద్యార్థి అని దేవాన్ష్‌ను కొనియాడారు.

వెల్‌డన్.. దేవాన్ష్: చంద్రబాబు

దేవాన్ష్ ప్రదర్శనపై తాత, సీఎం చంద్రబాబు సంతోషం వ్యక్తం చేశారు. 'వెల్‌డన్ నారా దేవాన్ష్' అంటూ 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. 'లోకేశ్ సతీమణి నారా బ్రాహ్మణి కూడా తనయుడి ప్రదర్శన పట్ల 'ఎక్స్'లో సంతోషం వ్యక్తం చేశారు. బ్రాహ్మణి పోస్టును ట్యాగ్ చేసి, దేవాన్ష్ మరిన్ని విజయాలు సాధించాలని కోరుకుంటున్నానని లోకేశ్ ఆకాంక్షించారు.

లక్నవరానికి జలగండం!

వేసవికి ముందే అడుగంటే ముప్పు.. అదే జరిగితే పర్యాటకానికి దెబ్బ

- ఇటీవలే మూడో దీవి ముస్తాబు
- రామప్ప నుంచి నీటి తరలింపునకు ఐదేళ్ల క్రితమే టెండర్లు
- భూసేకరణ స్థాయిలోనే కెనాల్ పనులు



ములుగు, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రకృతి ప్రేమికులను అమితంగా ఆకర్షిస్తున్న లక్నవరం చెరువుకు జలగండం పొంచి ఉంది. చుట్టూ కొండల నడుమ విశాలంగా పరుచుకున్న చెరువులోని దీవుల్లో విడిది చేయడం, పడవల్లో విహారం, ఉయ్యాల వంతెనలపై నడక పర్యాటకులకు ఇప్పుడైతే మధురానుభూతి కలిగిస్తోంది. అయితే వ్యవసాయ అవసరాలకు భారీగా నీటి వినియోగం జరుగుతుండగా క్రమంగా నీటిమట్టం తగ్గుతూ వేసవికి ముందే చెరువు అడుగంటే ప్రమాదం ఏర్పడింది. ఇదే జరిగితే మొదట ప్రభావితమయ్యేది పర్యాటక రంగమే. మూడో దీవిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దగా ఇటీవలే రాష్ట్ర పర్యాటక మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రారంభించారు. అదే స్థాయిలో పర్యాటకులు తరలివస్తుండగా వారి ఆనందానికి కొద్ది నెలల్లోనే తాత్కాలిక బ్రేకులు పడే ప్రమాదం ఉంది. దేవాదుల ఎత్తిపోతల పథకానికి బ్యాలెన్స్ రిజర్వాయర్‌గా ఉన్న రామప్ప చెరువు నుంచి లక్నవరానికి గోదావరి జలాలను తరలించే ప్రయత్నం భూసేకరణ స్థాయిలోనే మూలుగుతోంది. ఐదేళ్ల క్రితం టెండర్లు పూర్తయినా ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. వర్షాకాలంలో మత్తడి దుంకుతూ జలసవ్వడి చేసే లక్నవరం చెరువు ఏటా వేసవిలో డెడ్ స్టోరేజీకి చేరుతోంది. 34 అడుగుల నిల్వ సామర్థ్యం కలిగిన చెరువు.. మైదానంలా మారుతోంది. దీంతో నాలుగు నెలలు పర్యాటక రంగం కుదేలవుతోంది. మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల పరిధిలోని అటవీ ప్రాంతంలో కురిసే భారీ వర్షాలు, వరద లక్నవరం చెరువుకు ఆధారం. వర్షాభావ పరిస్థితులు నెలకొంటే కనీస నీటిమట్టం చేరడం ఒక్కోసారి కష్టమతోంది. దీంతో ఆయకట్టులోని 12 వేల ఎకరాలకు సమృద్ధిగా నీరందక ప్రతిసారీ చివరి పొలాలు ఎండిపోతున్నాయి. ఈ నేపథ్యంలో గత ప్రభుత్వం లక్నవరానికి రామప్ప చెరువు నుంచి జలాలను తరలించాలని యోచించింది. 7.5 కిలోమీటర్ల మేర కాల్వ తవ్వి గ్రావిటీతో నింపేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. 2019లోనే రూ.14.53 కోట్లు మంజూరు చేయగా టెండర్లు కూడా పూర్తయ్యాయి.

తెగని భూసేకరణ పంచాయితీ

కాల్వ నిర్మాణానికి 145.36 ఎకరాల భూములు అవసరమవుతాయని సాగునీటి పారుదల అధికారులు గుర్తించారు. ఎకరానికి రూ.2.47 లక్షల పరిహారాన్ని ప్రభుత్వం నిర్ణయించింది. వరి, మిర్చి పంటలు సాగయ్యే ఈ భూములకు మంచి డిమాండ్ ఉండటంతో ఎకరం రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షల ధర పలుకుతోంది. రైతులు ఒప్పుకోకపోవడంతో పరిహారాన్ని ఎకరానికి రూ.8 లక్షలకు పెంచాలని అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. ఆమోదం లభించకపోవడంతో ఐదేండ్లు గడిచిపోయాయి. నిర్మాణ వ్యయం రెట్టింపైందని, పాత టెండర్ రేట్లకు అనుగుణంగా పనులు చేయలేమని కాంట్రాక్టర్ సైతం చేతులెత్తేశాడు. మంత్రి సీతక్క ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.

పర్యాటకంపై తీవ్ర ప్రభావం

లక్నవరం సరస్సుకు పొంచి ఉన్న నీటి సమస్య పర్యాటక రంగంపై తీవ్ర ప్రభావం చూపనుంది. ఇప్పటికే ఆయకట్టులో యాసంగి టైబందీ ఖరారైంది. శ్రీరాంపతి, నర్సింహుల కాల్వల పరిధిలో 3,500 ఎకరాలకు నీటిని విడుదల చేయాలని అధికారులు నిర్ణయించారు. నారుమడులు సిద్ధం కాగా మరో వారం రోజుల్లో నాట్లు పడనున్నాయి. దీంతో భారీగా నీటి వినియోగం జరుగుతోంది. జనవరి నుంచి క్రమంగా చెరువులో నీటిమట్టం తగ్గిపోనుండగా పైనుంచి వరద లేక కొద్దిరోజులకే అడుగంటే అవకాశముంది. ఇదే కనుక జరిగితే పర్యాటక బోట్లు ఒడ్డుకే పరిమితం కావాల్సి వస్తుంది. వాటర్ స్పోర్ట్స్, అడ్వెంచర్ గేమ్‌లు మూలనపడతాయి. ఫలితంగా పర్యాటకులు ఇక్కడకు వచ్చేందుకు వెనుకాడే ప్రమాదముంది.

తలాక్ ఇవ్వనందుకు యువకుడి దారుణ హత్య

- పోలీసుల అదుపులో యువతి సోదరుడు
- ఓల్డ్ బోయిన్‌పల్లిలో ఘటన



సమీర్ (ఫైల్)

బోయిన్‌పల్లి, డిసెంబర్ 22 (ఆంధ్రజ్యోతి): ప్రేమించి పెళ్లి చేసుకున్న అమ్మాయికి తలాక్ ఇవ్వనని అన్నందుకు ఓ యువకుడిని యువతి సోదరుడు దారుణంగా హత్య చేశాడు. కత్తితో మెడపై పొడిచి, సర్జికల్ బ్లేడ్లతో శరీరంపై కోసి కిరాతకంగా హతమార్చాడు. హైదరాబాద్ ఓల్డ్ బోయిన్‌పల్లిలో నివాసం ఉండే మహ్మద్ సమీర్ (21) అదే ప్రాంతానికి చెందిన యువతి ప్రేమించుకున్నారు. సమీర్ వెల్డింగ్ పనులు చేస్తుండగా యువతి డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. వారి పెళ్లికి కుటుంబసభ్యులు అంగీకరించకపోవడంతో ఆరు నెలల క్రితం ఇంటి నుంచి పారిపోయి వివాహం చేసుకున్నారు. ఇటీవల ఇంటికి తిరిగొచ్చిన దంపతులను అమ్మాయి కుటుంబసభ్యులు కలుసుకుని సంప్రదాయం ప్రకారం వివాహ చేస్తామని నమ్మించి యువతిని వారింటికి తీసుకెళ్లారు. అనంతరం సమీర్‌ను సంప్రదించి యువతికి తలాక్ ఇవ్వాల్సిందిగా పట్టుబట్టారు. అయితే దీనికి సమీర్ ఒప్పుకోలేదు. దాంతో అతనిపై కోపం పెంచుకున్న యువతి సోదరుడు ఉమర్ మరో నలుగురితో కలిసి శనివారం అర్ధరాత్రి కత్తులు, బ్లేడ్లతో సమీర్‌పై దాడికి తెగబడ్డాడు. కత్తితో మెడపై పొడిచి, సర్జికల్ బ్లేడ్లతో శరీరంపై కోసి సమీర్‌ను కిరాతకంగా హతమార్చాడు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు సమీర్ మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. యువతి సోదరుడు ఉమర్ నిజామాబాద్ పారిపోయాడని తెలుసుకుని అక్కడి పోలీసులకు సమాచారమివ్వగా వారు అతణ్ని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. పోస్టుమార్టం అనంతరం పోలీసులు సమీర్ మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సాంస్కృతిక పునర్వికాసం అవసరం

- కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ

గుంటూరు (కార్పొరేషన్), డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సాంస్కృతిక పునర్జీవనం, పునర్వికాసం ప్రస్తుత సమాజంలో ఎంతైనా అవసరం ఉందని అరసం జాతీయ అధ్యక్షుడు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పెనుగొండ లక్ష్మీనారాయణ తెలిపారు. గుంటూరులోని జనచైతన్య వేదిక హాలులో ఆదివారం పెనుగొండ లక్ష్మీనారాయణకు అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. కులాలు, మతాలు, అసమానతలు, విద్వేషాలు లేని సమాజాన్ని సాధించుకున్న రోజున గురజాడ, శ్రీశ్రీ, గుర్రం జాషువాల సాహిత్యం చదివే అవసరం ఉండదన్నారు. ప్రజలు పఠనాసక్తిని పెంచుకోవాలని సూచించారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ.. పెనుగొండ లక్ష్మీనారాయణ యాభైఏళ్లుగా అందిస్తున్న సాహిత్యం సమాజ మలుపులో కీలక పాత్ర పోషించిందన్నారు. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణ్‌రెడ్డి, అరసం రాష్ట్ర కార్యదర్శి కె.శరత్‌చంద్ర తదితరులు ప్రసంగించారు.

రూ.818.03 కోట్లతో అమరావతిలో హ్యాపీనెస్ట్‌కు టెండర్లు

- మూడేళ్లలో పూర్తవ్వాలి: సీఆర్‌డీఏ నోటిఫికేషన్

విజయవాడ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలోని నేలపాడులో హ్యాపీనెస్ట్ నిర్మాణానికి సీఆర్‌డీఏ ఆదివారం టెండర్లు పిలిచింది. రూ.818.03 కోట్ల అంచనాతో హ్యాపీనెస్ట్ నిర్మాణం, ఇంటీరియర్ పనులు పూర్తి చేసేందుకు ఈ నోటిఫికేషన్ ఇచ్చింది. మొత్తం 1,200 ఫ్లాట్ల సామర్థ్యంతో జీ+18 అంతస్తులతో కూడిన 12 టవర్ల నిర్మాణంతో పాటు ఆర్కిటెక్చర్ డిజైన్లు, అంతర్గత ఇంటీరియర్, ఎలక్ట్రికల్, సెక్యూరిటీ సిస్టమ్స్, లిఫ్ట్‌ వంటివి ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అలాగే మూడేళ్లలో ప్రాజెక్టును పూర్తి చేయాలని పేర్కొన్నారు. అమరావతి పనులను ఆపేసినట్లే.. జగన్ హయాంలో ఈ ప్రాజెక్టును కూడా అటకెక్కించారు. దీంతో 1,200మంది లబ్ధిదారుల్లో 100మందికి పైగా డబ్బులు వెనక్కి తీసుకున్నారు. జగన్ ప్రభుత్వ విధ్వంసం కారణంగా చాలా మంది రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (రెరా)ను ఆశ్రయించారు. వారికి వడ్డీతో చెల్లించాలని సర్కారును రెరా ఆదేశించింది. దీంతో కొందరికి డబ్బులు చెల్లించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక.. మిగిలిన ఫ్లాట్లకు మళ్లీ దరఖాస్తులు ఆహ్వానించడానికి సీఆర్‌డీఏ శ్రీకారం చుట్టింది.

త్వరలో 'టీటీడీ చాట్ బాట్'

- విజన్ డాక్యుమెంట్‌కు అనుగుణంగా ప్రణాళికలు: ఈవో

తిరుమల, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): చాట్ జీపీటీ తరహాలో వాయిస్ ఆధారిత టీటీడీ చాట్ బాట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు. దీనిద్వారా భక్తులు ఏ సమాచారాన్నైనా సులభంగా తెలుసుకోవచ్చని అన్నారు. తిరుమలలో గత ఆరు నెలల్లో జరిగిన అభివృద్ధితో పాటు భవిష్యత్తులో తీసుకోబోతున్న చర్యలపై ఆయన అదనపు ఈవో వెంకయ్య చౌదరితో కలసి అన్నమయ్య భవనంలో ఆదివారం మీడియాతో మాట్లాడారు. విజన్ డాక్యుమెంట్‌కు అనుగుణంగా ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు చెప్పారు. తిరుమలలో ఇప్పటికే అనేక మార్పులు తీసుకొచ్చామని, అన్నప్రసాదాలు, లడ్డూలు మరింత నాణ్యంగా అందిస్తున్నామని వివరించారు. నాణ్యమైన నెయ్యితోనే లడ్డూ ప్రసాదాలు తయారవుతున్నాయని పేర్కొన్నారు. ఎన్‌డీడీబీ విరాళంగా ఇచ్చిన రూ.70 లక్షల విలువైన పరికరాలతో టీటీడీ సొంతగా ఏర్పాటు చేసుకుంటున్న ల్యాబ్ జనవరి నుంచి అందుబాటులోకి వస్తుందని తెలిపారు. క్యూలైన్ల నిర్వహణ, భక్తులు ఎక్కువ సమయం వేచి ఉండకుండా నిరంతరం పర్యవేక్షిస్తున్నట్టు తెలిపారు. అలాగే 45 అతిథిగృహాలకు ఆధ్యాత్మిక పేర్లు ఉండేలా చర్యలు చేపట్టామని చెప్పారు. తిరుచానూరులో పద్మావతీ అమ్మవారి ఆలయ మాడవీధులను కూడా అభివృద్ధి చేస్తామని, చాగంటి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో యువతలో భక్తి భావన పెంచేలా చర్యలు తీసుకుంటామని ఈవో పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర విజన్-2047కి అనుగుణంగా తిరుమల విజన్-2047 కోసం ప్రతిపాదనలు ఆహ్వానించినట్లు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో

అమెరికాలో విద్యార్థి మృతి

హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల వాసి



బండి వంశీ (ఫైల్)

కమలాపూర్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం మాదన్నపేట గ్రామానికి చెందిన బండి వంశీ అమెరికాలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు తెలిసింది. గ్రామస్థులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం. మాదన్నపేట గ్రామానికి చెందిన వంశీ ఓ యూనివర్సిటీలో ఎమ్మెస్సీ చదువడానికి అమెరికాకు వెళ్లాడు. పార్ట్ టైంజాబ్ చేస్తూ చదువుకుంటున్నాడు. శనివారం రాత్రి అతడు నివాసం ఉంటున్న అపార్ట్‌మెంట్ గ్రౌండ్ ఫ్లోర్‌లో అనుమానాస్పద స్థితిలో కారులో మృతి చెందినట్లు తెలిసింది. ఈ విషయం తెలుసుకున్న తోటి విద్యార్థులు ఆదివారం ఉన్నత అధికారులు, తల్లిదండ్రులకు సమాచారం అందజేశారు. వంశీ మృతదేహాన్ని స్వదేశానికి రప్పించాలని కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కు తల్లిదండ్రులు విన్నవించుకున్నారు. వంశీ మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. వంశీ మృతితో మాదన్నపేటలో విషాదఛాయలు అలుముకున్నాయి.


సోమవారం 23 డిసెంబరు 2024

వివిధ

vividha@andhrajyothy.com

సాహిత్య వేదిక

బొమ్మలు: అక్బర్



సాహిత్య కార్యకర్త

కార్యకర్తలు లేకపోతే కావ్యకర్తలు రాణించ లేరు. పుస్తకం అచ్చు బాధ్యత చూడాలన్నా దాన్ని సభలు సమావేశాలూ పెట్టి ప్రచార ప్రసారాలు చేయాలన్నా కార్యకర్తే కీలకం. బంగారం పళ్ళేనికైనా గోడచేర్పు అవసరం. సహజంగా కార్యకర్తలు సృజనాత్మక రంగంలో రాణించ లేరు. అది దక్షతతో కూడిన వ్యవహారం. కవులు రచయితలు ఆ రంగంలో రాణించిన దాఖలాలు దాదాపు లేవు. కానీ పెనుగొండ లక్ష్మీనారాయణ ఒక మినహాయింపు. ఆయన సవ్యసాచి.

సాధారణ రైతు కుటుంబంలో పుట్టారు. చిన్నా చితకా ఉద్యోగాలు చేస్తూ సాయం కళాశాలలో చదువు పూర్తి చేశారు. న్యాయవాద వృత్తిని చేపట్టారు. అభ్యుదయ రచయితల సంఘంలో యువకుడిగానే కార్యకర్త బాధ్యతలు స్వీకరించారు. అప్పటి నుంచి అరసానికి కరుడు గట్టిన కార్యకర్త. ఐదు దశాబ్దాలుగా అందులో క్రియాశీలంగా కృషి చేస్తూ వస్తున్నారు. అభ్యుదయ సాహిత్యానికి కొండంత అండ పెనుగొండ అంటే అతిశయోక్తి కాదు.

వృత్తి రీత్యా ప్రవృత్తి రీత్యా ఎన్ని పదవీ బాధ్యతలు నిర్వర్తించినా తనను తాను అరసం కార్యకర్తగానే చెప్పుకోవడానికి గర్వపడతారు. అందులో పెద్దలైన రాంభట్ల, సోమ సుందర్, రెంటాల గోపాల కృష్ణ, కొండేపూడి శ్రీనివాస రావు, బొల్లిముంత శివరామకృష్ణ, పులుపుల వెంకట శివయ్య, చాగంటి సోమయాజులు, పరుచూరి రాజారాం వీళ్ళ అడుగుజాడల పట్ల ఆయనకు అపార గౌరవం. వామపక్ష ఉద్యమాలు మనుషుల్ని మానవీయ వ్యక్తులుగా మలుస్తాయని గాఢంగా నమ్మే వ్యక్తి పెనుగొండ.

పెనుగొండ కవిగా 'రేపటిలోకి' ప్రవేశించినా విమర్శ ఆయన ప్రధాన రంగం అయింది. విమర్శను ఆయన చేపట్టాడు అనేకంటే ఆ ప్రక్రియే అనివార్యతను కలగ జేసింది అనేది ఆయన రాసిన వ్యాసాలు చూస్తే మనకు అర్థమవుతుంది. పెనుగొండ రాసిన వ్యాసాలు మూడు సంపుటాలుగా వచ్చాయి. 'అనేక' (2004), 'విదిత' (2014), 'దీపిక' (2021). ఈ మూడు పుస్తకాల్లోనూ దాదాపు వందకు పైగా వ్యాసాలు ఉన్నాయి. అందులో సుమారు ముప్పై మంది సాహిత్యకారుల కృషిని గుర్తించిన పరామర్శలున్నాయి. తెలుగు సాహిత్యంలో రాశిపరంగా కాకపోయినా వాసిపరంగా వినుతికెక్కి విస్మృతికి లోనైన కొంతమంది రచయితలకు కవులకు ఆయన దివిటీపట్టారు.

శ్రీశ్రీ, చాసోల గురించి కొందరు ప్రసిద్ధ విమర్శకులు రాసిన అవాకులు చెవాకులకు పెనుగొండ చాలా తీవ్రంగా స్పందించి సమాధానమిచ్చారు. అవతలివాళ్ళు ఎంతటివాళ్ళు అయినా వాళ్ల నోటి తీటకి తీవ్రస్థాయిలో బదులు ఇవ్వక పోతే అంతకంటే చారిత్రక ద్రోహం ఉండదని ఆయన నమ్మకం.

వృత్తి రీత్యా ప్రవృత్తి రీత్యా ఎన్ని పదవీ బాధ్యతలు నిర్వర్తించినా తనను తాను అరసం కార్యకర్తగానే చెప్పుకోవడానికి గర్వపడతారు పెనుగొండ లక్ష్మీనారాయణ. వామపక్ష ఉద్యమాలు మనుషుల్ని మానవీయ వ్యక్తులుగా మలుస్తాయని గాఢంగా నమ్మే వ్యక్తి ఆయన. అభ్యుదయ సాహిత్యానికి కొండంత అండ పెనుగొండ అంటే అతిశయోక్తి కాదు.

కథానికా సంకలనాల మీద పెనుగొండ విశేషమైన కృషి చేశారు. కాళీపట్నం రామారావు గారి కథానిలయం స్థాపనకు పరోక్షంగా ఒక వ్యాసం ద్వారా బీజ వాపన చేసింది పెనుగొండే.

ఈ వ్యాసం లోనే తొలి కథ సంకలనం 1932లో వచ్చిన 'కథావళి' అని, నిషేధానికి గురైన తొలి కథా సంకలనం 'ఇప్పుడు వీస్తున్న గాలి' అని, కులవృత్తికి సంబంధించిన తొలి కథ రచయిత అందే నారాయణ స్వామి అని, తొలి తెలుగు కథానువాదకుడు, కథా విమర్శ కుడు అక్కిరాజు ఉమాకాంతం అని నిర్ధారణ చేశారు. 'గురజాడ సాహిత్యం – వక్రీకరణలు, వాస్తవాలు' అనే వ్యాసంలో గురజాడతో పాటు రాయప్రోలును కూడా యుగకర్తను చేయడంలో అకడమిక్ కుట్ర ఇమిడి ఉందని అభిప్రాయపడ్డారు. ముద్దుకృష్ణ సంకలనం చేసిన వైతాళికులు కవితల ఎంపికలో చూపిన పక్షపాతం గురించి 'భావకవుల ప్రేమ గోల' అనే వ్యాసంలో ఎత్తిచూపారు. ఇలాంటి బాధ్యత గల కార్యక్రమాల్లో రాగద్వేషాలకు అతీతంగా ఉండాలన్నారు.

'తెలంగాణ విమోచన పోరాట సాహిత్యం – ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘీభావం' అనే వ్యాసంలో ఆనాటి ఆంధ్ర రచయితలు నవల, కథ, కవిత, నాటకం వంటి ప్రక్రియల్లో తమ రచనల ద్వారా నాటి ఉద్యమానికి ఎలా ఊపిరులూదిందీ వివరించారు. 'సాహిత్యం low సంగతులు' వ్యాసంలో వర్తమాన తెలుగు సాహిత్య రంగంలో నెలకొన్న అవాంఛనీయ అనారోగ్యకర వాతావరణాన్ని తూర్పారబట్టారు. 'తొలి మలి తరం తెలుగు కథలు సంకలనం'లో ఎలా ప్రామాణికత లోపించిందో సోదాహరణంగా వివరించే ప్రయత్నం చేశారు. ఈ సంకలనంలో ఎన్నో నిరాధార నిర్ధారణలు, మరికొన్ని అవగాహనా లోపాలు, ఎంతో అస్పష్టత ఉన్నాయని, ఈ పుస్తకం పాఠకులను తప్పుదోవ పట్టిస్తుందని కచ్చితంగా చెబుతున్నాను అని డంకా భజాయించారు.

ఒకవైపు నేటి ప్రపంచీకరణ నేపథ్యంలో వచ్చిన తెలుగు కవిత్వాన్ని విపులంగా విశ్లేషిస్తూనే మరోవైపు నాటి నవ్య కవితాఝరి ఐన నయాగరా కవుల గురించి విశ్లేషించారు. తెలుగు సాహిత్య చరిత్రలో చిరస్మరణీయమైన చారిత్రక పాత్ర నయాగరా కవితా సంకలనానికి ఉందన్నారు. ప్రాంతీయ కథా సంకలనాల గురించి విపులంగా చర్చిస్తూనే అభ్యుదయ సాహిత్యంలో దళిత జీవన చిత్రాల గురించి విపులంగా విశ్లేషించారు.

ఈ పుస్తకాలతో పాటు పెనుగొండ కృషికి గీటురాయి 'గుంటూరు సీమ సాహిత్య చరిత్ర'. ఏ ప్రాంతం వారైనా తమ సాహిత్య చరిత్ర రాయడానికి ఈ పుస్తకాన్ని ఒక నమూనాగా స్వీకరించవచ్చు. తన ప్రాంతం పట్ల చారిత్రక అవగాహన సాంస్కృతిక రాజకీయ ఉద్యమాల పట్ల గాఢమైన అభినివేశం పరిజ్ఞానం లేకపోతే అంత సాధికారికంగా రాయడం కుదరదు.

ఆయన సంపాదకత్వం వహించిన గ్రంథాల్లో ముఖ్యమైనది గుంటూరు సీమ కథలు. ఇందులో అక్కిరాజు ఉమాకాంతం 1918లో రాసిన 'అన్నపూర్ణ' కథ నుంచి వేదగిరి రాంబాబు రాసిన 'తల్లి' కథ వరకు 70 కథలు ఉన్నాయి. కథా స్రవంతి పేరుతో నాలుగు కథా సంకలనాలను వెలువరించారు. పాపినేని శివశంకర్, వల్లూరు శివప్రసాద్‌లతో కలిసి సంపాదకత్వం వహించిన 'కవితా ఓ కవితా', 'విస్మృత కథ', గంగోత్రి సాయితో కలిసి రూపొందించిన నాటక రంగ విశేష సంచిక 'రూపిక' ముఖ్యమైనవి. గుంటూరు కేంద్రంగా ఆయన మిత్రులతో కలిసి చేసిన సాహిత్య కార్యక్రమాలు ఆయన నిబద్ధతకు అద్దం పడతాయి.

"సాహిత్య సాంస్కృతిక సామాజిక ఉద్యమాల్లో ఐదు దశాబ్దాలకు పైగా చురుకైన కార్యకర్తగా బాధ్యత వహించడంలో నాకు చుక్కానిగా నిలిచింది వామపక్ష భావజాలం. మొత్తంగా సమాజాన్ని ప్రత్యేకించి ఈ రంగాలను దగ్గరగా గమనిస్తున్న నాకు ఆ భావజాలం పట్ల రోజురోజుకీ మరింత విశ్వాసం పెరుగుతుంది. ఈ రంగాలను ప్రజాపక్షంగా తీర్చి దిద్దడంలో ఎందరో కృషిచేసి ఈ తరానికి వారసత్వం అందించారు. ఆ వారసత్వాన్ని నేను అందిపుచ్చుకొని నా తర్వాత అందించటమే నా బాధ్యత" అంటూ చేసిన ప్రకటనను బట్టి పెనుగొండ తాను నమ్మిన ప్రగతిశీల భావజాలాన్ని జనం మధ్యకు తీసుకువెళ్లడానికి నిరంతరం శ్రమిస్తున్న కృషీవలుడిగా మనకు అర్థమవుతుంది.

(పెనుగొండ లక్ష్మీనారాయణ 'దీపిక' విమర్శ గ్రంథానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు ప్రకటించిన సందర్భంగా)

■ జి.ఎస్. చలం



జెండా

రాత్రిని చంద్రశిలపై వుతికి
ధాత్రి అవయవాలపై పరిచి
నీ దేహం మొగ్గని కాస్త కాస్త విప్పి
రేకల్తో నన్నదిమి
నీ జుట్టు అడవిని నిర్దాక్షిణ్యంగా
నా మొహం చుట్టూ కప్పేసి
నన్ను కార్చిచ్చులోకి నెట్టేసి
నువ్వు నీ అమాయిక పెదాల్తో
నా జంతు పెదాలపై ముద్దు
పెట్టుకుంటావు

సూర్యుడూ చంద్రుడూ
మన పెదాల మధ్య
భగ్గున మండుతారు

నక్షత్రాలు
నఖక్షతాలు కాగానే
సుందర ప్రదేశాలు సెగలు సోకి
కందిపోగానే
నువ్వు లోకంలోని
అన్ని పువ్వుల వాసనా వేస్తావు

నేను నా గీతాల వాసన వేస్తాను
అప్పుడప్పుడూ నువ్వు
అమ్మ వాసన వేస్తావు

అప్పుడు
నా పెదాల మీద
నువ్వు వొదిలిన మంటల్ని తింటూ
నేను కాలం గడుపుతాను

ఈలోగా
హఠాత్తుగా
రక్తంలో తడిసిన
మన చర్మాన్ని జెండాగా కుట్టి
ఆసుపత్రిలో నువ్వు
మానవ పతాకను ఎగరేస్తావు

■ నగ్నముని



చెమట రంగు పతాకం

నమ్ముకున్న రెక్కలు
మిత్తి లెక్కలకు మింగుడుపోతే..
పల్లె తల్లి కంట్లె నీళ్లు తుడుస్తూ
పట్నం బాటల కదిలే
బతుకు చక్రానివైతివి

నాలుగు రోడ్ల కూడళ్ళో
మూడు రాళ్ల పొయ్యిమీద
జొన్న రొట్టెపై కాలే నువ్వు
శెక్కర బీమారోల్లకు
తీపి జ్ఞాపకం పంచే
అన్నపూర్ణవైతివి

గంపెడు పిల్లల్ని
కండ్ల గంప కింద కమ్మి
రొట్టెంట రొట్టెపై
రోజును ఈదుతుంటే..
బతుకు పద్యానికొక
కొత్త అలంకారానివనిపిస్తావు
రోడ్లన్నీ నిద్రపోయేవరకు
అలుపెరుగక జోకొట్టే
నీ మునివేళ్ల కళకు
పజ్జొన్న పిండి ముద్ద
పసిడి రంగు జాబిలయితది

ఏ తండా కన్న బిడ్డవో
రూపాలీ..
తన మీద మచ్చతో
చంద్రుడే నీ నుండి
భేదమయ్యాడు కానీ
దాటలేని అగాధాలను
గుండె పొరల కింద దాచి
చెరగని చిరునవ్వు వెదజల్లే
వెన్నెల పున్నమి నువ్వు

పల్లె నుండి ఎవరైనా
అయినవాళ్ళొస్తే
చుక్కలు తెగిన ఆకాశమల్లే
దిక్కుల నిండా దుఃఖమై పారుతావు


అయినా..
జీవితంపై ఓటమినెప్పుడూ
ఒప్పుకోని నువ్వు
చెమట రంగు పతాకాన్ని
ఆత్మగౌరవమై ఎగరేస్తావు!

■ తుల శ్రీనివాస్

✆ 99485 25853

వచన కవిత్వ మూలాల అన్వేషణలో శిష్ట్లా దొరికాడు!

3? మూడు ప్రశ్నలు



తెలుగులో మొదటిసారి వచన కవిత్వం రాసిన శిష్ట్లా ఉమామహేశ్వరరావు (1909–1953) కథలు, కవిత్వం, గేయాలు, నాటికలు, వ్యాసాలతో కలిపి మొత్తం 800 పేజీల పుస్తకం 'శిష్ట్లా ఉమామహేశ్వరరావు సర్వలభ్య సాహిత్యం' ఇటీవల విడుదలైంది. ఏటుకూరి ప్రసాద్, యామిజాల ఆనంద్‌ల సంపాదకత్వంలో వచ్చిన ఈ పుస్తకంలో శిష్ట్లా రచనలతోపాటు, శిష్ట్లాపై సమకాలీన రచయితలూ, కుటుంబ సభ్యులూ రాసిన రచనలను కూడా జత చేసి ఈ పుస్తకాన్ని తయారు చేశారు. ఈ సందర్భంగా సంపాదకుల్లో ఒకరైన ఏటుకూరి ప్రసాద్‌తో వివిధ '3 ప్రశ్నలు'.

శిష్ట్లా ఉమామహేశ్వరరావు రచనలతో 2016లో మీరే తెచ్చిన పుస్తకాన్ని ఇప్పుడు మరింత పెంచి ఇంత విస్తృతంగా వేయాలన్న ఆలోచన ఎలా వచ్చింది?

1998లో ఆయన కవిత్వాన్ని మొదట ప్రచురించాం. అప్పట్లో కొందరు శిష్ట్లానే మొదటి వచన కవిత్వం రాశాడని అనేవారు కానీ, నాకేం సాక్ష్యం దొరకలేదు. ఆ తర్వాత ప్రయత్నం చేస్తే 'విష్ణుధనువు', 'నవమి చిలుక' పుస్తకాలు దొరికాయి. వాళ్లూవీళ్లూ ఆయనపై రాసిన వ్యాసాలు కొన్ని దొరికాయి. అవన్నీ కలిపి 1998లో 'శిష్ట్లా ఉమామహేశ్వర రావు కవిత్వ సమాలోచనం' అని పేరు పెట్టి వేశాం. ఆ తర్వాత ఇంతేం రాశాడా అని నేనూ, యామిజాల ఆనంద్ వెతకటం మొదలు పెట్టాం. మరికొన్ని కవితలు, చిన్నపిల్లల పాటలు, నాటికలు, వ్యాసాలు దొరికాయి. వీటికి ఆయన రాసిన 'సిపాయి కథలు', మరికొన్ని కథలు కూడా కలిపి 2016లో నవచేతన పబ్లిషింగ్ హౌస్ ద్వారా 'శిష్ట్లా ఉమామహేశ్వరరావు రచనలు' పుస్తకాన్ని తెచ్చాం. తర్వాత వెతికేకొద్దీ గత సంపుటంలో రాని చాలా కథలు, పాటలు, నాటికలు, వ్యాసాలు దొరుకుతూనే ఉన్నాయి. అలాగే శిష్ట్లాపై ఇతరులు రాసిన వ్యాసాలు కూడా మరిన్ని దొరికాయి. అవీ తీసుకున్నాం. ఈ సంపుటం కోసం జరిపిన అన్వేషణలోనే శిష్ట్లా జర్నలిస్ట్‌గా కూడా పని చేశారన్న విషయం మాకు తెలిసింది. ఆయన బరంపురం నుంచి ఒక పిల్లల మేగజైన్ ఎడిట్ చేశాడు. 'జమీన్ రైతు' పత్రికలో 'బెజవాడ లేఖలు' పేరుతో రాజకీయ వ్యంగ్య వ్యాసాలు రాశాడు. ఇవన్నీ కలిపితే మొత్తం రెండు వందల పేజీలు అదనంగా చేరాయి. అలా ఇదిగో 800 పేజీల పుస్తకం అయ్యింది. ఈ పుస్తకం వేసిన తర్వాత కూడా కొత్తగా రెండు కథలు దొరికాయి!

మీకు శిష్ట్లాపై ఇంత ఆసక్తి ఎందుకు?



యామిజాల ఆనంద్



ఇదంతా మొదలుపెట్టింది ఆయన మీద ఆసక్తితో కాదు. వచన కవిత మొదట రాసింది ఎవరూ అనే నా అన్వేషణలో ఆయన దొరికాడు. ఈ పుస్తకంలో చూస్తే ఆయన సమకాలికులు అందరూ చెప్పిన మాట ఒకటే– ఆయనే వచన కవితకు ఆద్యుడూ అని. తల్లావజ్ఝల శివశంకర శాస్త్రి శిష్ట్లాను "అత్యాధునిక కవుల్లో పూర్వుడు" అంటాడు. శ్రీశ్రీ కూడా "మా కవితలన్నీ ఇంకా పత్రికల్లో ఉండగానే శిష్ట్లా కవిత్వం అప్పటికే పుస్తకంగా వచ్చేసింది" అంటాడు. శ్రీరంగం నారాయణ బాబు కూడా అదే మాట అంటాడు. ఇలా శిష్ట్లా సమకాలీకులు అందరూ ఆయన గురించి ఏమన్నారో కూడా ఈ పుస్తకంలో పెట్టాం. అలాగే కుటుంబ సభ్యులని కూడా వెతికి పట్టుకున్నాం. వారి ద్వారా అనేక కొత్త విషయాలు కూడా తెలిశాయి. శిష్ట్లా బెనారస్‌లో ఎమ్మే చదివాడు. అప్పుడు కాంగ్రెస్ పార్టీ సభలన్నీ లక్నో లోనూ అలహాబాద్ లోనూ జరిగేవి. శిష్ట్లా వాటన్నిటికీ హాజరు అవుతుండేవాడు. అక్కడ ఆయన ఇంగ్లీష్ మాట్లాడితే "దొరలకంటే బాగా మాట్లాడుతున్నాడే" అనేవారట. ఈ విషయాన్ని కుటుంబసభ్యులు చెప్పారు. ఈ పుస్తకానికి రచనలు వెతికిపెట్టడంలోనూ, శిష్ట్లా కుటుంబ సభ్యులను కాంటాక్ట్ చేసి వివరాలకు సేకరించడంలోనూ నా సహసంపాదకుడు యామిజాల ఆనంద్ కృషి మరువలేనిది.

శిష్ట్లా సమకాలికులు అందరూ చెప్పిన మాట ఒకటే– ఆయనే వచన కవితకు ఆద్యుడూ అని. తల్లావజ్ఝల శివశంకర శాస్త్రి శిష్ట్లాను "అత్యాధునిక కవుల్లో పూర్వుడు" అంటాడు. శ్రీశ్రీ కూడా "మా కవితలన్నీ ఇంకా పత్రికల్లో ఉండగానే శిష్ట్లా కవిత్వం అప్పటికే పుస్తకంగా వచ్చేసింది" అంటాడు.

శిష్ట్లాది "విపరీత మనస్తత్వం" అంటాడు అబ్బూరి వరద రాజేశ్వరరావు. శ్రీశ్రీ, కొడవటిగంటి తదితరులు కూడా ఇలాంటి సూచన చేశారు. కానీ ఏ ఒక్కరూ స్పష్టంగా ఏమీ చెప్పలేదు. ఏమిటీ "విపరీత మనస్తత్వం"?

శిష్ట్లా హోమోసెక్సువల్. శ్రీశ్రీ చెప్తాడు కూడా ఒకచోట– మేమంతా మాట్లాడుకునే సమయంలో ఏదో కోపం వచ్చి శిష్ట్లా లోపలికి వెళ్లాడూ, అతని వెంబడి ఒక నలుగురు అబ్బాయిలు లోపలికి వెళ్లారూ అని. కొడవటిగంటి "అతనో వెలివేయబడ్డ మనిషి" అంటాడు. ఈయన చనిపోయిన తర్వాత స్వయంగా తండ్రే "ఎవ్వరూ అతని దహనకాండకు పోవద్దూ" అని చెప్పాడట. శిష్ట్లా సోదరుడి వరసయ్యే ఎస్వీ నరసింహం స్వయంగా నాతో అన్నాడు, "ఉమ్మాయిని గురించి ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మంచిదీ" అని. అయితే నేనేమంటానంటే– మనిషిగా ఆయన గురించి తక్కువే మాట్లాడినా, ఆయన సాహిత్యం గురించి చాలా మాట్లాడాలి. శ్రీశ్రీలో కూడా లేనివిధంగా సాహిత్యపరంగా అనేక ప్రక్రియల్లో ప్రవేశం ఉంది శిష్ట్లాకు.

ఏటుకూరి ప్రసాద్



తొల్సూరి బిడ్డను ఎత్తుకున్నంత సంబురం

నా మొదటి పుస్తకం

జూకంటి జగన్నాథం

దేశంలో ఎమర్జెన్సీ తర్వాత మేధావులకు కలిగిన కొత్త వెలుగులో నేను స్పష్టమైన ప్రజా కోణం నుంచి కవిత్వం రాస్తూ వస్తున్నాను.

నాకున్న ఆర్థిక పరిస్థితి వల్ల 1976 నుండి 1985 మధ్య రాసిన కవిత్వాన్ని ప్రచురించ లేకపోయాను. అయితే 1987 నుండి 1993 వరకు వివిధ పత్రికలలో రాసిన కవిత్వాన్ని 'పాతాళ గరిగె' పేరుతో పుస్తకంగా తీసుకువచ్చాను. ఈ పుస్తకం ప్రచురించడం వెనుక ఉన్న ముచ్చటను మీతో పంచుకోవాలి. సిరిసిల్లలో ఉన్న అర్బన్ బ్యాంకులో నా పేరు మీద, నా భార్య రమ పేరు మీద రెండు అకౌంట్ల పేరున రూ.5000 చొప్పున అప్పు తీసుకొని ఈ పుస్తకాన్ని ప్రచురించాను. అలాగే నా ఆత్మీయ మిత్రుడు నలిమెల భాస్కర్, అతని భార్య సావిత్రి కూడా ఒక్కొక్కరు రూ.5000 చొప్పున రుణం తీసుకొని 'పది ఉత్తమ మలయాళ కథలు' ప్రచురించారు. నా మొదటి పుస్తకం చేతుల్లోకి తీసుకున్నప్పుడు తొల్సూరి బిడ్డను ఎత్తుకున్నంత సంబురం కలిగింది.

అప్పటికే వందలాది తెలుగు పుస్తకాలకు ముఖ చిత్రాలు వేసిన శీలా వీర్రాజు వేసిన ముఖచిత్రంతో 'పాతాళ గరిగె' వచ్చింది. నాటి సామాజిక వాతావరణంలో, ఉత్తర తెలంగాణలో– ఒకవైపు వామపక్ష ఉద్యమాలపై అణచివేత, ఎన్‌కౌంటర్లు జరుగుతున్నాయి. మరోవైపు సమాజం లోని విలువల అస్తిత్వం కోల్పోతున్న దశ.

"నిండైన బావి నీళ్లలో
చేతులారా జారవిడుచుకున్న బొక్కెన కోసం
పాతాళ గరిగెతో
దేవులాడుతూనే ఉంటాం"

–అంటూ మనుషులు విలువల్ని కోల్పోతున్న వేదనను పలికించాను. నా మొదటి పుస్తకానికి మరో ప్రత్యేకత ఉంది. దానికి ముందుమాట నేనే రాసుకున్నాను. మా తరం కవులకు, తర్వాతి కవులకు అది స్ఫూర్తిగా నిలిచింది. నాటి విమర్శకులకు కొత్త ఆలోచనలకు ఆస్కారం ఇచ్చింది. ఆ ముందుమాటలో నేను కవిత్వం లోకి ఎలా వచ్చాను లాంటి మాటలు కాకుండా నా చుట్టూ సమాజం అల్లకల్లోలాన్ని, గ్రామీణ ప్రాంత మట్టి మనుషుల ఆందోళనలను చిత్రీకరిస్తూ, నా కవిత్వాన్ని ఆర్థిక సామాజిక రాజకీయ నేపథ్యంలో స్వీకరించే విధంగా రాశాను.

స్త్రీ బహుజన అస్తిత్వ వాదాల ప్రభావం నా మొదటి పుస్తకం లోని కవితలలో ప్రత్యక్షంగానో పరోక్షంగానో కనిపిస్తుంది. పెట్టుబడి తడిబట్టతో ప్రజల గొంతు కోస్తున్న సమయంలో, రాజకీయాలలో డబ్బు ప్రభావం ఎక్కువగా కనిపిస్తున్న సందర్భంలో, తెలుగు జనజీవనంలోకి నూతనంగా ప్రవేశించిన ప్రపంచీకరణ ప్రభావాలపైన కవిత్వం రాశాను. పెట్టుబడి కేంద్రీకృతం అవుతున్న సుదూర ప్రాంతాలకు, అరబ్బు దేశాలకు వలసలను, దూరాల దుఃఖాలను, కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న అమాయక ప్రజల బాధలను, అప్పుడప్పుడే కవిత్వంలోకి ప్రవేశిస్తున్న అనేక సందిగ్ధ సందర్భాలను మొట్టమొదటిసారిగా కొత్త డిక్షన్‌తో తీసుకువచ్చాను. అప్పుడూ ఇప్పుడూ సల్ఫ్యూరిక్ యాసిడ్‌లో ముంచి తీసిన అక్షరాల తోనే కవిత్వం రాశాను.

అద్దాన్నీ, ఆకారాన్నీ విభజించలేనట్లే నేను జీవితాన్నీ, కవిత్వాన్నీ వేరువేరుగా ఇప్పటికీ దర్శించలేకపోతున్నాను. స్వచ్ఛమైన గుండెల నిండా ప్రాణవాయువు నింపుకొని ఉదయపు తాజాదనంతో, నది వారసత్వంగా బహుజన ప్రజల ప్రయోజనంగా పంటపొలాలవైపు సాహిత్యంగా ప్రవహిస్తున్నాను. నా మొదటి పుస్తకం నుండి ఇప్పటి వరకు వచ్చిన 16 కవిత్వ సంపుటాలలో ఇదే చేశాను, చేస్తూనే ఉంటాను. సమాజానికి నాకు మధ్య నా కవిత్వం ఒక యానకం.



'నాగ స్వరం' కవిత్వం

కోయి కోటేశ్వర రావు కవితా సంపుటి 'నాగ స్వరం' ఆవిష్కరణ సభ డిసెంబర్ 27 సా.6గంటలకు హైదరాబాద్ బుక్ ఫెయిర్‌లో (ఎన్‌టిఆర్ స్టేడి యం, ఇందిరా పార్క్) తోపుడు బండి సాదిక్ ఆలీ వేదికపై జరుగుతుంది. సభాధ్యక్షులు ఎం.ఎం. వినోదిని, ముఖ్య అతిథి, ఆవిష్కర్త శిఖామణి, ఆత్మీయ అతిథులు యాకూబ్, నక్కా విజయరామ రాజు, సంగిశెట్టి శ్రీనివాస్, పసునూరి రవీందర్, జె. నీరజ.

సాహితీ పబ్లికేషన్స్

'చెమట చెక్కిన వాక్యం' వ్యాసాలు

కెంగార మోహన్ వ్యాస సంపుటి 'చెమట చెక్కిన వాక్యం' ఆవిష్కరణ సభ డిసెంబర్ 29ఉ.10 గంటలకు విజయవాడ లోని బాలోత్సవ్ భవన్‌లో జరుగుతుంది. ఆవిష్కర్త గుంటూరు లక్ష్మీనరసయ్య, పుస్తక పరిచయం– జి. వెంకటకృష్ణ, లోసాని సుధాకర్, కెంగార మోహన్, వొర్రప్రసాద్. వివరాలకు: 94900 99059.

సాహితీ స్రవంతి

'గచ్చెంసెట్టుకి అటూ ఇటూ' కవిత్వం

పాయల మురళీకృష్ణ కవితా సంపుటి 'గచ్చెంసెట్టుకి అటూ ఇటూ' ఆవిష్కరణ సభ డిసెంబర్ 29 సా.5గంటలకు విజయనగరంలోని గురజాడ కేంద్ర గ్రంథాలయంలో జరుగుతుంది. సభలో చీకటి దివాకర్, దుర్గా ప్రసాదరావు, అట్టాడ అప్పలనాయుడు, గంటేడ గౌరునాయుడు, గార రంగనాథం, మానస చామర్తి, సుంకర గోపాలయ్య శ్రీరాం పుప్పాల కంచరాన భుజంగరావు, లండ సాంబమూర్తి పాల్గొంటారు.

సాహితీస్రవంతి

కొలకలూరి పురస్కారాలకు గ్రంథాల ఆహ్వానం

కొలకలూరి భాగీరథీ కవిత్వ పురస్కారం, కొలకలూరి విశ్రాంతమ్మ నాటక పురస్కారం, కొలకలూరి రామయ్య పరిశోధన పురస్కారాలకు 1.1.2023 తర్వాత ముద్రితమైన గ్రంథాలను 15.1.2025 లోగా చేరేటట్లుగా పంపాలి. ప్రతి అవార్డుకు రూ.15వేల నగదు, జ్ఞాపిక, శాలువాతో 26.2.2025న హైదరాబాద్ నాంపల్లిలోని తెలుగు యూనివర్సిటీలో పురస్కార ప్రదానం ఉంటుంది. కవిత్వం, నాటకం పంపాల్సిన చిరునామా: కొలకలూరి మధుజ్యోతి (9441923172), తెలుగు శాఖాధ్యక్షులు, శ్రీ పద్మావతీ మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి– 517502. పరిశోధన గ్రంథాలు పంపాల్సిన చిరునామా: కొలకలూరి సుమకిరణ్ (9963564664), ఆంగ్లాచార్యులు, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి – 517 502.

కొలకలూరి ఇనాక్

పీచర పురస్కారాలకు గ్రంథాల ఆహ్వానం

పీచర సునీతారావు ఫౌండేషన్ కవిత్వం, కథలు, విమర్శ ప్రక్రియలలో సంపుటాలను ఆహ్వానిస్తున్నది. ఎన్నికైన ప్రతి సంపుటానికి రూ.15వేల నగదు, సత్కారం ఉంటాయి. మార్చ్ 2021 నుండి మార్చ్ 2024 వరకు వెలువడిన రచనలు 3 ప్రతులను ఫిబ్రవరి 10, 2025లోగా చిరునామా: పీచర సునీతా రావు ఫౌండేషన్, కేర్ ఆఫ్/ విజయేందర్ రావు, ప్లాట్ నం. 505. బ్లాక్–డి, భీమా ప్రైడ్ అపార్ట్‌మెంట్స్ నియర్ సుచిత్ర సర్కిల్, జీడిమెట్ల, హైదరాబాద్ 67, ఫోన్– 9866043441కు పంపాలి.

కాంచనపల్లి గోవర్ధన్ రాజు

కవితా సంపుటాలకు ఆహ్వానం

సాహితీ గౌతమి అంద జేస్తున్న సినారె కవితా పురస్కారం 2022కి గాను తెలుగు రాష్ట్రాల నుండి వచన కవితా సంపుటాలను ఆహ్వానిస్తున్నాం. కవులు 2019, 20, 21 సంవత్సరాలలో ముద్రించబడిన వారి కవితా సంపుటాలు నాలుగు ప్రతులను డిసెంబర్ 31లోగా పంపాలి. గతంలో ఈ పురస్కారం పొందిన కవులకు అవకాశం లేదు. చిరునామా: ఎడవల్లి విజయేంద్రరెడ్డి, శివానంద ఆసుపత్రి, ఇం. నెం. 33181, సవరన్ స్ట్రీట్, కరీంనగర్ – 505001కు పంపాలి. మరిన్ని వివరాలకు: 9490401861.

నంది శ్రీనివాస్

భరోసా.. భయం..



రైతు భరోసా సాయంపై ఆందోళన

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

రైతు భరోసా సాయంపై ఉత్కంఠ నెలకొంది. పథకంపై ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన ప్రకటనతో ప్రభుత్వ పెట్టుబడి సాయానికి అర్హులెవ్వరనేది ఆసక్తికరంగా మారింది. సాగు చేసే భూములకే రైతు భరోసా ఆర్థిక సాయం అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. గత ప్రభుత్వం బీడు భూములు, రాళ్లు, రప్పలున్న భూములకు రైతుబంధు ఇచ్చిందనే ఆరోపణలు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం కిసాన్ నిధి మార్గదర్శకాలను రైతు భరోసాకు వర్తింప చేసేందుకు కసరత్తు చేస్తుంది. దీంతో ప్రభుత్వ ఉద్యోగులు, ఐటీ చెల్లింపుదారులు, డాక్టర్లు, లాయర్లు తదితర వర్గాలకు రైతు భరోసా కోత పెట్టే యోచనలో ప్రభుత్వం ఉంది. ప్రస్తుతం ఉమ్మడి వరంగల్ జిల్లాలో రైతు బంధు పథకం ద్వారా 8.90 లక్షల మంది అన్నదాతకు పెట్టుబడి సాయం అందుతుండగా, ప్రభుత్వ తాజా ప్రకటనతో ఓరుగల్లు రైతుల్లో ఎవరెవరికి భరోసా అందనుందో అనే ఉత్కంఠ నెలకొంది.

సాగు చేయని భూములకు ఝులక్

ఉమ్మడి వరంగల్ జిల్లాలో సుమారు 15.61 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలను సాగు చేస్తున్నారు. అయితే సాగు భూములకంటే అధికంగా పెట్టుబడి సాయం దారి తప్పుతుంది. బంజార భూములు, సాగుకు పనికి రాని భూములు, కొండలు, గుట్టలకు కూడా రైతు బంధు ఇచ్చారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో ప్రభుత్వం రైతు భరోసా కింద పెట్టుబడి సాయాన్ని అర్హులైన రైతులకే ఇవ్వాలని ప్రణాళిక రూపొందిస్తుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న రైతుబంధు ద్వారా ఏటా అందుతున్న ఎకరాకు రూ.10వేల సాయాన్ని, రైతు భరోసాగా పథకాన్ని మార్చి, ఎకరాకు రూ.15,000లు అందిస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. అయితే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి అయినప్పటికీ రైతుభరోసా ఇవ్వకపోవడమే కాకుండా, గత ప్రభుత్వం అమలు చేసిన రైతుబంధు పథకం కింద వచ్చే రూ.10 వేల సాయం కూడా గత రెండు పంటలకు ఇవ్వకపోవటంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఖరీఫ్‌లోనే అతివృష్టి, అనావృష్టితో రైతులు తీవ్రంగా నష్టపోయారు. రబీ సాగుకు సిద్ధమైన రైతులకు పెట్టుబడి సాయం లేక అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అసెంబ్లీలో చేసిన ప్రకటన రైతులకు కొంత ఊరటనిచ్చింది. సంక్రాంతి నుంచి రైతు భరోసాను అమలు చేస్తామని ప్రకటించారు. అయితే గత ప్రభుత్వం తరహాలో సాగులో లేని భూములకు రైతు భరోసా ఇవ్వమని చెప్పారు. గతంలో బీడు భూములు, సాగులో లేని భూములకు కూడా రైతు భరోసా అమలు చేశారు. వందల ఎకరాల భూములన్న భూస్వాములకు కూడా రైతు బంధు ద్వారా పెట్టుబడిసాయాన్ని అందించారు. అయితే ప్రస్తుతం ప్రభుత్వం సాగులో లేని భూములకు రైతు భరోసా ఇచ్చేది లేదని తేల్చి చెప్పింది. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా రైతు బంధుకు భారీ కోత పడే అవకాశం ఉందనే చర్చ జరుగుతుంది.

రైతు భరోసాకు పీఎంకే నిధి మార్గదర్శకాలు..?

రైతు భరోసా ద్వారా ఎకరాకు రూ.7,500ల చొప్పున రెండు పంటలకు రూ.15,000లు ప్రభుత్వం

మిగతా 7వ పేజీలో...

- సాగు చేయని భూములకు సర్కార్ ఝులక్
- పంట సాగులో ఉన్న భూములకే భరోసా అంటూ ప్రకటన
- పీఎం కిసాన్ నిధి మార్గదర్శకాలను రైతు భరోసాకు అమలు చేసే యోచన
- ఉద్యోగులు, పెన్షనర్లు, ఐటీ చెల్లింపుదారులు, డాక్టర్లు, లాయర్లకు భరోసా లేనట్టే
- ప్రస్తుతం ఉమ్మడి వరంగల్ జిల్లాలో 8.90 లక్షల మంది కర్షకులకు రైతుబంధు
- అనర్హులను ఏరివేసి.. సాగు రైతులకే భరోసా ఇచ్చేలా ప్రభుత్వం వ్యూహం
- తెరపైకి 10 ఎకరాల వరకే రైతు భరోసా ఇవ్వాలనే డిమాండ్
- సంక్రాంతికి భరోసా అందిస్తామని ప్రభుత్వ ప్రకటనతో రబీ రైతులకు ఊరట

పెట్టుబడి సాయంలో భారీ కోతలే

ప్రభుత్వం రైతు భరోసాకు పీఎంకే నిధి పథకంలోని నిబంధనలను వర్తింప చేయాలని భావిస్తుందనే ప్రచారం రైతుల్లో గుబులు రేపుతోంది. చాలా మంది గ్రామాల్లో రైతులు బ్యాంకుల్లో రుణాల కోసం ఐటీ చెల్లింపుదారులుగా ఉన్నారు. ఇంటి రుణం, వ్యాపారం రుణం కోసం కనీసం మూడేళ్ల ఐటీ చెల్లించినట్లుగా ఉండాలనే నిబంధన ఉండటంతో రైతులు లేదా వారి పిల్లలు ఆదాయ పన్ను చెల్లిస్తున్నారు. పీఎంకే నిధి రూల్స్ ప్రకారం వరుసగా రెండేళ్ల కంటే ఎక్కువ సంవత్సరాలు ఐటీ చెల్లిస్తే ప్రభుత్వ సాయానికి అర్హులు కాదనే నిబంధన ఉంది. దీంతో రైతు భరోసాకు కూడా దీన్ని వర్తింప చేస్తే చాలా మంది రైతులు నష్టపోవాల్సి వస్తుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే కుటుంబంలో ఒక్కరికి మాత్రమే పీఎంకే నిధి ద్వారా సాయం అందుతుంది. రైతుబంధులో ఎవరి పేరు మీద ఎంత భూమి ఉంటే అంతే సాయం అందిస్తున్నారు. పీఎంకే నిధి నిబంధనలను రైతు భరోసాకు వర్తింప చేస్తే చాలా మంది రైతులకు కోత తప్పదనే టాక్ వినబడుతుంది. అలాగే రైతు భరోసాను 10 ఎకరాల లోపు ఉన్న రైతులకే ఇవ్వాలనే డిమాండ్ కూడా ఉంది. జూలై 15 తేదీన ఉమ్మడి వరంగల్ జిల్లా రైతుల అభిప్రాయాలను మంత్రివర్గ ఉపసంఘం సేకరించింది. బడా రైతులకు కాకుండా చిన్న, సన్నకారు రైతులకు రైతు భరోసా ఇవ్వాలనే సూచనాలు ఎక్కువగా వచ్చాయి. దీంతో ప్రభుత్వం కూడా 10 ఎకరాల లోపు ఉన్న రైతుకే భరోసా అనే నిబంధన పెడుతారా అనేది ఉత్కంఠగా మారింది. మొత్తానికి గత ప్రభుత్వం తరహాలో కాకుండా సాధ్యమైనంత వరకు అనర్హులను ఏరివేసి, సాగు భూములకే రైతు భరోసా ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించటం చర్చనీయాంశంగా మారింది.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రైతుబంధు, కేంద్రం అందిస్తున్న పీఎం కిసాన్‌సమ్మాన్ నిధి పథకం ద్వారా లబ్ధిపొందుతున్న రైతులు..

జిల్లా	రైతుబంధు రైతులు	పీఎంకేఎస్‌నిధి రైతులు
వరంగల్	1,54,822	65,361
హనుమకొండ	1,45,044	56,409
జనగామ	1,79,735	81,487
మహబూబాబాద్	2,14,685	90,978
భూపాలపల్లి	1,16,171	48,496
ములుగు	79,330	39,159
మొత్తం	8,89,787	3,81,890

ఉద్యోగం పేరిట టోకరా

- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జాబ్ ఇప్పిస్తానని మహిళకు మోసం
- రూ. 2.50 లక్షలు వసూలు చేసి నకిలీ అపాయింట్‌మెంట్ ఆర్డర్
- పోలీసులను ఆశ్రయించిన బాధితురాలు
- అయినా లభించని న్యాయం

నర్సంపేట టౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఉద్యోగం పేరిట రూ.2.50 లక్షలు వసూలు చేసి ఓ మహిళను మోసగించిన సంఘటన వరంగల్ జిల్లా నర్సంపేటలో ఆదివారం ఆలస్యంగా వెలుగుచూసింది.

. బాధితురాలి కథనం ప్రకారం... నర్సంపేట పట్టణంలోని ఎన్‌టీఆర్ నగర్‌లో బుడిగొండ శృతి-రమేష్ దంపతులు నివాసం ఉంటున్నారు. శృతి బీకాం(కంప్యూటర్స్) విద్యనభ్యసించి ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేస్తోంది. వీరి ఇంటికి సమీపంలోనే నివాసం ఉంటున్న వావిళ్ల ప్రసాద్ అనే వ్యక్తి ఏడాది క్రితం నర్సంపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోని స్కానింగ్ సెక్షన్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని శృతిని, ఆమె భర్త రమేష్‌లను నమ్మబలికాడు. ఇందుకు రూ.2.50లక్షలు ఖర్చు అవుతాయని చెప్పి వారి వద్ద వసూలు చేశాడు. ఇందుకోసం కొద్ది రోజులు శిక్షణ పొందాలంటూ కొందరు వ్యక్తులతో పట్టణంలోని ఎస్‌బీఐ కార్యాలయం సమీపంలో వరంగల్‌కు చెందిన ఓ బ్రోకర్ సహాయంతో శిక్షణ సైతం ఇచ్చారు. శిక్షణ అనంతరం 2023 అక్టోబరు 28న అపాయింట్‌మెంట్ లెటర్‌ను శృతికి ఇచ్చారు. అపాయింట్‌మెంట్ లెటర్‌తో శృతి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళితే లెటర్ నకిలీదని తెలపడంతో లబోదిబోమంటూ ఉద్యోగం ఇప్పిస్తానన్న ప్రసాద్‌ను నిలదీయగా తప్పించుకు తిరుగుతున్నాడని శృతి వాపోయింది.

పోలీసులను ఆశ్రయించినా న్యాయం జరగలేదు

- బాధిత మహిళ శృతి



నకిలీ అపాయింట్‌మెంట్ ఆర్డర్‌ను చూపిస్తున్న శృతి

తనకు జరిగిన అన్యాయంపై 2024 నవంబరు 12న నర్సంపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదని బాధిత మహిళ శృతి ఆదివారం విలేకరుల ఎదుట తన గోడు వెల్లబోసుకుంది. కూలీనాలీ చేసుకొని జీవనం వెళ్లదీస్తున్న తమకు ఉద్యోగం పేరుతో ఆశ చూపి రూ.2.50 లక్షలు తీసుకొని ఉద్యోగం ఇవ్వకుండా, డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్న ప్రసాద్, అతనికి సహకరించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని పోలీసులను వేడుకున్నా నేటి వరకు పట్టించుకోలేదని వాపోయింది. ఇప్పటికైనా సదరు వ్యక్తులపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను బాధితురాలు వేడుకుంటున్నది.

కొప్పూర్ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ చాలీసా మహా కోలాట ప్రదర్శన నిర్వహిస్తున్న మహిళలు





నిర్వాహకులకు గిన్నిస్ బుక్ రికార్డును అందజేస్తున్న నేషనల్ కో-ఆర్డినేటర్ వెంకటరమణరావు, మాజీ మంత్రి పెద్దిరెడ్డి

శ్రీరామదూత శిరసా నమామి

వెయ్యి మంది మహిళలతో భక్తి పారవశ్యం

- అలరించిన అతివల కోలాటం
- గిన్నిస్ కెక్కిన కొప్పూర్

7

ఎస్ఎస్ కాంట్రాక్ట్ ఉద్యోగుల వంటావార్పు

- కుటుంబాలతో తరలివచ్చిన ఉద్యోగులు
- ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వాలి
- జేఏసీ నాయకుల డిమాండ్
- నేడు భిక్షాటనతో నిరసన

హన్మకొండటౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : రెగ్యులైజ్ చేయాలనే డిమాండ్‌తో సర్వశిక్షా కాంట్రాక్ట్ ఉద్యోగుల నిరసన దీక్షలు భగ్గుమంటున్నాయి. ఆదివారం 17వ రోజు ఏకశిలా పార్కు వద్ద దీక్షల శిబిరానికి కాంట్రాక్ట్ ఉద్యోగులు పిల్లాపాపలు, కుటుంబాలతో తరలివచ్చి రోడ్డుపైనే వంటావార్పు నిర్వహించారు. రోడ్డుపైనే సహపంక్తి భోజనాలను చేపట్టారు. 'మీరిచ్చిన హామీ కదా- రెగ్యులైజ్ చేస్తామని' అంటూ సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నినాదాలతో గుర్తుచేశారు. తల్లిదండ్రుల వెట్టిచాకిరి వెతలపై పిల్లలు పాడిన పాటలు పలువురి ఆలోచింప చేశాయి. కనీస వేతనాలు లేక అవస్థలు పడుతున్న తమ బాధలు మీకు పట్టవా అంటూ ప్రభుత్వాన్ని జేఏసీ నాయకులు నిలదీశారు. విద్యావ్యవస్థకు పట్టుకొమ్మల్లా ఉన్నా తమ పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి వీడి తక్షణమే స్పందించాలని కోరారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ ఇచ్చే వరకు సమ్మెను వీడేది లేదని వారు తేల్చిచెప్పారు. కాగా, సోమవారం భిక్షాటనతో నిరసన తెలుపనున్నట్లు వారు చెప్పారు. దీక్షలను డీటీఎఫ్ అధ్యక్షుడు సత్యనారాయణ సందర్శించి మద్దతు తెలిపి ఆర్థిక సహాయాన్ని అందించారు. ఎస్ఎస్ ఉద్యోగుల న్యాయపరమైన డిమాండ్‌లను ప్రభుత్వం తీర్చాలని కోరారు.



దీక్షల వద్ద వంటావార్పు అనంతరం సహపంక్తి భోజనాలు చేస్తున్న ఎస్ఎస్ ఉద్యోగులు

నేడు బల్దియాలో ప్రజావాణి కార్యక్రమం

వరంగల్ కార్పొరేషన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : నగర ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకునేందుకు ప్రతీ సోమవారం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం సోమవారం జరుగనుందని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆమె వెల్లడించారు. ప్రజల సమస్యలు వెల్లడించేందుకు ఉదయం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయానికి వచ్చి ఫిర్యాదులు చేయవచ్చని తెలిపారు. ప్రజావాణిలో సంబంధిత అధికారులు బాధితుల ఫిర్యాదులు పరిష్కరించి తగిన పరిష్కారం చూపిస్తారని కమిషనర్ అశ్విని తానాజీ వాకడే తెలిపారు.

30న బల్దియా కౌన్సిల్ సమావేశం

పలు అంశాలు, అభివృద్ధి పనులపై చర్చ

వరంగల్ కార్పొరేషన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ సాధారణ సర్వసభ్య (కౌన్సిల్) సమావేశం ఈ నెల 30న జరుగనున్నట్లు బల్దియా సెక్రెటరి అలివేలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర మేయర్ గుండు సుధారాణి ఆదేశాల మేరకు బల్దియా పరిధిలోని 66 డివిజన్‌ల కార్పొరేటర్లు, మంత్రి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు (ఎక్స్ అఫిషియో) మెంబర్లు పాల్గొనాలని తెలిపారు. బల్దియా కౌన్సిల్ కార్యాలయంలో ఉదయం 11.30 గంటలకు కౌన్సిల్ సమావేశం జరుగుతుందని ఎజెండాలో పొందుపరిచిన అంశాలపై చర్చ ఉంటుందని తెలిపారు. నగరంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులు, ఇతర అంశాలపై అభిప్రాయ సేకరణ జరుగుతుందని వెల్లడించారు. కీలక నిర్ణయాలపై సభ్యుల ఆమోదం మేరకు కౌన్సిల్ సమావేశం జరుగుతుందని తెలిపారు. గతంలో ప్రవేశ పెట్టిన బడ్జెట్, నిధులు విడుదలపై విశ్లేషణ జరుగుతుంది.

అన్నీ అనుకూలమే... అయినా ఆలస్యం

- రైల్వే డివిజన్ హోదాపై సాగదీత
- పార్లమెంట్‌లో స్పష్టతరాని హోదా అంశం



కాజీపేట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : కాజీపేటకు రైల్వే డివిజన్ హోదా ఇవ్వడానికి అన్నీ అనుకూలాంశాలైనప్పటికీ రైల్వే శాఖ ఈ అంశాన్ని సాగదీస్తోందని విమర్శలు తలెత్తుతున్నాయి. గత కొన్ని రోజులుగా కాజీపేటకు రైల్వే డివిజన్ హోదా దక్కుతుందన్న ప్రచారాలతో ఉత్సాహంలో ఉన్న స్థానికులు, ఈ మధ్య జరిగిన పార్లమెంట్ సమావేశంలో రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ పూర్తి స్పష్టత ఇవ్వలేదని పలువురు చర్చించుకుంటున్నారు. కాజీపేట అభివృద్ధికై ఇప్పటికే నిధులు అధికంగా కేటాయించామని రైల్వే మంత్రి ప్రకటించారు. కానీ డివిజన్ ఏర్పాటుపై స్పష్టంగా, సూటిగా సమాధానం చెప్పలేదని రైల్వే కార్మికుల వాదన. విశాఖ జోన్ ఏర్పాటుకు రైల్వే శాఖ శరవేగంగా పనులు చేస్తోంది. ఈ క్రమంలో దక్షిణ మధ్య రైల్వేలో ఉన్న విజయవాడ, గంటూరు, గుంతకల్ డివిజన్‌లు విశాఖ జోన్‌లో విలీనం కానున్నాయి. దక్షిణ మధ్య రైల్వే జోన్‌లో కేవలం సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్‌లు డివిజన్‌లకు మాత్రమే పరిమితం కానున్నాయి.. దీంతో దక్షిణ మధ్య రైల్వేలో ఉన్న కాజీపేటను డివిజన్‌గా ఉన్నతీకరించాలని ఉన్న డిమాండ్‌ను విశాఖ జోన్ ఏర్పాటుతో కాజీపేటకు డివిజన్ హోదా దక్కుతుందనే అందరు అంచనా వేశారు. రైల్వే మంత్రి ప్రకటనతో స్థానికులకు, రైల్వే కార్మికులకు నిరాశే మిగిలింది.

డివిజన్ హోదాకు అన్నీ అనూకూల అంశాలే..

కాజీపేట జంక్షన్‌కు డివిజన్‌హోదా ఇవ్వడానికి వందకు వంద శాతం అన్నీ అనుకూలాంశాలే అని రైల్వే కార్మిక సంఘాలు, కార్మికులు, అన్ని రాజకీయ పార్టీలు భావన. ఉత్తర దక్షిణ రైల్వే మార్గాలకు కలిపే గేట్ వే ఆఫ్ ఇండియా కాజీపేట జంక్షన్, రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నుంచి ఢిల్లీ, చెన్నై రైల్వే మార్గాలను కలపడమే కాకుండా దక్షిణ మధ్య రైల్వేలో ఉన్న కాజీపేట సికింద్రాబాద్ డివిజన్‌కు 48. 6 శాతం కేవలం కాజీపేటనుంచే అధిక ఆదాయం వస్తోంది. ఇదే కాకుండా రోడ్డు రవాణా, నీటి సౌకర్యం, డివిజన్‌కు కావల్సినంత స్థలం కూడా ఉంది. ఇక్కడే ఎలక్ట్రికల్ లోకో షెడ్, డీజిల్ లోకోషెడ్, ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ శిక్షణ కేంద్రం, లోకోపైలెట్,

మిగతా 8వ పేజీలో...



బహిరంగ సభలో మాట్లాడుతున్న స్థిత ప్రజ్ఞ

సంఘాలు వ్యతిరేకించి ఉంటే సీపీఎస్ అమలయ్యేదా...?

- సీపీఎస్ అంతమే టీఎస్‌సీపీఎస్ఈయూ పంతం
- కాకతీయ కదన భేరీ బహిరంగ సభలో రాష్ట్ర అధ్యక్షుడు స్థిత ప్రజ్ఞ

6



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, దాస్యం వినయ్ భాస్కర్

అసెంబ్లీ వేదికగా ప్రజలను మోసం చేసిన సీఎం

- పరిపాలన చేయలేక ప్రతిపక్షాలే టార్గెట్‌గా అక్రమ కేసులు
- రాష్ట్ర స్థితిగతులపై అవగాహన లేని ముఖ్యమంత్రి
- మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య

6



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

సెలబ్రిటీ అయితే ఏం... శిక్షార్హుడు కాదా..?

- అల్లు అర్జున్‌లో పశ్చాతాపమే లేదు
- దొంగల సరసన పొన్నాల మాట్లాడడం బాధాకరం
- మీడియా సమావేశంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

6

అసెంబ్లీ వేదికగా ప్రజలను మోసం చేసిన సీఎం

- పరిపాలన చేయలేక ప్రతిపక్షాలే టార్గెట్‌గా అక్రమ కేసులు
- రాష్ట్ర స్థితిగతులపై అవగాహన లేని ముఖ్యమంత్రి
- మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య



క్రిస్మస్ వేడుకల్లో వినయ్‌భాస్కర్‌కు కేక్ తినిపిస్తున్న పొన్నాల లక్ష్మయ్య

హనుమకొండ టౌన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి అబద్ధపు ప్రకటనలతో తెలంగాణ ప్రజలను మోసం చేశారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత పొన్నాల లక్ష్మయ్య విమర్శించారు. ఆదివారం హనుమకొండలోని బీఆర్ఎస్ కార్యాలయంలో హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బీఆర్ఎస్ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ కార్యాలయంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించి కేక్ కట్ చేశారు. క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత పొన్నాల లక్ష్మయ్య మాట్లాడుతూ.. రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి ఏడాది పాలనపై ఉత్సవాలు ఎందుకు జరుపుతున్నారో చెప్పాలని అన్నారు. ఆర్థిక స్థితిగతులపై అవగాహన లేకుండా హామీలు ఇచ్చి అమలు చేయడం లేదని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో చేపట్టిన సంక్షేమ పథకాలు అమలు చేస్తారా లేదా.. అని ప్రశ్నించారు.

ప్రధాని మోదీ, అదానీ అవినీతిపై పబ్లిసిటీ కోసమే నిరసన ర్యాలీ చేయడం హాస్యాస్పదమన్నారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలకు ఎంత డబ్బు అవసరమో లెక్కలు లేకుండా ప్రజలను అయోమయానికి గురిచేస్తున్నారని చెప్పారు. 14 సార్లు ప్రజా క్షేత్రంలో గెలిచిన మాజీ సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని సాధించి ఎంతో అభివృద్ధి చేశారని అన్నారు. ప్రభుత్వ పాలనపై అనుభవం లేని రేవంత్‌రెడ్డి సీఎం పదవిలో ఉండడం ఆర్థిక స్థితిగతులపై కనీస అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. పరిపాలన చేయలేకనే ప్రతిపక్షాల నాయకులపై అక్రమ కేసులు నమోదు చేసి టార్గెట్ చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో అప్పులు ఉన్నాయి కాబట్టి సంక్షేమ కార్యక్రమాలు చేయడం లేదని కాంగ్రెస్ నాయకులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అమెరికా లాంటి అగ్ర రాజ్యం ఆదాయం కంటే ఎక్కువ అప్పులే ఉన్నాయని అవగాహన లేక పరిపాలన చేతగాక ప్రతిపక్షాలను ఇబ్బందులకు గురి చేస్తూ డైవర్షన్ రాజకీయాలకు తెరలేపినట్లు విమర్శించారు. 29 రాష్ట్రాలలో మెరుగైన ఆదాయం ఒక్క తెలంగాణ రాష్ట్రానికే వస్తుందని అన్నారు. రాష్ట్ర సంపదకు అప్పులకు తేడా ఎంత ఉందో తెలియని సీఎం రేవంత్‌రెడ్డి అని విమర్శించారు.

మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్ర పండుగలను మాజీ సీఎం కేసీఆర్ అధికారికంగా నిర్వహించారని తెలిపారు. బతుకమ్మ పండుగకు చీరలు, రంజాన్, క్రిస్మస్ పండుగలకు గిఫ్టులు అందించినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కోరితే ప్రతీకార చర్యలకు ఒడిగడుతున్నారని దుయ్యబట్టారు. ఏపీ సీఎం చంద్రబాబునాయుడితో రేవంత్‌రెడ్డి చీకటి ఒప్పందంలో భాగంగానే తెలంగాణ బ్రాండ్ హైదరాబాద్ ఇమేజ్‌ను దెబ్బతియ్యాలనే సినిమా రంగాన్ని అవమానపరుస్తూ సినీ నటులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. హైడ్రాతో పేదలను రోడ్డున పడేశారని ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని దుయ్యబట్టారు. ప్రజా పాలన అన్నారు. ఇప్పటికైనా ప్రతీకార పాలనను వీడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, వరంగల్ పశ్చిమ కోఆర్డినేటర్ పులి రజనీకాంత్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జోరిక రమేష్, రజనీకుమార్, నయీమొద్దీన్, రమేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అమిత్‌షా క్షమాపణ చెప్పాలి

- మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్

మహబూబాబాద్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అవమానించేలా వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ప్రజలకు క్షమాపణ చెప్పి, తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని మహబూబాబాద్ పోరిక బలరాంనాయక్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అమిత్‌షా రాజ్యాంగాన్ని, అంబేద్కర్‌ను కించపరుస్తూ వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. ఈ వ్యాఖ్యలు రాజ్యాంగ వ్యతిరేక, దళిత వ్యతిరేక మనస్తత్వాన్ని బహిర్గతం చేశాయని చెప్పారు. ఇది ఆర్ఎస్ఎస్ సైద్ధాంతిక వైఖరిని ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు. భారత రాజ్యాంగం కేవలం చట్టపరమైన పత్రం కాదని, మన ప్రజాస్వామ్యానికి పునాది అని వివరించారు. అమిత్‌షా వ్యాఖ్యలను ప్రతీ ఒక్కరు ఖండించాలని కోరారు.

సెలబ్రిటీ అయితే ఏం... శిక్షార్హుడు కాదా..?

- అల్లు అర్జున్‌లో పశ్చాత్తాపమే లేదు
- మీడియా సమావేశంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హనుమకొండ సిటీ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సినీ హీరో అల్లు అర్జున్ సెలబ్రిటీ అయితే ఏంటి, తప్పు చేసినప్పుడు శిక్షార్హుడు కాదా.. అని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, వరంగల్‌పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ప్రశ్నించారు. తప్పు చేస్తే ఎంతటి స్థాయి వారైనా సరే ఉపేక్షించేది లేదనేదే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిరూపిస్తున్నారని పేర్కొన్నారు. హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఆదివారం జరిగిన మీడియా సమావేశంలో రాజేందర్‌రెడ్డి మాట్లాడారు. హైదరాబాద్ సంధ్యా థియేటర్ ఘటన విషయంలో హీరో అల్లు అర్జున్ ఆయన తండ్రి అల్లు అరవింద్‌లో పశ్చాత్తాపమే కనిపించడం లేదన్నారు. తొక్కిసలాటలో తల్లి మరణించింది. కొడుకు ప్రాణాపాయ స్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అల్లు అర్జున్ కనీసం పరామర్శించలేదని విమర్శించారు. ఆర్థిక సహకారాన్ని కూడా అందించే విషయాన్ని కూడా వెల్లడించడం లేదన్నారు. ప్రాణం కోల్పోయి ఒక కుటుంబం ఆగమైందన్నారు. ఇంత జరిగితే పరామర్శించే సమయమే లేదన్నట్లుగా అల్లు అర్జున్ తీరు ఉందని మండిపడ్డారు. తమస్థాయి దిగజారుస్తున్నారని, వ్యక్తిత్వాన్ని కించపరుస్తున్నారంటూ ప్రభుత్వంపై అల్లు అర్జున్ వ్యాఖ్యలు చేయడం అర్థ రహితమన్నారు. తప్పు చేస్తే ఎంతటి వారైన సరే శిక్ష అనుభవించాల్సిందే అని స్పష్టం చేశారు.

బీజేపీ, బీఆర్ఎస్ వంత పాడడం సిగ్గు చేటు

అల్లు అర్జున్ తప్పును సమర్థిస్తూ బీజేపీ, బీఆర్ఎస్ నేతలు వంత పాడడం సిగ్గుచేటని రాజేందర్‌రెడ్డి ధ్వజమెత్తారు. పాప్‌కార్న్‌పై 12 శాతం జీఎస్టీ కేంద్రం విధించి ప్రజల నెత్తిన భారం రుద్దితే బీజేపీ, బీఆర్ఎస్ నేతలకు ఈ సమస్య పట్టడం లేదన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రజలపై భారాన్ని సమర్థిస్తారా అని ప్రశ్నించారు.

దొంగల సరసన పొన్నాల మాట్లాడడం బాధాకరం

బీఆర్ఎస్ కార్యాలయం కోసం ప్రభుత్వ భూమినే కబ్జా చేసిన దొంగల సరసన కూర్చొని మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య మాట్లాడడం బాధాకరమన్నారు. పొన్నాల లక్ష్మయ్యకు కాంగ్రెస్ రాజకీయ జన్మనిచ్చిందన్నారు. ఇంత చేస్తే దొంగల పక్కన కూర్చొని ఆయన కాంగ్రెస్‌ను నిందించడం పెద్దతనం కాదన్నారు. వరంగల్ నగరంలో వాడ్రా అమల్లోకి తెస్తామంటుంటే బీఆర్ఎస్ నేతలకు భయం పట్టుకుందన్నారు.

పొన్నాల దోపిడీ పార్టీలో చేరారు

వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ

మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య దోపిడీ పార్టీలో చేరారని వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ఆరోపించారు. మంత్రిగా, టీపీసీసీ అధ్యక్షుడిగా పదవులు ఇచ్చి కాంగ్రెస్ ఆయనను గౌరవించిందన్నారు. కానీ ఆయన మాత్రం దోపిడీ పార్టీ అయిన బీఆర్ఎస్‌లో చేరి కాంగ్రెస్‌నే విమర్శించడం గౌరవం కాదన్నారు. అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిజంగా హీరోనే అన్నారు. బీఆర్ఎస్ నాయకులకు మున్ముందు సినిమా చూపించనున్నారని స్వర్ణ పేర్కొన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు బత్తిని శ్రీనివాస్, బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, విర్జా అజీజుల్లా బేగ్, బొమ్మతి విక్రమ్, డాక్టర్ పులి అనిల్‌కుమార్, జీడబ్ల్యూఎంసీ ఫ్లోర్ లీడర్ తోట వెంకన్న, కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



శ్రీను (ఫైల్)

సీరోలు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లా సీరోలు మండలం కాంపల్లి శివారు సక్రాంనాయక్ తండాకు చెందిన తేజావత్ శ్రీను(38) అనే రైతు పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనకు సంబంధించి ఎస్సై నగేష్ తెలిపిన వివరాల ప్రకారం... సక్రాం నాయక్ తండాకు చెందిన శ్రీనుకు ఎకరం భూమి ఉంది. అందులో కొంత మిరపతోట వేయగా, దాని పెట్టుబడి కోసం రూ.2 లక్షలు అప్పు చేశాడు. తోటకు రోగాలు ఆశించడంతో తెచ్చిన అప్పు ఎలా తీర్చాలన్న మనస్తాపంతో ఈనెల 21న చేనువద్ద పురుగుల మందుతాగి ఇంటికి వచ్చి పడుకున్నాడు. భార్య మంగమ్మ కూలీ పనికిపోయి ఇంటికి వచ్చే సరికి శ్రీను వాంతులు చేసుకుంటుండగా, పురుగుల మందు వాసనను గుర్తించారు. శ్రీనును వెంటనే రాత్రి 7 గంటలకు చికిత్స నిమిత్తం మహబూబాబాద్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందినట్లు ఎస్సై నగేష్ తెలిపారు. మృతుడి సోదరుడు సక్రు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి భార్య, కుమార్తె గాయత్రి ఉన్నారు.

సంఘాలు వ్యతిరేకించి ఉంటే సీపీఎస్ అమలయ్యేదా..?

- సీపీఎస్ అంతమే టీఎస్‌సీపీఎస్ఈయూ పంతం
- కాకతీయ కదన భేరీ బహిరంగ సభలో రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ



కాకతీయ కదన భేరి బహిరంగ సభలో మాట్లాడుతున్న స్థితప్రజ్ఞ

వరంగల్ ఎడ్యుకేషన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వ్యవస్థీకృత సంఘాలు వ్యతిరేకిస్తూ ఆనాడు కాంట్రిబ్యూటెడ్ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) అమలయ్యేదా అని తెలంగాణ రాష్ట్ర సీపీఎస్ ఉద్యోగుల సంఘం (టీఎస్‌సీపీఎస్ఈయూ) రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం స్థితప్రజ్ఞ ప్రశ్నించారు. వరంగల్ ఇస్లామియా కళాశాల గ్రౌండ్‌లో సీపీఎస్ ఉద్యోగుల సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కందుల జీవన్‌కుమార్ అధ్యక్షతన సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ కాకతీయ కదన భేరి బహిరంగ సభను నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన స్థితప్రజ్ఞ మాట్లాడుతూ... రాష్ట్రంలోని 147 సంఘాల వైఫల్యమే నేడు ఉద్యోగ, ఉపాధ్యాయుల నెత్తిమీద సీపీఎస్ పెనుభూతంగా తాండవిస్తుందన్నారు. సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆవేదన నుంచే టీఎస్‌సీపీఎస్ఈయూ పుట్టిందన్నారు. కేవలం సీపీఎస్ పంతమే లక్ష్యంగా టీఎస్‌సీపీఎస్ఈయూ పనిచేస్తుందన్నారు. 2016లో సంఘం ఆవిర్భావం వరకు అప్పటికే రాష్ట్రంలో వ్యవస్థీకృతమైన సంఘాలకు సీపీఎస్ అంశం గుర్తుకురాలేదన్నారు. సీపీఎస్ ఉద్యోగులను సంఘాలన్నీ వాటి అవసరాలకు వాడుకున్నారని ఆరోపించారు. సీపీఎస్ ఉద్యోగులు సంఘాల నాయకులకు పల్లకీలు మోసే బోయల్లాగానే కనిపించారన్నారు. రాష్ట్రంలో గ్రాట్యూటీ, ఫ్యామిలీ పెన్షన్ తెచ్చిన ఘనత టీఎస్‌సీపీఎస్ఈయూదేనన్నారు. 2025 ఏప్రిల్ 1న కేంద్ర ప్రభుత్వం ఉద్యోగుల మీదకు యూపీఎస్‌తో మరో పెనుభూతాన్ని వదలనుందన్నారు. ఇప్పటికైనా కళ్లు తెరిచి వ్యతిరేకించకపోతే ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతారన్నారు. దశాబ్ద కాలంగా అయిదుగురు ఎమ్మెల్సీలకు మద్దతు తెలిపినా ఎవ్వరూ సీపీఎస్ రద్దు అంశాన్ని మండలిలో లేవనెత్తలేదని ఆయన విమర్శించారు. ఇన్ని సంఘాలున్నప్పటికీ జీవో 317కు ఇప్పటి వరకు పరిష్కారం దొరకలేదన్నారు.

సర్వీస్ రూల్, గురుకుల, మోడల్ స్కూల్, కేజీబీవీల సమస్యలను అపరిష్కృతంగానే ఉన్నాయన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో సీపీఎస్ రద్దు అంశాన్ని చేర్చిన కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం సీపీఎస్‌ను రద్దు చేస్తుందని ఆయన ధీమాను వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో సీపీఎస్ రద్దు చేయడంతో రాష్ట్రంలోనూ సీపీఎస్ రద్దు అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సీపీఎస్ ఉద్యోగుల సంఘం వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా డాక్టర్ కొలిపాక వెంకటస్వామిని ఆయన బహిరంగసభలో ప్రకటించారు. ఆయన గెలుపు కోసం సీపీఎస్ ఉద్యోగులందరూ కృషి చేయాలని కోరారు. శాసన మండలిలో సీపీఎస్ రద్దుకు పోరాడేందుకు వెంకటస్వామిని సీపీఎస్ ఉద్యోగులు గెలిపించుకోవాలని అన్నారు.

అనంతరం డాక్టర్ వెంకటస్వామి మాట్లాడుతూ... తాను రాజకీయ కోసం రాలేదని, సీపీఎస్ ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు వస్తున్నానన్నారు. అంతకుముందు మాట్లాడిన సంఘం రాష్ట్ర నాయకులు రవిచందర్, షేక్ అబ్దుల్లా, రవీందర్, బుచ్చన్న మాట్లాడుతూ... వరంగల్ సాక్షిగా సీపీఎస్‌ను రద్దు చేస్తానని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఓపీఎస్‌ను అమలు చేయాలన్నారు. పెన్షన్ అనేది ఉద్యోగి హక్కు అని పాత పెన్షన్ విధానాన్ని ప్రభుత్వం అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి కల్వల్ శ్రీకాంత్, కోశాధికారి ఇడిగి నరేష్‌గౌడ్, నాయకులు రవీందర్‌రెడ్డి, లింగమూర్తి, నర్సమ్మ, లింగమూర్తిలతో పాటు 33 జిల్లాల నుంచి ప్రతినిధులు, సీపీఎస్ ఉపాధ్యాయ, ఉద్యోగులు హాజరయ్యారు.

ఆదర్శ విద్యాలయంగా తీర్చిదిద్దాలి

- కూనూరు హైస్కూల్ అభివృద్ధికి చర్యలు
- కంప్యూటర్, సైన్స్ ల్యాబ్ గదులు నిర్మిస్తా
- పాఠశాలకు పూర్వ విద్యార్థులు తోడ్పడాలి
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- ముగిసిన స్కూల్ గోల్డెన్ జూబ్లీ వేడుకలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

జఫర్‌గఢ్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కూనూరు పాఠశాలను ఆదర్శ విద్యాలయంగా తీర్చిదిద్దాలని, స్కూల్ అభివృద్ధికి, పూర్వ విద్యార్థులు సహకారం అందించాలని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కోరారు. కూనూరు జడ్పీ హైస్కూల్‌లో గోల్డెన్ జూబ్లీ వేడుకలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన శ్రీహరి మాట్లాడుతూ 1974 నుంచి నేటి వరకు టెన్త్ చదువుకున్న సుమారు 6వేల మంది 50ఏళ్ల తర్వాత ఒకే వేదికపైకి రావడం ఆనందంగా ఉందన్నారు. హైస్కూల్‌కు వచ్చే విద్యా సంవత్సరం నాటికి 12 కంప్యూటర్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కంప్యూటర్ ల్యాబ్, సైన్స్ ల్యాబ్‌ల ఏర్పాటుకు రెండు గదులను నిర్మించనున్నట్లు తెలిపారు. పాఠశాల ప్రహరీని ఎత్తు పెంచేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. కార్పస్ ఫండ్‌ను ఏర్పాటు చేసుకుని విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పనకు ఓ మినీ బస్సును ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమానికి ముందు పాఠశాల ఆవరణలోని మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం విగ్రహానికి ఎమ్మెల్యే శ్రీహరి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సావనీర్ పుస్తకాలను, కూనూరు పాఠశాల పేరుతో ఏర్పాటుచేసిన యూట్యూబ్ చానల్, వెబ్‌సైట్‌ను పూర్వ విద్యార్థుల సమక్షంలో ప్రారంభించారు. గురువులను మెమెంటోలు, శాలువాలు, పూలమాలలో ఘనంగా సత్కరించారు. స్వర్ణోత్సవాల కమిటీ కన్వీనర్ నాగమళ్ల అశోక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ లావణ్య శిరీష్‌రెడ్డి, కమిటీ ప్రతినిధులు గంగిడి వెంకటేశ్వర్‌రెడ్డి, కాటం లక్ష్మారెడ్డి, ఆకుల కుమారస్వామి, పిట్ట రాజు, పల్లెపాటి జయపాల్‌రెడ్డి, అమరోజు శ్రీనివాస్, బెల్లి సరిత, శోభారాణి, ప్రమోద్‌రెడ్డి, నెల్లుట్ల వాసు, జితిన్, అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

తొమ్మిది నెలల శ్రమ ఫలించింది


నాగమళ్ల అశోక్, స్వర్ణోత్సవాల కమిటీ కన్వీనర్



1974 నుంచి 2024 వరకు కూనూరు హైస్కూల్‌లో టెన్త్ చదివిన పూర్వ విద్యార్థులను ఒకే వేదికపైకి తీసుకుచ్చేందుకు తొమ్మిది నెలల పాటు శ్రమించాం. కోర్ కమిటీని ఏర్పాటు చేసుకుని ఆయా బ్యాచ్‌ల వారీగా విద్యార్థులను గుర్తించి సంఘటితం చేశాం. తలా కొంత ఆర్థిక వనరులను సమకూర్చుకుని.. గురువులు, విద్యావేత్తలు, మిత్రుల సలహాలు, సూచనలతో స్వర్ణోత్సవ వేడుకలను గ్రామస్తుల సహకారంతో విజయవంతంగా నిర్వహించుకోగలిగాం.

ఎంతో ఆనందంగా ఉంది

మౌనిక, పూర్వ విద్యార్థి



ఎన్నో ఏళ్ల తర్వాత స్వర్ణోత్సవాల పేరిట మిత్రులమంతా ఒకే చోట కలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉంది. పిల్లా పాపలతో కలసి వచ్చాను. నాటి స్నేహితులను, గురువులను చూడగానే నాటి మధుర స్మృతులు గుర్తుకు వచ్చాయి. ఇలాంటి అపూర్వ ఘట్టం మరువలేనిది.

29న జిల్లా స్థాయి చెస్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ చెస్ అసోసియేషన్ సహకారంతో వరంగల్ జిల్లా చెస్ ఆధ్వర్యంలో ఈ నెల 29న హనుమకొండ పబ్లిక్ గార్డెన్ సమీపంలోని టీటీడీ కల్యాణ మండపంలో జిల్లా స్థాయి చెస్ పోటీలను నిర్వహించడం జరుగుతుందని క్రీడా పోటీల నిర్వహణ కార్యదర్శి కన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి అండర్-17 బాలబాలికల విభాగంలో క్రీడా పోటీలు ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు సెల్ 90595 22986 నెంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

లవ్వాల అడవుల్లో పెద్దపులి

తాడ్వాయి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తాడ్వాయి మండలంలోని అటవీ ప్రాంతంలో పెద్దపులి సంచారం మళ్లీ వెలుగుచూసింది. లవ్వాల అడవుల్లో పులి పాదముద్రలను అటవీశాఖ అధికారులు ఆదివారం గుర్తించారు. రేంజ్ అధికారి సత్తయ్య, డిప్యూటీ రేంజర్ శ్రీనివాస్, సెక్షన్ అధికారి సందీప్ ఆధ్వర్యంలో సిబ్బంది పులి కదలికలపై నిఘా పెట్టారు. రెండురోజులుగా పులి సంచరిస్తున్నట్లు తెలుసుకొని లవ్వాల అటవీ ప్రాంతంలో గాలించగా పలుచోట్ల దాని పాదముద్రలు లభ్యమయ్యాయి. కొడిశాల, లింగాల, లవ్వాల గ్రామ ప్రజలు అడవిలోకి వెళ్లవద్దని అధికారులు సూచించారు.



పులి జాడ కోసం అడవిలో వెదుకుతున్న ఫారెస్టు సిబ్బంది

మావోయిస్టు బాధిత కుటుంబాల భగ్గు

- పౌరహక్కుల నేతల తీరుపై ఆగ్రహం
- ఐటీడీఏ కార్యాలయం వద్ద ధర్నా



పౌర హక్కుల సంఘాల నాయకుల దిష్టిబొమ్మను దహనం చేస్తున్న మావోయిస్టు బాధిత కుటుంబాలు

ఏటూరునాగారం రూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పౌరహక్కుల నేతల తీరుపై మావోయిస్టు బాధిత కుటుంబాలు భగ్గుమన్నాయి. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం చెల్పాక అడవుల్లో ఈ నెల 1న జరిగిన ఎన్‌కౌంటర్‌పై నిజనిర్ధారణకు వస్తున్నారని తెలిసి నిరసనకు దిగారు. ఏటూరునాగారం ఐటీడీఏ కార్యాలయం ఎదుట ఆదివారం సాయంత్రం ధర్నా చేశారు. చెల్పాక అడవుల్లో ఎన్‌కౌంటర్‌కు ముందు వాజేడు మండలంలో మావోయిస్టుల చేతిలో స్థానికులు ఉికే రమేష్, ఉికే అర్జున్ హత్యకు గురయ్యారని, ఆ సమయంలో నిజనిర్ధారణకు రాని పౌరహక్కుల నేతలు ఎన్‌కౌంటర్ జరిగిందని తెలిసి రావడం ఏమిటని ఆరోపించారు. ఐటీడీఏ కార్యాలయం వద్ద 163 జాతీయ రహదారిపై బైఠాయించారు. మావోయిస్టులు, పౌరహక్కుల నేతలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పౌరహక్కుల నేతల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా మావోయిస్టు చేతిలో హత్యకు గురైన ఉికే రమేష్ తల్లి శాంత, ఉికే అర్జున్ భార్య సావిత్రితో పాటు పోలీసులను అంత మొందించేందుకు మావోయిస్టులు అమర్చిన బాంబులు పేలి కాలు విరిగిన వెంకటాపురానికి చెందిన డర్రా సునీత, ఆమె భర్త మహేష్ మాట్లాడుతూ అమాయకులైన వారిని మావోయిస్టులు అకారణంగా హత్య చేశారని ఆరోపించారు. మావోయిస్టుల దుశ్చర్యల కారణంగా రోడ్డున పడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్‌ఫార్మర్ల నెపంతో అమాయకులను మావోయిస్టులు చంపినప్పుడు పౌరహక్కుల నాయకులకు బాధిత కుటుంబాలు ఎందుకు గుర్తుకు రాలేదని ప్రశ్నించారు. చల్పాక ఎన్‌కౌంటర్‌లో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందితే మాత్రం పౌర హక్కులు గుర్తుకు వచ్చాయా? అని మండిపడ్డారు. మావోయిస్టులవే ప్రాణాలు.. తమవి కావా? అని ప్రశ్నించారు.

పౌర హక్కుల సంఘాల తీరును తీవ్రంగా వ్యతిరేకి స్తున్నామని దుయ్యబట్టారు. అందరి ప్రాణాలూ ఒక్కటేనని, అందరికీ పౌర హక్కులు ఉంటాయనే విషయాన్ని విస్మరించొద్దని హితవుపలికారు. ఇదిలా ఉండగా పౌర హక్కుల నేతల పర్యటన గోప్యంగా సాగిందని తెలిసింది. వారు ఎప్పుడొచ్చారో.. ఎప్పుడు తిరిగి వెళ్లారో వెల్లడికా లేదు. మావోయిస్టు బాధిత కుటుంబాలు నిరసనకు దిగాయని తెలిసి ఈ గోప్యతను పాటించారని సమాచారం.

గంజాయి పట్టివేత

ఆత్మకూరు, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆటోలో తరలిస్తున్న గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకుని ఆటో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్న ఘటన మండలంలో జరిగింది. ఆత్మకూరు సీ.ఐ. సంతోష్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని అక్కంపేట సమ్మక్క- సారలమ్మ తోరణం వద్ద ఆదివారం పోలీసులు పెట్రోలింగ్‌లో భాగంగా వాహనా లను తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో వరంగల్ నుంచి పెద్దాపురానికి వస్తున్న ఆటో డ్రైవర్ పోలీసులను చూసి ఆటోను వెంటనే వెనుకకు తిప్పుకుని పారిపోయే ప్రయత్నం చేయగా పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. ఆటోను తనిఖీలు చేసి అందులో ఉన్న సుమారు విలువ రూ.27, 500 విలువ గల 1100 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన గంజాయిని వరంగల్‌కు చెందిన ఎండీ అనిఫ్ వద్ద కొనుగోలు చేసినట్లు ఆటో డ్రైవర్ ఒర్రె వంశీకృష్ణ ఒప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఆటోను సీజ్ చేసి డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. తనిఖీల్లో ఎస్సై అశోక్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సైడైన సైకిల్

తగ్గుతున్న వినియోగం
కనుమరుగవుతున్న షాపులు
సైక్లింగ్ ఆరోగ్యదాయకం

ఎక్కడికి వెళ్లిన సైకిల్ పైనే..



గొల్లూరి యాదయ్య, తొర్రూరు

సరుకుల కోసం పాలకుర్తికి సైకిల్‌పైనే పోత. కూలీ, వ్యవసాయ బావి వద్దకు వెళ్లాలన్నా సైకిల్ మీదనే వెళ్తుంట. 40 ఏండ్ల నుంచి సైకిల్ వాడుతున్న. నాకు ఇప్పటికి ఎలాంటి జబ్బులు లేవు. ఆరోగ్యంగా ఉన్న. సైకిల్ వాడని రోజు లేదు. నాకు మోటర్ సైకిల్ ఉంది. అయినా సైకిలే వాడతాను.

పాలకుర్తి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఇరవై ఏండ్ల క్రితం ప్రయాణానికి సైకిల్ ప్రధాన సాధనంగా ఉండేది. దూరం ఉన్న ఊర్లకు కూడా సైకిల్ పైనే ప్రయాణం చేసే వాళ్లు. ఆ సైకిల్ కనుమరుగయ్యే పరిస్థితికి వచ్చింది. అదేవిధంగా సైకిల్‌పై ప్రయాణిస్తే శారీరక దారుఢ్యంతో పాటు మానసికోల్లాసానికి దోహదపడుతుంది. ఇబ్బడి ముబ్బడిగా బైక్‌లు, కార్లు, ఇతర వాహనాలు మార్కెట్‌లోకి రావడంతో సైకిల్ ప్రాధాన్యత రోజు రోజుకు తగ్గిపోతోంది. దీంతో శారీరక శ్రమ తగ్గి రోగాలు కూడా అదే రీతిలో పెరిగిపోతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో రైతులు వ్యవసాయం కోసం సైకిళ్లను ఇప్పటికి వినియోగిస్తున్నారు. కొంత మంది సైకిల్‌పైనే పట్టణాలకు వస్తూ వారికి కావాల్సిన నిత్యావసర సరుకులను తీసుకువెళ్తున్నారు.

ఆర్థికంగా అభివృద్ధి చెందినా ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఇంకా సైకిల్‌పైనే ప్రయాణం చేస్తున్న వారు అనేక మంది ఉన్నారు. 60, 70 ఏండ్ల వృద్ధులు ఇప్పటికి సైకిల్‌పై ప్రయాణం చేస్తున్నారంటే ఎంత ఆరోగ్యంగా ఉంటున్నారో అర్థం చేసుకోవచ్చు.



సైకిల్ రిపేరు చేస్తున్న మెకానిక్

20 ఏళ్ల క్రితం కిరాయికి సైకిళ్లు

ఇరవై ఏండ్ల క్రితం సైకిల్ స్టాండ్లు ఉండేవి. ఒక్కో సైకిల్‌ను గంటకు రూ. 50 పైసల నుంచి రూ. 3 వరకు కిరాయికి ఇచ్చేవారు. కొంత మంది రోజు లెక్కన రూ. 15 తీసుకొని సైకిల్‌ను కిరాయికి ఇచ్చేవారు. మరికొంత మంది షాపుల యాజమానులు 6 నెలలు, ఏడాది వరకూ కిరాయికి ఇచ్చేవారు. రాత్రి ప్రయాణం చేయడానికి సైకిల్‌కు డైనొమో బిగిస్తే లైట్ వెలిగేది. అటువంటి సైకిళ్లు కిరాయికి అందుబాటులో ఉండేవి. ఇప్పుడు సైకిళ్లను కిరాయికి తీసుకునే వారు లేక స్టాండ్లు కనుమరుగయ్యాయి. కిరాయికి ఇచ్చే వారు ప్రత్నామ్నాయ పనులు వెతుకున్నారు.

50 ఏండ్ల నుంచి సైకిల్‌తోనే సహవాసం



అనుముల బుచ్చయ్య, ఈరవెన్ను

ప్రతి రోజు వ్యవసాయ బావి వద్దకు సైకిల్‌పైనే వెళ్తా. గ్రామంలో ఏ చిన్న పనికి వెళ్లాలన్న సైకిలే. దాదాపు రోజుకు 10 కిలోమీటర్లు సైకిల్ మీద తిరుగుతా. నేను 72 ఏండ్ల వయసున్న. ఇప్పటికి ఎలాంటి కాళ్లు, కీళ్ల నొప్పులు లేవు. సైకిల్ తొక్కుతూ ఆరోగ్యంగా ఉన్నా.

అల్లుడికి కట్నంగా సైకిల్

1980 నుంచి 2000 సంవత్సరాల మధ్య కాలంలో సైకిళ్ల హవా కొనసాగింది. కూతురు వివాహం చేస్తే అల్లుడికి కట్నం కింద కొంత నగదుతో పాటు సైకిల్‌ను ఇచ్చేవారు. పలు కంపెనీలకు సంబంధించిన సైకిళ్లకు మంచి క్రేజీ ఉండేది. అత్యధిక శాతం మంది ఆనాడు పిలిప్స్ సైకిల్‌ను ఇష్టపడేవారు. నాణ్యంగా ఉంటుందని ఆ సైకిల్‌నే కట్నంగా అడిగేవారు. ఇప్పటికి ఆ సైకిళ్లు అక్కడక్కడ కనిపిస్తాయి.

30 ఏండ్ల నుంచి షాపు నడుపుతున్న..



దేవగిరి శ్యాంప్రసాద్, పాలకుర్తి

ముప్పై ఏండ్ల నుంచి సైకిల్ షాపు నడుపుతున్నా. ఇరవై ఏండ్లు షాపు బాగా నడిచింది. సైకిల్‌ను గంటకు ఒక రూపాయి నుంచి రూ. 3 వరకు ఇచ్చేది. కొంత మంది రోజు లెక్కన కిరాయికి తీసుకు వెళ్లేవారు. రోజుకు రూ. 15 తీసుకునేవాళ్లం. 30 సైకిళ్ల కిరాయికి ఇచ్చేది. రోజుకు రూ. 300 నుంచి రూ. 500 వరకు సంపాదించేవాడిని. బండ్లు (బైక్) బాగా పెరిగాయి. సైకిల్ వాడే వారు లేరు. పదేళ్ల నుంచి గిరాకి తగ్గింది.

భరోసా..భయం

(5వ పేజీ తరువాయి)

పెట్టుబడి సాయాన్ని అందించనుంది. అయితే సాగులో లేని భూములతో పాటు మరికొన్ని వర్గాలకు కూడా రైతు భరోసాలో కోత పెట్టేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తుందనే టాక్ వినబడుతుంది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి కిసాన్ నిధి పథకం ద్వారా రైతులకు మూడు విడతల్లో రూ.6 వేల ఆర్థిక సాయాన్ని అందిస్తుంది. అయితే ఈ పీఎంకే నిధి పథకానికి కేంద్రం అనేక నిబంధనలను అమలు చేస్తుంది.

ప్రధానంగా ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, ఆదాయ పన్ను చెల్లిస్తున్నవారు, ఇంజనీర్లు, వైద్యులు, న్యాయవాదులు, చార్టర్డ్ అకౌంటెంట్లు, ఆర్కిటెక్టులు తదితర వర్గాలకు పీఎంకే నిధి పథకాన్ని అందించటం లేదు. ఇదే విధానాన్ని రైతు భరోసాకు కూడా వర్తింప చేయాలని ప్రభుత్వం భావిస్తుంది. ఇప్పటి వరకు ఉమ్మడి వరంగల్ జిల్లాలో రైతుబంధు పథకం ద్వారా 8,89,787మంది రైతులు లబ్ధి పొందుతున్నారు.

వీరికి గత యాసంగిలో ఎకరాకు రూ.5వేల చొప్పున ప్రభుత్వం పెట్టుబడి సాయాన్ని అందించింది. అయితే పీఎంకే నిధి పథకం ద్వారా ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 3,81,890 మంది రైతులు మాత్రమే లబ్ధి పొందుతున్నారు. పీఎంకే నిధి కంటే 5,07,897 మంది రైతులు అదనంగా రైతుబంధు పొందుతున్నారు. అయితే ప్రభుత్వం పీఎంకే నిధి మార్గదర్శకాల్లో కొన్నింటినైనా అమలు చేసినా నగం మందికి రైతు భరోసా దక్కకుండా పోతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

నేడు దత్తక్షేత్రంలో అనఘాష్టమి వ్రతాలు



వరంగల్ కల్చరల్, డిసెంబరు 22 : మార్గశిర మాసం బహుళాష్టమి రోజున ప్రధానమైన అష్టమిగా నిర్వహిస్తూ ప్రతీ సంవత్సరం దేశవ్యాప్తంగా దత్త భక్తులు అనఘాష్టమి వ్రతాన్ని సోమవారం నగరంలోని శ్రీగణపతి సచ్చిదానంద వరద దత్తక్షేత్రంలో వెయ్యి మందితో సామూహిక శ్రీఅనఘాష్టమి వ్రతాలను నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎస్‌జీఎస్ దత్తజ్ఞాన బోధ సభ ట్రస్టు సభ్యులు వైవీ వామన్‌రావు తెలిపారు. ప్రధాన అనఘాష్టమి రోజున దంపతులు లేదా ఒక్కరు, పెళ్లికాని వారు, భర్త లేనివారు, ఎవరైనా ఈ వ్రతాన్ని ఆచరించుకోవచ్చని తెలిపారు. ఆరోగ్యం, ఐశ్వర్యం, వివాహం కాని వారు ఈ వ్రతాన్ని ఆచరించుకుంటే విశేష ఫలితాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం. భక్తులందరి చేత దత్త ప్రచారక్ కొక్కుల రాజేంద్రప్రసాద్ వ్రతాన్ని ఆచరింప చేస్తారని, వ్రతం అనంతరం భక్తులందరికి మహా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు భక్తులందరు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆచరించుకోవాలని వామన్‌రావు తెలిపారు.

పంట క్షేత్రంలో నిఘా నేత్రం



మండలంలోని తిమ్మంపేటలో వ్యవ సాయ పంట క్షేత్రంలో పంటల రక్షణ కోసం ఓ రైతు సోలార్ ద్వారా నిఘానేత్రం (సీసీ కెమెరా) ఏర్పాటు చేశారు. వ్యవసా యపంట భూమిలో సాగుచేసిన పంటలకు, వ్యవసాయ పనిముట్ల రక్షణగా ఉండడానికి సీసీ కెమెరాను ఏర్పాటు చేసిన దృశ్యం 'ఆంధ్రజ్యోతి' కంటపడింది. రైతులు పంట భూమిలో సీజనల్ పంటలు సాగు చేయడంతో పాటు పండిన పంటలు అమ్ముకునే వరకు పంట భూమి దగ్గరనే ఉంచుతారు. మిరప పంట సాగు చేసిన తర్వాత వరుగు కావడానికి కల్లంలో ఆరబోస్తారు. నిఘా నేత్రాలతో పంటలకు భద్రతగా ఉంటుంది.

దుగ్గొండి (ఆంధ్రజ్యోతి)

శ్రీరామదూత శిరసా నమామి

- పాల్గొన్న వెయ్యి మంది మహిళలు
- అలరించిన అతివల కోలాటం
- గిన్నీస్ కెక్కిన కొప్పూర్



కొప్పూర్ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం వద్ద హనుమాన్ చాలీసా మహా కోలాటం ప్రదర్శిస్తున్న మహిళలు



నృత్యం చేస్తున్న చిన్నారి

భీమదేవరపల్లి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : హనుమాన్ చాలీసా మహా కోలాట బృందం ప్రదర్శన స్పిరిచ్‌వల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు నమోదైంది. ఆదివారం భీమదేవరపల్లి మండలం కొప్పూర్ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ చాలీసా మహిళ కోలాట ప్రదర్శన నిర్వహించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన వెయ్యి మంది మహిళలు పాల్గొని స్పిరిచ్‌వల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డును నమోదు చేశారు. గతంలో 420 మంది మహిళల పేరిట ఉన్న రికార్డును కొప్పూర్ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో మహిళలు తిరగరాశారు. సుమారు 11 నిమిషాల పాటు సాగిన హనుమాన్ చాలీసా కోలాట బృందం ప్రదర్శనను నేషనల్ కో-ఆర్డినేటర్ లయన్ వెంకటరమణరావు ప్రత్యేక్షంగా తిలకించి స్పిరిచ్‌వల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డుగా నమోదైందని ప్రకటించారు. అనంతరం ధ్రువీకరణ పత్రాన్ని నిర్వాహకులకు అందజేశారు. కొప్పూర్ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం 12వ వార్షికోత్సవం సందర్భంగా ఒక కొత్త కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆలయ చైర్మన్ కాసం రమేష్ గుప్తా భావించారు. తేజస్వి డ్యాన్స్ అకాడమీ చైర్మన్ శ్వేత, కొప్పూర్ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం సంయుక్త ఆధ్వర్యంలో స్పిరిచ్‌వల్ హనుమాన్ చాలీసా మహా కోలాట బృందం ప్రదర్శన నిర్వహించాలని భావించారు. గిన్నిస్ బుక్ రికార్డు కోసం గత రెండు నెలలుగా తీవ్రంగా శ్రమించారు. తెలంగాణతో పాటు, ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, నెల్లూర్ తదితర ప్రాంతాల నుంచి మహిళలకు హనుమాన్ చాలీసా కోలాటంపై శ్వేత క్లాస్‌లు నిర్వహించారు. ఆదివారం సుమారు వెయ్యి మంది మహిళలు మహా కోలాట ప్రదర్శనలో పాల్గొని గిన్నిస్ బుక్ రికార్డును సొంతం చేసుకున్నారు. వారందరి కరతాళ ధ్వనుల మధ్య గిన్నిస్ బుక్ రికార్డును నిర్వాహకులు నేషనల్ కో-ఆర్డినేటర్ వెంకటరమణరావు చేతుల మీదుగా అందుకున్నారు. అనంతరం పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి, ఆలయ చైర్మన్ కాసం రమేష్ గుప్తా, శ్వేత, మాజీ జడ్పీటీసీ వంగ రవీందర్, ఆలయ అర్చకుడు ఉపేందర్‌శర్మ, చిట్టంపల్లి అయిలయ్య, గద్ద సమ్మయ్య, గద్ద సంపత్, కొమురవెల్లి చంద్రశేఖర్‌గుప్తా, గూటం జోగిరెడ్డి, మాచర్ల కుమారస్వామి, అంచూరి సదానందం, జ్ఞానేశ్వర్, తనుకు వెంకటేష్, రమాదేవి, తిరుపతి, జైపాల్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డు నేషనల్ కో-ఆర్డినేటర్ వెంకటరమణరావు మాట్లాడుతూ కళలను వెలికితీసేందుకే గిన్నిస్ బుక్ రికార్డులను నమోదు చేస్తున్నామని అన్నారు. భారతీయ కళలను ప్రోత్సహించడం, ప్రతిభను వెలికి తీయడం లాంటి కార్యక్రమాలు చేపట్టడం వల్ల ఎంతో మంది ప్రతిభ ఉన్నవారు బయటకు వస్తున్నారన్నారు.

'సెంచరీ' కొట్టేసిన బామ్మ

కుటుంబంతో కలిసి వందేళ్ల పుట్టిన రోజు వేడుకలు



పుట్టిన రోజు సందర్భంగా కొడుకులు, కూతుళ్లతో శ్యామక్క

గణపురం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన గడ్డమీది శ్యామక్క 'సెంచరీ' కొట్టేసింది. వందేళ్ల పూర్తి చేసుకున్న ఆమె తన పుట్టిన రోజు వేడుకలను కుటుంబ సభ్యులతో కలిసిజరుపుకుంది. కొడుకులు, కూతుళ్లు, మనవళ్లు, మనవరాళ్లు, మునిమనవళ్లు, మునిమనవరాళ్ల మధ్య ఈ వేడుక ఆదివారం ఘనంగా జరిగింది. తన బలగం మధ్య శ్యామక్క కేక్ కట్ చేసి అందరికీ తెలిపించింది. ఆమెకు నలుగురు కొడుకులు, ఒక కూతురు సంతానం కాగా ఎనిమిది మంది మనవళ్లు, ఎనిమిది మంది మనుమరాళ్లు, ఆరుగురు మునివవళ్లు, నలుగురు మునిమనుమరాళ్లు ఉన్నారు. పెద్ద కుమారుడి వయసు 82 ఏళ్లు కాగా అందరి కంటే చిన్నదైన మునిమనుమరాలి వయసు ఐదేళ్లు. వీరంతా శ్యామక్క పుట్టిన రోజు వేడుకలో పాల్గొని ఆమె ఆశీర్వాదం తీసుకున్నారు. వందేళ్లు పూర్తయినా శ్యామక్క ఇంకా ఆరోగ్యంగానే ఉంది. తన పని తాను చేసుకుంటూ ఆనందంగా జీవిస్తోంది. ఆమె ఇంకా నూరేళ్లు జీవించాలని పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొన్న వారు ఆకాంక్షించారు.

ఏజెన్సీలో మంచు దుప్పటి

పొంగమంచుతో రాకపోకలకు ఇబ్బందులు

కొత్తగూడ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఏజెన్సీ కొత్తగూడ మండలాన్ని ఆదివారం మంచు దుప్పటి కప్పేసింది. ఏజెన్సీలో చలి తీవ్రత పెరుగుతుంది. మంచు కప్పేయడంతో ఉదయం రాకపోకలకు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

కొత్తగూడ గ్రామాన్ని ముంచేసిన మంచు



చీరెలతో రక్షించినారు..



తీవ్ర చలితో నారు పాడైపోతుందని భావించిన ఇప్పగూడెం గ్రామానికి చెందిన రైతు తుపాకుల వెంకటేశ్వర్లు వరి నారుకు చుట్టూరా చీరెలను రక్షణగా ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా రైతు మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా తీవ్రచలి ఉండడంతో పాటు, కోళ్లు, పందులు వచ్చి నారుమడిలో విత్తనాలను నాశనం చేయకుండా రక్షణగా ఉంటాయని చీరెలన ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

-స్టేషన్‌ఘన్‌పూర్(ఆంధ్రజ్యోతి)

మౌనముని.. మన్నించు

- పీవీ విజ్ఞాన వేదికలో పూర్తి కాని అభివృద్ధి పనులు
- 15 కోట్లతో గత ప్రభుత్వ హయాంలో ప్రతిపాదనలు
- కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా అభివృద్ధి పనులు పూర్తయ్యేనా ?
- నేడు పీవీ 20వ వర్ధంతి



వంగరలోని పీవీ ఇల్లు

భీమదేవరపల్లి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పీవీ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా వంగరలోని పీవీ విజ్ఞాన వేదికలో గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు నిధులు సక్రమంగా విడుదల చేయకపోవడంతో అర్థాంతరంగా ఆగిపోయాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తయినా ఇప్పటికీ వంగరలో పీవీ విజ్ఞాన వేదిక వద్ద పనులు పూర్తి కాలేదు. ప్రహరీగోడ నిర్మించినా పీవీ విజ్ఞాన వేదికలోకి పశువులు, గొర్రెలు వెళ్లి మేత మేస్తున్నాయి. దక్షిణ భారతదేశం నుంచి దేశ ప్రధానిగా మొట్ట మొదటిగా ఎన్నికైనా పీవీకి ఆయన మరణానంతరం కాంగ్రెస్ పార్టీ సరిగ్గా పట్టించుకోలేదని బీఆర్ఎస్ పార్టీ పేర్కొంది. తెలుగోడు... తెలంగాణలో జన్మించిన పీవీకి కీర్తి ప్రతిష్టలు తెచ్చే విధంగా ఆయన శత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అప్పట్లో ప్రకటించారు. ఆయన జన్మస్థలమైన వంగరను అన్ని విధాల అభివృద్ధి చేస్తామని అప్పుడే పీవీకి నిజమైన నివాళి ఇచ్చినట్లు అవుతుందని కేసీఆర్ స్వయంగా ప్రకటించారు. 2021లో పీవీ శత జయంతి ఉత్సవాల నేపథ్యంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం భావించింది. భీమదేవరపల్లి మండలంలోని వంగరలో వివిధ అభివృద్ధి పనుల కోసం రూ. 15 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి పనుల కోసం అరకొరగ నిధులు విడుదల చేయడంతో పనులు నెమ్మదిగా ప్రారంభించారు.

వంగరలో అర్ధాంతరంగా ఆగిన పనులు

పీవీ విజ్ఞాన వేదికలో పలు అభివృద్ధి కార్యక్రమాలు అర్థంతరంగా ఆగిపోయాయి. జ్ఞాన వేదికలో ఆడిటోరియం, పీవీ జీవిత చరిత్రను ప్రజలకు తెలియజేసే విధంగా ఏర్పాటు చేసిన ఓపెన్ థియేటర్, పీవీ వాడిన వస్తువులు, పీవీ మ్యూజియం, అధ్యాత్మిక కేంద్రం, ఆర్ట్ గ్యాలరీ, పీవీ విగ్రహం ఏర్పాటు దాని చుట్టూ పార్క్ ఏర్పాటు ఇలాంటి కార్యక్రమాలు అర్థాంతరంగా ఆగిపోయాయి. రూ. 11కోట్లతో చేపట్టిన పనులు ఇప్పటికే నత్తనడకన సాగుతుండడంతో పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

వంగర సమ్మక్క బోటి నుంచి వంగర పీవీ జ్ఞాన వేదిక వరకు రూ. 4కోట్లతో చేపట్టాల్సిన డబుల్ రోడ్‌కు ఇప్పటి వరకు రూపాయి బిల్లుకు రాలేదు. ఒక్క అభివృద్ధి పని కూడా పూర్తికాలేదు.

నేడు వంగరలో వర్ధంతి

2004డిసెంబరు 23న పీవీ కన్ను మూశారు. మండలంలోని వంగరలో సోమవారం పీవీ 20వ వర్ధంతిని నిర్వహిస్తున్నట్లు పీవీ సోదరుడి కుమారుడు పీవీ మదన్‌మోహన్‌రావు తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు పలువురు హాజరవుతారన్నారు.



వంగరలో ఏర్పాటు చేసిన పీవీ విగ్రహం



పీవీ విజ్ఞాన వేదికలో మేస్తున్న గొర్రెలు

కస్తూర్బా హాస్టల్‌ను తనిఖీ చేసిన కలెక్టర్



హాస్టల్‌ను పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ సత్యశారద

జూలైవాడ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జూలైవాడలోని కస్తూర్బా బాలికల గురుకుల పాఠశాలను జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ సత్యశారద ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నూతన మెనూ ప్రకారం భోజనం అందుతుందా లేదా అని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సత్యశారద మాట్లాడుతూ మెనూ ప్రకారం విద్యార్థినులకు పౌష్టికాహారం అందేలా చూడాలని వార్డెన్‌ను ఆదేశించారు. పదో తరగతిలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. వార్డెన్, ఫిజికల్ టీచర్, ఏఎన్ఎంలు అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీటీడీవో ప్రేమకళ తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సిలింగ్



మడికొండ పీఎస్‌లో రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ చేస్తున్న సీఐ కిషన్

మడికొండ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మడికొండలోని పోలీసుస్టేషన్‌లో రౌడీషీటర్లకు ఆదివారం స్థానిక సీఐ పుల్యాల కిషన్ కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ పంచాయతీల్లో తలదూర్చకూడదని, ఒకవేళ తలదూర్చితే పీడీ యాక్ట్ నమోదు చేసి జైలుకు పంపించాల్సి వస్తుందని తెలిపారు. రౌడీషీటర్లు తమ ప్రవర్తన, నడవడికలో మార్పు రావాలని సూచించారు.

పాత్రికేయ మిత్రమండలి ఏర్పాటు



నూతనంగా ఎన్నికైన మిత్రమండలి

కాజీపేట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : పూర్వ ఓ దినపత్రికలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో పాత్రికేయులుగా పనిచేసిన వారంతా ఆదివారం కాజీపేట ఐటీఐలో ద్వితీయ సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. అనంతరం ఉదయం పాత్రికేయ మిత్రమండలి పరస్పర ఆర్థిక సహకార పొదుపు సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నారు. అధ్యక్షుడిగా సీనియర్ జర్నలిస్టులు దాసరి కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కన్నా పరుశరాములు, కోశాధికారిగా అచ్యుత రఘునాథ్, ఉపాధ్యక్షులుగా కూన మహేందర్, ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్, సహాయ కార్యదర్శులుగా పెండెం వేణుమాధవరావు, ముల్లంగి మోహన్ రెడ్డి, సభ్యులుగా ఎ.రామ్మూర్తి శర్మ, పి.వెంకటేశ్వరరావు, సభ్యులుగా ఎంఎల్ మూర్తిలను ఎన్నుకున్నారు. అనంతరం దినపత్రికలో పనిచేసిన అనుభవాలతో కూడిన స్మరణిక ప్రత్యేక సంచికను ప్రచురించాలని తీర్మానించారు. ఈ సంచికకు చైర్మన్‌గా రాధాకృష్ణ, సంపాదకుడిగా ఆర్.లక్ష్మణ్‌సుధాకర్, సభ్యులుగా తక్కళ్లపల్లి రవీందర్, సూర్యప్రకాశ్, బి.రాజమౌళిలను నియమించారు. కార్యక్రమంలో గతంలో పనిచేసిన ఉమ్మడి జిల్లా జర్నలిస్టులు పాల్గొన్నారు.

ఘనంగా రామానుజన్ జయంతి



విద్యార్థులను అభినందిస్తున్న ఎస్పీఆర్ స్కూల్ డైరెక్టర్ జగన్‌మోహన్

హసన్‌పర్తి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎల్లాపూర్ శివారు ఎస్పీఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాలలో ఆదివారం శ్రీనివాస రామానుజన్ 137వ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ గౌరిశెట్టి జగన్‌మోహన్ పాఠశాల విద్యార్థులలో రామానుజన్ నెంబర్ 1729 ప్రాముఖ్యతను వివరించి మాట్లాడారు. ఆధునిక ప్రపంచంలో గణిత శాస్త్రానికి ఉన్న ప్రాముఖ్యతను మానవ మనుగడలో నూతన ఆవిష్కరణలలో గణిత శాస్త్రం ప్రాముఖ్యత ఎంతో ఉందని తెలిపారు. ప్రపంచ గణితశాస్త్ర విజ్ఞానంలో ఆర్యభట్ట మొదలు రామానుజన్ వరకు అనేక మంది గణితశాస్త్రంలో భారతీయుల ఘనతను చాటి చెప్పారన్నారు. అనంతరం విద్యార్థులకు టాలెంట్ టెస్ట్, మ్యాజిక్ స్క్వేర్ బ్రెయిన్ టీజర్, గుర్తుల గుర్తింపు, జూనియర్, సీనియర్ విభాగాల్లో విడివిడిగా క్విట్ పోటీలను నిర్వహించి ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.శేషగిరిరావు, 20 మంది గణిత ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా అయ్యప్ప పడిపూజ



ఆలయంలో మహా పడిపూజలో పాల్గొన్న అయ్యప్ప స్వాములు

వడ్డెపల్లి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ వడ్డెపల్లిలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో రుత్వికులు ప్రసాద్ శర్మ, ప్రవీణ్‌శర్మ, విజయ్‌శర్మ పర్యవేక్షణలో అయ్యప్ప స్వామి మహా పడిపూజ ఆదివారం నేత్రపర్వంగా నిర్వహించారు. వేద పండితులు, గురుస్వాములు తొలుత గణపతికి, కుమారస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం హరిహర పుత్రుడు అయ్యప్ప స్వామి విగ్రహానికి పంచామృతాలతో భక్తి ప్రపత్తులతో అభిషేకాలను నిర్వహించారు. స్వామియే శరణం అయ్యప్ప నామస్మరణతో వడ్డెపల్లి పుర వీధులతో పాటు శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ ప్రాంగనం మార్మోగింది. లింగాల రమేష్ గురుశర్మ ఆధ్వర్యంలో వేమన్‌రెడ్డి, అల్లం హరి మహేందర్, అనుమాండ్ల శ్రీకాంత్, ఆకుల మధూకర్, శివకుమార్ కన్నె స్వాములు హరిహరసుతుడు అయ్యప్ప స్వామిని మాలధారలు నేత్రపర్వంగా కీర్తిస్తూ ఆలాపించిన భజన కీర్తనలు ఆద్యంతం అలరించాయి. ఆలయ కమిటీ చైర్మన్ కటకం ప్రసాద్, బోయినపల్లి సాయితోపాటు అయ్యప్ప స్వాములు అధిక సంఖ్యలో పాల్గొని అయ్యప్పను కొలిచారు. అనంతరం మహా అన్నదాన వితరణ గావించారు.

అభివృద్ధికి ఆటంకం

- అధికారుల కొరతతో ఇబ్బందులు
- వరంగల్ బల్దియాలో ప్రధాన పోస్టులు ఖాళీ
- ఇన్‌చార్జ్‌ల పాలనలో పలు శాఖలు
- సిబ్బంది నియామకాల్లో పారదర్శకలోపం
- ఆ ఇద్దరి కనుసన్నల్లోనే వ్యవహారం



వరంగల్ కార్పొరేషన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ వరంగల్ మహానగర పాలక సంస్థలో అధికారుల కొరత కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. దీంతో ఇన్‌చార్జ్‌లు అదనపు భారం మోస్తున్నారు. దీంతో పనులపై అవగాహన లేకపోవడంతో అభివృద్ధి పనులు ఎక్కడికక్కడ కూనరిల్లుతున్నాయి. కొంత కాలంగా ఇక్కడి నుంచి బదిలీపై వెళ్లిన అధికారుల స్థానంలో ఇంకా ఎవరినీ భర్తీ చేయకపోవడంతో ఖాళీలు పేరుకుపోతున్నాయి. పాలక వర్గం అశ్రద్ధ వల్లనే బల్దియాలో చాలాకాలంగా అధికారులు కొరత ఏర్పడిందనే ప్రచారం జరుగుతోంది. బల్దియాలో పూర్తిస్థాయి వింగ్ అధికారులు లేకపోవడంతో కిందిస్థాయి సిబ్బంది ఆడిందే ఆట..పాడిందే పాటగా సాగుతోందనే ఆరోపణలున్నాయి. ప్రధానంగా ఇంజనీరింగ్, హార్టికల్చర్, వెటర్నరీ, టౌన్‌ప్లానింగ్ విభాగాలకు పర్మనెంట్ అధికారులు లేకపోవడంతో ఆయా శాఖల్లో ఫైళ్లు పేరుకుపోతున్నాయి. కొందరికి అదనపు బాధ్యతలు, మరి కొందరికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తున్నట్లు జోరుగా విమర్శలు వస్తున్నాయి.

ఆరు శాఖలకు అతడే అధిపతి..

గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ ప్రస్తుతం 66 డివిజన్‌లకు విస్తరించింది. కానీ ఇక్కడి ఉన్నతాధికారులు ప్రధాన శాఖలకు సైతం ప్రత్యేక అధికారులను నియమించడం లేదు. కనీసం ఇక్కడ అధికారుల అవసరం ఉందని కూడా రాష్ట్ర పురపాలక శాఖకు అర్జీ పెట్టుకోవడం లేదంటే అతిశయోక్తికాదు. దీంతో ఏసీబీ వలలో చిక్కి తిరిగి ఉద్యోగం పొంది పోకల్ పోస్టులో పని చేస్తున్న ఓ అధికారికి అన్ని బాధ్యతలు అప్పగించారు. అన్నిట్లో 'ప్రావీణ్యం' కలిగిన అధికారి మోయలేని భాగం మోయడం వెనుక ఆంతర్యం ఏమిటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అంతే కాకుండా సదరు ముఖ్య అధికారి స్మార్ట్‌సిటీ పనుల్లో అవినీతికి పాల్పడినట్టు ఆరోపణలు ఉన్నా.. ప్రస్తుతం స్మార్ట్‌సిటీ, తాగునీటి సరఫరా, ఐసీసీసీ, సివిల్, ఎలక్ట్రికల్, సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్ విభాగాలను అతడే మోస్తున్నాడు. స్మార్ట్ సిటీ, ఇంజనీరింగ్ విభాగాలతో పాటు మిగతా శాఖలను పర్యవేక్షించాల్సిన ప్రత్యేక అధికారుల నియామకం లేకపోవడంతో ప్రస్తుతం నగరంలో పైప్‌లైన్ లీకేజీలు, భద్రకాళి బండ్, వరంగల్ బస్‌స్టేషన్, భద్రకాళి చెరువు పూడికతీత పనులు, నగరంలో గుంతల రోడ్ల పనులు ముందుకు సాగడం లేదు.

అంతా ఆ ఇద్దరి కనుసన్నల్లోనే..

ప్రస్తుతం వరంగల్ నగర పాలక సంస్థ పనులు ప్రభుత్వ అధికారుల చేతిలో నుంచి ప్రజాప్రతినిధుల చేతిలో కీలుబొమ్మగా మారింది. బల్దియాలో ఉద్యోగుల బదిలీల నుంచి మొదలుకొని వింగ్ అధికారులకు విధుల కేటాయింపు, చేసిన పనులకు కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపు వరకు ఆ ఇద్దరు జట్టుకట్టి నడిపిస్తున్నట్టు బల్దియాలో జోరుగా ప్రచారం జరుగుతోంది. ఇక ఇటీవల ఓ అధికారి బదిలీ అవుతున్నట్టు ముందస్తుగా తెలుసుకుని పాత పనులకు సంబంధించిన ఎంబీ బుక్స్ తన క్యాంపు కార్యాలయానికి తెప్పించుకుని పర్సంటేజీ చొప్పున సంతకాలు చేస్తున్నట్టు తెలిసింది. ఇద్దరు కలిసి ఈ దందా సాగిస్తున్నా అటు ఇంటెలిజెన్స్ గానీ ఇటు ఏసీబీ, సీఐడీ అధికారులు దృష్టిసారించకపోవడం విచారకరం. వీరి వల్ల బల్దియా పాలన గాడి తప్పిందని, మెరుగు పడాలంటే ప్రక్షాళన చేయాల్సిందేనని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

పారదర్శక లోపం

ఇతర ప్రాంతాల నుంచి ఇటీవల కొందరు సిబ్బంది బల్దియాలో పనిచేయడానికి బదిలీపై వచ్చిన వారికి ఆయా శాఖలు కేటాయించడంలో పారదర్శకత లోపిస్తోందని స్పష్టంగా కనిపిస్తోంది. ఇటీవల హార్టికల్చర్ విభాగానికి లక్ష్మారెడ్డి అనే ఓ మండల స్థాయి అధికారిని డిప్యూటేషన్‌పై బల్దియాకు కేటాయించగా, అతడికి చీఫ్ హార్టికల్చర్ అధికారి హోదాను కట్టబెట్టి ప్రస్తుతం ఫారెస్ట్ రేంజ్ అధికారి హోదా కలిగిన హెచ్‌వో (హార్టికల్చర్ అధికారి) పలాస రమేష్‌ను పక్కకు తప్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. అయితే లక్ష్మారెడ్డి అనే వ్యక్తి ఓ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సహకారంతో ఇక్కడ డిప్యూటేషన్‌పై పోస్టింగ్ పొందినట్టు ప్రచారం జరుగుతోంది.

కాగా, అధికారుల తప్పుడు నిర్ణయాన్ని హార్టికల్చర్ సిబ్బంది జీర్ణించుకోలేకపోతున్నారు. ఇంకా మూడు నెలల కిందట ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లిన సుమారు 50 మంది సిబ్బంది.. రాజకీయ, ఆర్థిక పలుకుబడితో తిరిగి వరంగల్ బల్దియాకు చేరుకుని డిప్యూటేషన్‌పై విధులు నిర్వర్తిస్తున్నారు.

ఆశ వర్కర్ల సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని

హనుమకొండ సిటీ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆశ వర్కర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి వెల్లడించారు. ఆశ వర్కర్స్ యూనియన్ (ఐఎన్‌టీయుసీ) తొలివార్షికోత్సవ సమావేశం ఆదివారం హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగింది. ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు షైముదా అధ్యక్షతన జరిగిన సమావేశానికి రాజేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజలకు ఆరోగ్య సేవలు అందించడంలో ఆశ వర్కర్ల పాత్ర కీలకమన్నారు. వైద్య, ఆరోగ్య సమస్యలపై విస్తృత స్థాయి ప్రజలకు అవగాహన కల్పించాలని ఆశాలకు సూచించారు. సమావేశంలో యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కూర వెంకట్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

హనుమకొండ టౌన్ : కాజీపేట డివిజన్‌లోని పలు కాలనీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం కాజీపేట జాగీర్‌లోని పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెన్షనర్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. పెన్షనర్స్ సంఘ సభ్యులు అనేక సేవా కార్యక్రమాలు చేయడాన్ని అభినందించారు. డివిజన్‌లో అనేక మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. మాజీ కార్పొరేటర్ జనాబ్ అబుబాకర్, మోడెం సమ్మయ్య, రాందాస్, కవి, శనగరపు రాజమోహన్, సట్ల గట్టయ్య, రాజారాం కబీర్, వీరస్వామి పాల్గొన్నారు.

జీవితంపై విరక్తితో ఆటోడ్రైవర్ ఆత్మహత్య



రాజశేఖర్ (ఫైల్)

కాజీపేట, డిసెబరు 22 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు, ఒంటరితనం తట్టుకోక జీవితంపై విరక్తి ఓ ఆటోడ్రైవర్ ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.. కాజీపేట ఎస్సై నవీన్ కుమార్ తెలిపిన వివరాలు ప్రకారం.. కాజీపేట వైఎస్సార్ నగర్‌కు చెందిన అంగిడి రాజశేఖర్(32) ఆటోడ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కుటుంబ కలహాలతో భార్య అఖిల మూడు సంవత్సరాల క్రితం విడాకులు తీసుకుని స్వగ్రామమైన కరీంనగర్‌లో ఉంటోంది. అప్పటినుంచి ఒంటరిగా ఉంటున్న రాజశేఖర్ ఆర్థిక ఇబ్బందులు, ఒంటరితనంతో జీవితం విరక్తి చెంది ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహ్యతకు పాల్పడ్డాడు. ఆదివారం మృతుని తల్లి లక్ష్మి ఇచ్చిన సమాచారం మేరకు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్ట్‌మార్టం నిర్వహించి బంధువులకు అప్పగించామని ఎస్సై తెలిపారు. మృతునికి ఒక ఉమార్తె ఉంది. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నవీన్ కుమార్ తెలిపారు.

మొబైల్ షాపు దగ్ధం

రూ.8 లక్షల ఆస్తి నష్టం



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

వరంగల్ క్రైం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): షార్ట్ సర్క్యూట్‌తో హనుమకొండ కంచరకుంటలోని శ్రీ సాయి మొబైల్ షాపు దగ్ధమైంది. హనుమకొండ అగ్నిమాపకశాఖ అధికారి దయాకర్ కథనం ప్రకారం... శనివారం రాత్రి 11 గంటల సమయంలో షాపులో నుంచి మంటలు వస్తున్నాయని స్థానికుల ఇచ్చిన సమాచారం మేరకు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.8 లక్షల నష్టం జరిగినట్లు బాధితుతు వెల్లడించినట్లు ఫైర్ ఆఫీసర్ తెలిపారు.

దేవుడి భూముల కోసం 30 ఏళ్లుగా పోరాటం

- ఏబీఎఫ్ఎంఎస్ ప్రాపర్టీ కస్టోడియన్ సురేందర్ బాబు



సమావేశంలో మాట్లాడుతున్న మంద సురేందర్ బాబు

శంభునిపేట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : దేశ వ్యాప్తంగా ఉన్న అమెరికన్ బాప్టిస్ట్ ఫారెన్ మిషన్ సొసైటీ (ఏబీఎఫ్ఎంఎస్) ఆస్తుల రక్షణ కోసం మూడు దశాబ్దాలుగా చేస్తున్న న్యాయ పోరాటం గెలిచిందని ఏబీఎఫ్ఎంఎస్ ప్రాపర్టీ కస్టోడియన్ మంద సురేందర్ బాబు తెలిపారు. హనుమకొండలోని మిషన్ ఆసుపత్రితో పాటు ఏబీఎఫ్ఎమ్ఎస్‌కు సంబంధించిన ఆస్తులపై కొందరు భూకబ్జాదారులు కన్నేశారు. తప్పుడు పత్రాలతో ఆస్తులను స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంపై మంద సురేందర్‌బాబు చేసిన న్యాయపోరాటంలో భాగంగా ఈనెల 19న మద్రాసు హై కోర్టు కీలక తీర్పును ఇచ్చిందన్నారు. ఈ సందర్భంగా ఉర్సు బాపిస్టు తెలుగు బాపిస్టు చర్చిలో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మంద సురేందర్‌బాబు వివరాలు వెల్లడించారు. మద్రాసు హై కోర్టు ఉత్తర్వుల ప్రకారం పీఏబీసీ ఎగ్జిక్యుటివ్ డైరెక్టర్‌గా చలామణి అవుతున్న దివాకర్‌కు ఎలాంటి అర్హతలు లేవని పేర్కొన్నారని తెలిపారు. దివాకర్ తన పేరుతో అమ్మిన ఏబీఎఫ్ఎమ్ఎస్ ఆస్తుల రిజిస్ట్రేషన్‌లన్నింటినీ రద్దు పరిచారు. లక్షల మందికి వైద్య సేవలందిస్తున్న మిషన్ ఆస్పత్రికి సంబంధించిన భూములు పేదలకు వచ్చేలా హై కోర్టు తీర్పు ఇవ్వడంపై బాపిస్టు, ఇతర సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయన్నారు. 2004 లోనే ఈ భూములపై మద్రాసు, ఏపీ హై కోర్టుల్లో న్యాయస్థానాలు ఇచ్చిన తీర్పులను అమలు చేయడంలో జిల్లా అధికారులు విఫలం అవ్వడం వల్లే కబ్జాదారులు ఆ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు నిర్మించారని అన్నారు. ఆక్రమణదారులు సాక్షాలను చూపించటంలో విఫలమై తప్పు ఒప్పుకొని కోర్టు ధిక్కారం కేసు కింద క్షమాపణు చెప్పి 2004లోనే కబ్జాదారులు మిషన్ ఆస్పత్రి భూముల జోలికి పోమని అండర్‌టేకింగ్ ఇచ్చారని అన్నారు. 2006లోనే ఆసుపత్రి స్థలంలోనే నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ అక్రమ నిర్మాణం అని గుర్తించి కోర్టు సదరు అక్రమ నిర్మాణానికి సంబంధించిన రిజిస్ట్రేషన్‌ను రద్దు పరిచిందన్నారు. ఈ వ్యవహారం నాటి సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి వేసిన హౌజ్ కమిటీ రిపోర్టును సైతం అమలు చేయడంలో గత ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. జిల్లా అధికారులు తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి తీసుకున్న చర్యలు శూన్యం అన్నారు. ఈ కోర్టు తీర్పు కాపీలను త్వరలోనే జిల్లా కలెక్టర్, సీపీలకు అందించుతామన్నారు. ఇన్నాళ్ళ పోరాటంలో న్యాయం గెలిచిందని ఈ సందర్భంగా తమ పోరాటానికి సహకరించిన పలు సంఘాల నాయకులతో పాటు పలువురు ప్రముఖులకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు మిషన్ ఆస్పత్రిలో ఫీల్డ్ క్రిస్మస్ వేడుకలు..

ఈ సందర్భంగా సోమవారం అన్నీ సంఘాలతో కలిసి ఫీల్డ్ క్రిస్మస్ వేడుకలు నిర్వహించనున్నట్లు మంద సురేందర్‌బాబు తెలిపారు. ఈ వేడుకల్లో మంత్రి కొండా సురేఖమురళీధర్‌రావులతో పాటు పశ్చిమ ఎమ్మెల్యే నాయిన రాజేందర్ రెడ్డిలు పాల్గొననున్నట్లు తెలిపారు. పెద్ద సంఖ్యలో బాపిస్టు సంఘాలు హజరు అయ్యే అవకాశాలు ఉండటంతో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

గంజాయి సాగు చేస్తున్న రైతుపై కేసు

హసన్‌పర్తి, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మల్లారెడ్డిపల్లికి చెందిన రైతు కొత్తూరు కిషన్ తన వ్యవసాయ భూమిలో గంజాయి సాగు చేస్తున్నట్లు పక్కా సమాచారంతో కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ వట్టె చేరాలు తెలిపారు. ఇన్‌స్పెక్టర్ కథనం ప్రకారం.. మండలంలోని మల్లారెడ్డిపల్లికి చెందిన కొత్తూరు కిషన్ తనకున్న వ్యవసాయ భూమిలో గంజాయి సాగుచేస్తున్నట్లు కేయూ ఇన్‌స్పెక్టర్ సుంకరి రవికుమార్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసినట్లు తెలిపారు. స్థానిక నాయబ్ తహసీల్దారు ఎండీ.రహీంపాషా, ఏఈవో బైరి అనూష సమక్షంలో ఇద్దరు మల్లారెడ్డిపల్లికి చెందిన వీఆర్‌ఏలు పిట్టల ప్రవీణ్, జట్టి సాంబయ్య, ముగ్గురు కానిస్టేబుళ్లు జి.అశోక్, ఎం.నాగరాజు, వై.ప్రకాష్‌ల సమక్షంలో విచారణ జరిపినట్లు తెలిపారు. కొత్తూరు కిషన్‌కు చెందిన 3 ఎకరాల వ్యవసాయ భూమిలో ఒక ఎకరం పత్తిలో గంజాయి మొక్కను పెంచుతున్నట్లు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. కిషన్‌పై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ చేరాలు తెలిపారు.

రైలు కిందపడి వ్యాపారి ఆత్మహత్య



బాలరాజు (ఫైల్)

కాజీపేట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఓ వ్యాపారి రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.. కాజీపేట రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాజీపేట వెంకటాద్రినగర్‌కు చెందిన బాలరాజు (56) చౌరస్తాలో కొబ్బరి బొండాల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వ్యాపారంలో నష్టంరావడం, కుటుంబకలహాలతో తీవ్ర మనస్తాపానికి గురైన అతడు ఆదివారం టౌన్‌స్టేషన్ సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల సమాచారం మేరకు రైల్వే పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఎంజీఎంకు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతునికి భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

అన్నీ అనుకూలమే... అయినా ఆలస్యం

5వ పేజీ తరువాయి

అసిస్టెంట్ లోకో పైలెట్ శిక్షణ కేంద్రం, డీజిల్ ట్రాక్షన్ శిక్షణ కేంద్రం ఉన్నాయి. మొత్తంగా కాజీపేటలో ఇప్పటికే సుమారు 5వేల మంది కార్మికులు వివిధ డిపార్ట్‌మెంట్లలో పనిచేస్తున్నారు. నూతనంగా నిర్మిస్తున్న రైల్వే కోచ్ ఫ్యాక్టరీలో సుమారు 5 వేలమంది ప్రత్యక్షంగా, మరో 5 వేల మందికి పరోక్షంగా జీవనోపాధిలభించే అవకాశం ఉంది.

కొత్తలైన్లు..

డోర్నకల్ నుంచి గద్వాలకు 296 కిలోమీటర్ల రైల్వే లైన్ నిర్మాణానికి రూ.5330 కోట్ల అంచనా, కొత్తపల్లి నుంచి మనోహరాబాద్‌కు 143 కిలోమీటర్లకు రూ.3648 కోట్ల అంచనా, రామగుండం నుంచి మణుగూరు (వయా - మేడారం, ఏటూర్‌నాగారం, 207 కిలోమీటర్లకు అంచనా రూ. 4548 కోట్లు)నష్కల్ నుంచి హసన్‌పర్తి 29 కి.మీటర్లు, నష్కల్ నుంచి చింతలపల్లి 38 కిలో మీటర్లు. ఇన్ని అనుకూలాంశాలు ఉన్న డివిజన్ ఏర్పాటునుసాగదీస్తున్నారని, ఎట్టిపరిస్థితుల్లో విశాఖ జోన్ తోనే కాజీపేట డివిజన్ ప్రకటించాలని రైల్వే కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీలు డిమాండ్ చేస్తున్నాయి.

విద్యుత్ శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ మోసం

- 15 మంది నుంచి రూ.1.76 కోట్లు వసూలు
- ఇద్దరిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలింపు
- వివరాలు వెల్లడించిన రూరల్ సీఐ సర్వయ్య

మహబూబాబాద్ రూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ 15 మంది వద్ద నుంచి రూ.1.76 కోట్లు వసూలు చేసి, ఘరానా మోసానికి పాల్పడిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య ఆదివారం తెలిపారు. రూరల్ సీఐ సర్వయ్య తెలిపిన వివరాల ప్రకారం. మహబూబాబాద్ జిల్లా కురవి మండలం మొగిలిచర్ల గ్రామానికి చెందిన ఇరుకుల పాటి నాగేశ్వర్‌రావు ఖమ్మంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో లెక్చరర్‌గా పని చేస్తున్నాడు. హన్మకొండ జిల్లా శాయంపేట మండలం పత్తిపాకకు చెందిన మండల సహోదర్‌రెడ్డి హైదరాబాద్ రామంతాపూర్ మేడ్చల్‌లో ప్రైవేట్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. వీరిరువురు కలిసి జిల్లాలోని మహబూబాబాద్ టౌన్, రూరల్, కురవి, బయ్యారం పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో 15 మంది వ్యక్తుల వద్ద నుంచి విద్యుత్‌శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ గత రెండేళ్ల క్రితం రూ.1.76 కోట్లు వసూలు చేశారు. నాటి నుంచి నేటి వరకు బాధితులకు ఉద్యోగాలు ఇప్పించకుండా తప్పించుకుంటూ తిరుగుతున్నారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కేసులో ఇరుకులపాటి నాగేశ్వర్‌రావు, మండల సహోదర్‌రెడ్డిలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సర్వయ్య తెలిపారు. ఈ కేసును ఛేదించి, వారిద్దరిని చాకచక్యంగా పట్టుకున్న రూరల్ సీఐ సర్వయ్య, టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్, ఎస్సైలు దీపికరెడ్డి, విజయ్‌కుమార్, కానిస్టేబుళ్లు సుధీర్, గణపతిలను ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ అభినందించారు.

జేఎన్ఎస్‌లో పాఠశాల క్రీడా పోటీలు ప్రారంభం



100 మీటర్ల పరుగు పందెంలో పాల్గొన్న క్రీడాకారులు

వరంగల్ స్పోర్ట్స్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లో రాణించడం ద్వారా ఉజ్వల భవిష్యత్ ఉంటుందని గోల్డెన్ ఓక్ పాఠశాల చైర్మన్ గంటా రవికుమార్ అన్నారు. ఆదివారం హనుమకొండ జేఎన్ఎస్‌లో పాఠశాల వార్షిక క్రీడా సమ్మేళనంలో భాగంగా ఏర్పాటు చేసిన క్రీడా పోటీలు ప్రారంభ కార్యక్రమానికి గంట రవికుమార్ ముఖ్య అతిథిగా హాజరై ముందుగా క్రీడాకారుల చేత గౌరవ వందనం స్వీకరించి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల్ని చదువులతో పాటు క్రీడల్లో ప్రోత్సాహించాలని కోరారు. భవిష్యత్‌లో భారతదేశం నుంచి ఎంతో మంది క్రీడాకారులు వివిధ క్రీడాంశాలలో ఒలంపిక్స్‌లో పాల్గొని పతకాలు సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. తమ పాఠశాల వార్షిక క్రీడా సమ్మేళనంలో భాగంగా క్రీడాకారుకులకు పరుగు పందెం, రిలే క్రీడల్లో పోటీలు నిర్వహించి ప్రతిభ కనబర్చిన వారికి పతకాలు, షీల్డులను ప్రధానం చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో గోల్డెన్ ఓక్ కాపువాడ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు దీప్తి, శివనగర్ బ్రాంచి ప్రధానోపాధ్యయుడు మనోహర్ తో పాఠశాల ఉపాధ్యయులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ కార్పొరేటర్‌కు అస్వస్థత

కాశిబుగ్గ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : మాజీ కార్పొరేటర్ తత్తరి లక్ష్మణ్ అస్వస్థతకు గురయ్యారు. వరంగల్ నర్సంపేట రోడ్డులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ఆయన చికిత్స తీసుకుంటున్నారు. ఆయన్ని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య ఆదివారం పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి వైద్యసేవలు మెరుగ్గా ఉండాలని సూచించారు. ఆయన వెంట కుమార్, రాజు, ఏకాంబరం, రఘు ఉన్నారు.

స్ఫూర్తి
ఆంధ్రజ్యోతి
నవ్య 9
కుటుంబ కదంబం
సోమవారం • 23 డిసెంబరు 2024

మహిళలు మెచ్చిన సరికొత్త ఉంగరాలు

మహిళల చేతులకు అందాన్ని ఆకర్షణను అందించడంలో ఉంగరాలదే ప్రథమ స్థానం. ప్లాటినం, బంగారం, వెండి లోహాలతో సందర్భానుసారం ఎన్నో రకాల ఉంగరాలు రూపుదిద్దుకుంటున్నాయి. వాటికి వజ్రాలు, రత్నాలు జతచేరి అద్భుతమైన మోడల్స్ ఆవిష్కృతమవుతున్నాయి. మహిళల మనసు దోచుకుని ప్రస్తుతం ట్రెండింగ్‌లో ఉన్న ఉంగరాలు ఇవే.....



సిగ్నెట్



● ఉంగరానికి ఏదైనా జంతువు లేదా పక్షి బొమ్మను జతచేస్తారు. నెమలి, బాతు, హంస, చిలకలు, జింకల బొమ్మలతో; రాశి గుర్తులతో కూడిన సిగ్నెట్ ఉంగరాలకు మంచి ఆదరణ ఉంది. వీటిని బంగారం లేదా వెండితో తయారు చేస్తారు. ఇవి పెళ్లి కానుకగా ఇవ్వడానికి బాగుంటాయి.



ఆర్ట్ డెకో

● ఇవి వందేళ్ల క్రితం ప్రాచుర్యంలో ఉన్న వింటేజ్ ఉంగరాలు. మళ్లీ ఇప్పుడు ట్రెండింగ్‌లోకి వచ్చాయి. ఉంగరానికి త్రిభుజం లేదా గోళం ఆకారంలో ఉన్న పెద్ద సైజు పచ్చను కానీ కెంపును కానీ అమరుస్తారు. దాని చుట్టూ చిన్న గుండ్లు, గొట్టాలతో ఓ ప్రత్యేకమైన ఆకృతిని పేరుస్తారు. ఈ ఉంగరాలను బంగారం, ప్లాటినం లోహాలతో తయారు చేస్తారు. ఇవి చూడడానికి చాలా రిచ్‌గా కనిపిస్తాయి. మహిళల వేళ్లకు లగ్జరీ లుక్‌ని ఇస్తాయి.

లీఫ్ వైన్



● ఉంగరం మొత్తాన్ని అందమైన పూలు, ఆకులు, తీగలతో కూడిన ప్రత్యేకమైన డిజైన్‌తో తయారు చేస్తారు. మధ్యలో సీజడ్‌లు, అమెరికన్ డైమండ్స్, ఇతర రంగు రాళ్లు పొదిగి అందంగా రూపొందిస్తారు. ఈ ఉంగరాలను బంగారం, వెండి, ఇత్తడి వంటి లోహాలతో తయారు చేస్తారు. యువతులు ఎక్కువగా వీటిని ఇష్టపడుతున్నారు.

ఫ్లోరల్



● ఉంగరానికి ఇష్టమైన పువ్వు ఆకారాన్ని జతచేస్తారు. పూర్తిగా బంగారంతో తయారుచేసే ఈ ఉంగరాలకు అన్ని వర్గాల మహిళల నుంచి అత్యధిక డిమాండ్ ఉంది. బరువుగా కాకుండా తేలికగా ఉండడంతో ఉద్యోగినులు, యువతులు వీటిని ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు.



సాలిటైర్

● ఉంగరానికి పెద్ద సైజు వజ్రాన్ని జతచేస్తారు. వీటిని ప్లాటినంతో తయారు చేస్తారు. చూడడానికి చాలా గ్రాండ్‌గా రాయల్ లుక్‌తో ఉంటాయి. ఈ ఉంగరాలను ఎక్కువగా నిశ్చితార్థం వేడుక కోసం కొనుగోలు చేస్తున్నారు.

ఓపెన్



● ఈ ఉంగరాలు మధ్యలో తెరచుకుని ఉంటాయి. ఒక కొనకు ఏదైనా మంచి డిజైన్ లేదా పువ్వు ఆకారాన్ని, రెండో కొనకు ముత్యం, పగడం, కెంపు, పచ్చల్లో ఒకదాన్ని జతచేస్తారు. ఉంగరం పై భాగమంతా చిన్న సైజు సీజెడ్ రాళ్లు లేదా అమెరికన్ డైమండ్స్ అమరుస్తారు. ఇవి చూడడానికి చాలా క్లాసీగా ఉంటాయి. మోడరన్ దుస్తుల మీద బాగా నప్పుతాయి. వీటిని బంగారం, వెండి లోహాలతో తయారు చేస్తారు.



స్టాకింగ్

● ఈ ఉంగరాలను బంగారంతో తయారు చేస్తారు. మధ్యలో వివిధ సైజుల్లో ఉన్న జాతి రత్నాలు పొదిగిన ప్రత్యేకమైన ఆకృతిని జతచేస్తారు. ఇవి కూడా వింటేజ్ లుక్‌ని ఇస్తాయి. మోడరన్ దుస్తుల మీద రాయల్‌గా కనిపిస్తాయి.

కాక్‌టెయిల్



● ఉంగరానికి మధ్యలో అష్టదళ పద్మం లాంటి పెద్ద డిజైన్‌ని జత చేస్తారు. దానిమీద విలువైన రాళ్లను పొదుగుతారు. చూడడానికి చాలా పెద్దగా ఉంటుంది ఈ ఉంగరం. ఒక వేలికి పెట్టుకుంటే మూడు వేళ్లను ఆక్రమించి నిండుగా కనిపిస్తుంది. చేయి మొత్తం గ్రాండ్‌గా మెరిసిపోతుంది. వివాహాది వేడుకల్లో వీటిని ఎక్కువగా ధరిస్తున్నారు మహిళలు.



చైన్

● ఈ ఉంగరాలను గొలుసు డిజైన్లలో తయారు చేస్తారు. ఫంకీ లుక్‌ని ఇష్టపడే యువతులు వీటిని ఎక్కువగా కొంటున్నారు. చూడడానికి సాధారణంగా ఉంటూ యువతుల వేళ్లు నాజూకుగా కనిపించేలా చేస్తాయి. బంగారం, వెండి, ఇత్తడి, రాగి తదితర లోహాలతో వీటిని తయారు చేస్తున్నారు. విద్యార్థినులు, ఉద్యోగినులు రోజువారీ ధరించడానికి అనువుగా ఉంటాయి.



మక్కువతో మొదలై..

పరిశ్రమగా ఎదిగింది

ఆమె మక్కువతో నేర్చుకున్న జనపనార ఉత్పత్తుల తయారీ పని, వేల మందికి జీవనభృతిని కల్పించడానికి కారణమైంది. టిటిడి దేవస్థానానికీ, టప్పర్‌వేర్ కంపెనీకీ ఉత్పత్తులను సరఫరా చేసే స్థాయికి కూడా ఎదిగిపోయింది. ఆ వైనాన్నీ, జూట్ ఉత్పత్తుల శిక్షకురాలిగా తన అనుభవాల్నీ నవ్యతో ఇలా పంచుకుంది హైదరాబాద్‌కు చెందిన విక్టోరియా. ఆ ఆసక్తికరమైన విశేషాలు...

కుట్టు పనంటే నాకెంతో మక్కువ. ఆ మక్కువ కాస్తా జూట్ మీదకు మళ్లింది. దాంతో 17 ఏళ్ల క్రితం నేషనల్ జూట్ బోర్డులో జూట్ సంచుల తయారీలో శిక్షణ తీసుకున్నాను. నేర్చుకున్న రెండు నెలల నుంచే నేషనల్ జూట్ బోర్డు నిర్వహించే శిక్షణా తరగతులకు హాజరయ్యే వారికి శిక్షణ ఇవ్వడం కూడా మొదలుపెట్టాను. అలా కరీంనగర్, జగిత్యాల, మెట్టుపల్లి, ఖమ్మం మొదలైన ప్రాంతాల్లో వేల మందికి శిక్షణ ఇచ్చాను. ప్రభావన మల్టీ స్టేట్ విమెన్స్ జూట్ అండ్ ఫైబర్ ప్రొడక్ట్స్ కొఆపరేటివ్ సొసైటీ తరఫున ఏడేళ్లుగా వాళ్లు నిర్వహించే శిక్షణా కార్యక్రమాల్లో పాల్గొనే వారికి శిక్షణనిస్తున్నాను. అంతకు ముందు వరకూ నేషనల్ జూట్ బోర్డు తరఫున శిక్షణ ఇచ్చాను. ప్రస్తుతం ప్రభావనలో శిక్షకురాలిగా పని చేస్తూనే ప్రొడక్షన్ పని కూడా చూసుకుంటున్నాను.

> మా వారు ఇమ్మానుయెల్ ఆనంద్ బాబు, అమెరికన్ రీసెర్చ్ సెంటర్‌లో ప్రోగ్రామర్‌గా పని చేశారు. ఆయన ఇప్పుడు లేరు. ఆయన ఉన్నన్ని రోజులు నేను ఇంటికే పరిమితమైపోయాను. పెద్దగా చదువుకోలేదు కాబట్టి కుట్టుపనితో కాలక్షేపం చేసేదాన్ని. ఆయన పోయిన తర్వాత, జూట్ ఉత్పత్తుల తయారీ నేర్చుకుని, శిక్షకురాలిగా మారిపోయాను. ఇప్పటికీ పండగలు, పెళ్లి వేడుకల సందర్భాల్లో నాకు ఆర్డర్లు వస్తూ ఉంటాయి. నాకు కూతురు, కొడుకు, మనవళ్లు, మనవరాళ్లు ఉన్నారు. మా బాబు శామ్యుయెల్, స్నూకర్ బోర్డుల మరమ్మత్తు చేస్తూ ఉంటాడు.



అంధులకూ, ట్రాన్స్‌జెండర్స్‌కూ...

నా దగ్గర జూట్ సంచుల తయారీ నేర్చుకుని, యూనిట్లు పెట్టుకునే స్థాయికి ఎదిగిన వాళ్లు చాలా మంది ఉన్నారు. ట్రాన్స్ జెండర్స్‌కూ, అంధులకూ కూడా సంచుల తయారీలో శిక్షణనిచ్చాను. ట్రాన్స్‌జెండర్స్‌కు నేర్పించే సమయంలో వాళ్ల మెప్పు పొందడం చాలా కష్టమని ఎంతో మంది నిరుత్సాహపరిచారు. కానీ సంచులు కుట్టడం దగ్గరి నుంచి సొంత వ్యాపారాలు నెలకొల్పే స్థాయికి ఎదిగే వరకూ మూడేళ్ల పాటు నేను వాళ్లతో ఉన్నాను. వాళ్లందరూ నన్ను అమ్మా అని పిలుస్తారు. నేను కూడా వాళ్లను పిల్లల్లాగే భావిస్తూ ఉంటాను. సాధారణంగా ట్రాన్స్‌జెండర్స్ అనగానే వాళ్లు మగవాళ్లు అనే భావన మనసులో కలుగుతుంది. కానీ నేను వాళ్లను మహిళల్లాగే పరిగణించి, అలాగే మెలగడంతో వాళ్లు నాకెంతో దగ్గరైపోయారు. ఒక ట్రాన్స్‌జెండర్ క్రిస్మస్ సందర్భంగా నాకోసం ఫలహారాలు, బియ్యం కూడా పంపించింది. ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రిలోని యూనిట్‌లో అంధులకు కూడా నేను జనపనార సంచుల తయారీ నేర్పించాను. అంధులకు అర్థమయ్యేలా నేర్పించడం కోసం నేను కూడా కళ్లు మూసుకుని సంచులను కుట్టడం సాధన చేశాను. ఎలా వివరిస్తే అంధులకు సులువుగా అర్థమవుతుందో నాకు నేనుగా గ్రహించి వాళ్లకు నేర్పించాను. చేతులతో పట్టుకుని బ్యాగ్ సెంటర్ పాయింట్‌ను గుర్తించడం, అక్కడి నుంచి వేళ్లతో రెండంగులాలు కొలిచి హ్యాండిల్‌ను కుట్టడమెలాగో నేర్పించాను.

ప్రసాదం సంచులు మావే!

టిటిడి నుంచి మాకు విడతలవారీగా దాదాపు లక్ష సంచులు తయారు చేసి పంపించమని ఆర్డర్లు అందుతూ ఉంటాయి. ఇవన్నీ ప్రసాదం సంచులే! ప్రత్యేకించి తిరుపతి లడ్డుకు జనపనార అంటుకోకుండా ఉండడం కోసం, సంచి లోపల అల్యూమినియం ఫాయిల్‌ను కూడా ఏర్పాటు చేసి కుడుతూ ఉంటాం. ఈ సంచితో పాటు ఇతరత్రా ప్రసాదాలన్నిటికీ కలిపి ఒక పెద్ద సంచీ తయారుచేస్తాం. అలాగే విమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌కూ, టప్పర్‌వేర్ కంపెనీకీ పని చేస్తున్నాను. టప్పర్‌వేర్ లంచ్ బాక్సుల కవర్ల లోపల జనపనార లైనింగ్ కుట్టి అందిస్తూ ఉంటాను. జనపనార సంచులు ఆకర్షణీయంగా ఉండడంతో పాటు ఎక్కువ కాలం పాటు మన్నుతాయి. ప్లాస్టిక్‌లా కాకుండా మట్టిలో పూర్తిగా కలిసిపోతాయి. పర్యావరణ హితం పట్ల అందర్లో అవగాహన పెరగడంతో వీటికి గిరాకీ కూడా బాగా పెరిగింది. నలుగురికి ఉపయోగపడేవీ, పర్యావరణానికీ హాని కలిగించని ఉత్పత్తులను తయారుచేయడంతో పాటు, వాటి తయారీ నలుగురికీ నేర్పించి, జీవనభృతి కల్పించగలుగుతున్నందుకు నాకెంతో సంతృప్తిగా ఉంది.

● గోగుమళ్ల కవిత

చూపులేకున్నా... లక్ష్యం మీదే గురి

పుట్టుకతోనే చూపు లేదు. చిన్న వయసులోనే తల్లిని కోల్పోయింది. కనీస అవసరాలైనా తీర్చుకోలేని నిరుపేద గిరిజన కుటుంబం... కానీ ఇలాంటి అవరోధాలన్నీ ఆమె పట్టుదల ముందు తలవంచాయి. ఒడిశాకు చెందిన పదిహేడేళ్ల ఫులా సోరెన్... ఇప్పుడు 'ఇండియన్ బ్లైండ్ ఉమెన్ క్రికెట్ జట్టు'కు వైస్ కెప్టెన్. నిరుడు తన సారథ్యంతో 'ఐబిఎస్ఎ' ప్రపంచ క్రీడల్లో మన దేశానికి చారిత్రాత్మకమైన స్వర్ణ పతకాన్ని సాధించి పెట్టింది.

క్రికెట్‌లో జీవితానికి అర్థాన్ని వెతుక్కోవడమే కాదు, తనను తాను సరికొత్తగా ఆవిష్కరించుకుంది ఫులా సోరెన్. "మైదానంలో నేను వేసే ప్రతి అడుగు నాలో ఆత్మవిశ్వాసాన్ని మరింత పెంచుతుంది" అని చెబుతుందామె. క్రీడల్లో రాణించడం అందరికీ సులభం కాదు. ఆర్థికమైన, సామాజికమైన నేపథ్యం లేని అందురాలైన అమ్మాయికి అది మరింత కష్టమవుతుంది. కానీ జాతీయ, అంతర్జాతీయ వేదికల మీద ఫులా తన సత్తాను బలంగా చాటుతోంది.

ఒంటరితనం బాధపెట్టేది...

ఫులా స్వస్థలం ఒడిశాలోని సలాబనీ అనే గ్రామం. పుట్టుకతోనే చూపులేని ఆమె జీవితం ఎన్నో ఒడుదొడుకులతో సాగింది. ఆమె తండ్రి టునా సోరెన్ గ్రామంలో చిన్న చిన్న పనులు చేసేవారు. స్థిరమైన ఆదాయం లేకపోవడంతో... రోజూ రెండు పూటలు భోజనం దొరకడమే ఆ గిరిజన కుటుంబానికి కష్టంగా ఉండేది. చూపులేని ఫులాను ఆమె తల్లి కంటికి రెప్పలా కాపాడుకొనేవారు. "ఎవరి మీదా ఆధారపడకుండా సొంతంగా చిన్న చిన్న పనులు చేసుకోవడం అమ్మే నాకు నేర్పింది. నేను బాగా చదువుకోవాలని ఆమె కోరిక. అయితే సాధారణ బడుల్లో నాకు అనుమతి దొరకలేదు. దాంతో... అంధుల పాఠశాలలో నాన్న చేర్పించారు. బడికి కాస్త అలవాటు పడుతున్న దశలో... మా అమ్మకు హఠాత్తుగా జబ్బు చేసింది. కొద్ది రోజుల్లోనే ఆమె మరణించింది. ఆ విషాదం నుంచి చాలా కాలం కోలుకోలేకపోయాను. ఆ సమయంలో నాన్న ఇచ్చిన నైతిక స్థైర్యాన్ని ఎప్పటికీ మరచిపోలేను. కానీ నాన్న పొద్దున్నే పనికి వెళ్తే... తిరిగి వచ్చేసరికి ఏ రాత్రో అయ్యేది. ఒంటరితనం మాత్రం నన్ను చాలా బాధపెట్టేది. దీంతో... బడిలో ఎక్కువసేపు గడపడం కోసం క్రీడల్లో పాల్గొనేదాన్ని" అని గుర్తుచేసుకుంది ఫులా. క్రీడల్లో ఆమె చురుకుదనాన్ని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు గమనించారు. క్రికెట్ వైపు ఆమెను ప్రోత్సహించారు. "ఆ తరువాత క్రికెట్ నా లోకమైపోయింది. అమ్మ లేని బాధను ఆటలో మరచిపోయేదాన్ని. కొద్దికాలంలోనే ఆల్‌రౌండర్‌గా నైపుణ్యాన్ని సాధించాను. అయితే దాని వెనుక ఎంతో కష్టం ఉంది. మైదానంలో తిరగడం, బ్యాట్‌ను



ఊపడం, బౌలింగ్ చెయ్యడం ... ఇవి అంధులకు పెద్ద సవాల్. పూర్తిగా శబ్దం మీద, స్పర్శమీద, ఇంద్రియ జ్ఞానం మీద ఆధారపడాలి. ఈ ఆటకు నిరంతరమైన ఏకాగ్రత, అంకితభావం కావాలి. అవన్నీ క్రమంగా మెరుగుపరుచుకున్నాను. ఎప్పుడూ నా లక్ష్యం మీదే దృష్టి పెట్టాను. నన్ను నేను పదును పెట్టుకోవడానికి... నాకు అందుబాటులో ఉన్న ప్రతిదాన్నీ ఉపయోగించుకున్నాను" అని చెబుతోంది ఫులా.

గర్వంగా అనిపిస్తోంది...

అంధుల పాఠశాలస్థాయి పోటీల నుంచి ఆమె విజయపరంపర మొదలయింది. జిల్లాస్థాయి, రాష్ట్ర స్థాయి టోర్నీల్లో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి అంధ మహిళల క్రికెట్ జట్టుకు ఎంపికయింది. "ఎక్కడ ఆడుతున్నాననే దాన్ని పట్టించుకోను. అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వడానికి ఎల్లవేళలా ప్రయత్నిస్తాను" అంటున్న ఫులా అనేక జాతీయ, అంతర్జాతీయ టోర్నీల్లో పాల్గొంది. ఎన్నో సార్లు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్', 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా నిలిచింది. కిందటి ఏడాది జాతీయ జట్టుకు వైస్ కెప్టెన్‌గా ఎంపికయింది. బ్రిటన్‌లోని బర్మింగ్‌హామ్‌లో నిరుడు జరిగిన 'ఇంటర్నేషనల్ బ్లైండ్‌స్పోర్ట్స్ ఫెడరేషన్ (ఐబిఎస్ఎ)-నేషనల్ గేమ్స్'లో... ఆమె సారథ్యంలోని జట్టు ఫైనల్లో ఆస్ట్రేలియా జట్టును ఓడించి స్వర్ణ పతకం గెలుచుకుంది. ఇది భారత అంధ మహిళల క్రికెట్ జట్టు సాధించిన తొలి బంగారు పతకం కావడం విశేషం. ఆ పోటీల నుంచి స్వదేశానికి తిరిగి వచ్చినప్పుడు... ఆమెకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. "టునా సోరెన్‌ది నిరుపేద కుటుంబం. కొన్నిసార్లు తినడానికి తిండి లేకుండా ఇబ్బందులు పడ్డారు. కానీ ఈ రోజు అతని కుమార్తె ఫులా తన ప్రతిభతో మన దేశానికి ప్రాతినిధ్యం వహిస్తోంది. మేము ఎన్నడూ చూడని, బహుశా జీవితంలో చూడలేని ప్రదేశాలకు వెళ్ళి... గొప్ప ప్రదర్శన చేస్తోంది. ఆమె మా ఊరుకు గర్వకారణం" అంటున్నారు గ్రామస్తులు. "క్రికెట్ నాకు ఒక గుర్తింపు ఇచ్చింది. ఇప్పుడు నన్ను, మా నాన్నను జనం గుర్తుపడుతున్నారు. 'ఆయన... ఆ అమ్మాయి తండ్రి' అని మా నాన్న గురించి చెబుతూ ఉంటే ఎంతో గర్వంగా అనిపిస్తోంది" అని చెబుతున్న ఫులా తన తల్లి ఆశయాన్ని మాత్రం మరచిపోలేదు. భువనేశ్వర్‌లో డిగ్రీ చదువుతోంది. "పుట్టుకతో వచ్చే వైకల్యాన్ని నివారించడం మన చేతిలో లేదు. కానీ ఇష్టమైన రంగాన్ని ఎంచుకొని దానిలో కృషి చేస్తే... గెలుపును, సంతృప్తిని సాధించగలం. దానికోసమే నా ప్రయత్నమంతా. వచ్చే ఏడాది జరగబోయే 'అంధ మహిళల తొలి టి-20 ప్రపంచ కప్' పోటీలకు మన దేశం ఆతిథ్యం ఇస్తోంది. దానిలో రాణించడమే ప్రస్తుతం నా లక్ష్యం" అంటోంది ఫులా.



> **"క్రికెట్ నాకు ఒక గుర్తింపు ఇచ్చింది. ఇప్పుడు నన్ను, మా నాన్నను జనం గుర్తుపడుతున్నారు. 'ఆయన... ఆ అమ్మాయి తండ్రి' అని మా నాన్న గురించి చెబుతూ ఉంటే ఎంతో గర్వంగా అనిపిస్తోంది" అని చెబుతున్న ఫులా తన తల్లి ఆశయాన్ని మాత్రం మరచిపోలేదు.**

పేరెంటింగ్

పిల్లల్లో ఆధ్యాత్మికత ఇలా...

బాల్యంలో నేర్చుకునే ప్రతీ అంశం పిల్లల భవిష్యత్తుని తీర్చిదిద్దుతుంది. అందుకే పిల్లల మానసిక వికాసాన్ని దృష్టిలో ఉంచుకుని తల్లిదండ్రులు తొలి పాఠాలు నేర్పించాల్సి ఉంటుంది. ఆత్మాభిమానం, ఆత్మవిశ్వాసం, సానుకూల దృక్పథంతోపాటు ఆధ్యాత్మిక భావనలు అలవడేలా పిల్లలకు మార్గనిర్దేశం చేయాలి. వయసుతోపాటు వ్యక్తిత్వం వికసించే విధంగా పిల్లలకు ఆధ్యాత్మికతను ఎలా పరిచయం చేయాలో తెలుసుకుందాం.

కృతజ్ఞతలు చెప్పడం

● భగవంతునికి, ప్రకృతికి ధన్యవాదాలు చెప్పడమనేది అద్భుతమైన ఆధ్యాత్మిక భావన. పిల్లలకు ప్రతిరోజూ సూర్యోదయానికి ఎదురుగా నిలబడి కృతజ్ఞతా పూర్వకంగా నమస్కరించడం అలవాటు చేయండి. ఇది వారిలో సానుకూల దృక్పథాన్ని, నూతనోత్సాహాన్ని పెంచుతుంది. నిరాశను తొలగిస్తుంది. భోజనానికి ముందు భగవంతుని స్మరించడం నేర్పించండి. దీనివల్ల పిల్లలకు ప్రకృతి శక్తి అవగతమవుతుంది. పెంపుడు జంతువులు చూపే ప్రేమకు విధేయంగా ఉండమని చెప్పండి. మనసులోని కృతజ్ఞతా భావం జీవితాన్ని ఎలా సంతోషమయం చేస్తుందో పిల్లలకు వివరించండి.

దయతో ఉండడం

● సృష్టిలో ప్రతి ప్రాణి పట్ల దయతో వ్యవహరించాలని పిల్లలకు చెప్పండి. భగవంతుని దయా గుణాన్ని చిన్న కథల రూపంలో వివరించండి. ఇవి పిల్లల మనసుల్లో చెరగని ముద్ర వేస్తాయి. మెల్లగా ఆచరణలో పెట్టే ప్రయత్నం ఆరంభిస్తారు. పాఠశాలలో పేద పిల్లలకు సహాయం చేయడం, పుస్తకాలు పంచుకోవడం, కలిసి ఆడుకోవడం లాంటివి అలవరచుకుంటారు. వృద్ధులు, వికలాంగులకు అవసరమైన సహాయం అందించడంలో వెనకాడకూడదని పిల్లలకు చెప్పండి. దీనితో పిల్లలు సరైన వ్యక్తిత్వాన్ని అర్థం చేసుకునే ప్రయత్నం చేస్తారు.



ధ్యానం చేయడం

● ప్రస్తుతం పిల్లల్లో ఏకాగ్రత లోపిస్తోంది. చేస్తున్న పనిమీద పూర్తిగా దృష్టి పెట్టలేకపోతున్నారు. దీనికి పరిష్కారంగా పిల్లలకు ఉదయం లేదంటే సాయంత్రం అరగంట ధ్యానం చేయడం నేర్పించండి. వేగంగా శ్వాస తీసుకోవడం, మెల్లగా శ్వాస వదలడం వంటివి సాధన చేయించండి. ఇష్టదైవాన్ని తలచుకోవడం, ప్రశాంతమైన వాతావరణంలో వీచే చల్లని గాలిని అనుభూతి చెందడం, పక్షుల అరుపులు వినడం, పూల వాసనలు గ్రహించడం ద్వారా ప్రకృతిలో విహరించడాన్ని నేర్పించండి. ధ్యానం వల్ల మనసు, మెదడు విశ్రాంతి పొందుతాయి. జ్ఞాపకశక్తి, ఏకాగ్రత పెరుగుతాయి.

క్షమించడం

● క్షమకు మించిన ఆధ్యాత్మిక భావన లేదు. క్షమించే మనసుకి భగవంతుని సహకారం ఉంటుందని పిల్లలకు చెప్పండి. దీనికి ఉదాహరణగా పురాణాలు, ఇతిహాసాల్లోని చిన్న కథలు చెప్పండి. కోపం, పగల కారణంగా మనసులో బరువు పెరుగుతుంది. దీనివల్ల పెదవులపై చిరునవ్వు, కళ్లలో ప్రశాంతత కరువవుతాయి. తప్పు చేసినపుడు క్షమాపణ కోరడం, తప్పు చేసినవారిని క్షమించడం వల్ల మనసు ప్రశాంతంగా ఉంటుందని పిల్లలకు వివరించండి. ఈ గుణం పిల్లలను అందరిలో ఉన్నతంగా నిలుపుతుంది.

సేవ చేయడం

● మానవ సేవే మాధవ సేవ అని పిల్లలకు చెప్పండి. బాధలో ఉన్నవారిని ఓదార్చడం నేర్పించండి. స్నేహితులకు లేదా పక్కింటివారికి కష్టం వచ్చిందని తెలిస్తే తనవంతు సహాయం చేసేలా ప్రోత్సహించండి. దీనివల్ల సంబంధాలు బలపరచుకుంటూ ముందుకు సాగడం పిల్లలకు అర్థమవుతుంది. పాఠశాల, గుడి ప్రాంగణాలను పిల్లలచేత శుభ్రం చేయించండి. వారికి సేవాభావం అలవడుతుంది. పిల్లల పుట్టినరోజున అనాథాశ్రమాలు, వృద్ధాశ్రమాలకు వెళ్లి అక్కడివారితో గడపడాన్ని పరిచయం చేయండి. దీనివల్ల పిల్లలకు జీవితం విలువ, భగవంతుని తత్వం అర్థమవుతాయి.

భక్తితో ఉండడం

● భక్తి భావన అనేది వ్యక్తిత్వానికి మెరుగులు దిద్దుతుంది. పిల్లలు సాధారణంగా దేవుడి గురించి అలాగే ఈ ప్రపంచం, జీవితం గురించి రకరకాల ప్రశ్నలు అడుగుతుంటారు. వాటన్నింటికీ క్లుప్తంగా వారికి అర్థమయ్యే రీతిలో సమాధానాలు చెప్పండి. భగవంతుని రూపాలు, మన పండుగలు, సంప్రదాయాలు, భగవద్గీత ప్రాముఖ్యం, పురాణాల విశిష్టత గురించి వివరించి చెప్పండి. దీనివల్ల పిల్లలు కష్టపడి సాధించుకోవడం, సమస్యలకు పరిష్కారాలు వెదుక్కోవడం, సమాజ శ్రేయస్సుకు పాటుపడడం వంటివి నేర్చుకుంటారు.

హాట్ హిట్స్

ఈ వారం అమెజాన్ మ్యూజిక్‌లో దేశవ్యాప్తంగా ట్రెండ్ అవుతున్న టాప్-10 బాలీవుడ్ పాటలు...



1. తౌబా తౌబా (బ్యాడ్ న్యూజ్)
2. ఆజ్ కీ రాత్ (స్త్రీ-2)
3. సాజ్‌నీ రే (లా పతా లేడీస్)
4. అఖియా గులాబ్ (తేరీ బాతోమ్‌మే ఐసా ఉల్ఝా జియా)
5. నైనా (క్రూ)
6. జో తుమ్ మేరే హో (జో తుమ్ మేరే హో)
7. భూల్ భులాయా (భూల్ భులాయా3)
8. ఆయీ నై (స్త్రీ-2)
9. ఇష్క్ (లాస్ట్; ఫౌండ్)
10. తేరీ బాతోమే (తేరీ బాతోమే ఐసా ఉల్ఝా జియా)

ట్రెండింగ్ టాప్ తెలుగు సాంగ్: చుట్టమల్లే చుట్టేస్తాంది (దేవర)

దిక్సూచి DIKSUCHI

ఎస్‌బీఐలో 13,735 క్లర్క్ జాబ్స్

భారతదేశంలోని అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు అయిన స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) 13,735 క్లర్క్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన ఖాళీలు ఇవి.
హైదరాబాద్ సర్కిల్: 342, అమరావతి సర్కిల్: 50


వయస్సు: అభ్యర్థుల వయస్సు 2024 ఏప్రిల్ 1వ తేదీ నాటికి 20 నుంచి 28 సంవత్సరాల మధ్యలో ఉండాలి. అంటే 1996 ఏప్రిల్ 2 నుంచి 2004 ఏప్రిల్ 1వ తేదీ మధ్యలో జన్మించి ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూడీ(జనరల్/ఈడబ్ల్యూఎస్) అభ్యర్థులకు పదేళ్ల గరిష్ట వయో పరిమితిలో సడలింపు ఉంటుంది.

విద్యార్హతలు: ఏ విభాగంలో అయినా గ్రాడ్యుయేషన్ పూర్తి చేసినవారు దరఖాస్తునకు అర్హులు. అలాగే ప్రస్తుతం డిగ్రీ ఫైనలియర్ చదువుతున్న అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

పరీక్ష కేంద్రాలు: తెలుగు రాష్ట్రాల్లోని హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, ఖమ్మం, విజయవాడ/గుంటూరు, విశాఖపట్నం, తిరుపతి, అనంతపురం, కడప, కర్నూలు, నెల్లూరు, కాకినాడ, రాజమండ్రి, శ్రీకాకుళం, విజయనగరంల్లో ఈ కేంద్రాలున్నాయి.

ప్రిలిమినరీ/ మెయిన్స్: ఈ నోటిఫికేషన్‌కు సంబంధించిన ప్రిలిమినరీ పరీక్ష 2025 ఫిబ్రవరిలో, మెయిన్ పరీక్ష 2025 మార్చి/ ఏప్రిల్‌లో జరుగుతుంది.

ఎంపిక: ఈ పరీక్షలను ఆన్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు.



- **హైదరాబాద్ సర్కిల్:** 342
- **అమరావతి సర్కిల్:** 50
- **చివరి తేదీ:** 2025 జనవరి 7లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు దాఖలు చేసుకోవచ్చు.
- **పూర్తి వివరాల కోసం:** sbi.co.in/web/careers/current-openings వెబ్‌సైట్ చూడవచ్చు.

ప్రిలిమినరీ పరీక్ష: ప్రశ్న పత్రం మొత్తం వంద మార్కులకు ఉంటుంది. జవాబులను 60 నిమిషాల వ్యవధిలోనే పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇందులో కూడా ఒక్కో విభాగానికి కేటాయించిన నిర్ణీత వ్యవధిలోనే సమాధానాలు గుర్తించాల్సి ఉంటుంది. ఇందులో నెగెటీవ్ మార్కింగ్ ఉంటుంది. తప్పుగా జవాబు రాసిన ప్రతీ ప్రశ్నకు 1/4 మార్కును కట్ చేస్తారు. సుమారుగా ప్రతీ ఖాళీకి పదిమంది చొప్పున మెయిన్ పరీక్షకు ఎంపిక చేస్తారు.

విభాగం	ప్రశ్నలు	మార్కులు	నిమిషాలు
ఇంగ్లిష్	30 ప్రశ్నలు	30 మార్కులు	20 నిమిషాలు
న్యూమరికల్ ఎబిలిటీ	35 ప్రశ్నలు	35 మార్కులు	20 నిమిషాలు
రీజనింగ్ ఎబిలిటీ	35 ప్రశ్నలు	35 మార్కులు	20 నిమిషాలు
మొత్తం	100	100	60 నిమి.

మెయిన్ పరీక్ష: ఇందులో 200 మార్కులకు 190 ప్రశ్నలు ఉంటాయి. రెండు గంటల 40 నిమిషాల్లో దీనిని పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇందులో కూడా నెగెటీవ్ మార్కింగ్ ఉంటుంది. తప్పుగా సమాధానం రాసిన ప్రతీ ప్రశ్నకు పావు మార్కు కోత విధిస్తారు.

విభాగం	ప్రశ్నలు	మార్కులు	నిమిషాలు
జనరల్ ఫైనాన్షియల్ అవేర్‌నెస్	50 ప్రశ్నలు	50 మార్కులు	35 నిమిషాలు
ఇంగ్లిష్	40 ప్రశ్నలు	40 మార్కులు	35 నిమిషాలు
క్వాంటిటేటీవ్ ఆప్టిట్యూడ్ రీజనింగ్ ఎబిలిటీ &	50 ప్రశ్నలు	50 మార్కులు	45 నిమిషాలు
కంప్యూటర్ ఆప్టిట్యూడ్	50 ప్రశ్నలు	60 మార్కులు	45 నిమిషాలు
మొత్తం	190	200	2 గం. 40 నిమి.

ప్రిపరేషన్ టిప్స్

జనరల్

- ప్రిపరేషన్ ప్రారంభించే ముందే సిలబస్, వెయిటేజీ పట్ల అవగాహన తెచ్చుకోవాలి. వెయిటేజ్ ఆధారంగా ప్రిపరేషన్ మొదలుపెట్టాలి.
- ఎక్కువ సిలబస్ ఉన్న దృష్ట్యా సరైన ప్రణాళికను తయారు చేసుకోవాలి. మెయిటేజీ, కష్టాన్ని బట్టి ఆయా టాపిక్‌కు సమయాన్ని కేటాయించుకోవాలి.
- నిర్ణీత సమయంలో సిలబస్ పూర్తయినప్పటికీ పునశ్చరణ అనేది క్రమం తప్పకుండాలి చేసుకోవాలి. దీంతో పరీక్షహాల్లో వేగంగా సమాధానాలు గుర్తించేందుకు ఉపయోగపడుతుంది.
- బ్యాంకింగ్ తదితర పరీక్షల్లో టైమ్ మేనేజ్‌మెంట్ అనేది చాలా కీలకం. నిర్ణీత సమయంలో జవాబు పూర్తయ్యేలా కృషిచేయాలి. ఒక ప్రశ్నకు ఎక్కువ సమయం పడుతుందనుకుంటే వెంటనే దానిని వదిలేసి ఇంకోదానికి వెళ్లిపోవాలి. చివర్లో టైమ్ మిగిలితే దానిని పూర్తి చేయడానికి ప్రయత్నించాలి.
- మాక్ టెస్టులు తప్పనిసరి. అభ్యర్థి బలాలు, బలహీనతలు దీనితో బయట పడతాయి. తప్పులు కనిష్ట స్థాయిలో ఉండే విధంగా అభ్యర్థులు సిద్ధం కాగలుగుతారు.

ఇంగ్లీషు

- ఇంగ్లిషు సిలబస్ ఇటీవల కాలంలో చాలా మారింది. అందుకే నిర్లక్ష్యం చేయొద్దు.
- రెనిన్ మార్టిన్ బుక్ నుంచి గ్రామర్ రూల్స్‌ను నేర్చుకోవాలి. ఉదాహరణల ఆధారంగా వాటిని నేర్చుకోవాలి.
- ఇంగ్లిషు ఆర్టికల్స్ రోజు చదవాలి. కొత్త పదాలు రాసుకోవాలి. తరచుగా పునశ్చరణ చేసుకోవాలి.
- క్లోజ్ టెస్ట్, పిల్లర్స్, సెంటెన్స్ కరెక్షన్, స్పాటింగ్ ఎర్రర్స్ చాప్టర్లను ప్రాక్టీసు చేయాలి.

రీజనింగ్

- బేసిక్ కాన్సెప్టులు అర్థం అయితే ఈ సెక్షన్ సులువు.
- పరీక్షలో వచ్చే అవకాశం ఉన్న పజిల్ మోడల్స్ రోజు రెండు మూడు పూర్తి చేయాలి.
- ఇన్ ఈక్వాలిటీ, ఆర్డర్ అండ్ ర్యాంకింగ్, కోడింగ్ అండ్ డీ కోడింగ్, డైరెక్షన్ డిస్టెన్స్, రక్త సంబంధాలు చాప్టర్లు ప్రాక్టీసు చేయాలి.

క్వాంటిటేటీవ్ ఆప్టిట్యూడ్

- స్క్వేర్స్, క్యూబ్స్, టేబుల్స్ బట్టీపట్టాలి.
- పరీక్షలో కాలిక్యులేషన్స్ వేగంగా చేయడానికి వేదిక్ ట్రిక్స్ ప్రాక్టీసు చేయాలి.
- బేసిక్ చాప్టర్లు అయిన నంబర్ సిరీస్, క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్, యావరేజ్, రేషియో ప్రపోర్షన్స్, పర్సెంటేజీలు బాగా చూసుకోవాలి.
- బార్ గ్రాఫిక్స్, టాబులర్ డిఐ తదితర డేటా ఇంట్రప్రిటేషన్ సెట్స్ ప్రాక్టీసు ముఖ్యం.

కరెంట్ అఫైర్స్

- క్రమం తప్పకుండా పేపర్ చదవాలి. రెండు మూడు పత్రికల ఎడిటోరియల్ పేజీలు చూడాలి.
- సీఎస్ఆర్ జీకే పుస్తకాలు ఫాలోకావాలి.
- మనోరమ ఇయర్ బుక్ చదివితే మంచిది.

రిఫరెన్స్ పుస్తకాలు

- **క్వాంటిటేటీవ్ ఆప్టిట్యూడ్, రీజనింగ్:** ఎస్ చాంద్, ఆర్.ఎస్. అగర్వాల్, అరుణ్ శర్మ, ఎంకె పాండే పుస్తకాలు చదవాలి.
- **ఇంగ్లీషు లాంగ్వేజ్:** రెనిన్ మార్టిన్, అరిహంత్ పబ్లికేషన్స్, ఎస్.చాంద్ పుస్తకాలు మంచివి
- **జనరల్ అవేర్‌నెస్:** మనోరమ ఇయర్ బుక్, సీఎస్ ఆర్ జీకే, దిన పత్రికలు
- **బ్యాంకింగ్ అవేర్‌నెస్:** అరిహంత్ పబ్లికేషన్స్

మోడల్ స్కూల్స్‌లో...



అడ్మిషన్స్

తెలంగాణలోని 194 మోడల్ స్కూల్స్‌లో ఆరు నుంచి పదో తరగతుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ వెలువడింది. 2025 జనవరి ఆరు నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. ఏప్రిల్ 13న ప్రవేశ పరీక్ష జరుగుతుంది. ఆరో తరగతిలోని అన్ని సీట్లను ఈ ప్రవేశ పరీక్ష ద్వారా భర్తీ చేస్తారు. ఏడు నుంచి పదో తరగతి వరకు మాత్రం ఖాళీలను భర్తీ చేస్తారు. ఆసక్తిగల విద్యార్థులు రూ.200 చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులు, ఈడబ్ల్యూఎస్ కేటగిరీ వారు మాత్రం రూ.125 చెల్లిస్తే సరిపోతుంది. పూర్తి వివరాల కోసం https://telanganams.cgg.gov.in/ వెబ్‌సైట్ చూడవచ్చు.

గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరంలో 5వ తరగతిలో ప్రవేశానికి ఉద్దేశించిన నోటిఫికేషన్ వెలువడింది. 2025 ఫిబ్రవరి 23వ తేదీన ప్రవేశ పరీక్ష జరుగుతుంది. ఆన్‌లైన్‌లో రూ.100/- చెల్లించి దరఖాస్తు 2025 ఫిబ్రవరి 1 తేదీలోపు దరఖాస్తు దాఖలు చేసుకోవచ్చు. పాత జిల్లా ఒక యూనిట్‌గా తీసుకుని అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ప్రాస్పెక్టస్ కోసం https://tgswreis. telangana.gov.in/, https://tgtwreis.telangana.gov.in/, http://tgcet.cgg.gov.in/ వెబ్‌సైట్‌లు చూడొచ్చు. లేదా TGSWREIS 040-23391598, TGTWREIS 9491063511, MJPTBCREIS 040-23328266, TGREIS 040-24734899 నెంబర్లను సంప్రదించవచ్చు.

SCHOLARSHIP ALERT

'LIFE'S GOOD'

Description: LG Electronics India Private Limited invites applications from students pursuing undergraduate and post-graduate courses at select colleges/institutes across India.

Eligibility: Students must be pursuing undergraduate/postgraduate courses (any academic year) from select colleges/institutes across India. First-year students must have scored a minimum of 60% marks in their class 12th examinations, while students in the 2nd, 3rd, and 4th years must have achieved a minimum of 60% marks in the previous academic year. Preference will be given to meritorious students, female students and students with an annual family income of not more than INR 8 lakh.

Prizes & Rewards: Up to INR 100,000 for one year

Last Date: 31-12-2024 *Application mode:* Online only

Short Url: www.b4s.in/aj/LGIGS1

Tata Capital Pankh

Description: An initiative of Tata Capital Limited aimed at providing financial support to students belonging to economically weaker sections of society to help them fulfill their academic dreams.

Eligibility: Indian students who are currently studying in Classes 11, 12 general graduation (B.Com., B.Sc., B.A., etc.), diploma and ITI courses at recognised institutions are eligible. Applicants must have scored at least 60% marks in the preceding class. The annual family income of the applicants from all sources must be less than or equal to INR 2.5 lakh.

Prizes & Rewards: Up to an amount ranging from INR 10,000 to INR 12,000 or 80% of course fees (whichever is less)

Last Date: 15-01-2025 *Application mode:* Online only

Short Url: www.b4s.in/aj/TCPS27

PROMYS India

Description: PROMYS India (Program in Mathematics for Young Scientists) 2025 is offered by PROMYS, an Indian residential mathematics summer program, in partnership with the Indian Institute of Science (IISc.) to the students of classes 9 to 12.

Eligibility: Applicants must be at least 15 years old on May 11, 2025. They must be enrolled in classes 9 to 12 or pre-university courses in a government-funded, government-aided, private, unaided, independent school, sixth-form college, home schools, or other types of secondary and higher secondary schools.

Prizes & Rewards: Selected students will receive a full scholarship covering tuition fees and other benefits.

Last Date to Apply: 15-01-2025

Application mode: Online only

Short Url: www.b4s.in/aj/PROM2

buddy4study.com

నవ్య చిత్రజ్యోతి

రేవతి కుటుంబాన్ని పరామర్శించా



జగపతి బాబు

సంధ్య థియేటర్ వద్ద జరిగిన ఘటనలో ప్రాణాలు కోల్పోయిన రేవతి కుటుంబాన్ని తాను పరామర్శించానని, కానీ ప్రచారం చేసుకోలేదని నటుడు జగపతి బాబు అన్నారు. రేవతి కుటుంబాన్ని సినీ పరిశ్రమ నుంచి ఎవరూ పరామర్శించలేదని సీఎం రేవంత్‌రెడ్డితో పాటు ఇతర నేతలు వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. వీరి వ్యాఖ్యలపై జగపతి బాబు స్పందించారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఓ వీడియో సందేశాన్ని పోస్టు చేశారు. 'సినిమా షూటింగ్ పూర్తయ్యాక ఊరి నుంచి తిరిగి రాగానే వెంటనే ఆసుపత్రికి వెళ్లాను. బాధిత కుటుంబాన్ని పరామర్శించాను. శ్రీతేజ తండ్రి, సోదరిని పలకరించా. బాబు కోలుకుంటాడని ధైర్యం చెప్పా. కానీ ప్రచారం చేసుకోలేదు. ఈ విషయం ఎవరికీ తెలియదు. ఇప్పుడు క్లారిటీ ఇవ్వాలని చెబుతున్నా' అని జగపతి బాబు ఆ వీడియోలో పేర్కొన్నారు.



రామ్‌చరణ్‌కు జాతీయ అవార్డు పక్కా

సుకుమార్

"రంగస్థలం'లో అద్భుతంగా నటించిన రామ్‌చరణ్‌కు జాతీయ అవార్డు వస్తుందనుకున్నా. కానీ రాలేదు. ఈసారి 'గేమ్ ఛేంజర్' క్లైమాక్స్‌లో రామ్‌చరణ్ నటనకు జాతీయ అవార్డు పక్కాగా వస్తుంది' అని అన్నారు డైరెక్టర్ సుకుమార్. రామ్‌చరణ్ హీరోగా ఎస్.శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'గేమ్ ఛేంజర్'. దిల్‌రాజు, శిరీష్ నిర్మించారు. జనవరి 10న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను డ్రీమ్స్ రాజేశ్ కల్లెపల్లి ఆధ్వర్యంలో డల్లాస్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా సుకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'విదేశీ ప్రేక్షకులు తెలుగు సినిమాల్ని ఎక్కువగా ఆదరిస్తుంటారు. 'వన్' 'నేనొక్కడినే' చిత్రాలను ఇక్కడ ఆదరించి ఉండకపోతే నాకు తర్వాతి సినిమాలు వచ్చేవి కావు' అని అన్నారు. రామ్‌చరణ్ మాట్లాడుతూ ' క్రికెట్‌కు సచిన్ ఎలాగో...ఇండియన్ సినిమాకు శంకర్ అలా.. అలాంటి డైరెక్టర్‌తో పని చేయడం నా అదృష్టం. నా నుంచి సోలో ఫిల్మ్ వచ్చి ఐదేళ్లు అవుతోంది. ఇది నాకు చాలా ప్రత్యేకమైన సినిమా' అని అన్నారు. నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ 'ఇది మా బేనర్‌లో 50వ సినిమా. ఇంత పెద్ద బడ్జెట్‌తో నేను ఎప్పుడూ సినిమాలు తీయలేదు. ఓ సాంగ్‌ను డల్లాస్‌లో రిలీజ్ చేస్తున్నామని తెలిసి నాకు సంతోషం వేసింది. రామ్‌చరణ్ వల్లే సినిమా ఈ స్థాయికి వచ్చింది' అని అన్నారు. శంకర్ మాట్లాడుతూ' ప్రభుత్వాధికారి, రాజకీయ నాయకుడి మధ్య వచ్చే ఘర్షణ మీదే ఈ చిత్రం ఉంటుంది. రామ్‌చరణ్ ఎంతో అద్భుతంగా నటించారు' అని అన్నారు.

కించపరిచే పోస్టులొద్దు



● అభిమానులకు అల్లు అర్జున్ విజ్ఞప్తి

సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిగతంగా ఎవరినీ కించపరిచేలా పోస్టులు పెట్టొద్దు, మీ అభిప్రాయాలను బాధ్యతాయుతంగా వ్యక్తం చేయండి అని అల్లు అర్జున్ అభిమానులకు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు ఆయన సోషల్ మీడియా ద్వారా ఓ ప్రకటన విడుదల చేశారు. కొందరు సోషల్ మీడియాలో కావాలనే నకిలీ అకౌంట్ల ద్వారా తప్పుడు వ్యాఖ్యలు చేస్తూ రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని, ఈ దుష్ప్రచారానికి దూరంగా ఉండాలని కోరారు. సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటపై అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. దీనికి కౌంటర్‌గా అల్లు అర్జున్ మీడియా సమావేశం ఏర్పాటు చేసి తన వాదనను వినిపించారు. ఈ నేపథ్యంలో అభిమానుల ముసుగులో కొందరు సామాజిక మాధ్యమాల వేదికగా తెలంగాణ ప్రభుత్వంపై తీవ్ర వ్యాఖ్యలు చేస్తున్నారు. దీన్ని గుర్తించిన అల్లు అర్జున్ అలాంటి వాటికి దూరంగా ఉండాలంటూ తన అభిమానులకు విజ్ఞప్తి చేశారు.

మర్రిచెట్టు కింద



ప్రమోద్ దేవా, రణధీర్, కీర్తన, ముస్కాన్ రాజేందర్ హీరో, హీరోయిన్లుగా నరేశ్ వర్మ ముద్దం దర్శకత్వంలో శ్రీ నారసింహ చిత్రాలయ బేనర్‌పై తెరకెక్కనున్న చిత్రం 'మర్రిచెట్టు కింద మనోళ్లు' పూజ కార్యక్రమంతో ప్రారంభమైంది. నటుడు బాబు మోహన్ నటీనటులపై క్లాప్ కొట్టారు. ఆర్టిస్టు నాగ మహేశ్ కెమెరా స్విచ్చాన్ చేశారు. నటులు పృథ్వీ, రాజీవ్ కనకాల, తెలుగు ఫిల్మ్‌ఛాంబర్ అధ్యక్షులు దామోదర ప్రసాద్, నిర్మాత సి.కళ్యాణ్, టీఎంఏఏ ప్రెసిడెంట్ రష్మీ ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాబు మోహన్ మాట్లాడుతూ 'బేనర్, టైటిల్, డైరెక్టర్...ఇలా ఈ సినిమాకు అన్నీ పవర్‌ఫుల్‌గానే ఉన్నాయి' అని అన్నారు. చిత్ర దర్శకుడు నరేశ్ వర్మ మాట్లాడుతూ 'ప్రతి ఒక్కరినీ అలరించే విధంగా ఒక మంచి సబ్జెక్టుతో చేస్తున్న చిత్రమిది' అని తెలిపారు.

బెనిఫిట్‌కు బ్రేక్?

'తెలంగాణలో ఇక నుంచి ఎలాంటి బెనిఫిట్ షోలు ఉండవు. సినిమా టికెట్ల ధరలు పెంచబోం. నేను ముఖ్యమంత్రిగా ఉన్నంతవరకూ అనుమతినివ్వను. ఈ కుర్చీలో ఉన్నంతవరకూ మీ ఆటలు సాగనివ్వను' అంటూ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన హెచ్చరిక టాలీవుడ్‌ను కలవరపరుస్తోంది. సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటన కొత్త మలుపులు తీసుకుంటూ చిత్ర పరిశ్రమ మెడకు చుట్టుకుంటోందనే అభిప్రాయం ఇండస్ట్రీలో వ్యక్తమౌతోంది.

బెనిఫిట్ షోల రద్దు ప్రభావం వెంటనే తెలుగు చిత్ర పరిశ్రమపై కనిపించనుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఏటా సంక్రాంతికి విడుదలయ్యే పెద్ద హీరోల సినిమాలకు వసూళ్ల పరంగా భారీగా లబ్ధి చేకూరుతుండగా, ఇకపై దీనికి బ్రేక్ పడేలా కనిపిస్తోంది.

సంక్రాంతి చిత్రాలివే...

రామ్‌చరణ్ కథానాయకుడిగా శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'గేమ్ ఛేంజర్'. రూ. 450 కోట్ల భారీ బడ్జెట్‌తో దిల్ రాజు నిర్మించిన ఈ సినిమా పాన్ ఇండియా లెవెల్లో జనవరి 10న విడుదలవుతోంది. ఈ చిత్రం అన్ని రికార్డులను తిరగరాస్తుందనే అంచనాలు ఉన్నాయి. జనవరి 12న బాలకృష్ణ కథానాయకుడిగా బాబీ కొల్లి దర్శకత్వంలో నటించిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'డాకూ మహారాజ్' విడుదలవుతోంది. జనవరి 14న వెంకటేశ్ కథానాయకుడిగా అనిల్ రావిపూడి తెరకెక్కించిన 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రం విడుదలవుతోంది. బెనిఫిట్ షోలు, టికెట్ ధరల పెంపు లేకపోతే ఈ సినిమాల వసూళ్లు దెబ్బతింటాయి. 'గేమ్ ఛేంజర్'తో పాటు 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రాలను దిల్‌రాజు నిర్మించారు. ఆయనతో పాటు సినీ పెద్దలు ఇప్పటివరకూ ప్రభుత్వ నిర్ణయంపై స్పందించలేదు. ప్రభుత్వంతో ఏమైనా సంప్రదింపులు జరుపుతారా అనేది వేచి చూడాలి.

వసూళ్లలో కీలక పాత్ర

బెనిఫిట్ షోలు, టికెట్ ధరల పెంపు భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న స్టార్ హీరోల సినిమాలకు ఎంతగానో అవసరం. భారీగా ఆరంభ వసూళ్లు తెచ్చుకోవడానికి.. సినిమా త్వరగా బ్రేక్ ఈవెన్ కావడానికి దోహదం చేస్తాయి. ఈ నెల 5న విడుదలైన 'పుష్ప 2' సినిమా తొలిరోజే ఏకంగా రూ.294 కోట్లు రాబట్టడంలో బెనిఫిట్ షోలు, టికెట్ ధరల పెంపు కీలక పాత్ర పోషించాయి. అలాగే ముందురోజు పెయిడ్ ప్రీమియర్ షోలకు సైతం తెలంగాణ ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఈ సినిమా టికెట్ రేట్లు పన్నులతో కలిపి సింగిల్ స్క్రీన్స్‌లో రూ.1000.. మల్టీప్లెక్సుల్లో రూ.1200లు దాటిపోయాయి. అలాగే రిలీజైన 18 రోజుల వరకూ టికెట్ ధరను పెంచుకునేందుకు వెసులుబాటు కల్పించింది తెలంగాణ సర్కార్. 'పుష్ప 2'తో పాటు ఈ ఏడాది విడుదలైన 'దేవర', 'కల్కి 2898 ఏ.డీ' చిత్రాలకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి టికెట్ రేట్ల పెంపునకు అనుమతులు లభించడంతో మంచి ఆరంభ వసూళ్లు దక్కించుకున్నాయి. అయితే, 'పుష్ప 2' ప్రీమియర్స్ సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో రేవతి అనే మహిళ మృతి చెందడం.. బాలుడు శ్రీతేజ్ పరిస్థితి విషమంగా ఉండడం, అసెంబ్లీలో ఈ ఘటన గురించి ప్రస్తావన రావడం.. అల్లు అర్జున్ ప్రెస్ మీట్ పెట్టడంతో ఒక్కసారిగా వాతావరణం వేడెక్కింది. దీని ప్రభావం రానున్న సినిమాలపై పడనుంది.







భారీ బడ్జెట్ సినిమాలకు బెనిఫిట్ షోలు, కొన్ని రోజుల వరకూ టికెట్ ధరల పెంపు, అదనపు ఆటలకు వెసులుబాటు ఇవ్వాలని పరిశ్రమ కోరడం, ప్రభుత్వం అంగీకరించడం జరుగుతోంది. ఒకప్పుడు ఎన్ని సెంటర్లలో వంద రోజులు ఆడిందనేది సినిమా విజయానికి కొలమానంగా ఉండేది. కానీ ఇప్పుడు ఫస్ట్ డే వసూళ్లు.. అడ్వాన్స్ బుకింగ్స్, వారాంతపు వసూళ్లు ప్రామాణికంగా మారాయి. అలా, విజయం కోసం కొత్త పుంతలు తొక్కుతున్న తెలుగు సినిమాకు తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయం ఝలక్ ఇచ్చిందంటున్నాయి పరిశ్రమ వర్గాలు.




స్మృతి మంధాన (91)

కల్యాణం..కమనీయం

రేపు హైదరాబాద్‌లో రిసెప్షన్

● అంగరంగ వైభవంగా సింధు పెళ్లి ● కుటుంబ సభ్యులు, సన్నిహితుల సమక్షంలో వేడుక




ఉదయ్‌పూర్: భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు, పోసిడెక్స్ టెక్నాలజీస్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకట దత్తసాయి ఒక్కటయ్యారు. ఆదివారం ఉదయ్‌పూర్‌లోని ఓ దీవిలో కుటుంబ సభ్యులు, సన్నిహితుల మధ్య అంగరంగ వైభవంగా వీరి వివాహం జరిగింది. తెలుగు సంప్రదాయాలకు అనుగుణంగా పూర్తి శాస్త్రబద్ధంగా పెళ్లి తంతును నిర్వహించారు. పండితుల వేద మంత్రాల నడుమ రాత్రి 11.20 గంటల సమయంలో సింధు మెడలో దత్త మూడు ముళ్లు వేశాడు. కుటుంబ సభ్యులు, సన్నిహితులతో కలిపి సుమారు 140 మంది ముఖ్యుల సమక్షంలో ఈ వివాహ వేడుక అట్టహాసంగా జరిగింది. ఈ వేడుకలో తెలుగుదనంతో పాటు రాజస్థాన్ రాచరిక సంస్కృతి ఉట్టిపడేలా ఏర్పాట్లు చేశారు. ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడు చాముండేశ్వర్‌నాథ్, వ్యాపారవేత్త నిమ్మగడ్డ ప్రసాద్, ప్రముఖ వైద్యుడు గురువారెడ్డి తదితరులు ఈ వివాహానికి హాజరయ్యారు. మంగళవారం రాత్రి హైదరాబాద్‌లో వివాహ రిసెప్షన్ జరగనుంది.

పెళ్లి వేదిక ప్రత్యేకత..

ఉదయ్‌పూర్‌లోని ఉదయ్‌సాగర్ సరస్సులో 21 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఒక దీవి వేదికగా సింధు వివాహం జరిగింది. ఆరావళి పర్వతాల మధ్యలో ఉన్న ఈ దీవిలో రఫల్స్ సంస్థ భారీ రాజప్రసాదాన్ని తలపించే రిసార్ట్‌ను నిర్మించింది. వంద గదులతో కూడిన మూడు ప్రధాన భవంతులు ఈ రిసార్ట్‌లో ఉన్నాయి. అతిథులను ప్రత్యేక పడవల్లో వివాహ వేదిక వద్దకు తీసుకెళ్లారు. ఈ రిసార్ట్‌లో సాధారణ గదికి ఒక్క రోజు అద్దె సుమారు రూ. లక్ష. సింధు పెళ్లి నిమిత్తం అతిథుల కోసం ఈ 100 గదులను బుక్ చేశారు. అంతేకాక ఈ పెళ్లికి హాజరైన వారికి సింధు కుటుంబం ప్రత్యేకంగా విమాన టిక్కెట్లు బుక్ చేసింది.




వివాహ వేడుక జరిగిన దీవి ఇదే

బోణీ అదిరె..

211 రన్స్ తేడాతో హర్మన్ సేన ఘనవిజయం

స్మృతి చేజారిన శతకం • విండీస్‌తో తొలి వన్డే


రేణుక (5/29)

వడోదర: టీ20 ఫార్మాట్ జోరును భారత మహిళల జట్టు వన్డే సిరీస్‌లోనూ కొనసాగిస్తోంది. ఆదివారం వెస్టిండీస్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టింది. స్మృతి మంధాన (91) తన భీకర ఫామ్‌ను కొనసాగించగా.. బౌలింగ్‌లో పేసర్ రేణుక (5/29) హడలెత్తించింది. దీంతో భారత్ ఏకంగా 211 పరుగుల తేడాతో ఘనంగా బోణీ చేసింది. తద్వారా మూడు వన్డేల సిరీస్‌లో 1-0తో ఆధిక్యం అందుకుంది. మంగళవారం ఇదే స్టేడియంలో రెండో డే/నైట్ మ్యాచ్ జరుగుతుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 50 ఓవర్లలో 9 వికెట్లకు 314 పరుగుల భారీ స్కోరు సాధించింది. హర్లీన్ (44), రావల్ (40), హర్మన్ (34), జెమీమా (31) రాణించారు. జైదా జేమ్స్‌కు ఐదు వికెట్లు దక్కాయి. పేసర్ రేణుకా ధాటికి ఓ దశలో 34/6 స్కోరుతో దీనస్థితిలో నిలిచింది. టాప్-4 బ్యాటర్లు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. అయితే ఫ్లెచర్ (24 నాటౌట్) కాస్త రాణించడంతో చివరికి బంగ్లా 26.2 ఓవర్లలో 103రన్స్‌చేసి చిత్తుగా ఓడింది. ప్రియాకు రెండు వికెట్లు దక్కాయి. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా రేణుకా సింగ్ నిలిచింది.

సంక్షిప్త స్కోర్లు

భారత్: 50 ఓవర్లలో 314/9 (స్మృతి మంధాన 91, హర్లీన్ 44, ప్రతికా రావల్ 40, హర్మన్ 34, జెమీమా 31; జేమ్స్ 5/45, మాథ్యూస్ 2/61).

వెస్టిండీస్: 26.2 ఓవర్లలో 103 ఆలౌట్. (ఫ్లెచర్ 24 నాటౌట్, క్యాంప్‌బెల్ 21; రేణుకా సింగ్ 5/29, ప్రియా మిశ్రా 2/22).

బ్యాటర్ల దూకుడు: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత మహిళలు ఆరంభం నుంచే విండీస్ బౌలర్లను ఆటాడుకున్నారు. మంధాన విండీస్‌పై ఇప్పటికే టీ20 సిరీస్‌లో వరుసగా మూడు అర్ధసెంచరీలు సాధించింది. అదే ఫామ్‌ను తొలి వన్డేలోనూ ప్రదర్శించి త్రుటిలో శతకం చేజార్చుకుంది. 13 ఫోర్లతో తన ఆధిపత్యాన్ని చూపింది. అలాగే అరంగేట్ర ఓపెనర్ ప్రతికా రావల్ కూడా ఆకట్టుకోవడంతో తొలి వికెట్‌కు 110 పరుగుల భాగస్వామ్యం నమోదైంది. 24వ ఓవర్‌లో ఈ జోడీని మాథ్యూస్ విడదీసింది. ఆ తర్వాత హర్లీన్‌తో కలిసి మంధాన రెండో వికెట్‌కు 50 పరుగులు జోడించడం విశేషం. అయితే సెంచరీ ఖాయంగా కనిపించిన మంధానాను జేమ్స్ ఎల్బీ చేసింది. మిడిలార్డర్‌లో హర్మన్, రిచా (26), జెమీమా వేగంగా ఆడి పరుగులు రాబట్టారు. అయితే చివర్లో స్పిన్నర్ జేమ్స్ తన వరుస రెండు ఓవర్లలో భారత్ ఆఖరి 4 వికెట్లను తీసి కాస్త కట్టడి చేసింది.

రోహిత్, ఆకాశ్‌లకు గాయాలు

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియాతో నాలుగో టెస్టుకు భారత జట్టు సన్నాహకాలను ముమ్మరం చేసింది. అయితే ఆదివారం నెట్స్‌లో కెప్టెన్ రోహిత్ శర్మతో పాటు పేసర్ ఆకాశ్ దీప్ గాయం బారినపడడం ఆందోళన కలిగిస్తోంది. ఎంసీజీలోని అవుట్‌డోర్ ప్రాక్టీస్ ఏరీనాలో జట్టు ఆదివారం నెట్స్‌లో గడిపింది. అయితే త్రోడౌన్స్ ఎదుర్కొనేటప్పుడు రోహిత్ ఎడమ మోకాలికి బంతి బలంగా తాకింది. అసౌకర్యంగానే అతను బ్యాటింగ్ కొనసాగించినా కాసేపటికి ఫిజియో వచ్చి చికిత్స చేశాడు. ఆ తర్వాత మోకాలిపై ఐస్ ప్యాక్ ఉంచి విశ్రాంతి తీసుకున్నాడు. అటు ఆకాశ్ చేతికి గాయమైంది. అయితే ట్రైనింగ్‌లో ఇలాంటి గాయాలు మామూలేనని, ఇందులో ఆందోళనపడాల్సిన అవసరం లేదని ఆకాశ్ తెలిపాడు. మరోవైపు ఆరో నెంబర్ బ్యాటర్‌గా రోహిత్ వ్యూహం మార్చి దూకుడుగా ఆడాలని మాజీ కోచ్ రవి శాస్త్రి సూచించాడు.

క్యారమ్ బాల్‌తో బౌల్డ్ చేశావు

అశ్విన్‌కు మోదీ ఉద్వేగభరిత లేఖ

న్యూఢిల్లీ: అంతర్జాతీయ క్రికెట్‌కు ఇటీవల వీడ్కోలు పలికిన రవిచంద్రన్ అశ్విన్‌కు ప్రధాని నరేంద్ర మోదీ ఉద్వేగభరిత లేఖ రాశారు. భారత క్రికెట్‌కు అతడు అందించిన సేవలను కొనియాడారు. అశ్విన్ రిటైర్మెంట్‌ను అతడికే ప్రత్యేకమైన క్యారమ్ బాల్‌తో మోదీ పోల్చారు. 'అంతర్జాతీయ క్రికెట్‌కు నీవు వీడ్కోలు పలకడం భారత్‌తోపాటు ప్రపంచ వ్యాప్తంగా అభిమానులను ఆశ్చర్యానికి లోనుచేసింది. వారంతా నీనుంచి దూసుకొచ్చే ఆఫ్‌బ్రేక్ బంతుల కోసం ఎదురు చూస్తున్న తరుణంలో ఓ క్యారమ్ బాల్ విసిరి అందరినీ బౌల్డ్ చేశావు' అని పేర్కొన్నారు. 'క్రికెట్‌పట్ల నీ నిబద్ధత ప్రశ్నించలేనిది.. ఆసుపత్రిలో ఉన్న తల్లిని పరామర్శించి వెళ్లి మళ్లీ జట్టుకు సేవలందించడం ఆటపట్ల నీ చిత్తశుద్ధికి నిదర్శనం. వరదతో చెన్నై అతలాకుతలం అయినా కుటుంబం గురించి ఆందోళన చెందకుండా దక్షిణాఫ్రికాతో ఆడిన సందర్భం ఇంకా గుర్తుంది' అని మోదీ ప్రశంసించారు.

ఆసియా క్వీన్ భారత్

అండర్-19 టీ20 చాంపియన్‌షిప్



హాఫ్ సెంచరీతో మెరిసిన త్రిష

ఫైనల్లో బంగ్లాదేశ్ చిత్తు


త్రిష (52)

కౌలాలంపూర్: భారత జట్టు అండర్-19 ఆసియా కప్‌ను కైవసం చేసుకుంది. టోర్నమెంట్‌లో సూపర్ ఫామ్‌లో ఉన్న తెలుగు బ్యాటర్ గొంగడి త్రిష ఫైనల్లోనూ అదరగొట్టింది. క్లిష్టమైన పిచ్‌పై ఓపెనర్‌గా దిగిన త్రిష (47 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లతో 52) మెరుపు హాఫ్ సెంచరీతో భళా అనిపించింది. దాంతో బంగ్లాదేశ్‌తో ఆదివారం జరిగిన మహిళల అండర్-19 ఆసియా కప్ టీ20 టోర్నమెంట్ ఫైనల్లో యువ భారత్ 41 పరుగులతో ఘన విజయం సాధించింది. తద్వారా తొలిసారి నిర్వహించిన టోర్నీ టైటిల్ అందుకుంది. టాస్ కోల్పోయి మొదట బ్యాటింగ్ చేసిన భారత్ 20 ఓవర్లలో ఏడు వికెట్లకు 117 పరుగులు సాధించింది. మిథిలా వినోద్ (17), కెప్టెన్ నికీ ప్రసాద్ (12) పర్లేదనిపించారు. ఫర్జానా నాలుగు వికెట్లు పడగొట్టింది. స్వల్ప ఛేదనలో భారత స్పిన్నర్లు ఆయుషి (3/17), పరునిక (2/12), సోనమ్ (2/13) ధాటికి బంగ్లాదేశ్ 18.3 ఓవర్లలో 76 పరుగులకే కుప్పకూలింది. ఫిర్దోస్ (22), ఫహోమిద (18) మాత్రమే రాణించారు. త్రిష 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్', 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్'గా నిలవడం విశేషం.

సంక్షిప్త స్కోర్లు

భారత్: 20 ఓవర్లలో 117/7 (త్రిష 52, మిథిలా వినోద్ 17, నికీ ప్రసాద్ 12, ఫర్జానా 4/31, నిషిత 2/23).

బంగ్లాదేశ్: 18.3 ఓవర్లలో 76 ఆలౌట్ (ఫిర్దోస్ 22, ఫహోమిద 18, ఆయుషి శుక్లా 3/17, పరునిక 2/12, సోనమ్ 2/13).

ఏడాది తర్వాత మళ్లీ వన్డేల్లోకి రూట్

లండన్: వచ్చే ఏడాది జరిగే చాంపియన్స్ ట్రోఫీలో వెటరన్ బ్యాటర్ జో రూట్ బరిలోకి దిగనున్నాడు. ఏడాది తర్వాత తను వన్డేల్లో ఆడబోతుండడం విశేషం. ఈ మెగా టోర్నీతో పాటు భారత పర్యటనలో జరిగే పరిమిత ఓవర్ల సిరీస్‌ల కోసం ఇంగ్లండ్ జట్లను ఆదివారం ప్రకటించారు. 2023 వన్డే వరల్డ్‌కప్‌లో రూట్ విఫలం కావడంతో జట్టుకు దూరమయ్యాడు. ఇక గాయం నుంచి కోలుకుంటున్న బెన్ స్టోక్స్‌కు బెర్త్ దక్కలేదు. భారత పర్యటనలో జట్టు ఐదు టీ20లు, మూడు వన్డేల్లో తలపడనుండగా.. రెండు ఫార్మాట్లకు జోస్ బట్లర్ నేతృత్వం వహించనున్నాడు. టీ20 జట్టులో రూట్ స్థానంలో లెగ్ స్పిన్నర్ రెహాన్ అహ్మద్ ఆడనున్నాడు.

సెమీస్‌కు హరియాణా

పుణె: ప్రొ కబడ్డీ లీగ్‌లో అగ్రస్థానాన్ని పదిలం చేసుకొన్న హరియాణా స్టీలర్స్ నేరుగా సెమీస్‌కు దూసుకెళ్లింది. ఆదివారం జరిగిన తమ ఆఖరి లీగ్ మ్యాచ్‌లో హరియాణా 47-30తో యు ముంబాను చిత్తు చేసింది. రైడర్ శివమ్ పటారే 14 పాయింట్లతో అదరగొట్టాడు. లీగ్ ఫార్మాట్ ప్రకారం టాప్-2లో నిలిచిన జట్లు నేరుగా సెమీస్‌కు అర్హత సాధిస్తాయి. మరో మ్యాచ్‌లో తమిళ్ తలైవాస్ 42-32తో బెంగళూరు బుల్స్‌పై గెలిచింది. ఆల్‌రౌండ్ హిమాన్షు 13 పాయింట్లు సాధించాడు.

భారత మ్యాచ్‌లు దుబాయ్‌లో..!

చాంపియన్స్ ట్రోఫీ

కరాచీ: హైబ్రిడ్ విధానంలో నిర్వహించే చాంపియన్స్ ట్రోఫీలో భారత్ ఆడే మ్యాచ్‌ల తటస్థ వేదిక ఖరారైంది. లీగ్ దశలో టీమిండియా ఆడే మ్యాచ్‌లు దుబాయ్‌లో నిర్వహించనున్నట్టు ఆతిథ్య పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ)కు సంబంధించిన విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఒకవేళ భారత్ సెమీస్, ఫైనల్ చేరితే యూఏఈనే వేదిక కానుంది. పీసీబీ ఛైర్మన్ మొహసిన్ నక్వీ, యూఏఈ క్రికెట్ అధ్యక్షుడు ముబారక్ మధ్య జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకొన్నట్టు తెలుస్తోంది. వేదికలపై స్పష్టత వస్తే.. ఐసీసీ వీలైనంత వేగంగా షెడ్యూల్‌ను విడుదల చేసే అవకాశం ఉంది.

బిజినెస్

ఐపీఓ జోరు.. లాభాల హోరు

ఆటుపోట్ల మార్కెట్లో నిధుల వేట.. రూ.1.6 లక్షల కోట్ల సమీకరణ

న్యూఢిల్లీ: ఈ ఏడాది ఈక్విటీ మార్కెట్ తీవ్ర ఆటుపోట్లు ఎదుర్కొంటున్నప్పటికీ పబ్లిక్ ఇష్యూల (ఐపీఓ) జోరు చాలా అధికంగా ఉంది. ప్రపంచ దేశాలన్నీ తీవ్ర ఆర్థిక సంక్షోభం ఎదుర్కొంటున్నప్పటికీ భారత్ ప్రోత్సాహకరమైన వృద్ధి నమోదు చేస్తూ ఉండడం, సానుకూల మార్కెట్ పరిస్థితులు, నియంత్రణా వ్యవస్థలో మెరుగుదలలు ఐపీఓ కార్యకలాపాలు పెరిగేందుకు దోహదపడ్డాయి. 2024 సంవత్సరం మొత్తం మీద 90 ప్రధాన కంపెనీలు నిధుల కోసం మార్కెట్ తలుపు తట్టాయి. రికార్డు స్థాయిలో రూ.1.6 లక్షల కోట్ల నిధులు ఐపీఓల ద్వారా వసూలయ్యాయి. ఐపీఓల ద్వారా షేర్లు కొనడానికే కాదు, లిస్టింగ్ రోజు లాభాలు దండుకోవడానికి లేదా దీర్ఘకాలిక అవకాశాలున్న కంపెనీలకు మద్దతుగా నిలిచేందుకు కూడా ఇన్వెస్టర్లు పోటీ పడ్డారు. ఇష్యూల పరిమాణం విషయానికి వస్తే హ్యుండయ్ మోటార్ ఇండియా చరిత్రలోనే అతి పెద్ద ఐపీఓ జారీ చేసింది. రూ.27,870 కోట్లు సమీకరించింది. విభోర్ స్టీల్ ట్యూబ్స్ అతి చిన్న ఇష్యూ (రూ.72 కోట్లు) జారీ చేసింది. ఎస్ఎంఈ విభాగం కూడా నిధుల వేటలో పోటీ పడింది. 238 చిన్న, మధ్యతరహా కంపెనీలు రూ.8,700 కోట్ల వరకు సమీకరించాయి.

సబ్‌స్క్రిప్షన్‌లోనూ రికార్డులు: ఐపీఓల్లో ఇన్వెస్ట్ చేయడానికి మదుపరులు పోటీ పడడంతో పలు కంపెనీలకు ఇష్యూ పరిమాణం కన్నా వందల రెట్లు అధిక సబ్‌స్క్రిప్షన్ రావడం కూడా విశేషం. విభోర్ స్టీల్స్ అతి చిన్న ఐపీఓ జారీ చేసినా ఆ ఇష్యూ 320 రెట్లు అధిక సబ్‌స్క్రిప్షన్ సాధించింది. కేఆర్ఎన్ హీట్ ఎక్స్ఛేంజర్ అండ్ రిఫ్రిజిరేషన్, మన్బా ఫైనాన్స్, గాలా ప్రెసిషన్ ఇంజనీరింగ్ వంటి ఇష్యూలకు 200 రెట్లు ఓవర్ సబ్‌స్క్రిప్షన్ వచ్చింది. లిస్టింగ్‌లో ఇన్వెస్టర్లకు లాభాలు పంచడంలో కూడా కంపెనీలు పోటీ పడ్డాయి. ఏడాది మొత్తం మీద 60 కంపెనీలు ఇన్వెస్టర్లకు లిస్టింగ్‌లో సానుకూల రాబడులు అందించాయి. విభోర్ స్టీల్ ట్యూబ్స్, బీఎల్ఎస్ ఈ-సర్వీసెస్, బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్, కేఆర్ఎన్ హీట్ ఎక్స్ఛేంజర్ వంటి కంపెనీలు లిస్టింగ్‌లో 100 శాతం లాభాలు పంచాయి.

- రిటైల్ చెయిన్ నేషనల్ మార్ట్.. తెలంగాణలో తన కార్యకలాపాలను మరింతగా విస్తరించింది. తాజాగా కంపెనీ హన్మకొండలో 40,000 చదరపు అడుగుల్లో కొత్త స్టోర్‌ను ప్రారంభించింది. సంస్థకిది 12వ స్టోర్. కాగా త్వరలో నిజామాబాద్‌లో కొత్త స్టోర్‌ను ప్రారంభించనున్నట్లు కంపెనీ ప్రకటించింది.
- హైదరాబాద్‌లో పోడియాట్రిక్ (పాదాలు, చీలమండ) చికిత్స కోసం ఇసోటేకి చెందిన అత్యాధునిక ఓ-స్కాన్ ఎంఆర్ఐ మెషిన్‌ను వాస్క్యులర్, పోడియాట్రిక్ సర్జన్ డాక్టర్ నరేంద్రనాధ్ మేడా అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ ఎంఆర్ఐ ద్వారా తొలి దశలోనే వ్యాధి లక్షణాలను గుర్తించి మెరుగైన చికిత్సను అందించవచ్చని నరేంద్రనాధ్ తెలిపారు.
- ఐస్ మేక్ రిఫ్రిజిరేషన్ లిమిటెడ్.. మార్కెట్లోకి సరికొత్త చెస్ట్ ఫ్రీజర్లు, కూలర్స్ సహా కమర్షియల్ ఫ్రీజర్లు, విసీ కూలర్స్‌ను తీసుకువచ్చింది. 100 లీటర్ల నుంచి 900 లీటర్ల శ్రేణిలో ఈ ఫ్రీజర్లు అందుబాటులో ఉంటాయి.
- జెట్‌వెర్క్.. ఖోస్లా వెంచర్స్ సారథ్యంలోని వివిధ సంస్థల నుంచి 9 కోట్ల డాలర్ల (రూ.766 కోట్లు) నిధులు సమీకరించింది. 2023-24లో తాము రూ.17,564 కోట్ల జీఎంవీ సాధించామని, ఇందులో 20 శాతం అమెరికా మార్కెట్ నుంచే వచ్చిందని సీఈఓ అమృత్ ఆచార్య చెప్పారు.

బ్యాంకులకు కుచ్చుటోపీ

2,664 కంపెనీలు.. రూ.1.96 లక్షల కోట్లు..

భారీగా పెరిగిన ఉద్దేశపూర్వక ఎగవేతలు



ముంబై: కొందరు బడా బాబులు బ్యాంకుల సొమ్ముతో మజా చేస్తున్నారు. ఏదో ఒక వ్యాపారం పేరుతో బ్యాంకుల నుంచి రుణాలు తీసుకోవడం, ఆ నిధులను తమ డొల్ల కంపెనీలకు లేదా తమ సొంత ఖాతాలకు దర్జాగా దారి మళ్లిస్తూ ఉద్దేశపూర్వకంగా బ్యాంకులకు టోపీ పెడుతున్నారు. ఈ ఏడాది (2024) మార్చి నెలాఖరుకు ఇలా 2,664 కంపెనీలు బ్యాంకులకు రూ.1,96,441 కోట్లు టోపీ పెట్టాయి. 2020 మార్చి నాటికి నమోదైన రూ.1,52,860 కోట్లతో పోలిస్తే ఇది రూ.43,581 కోట్లు ఎక్కువ. సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) కింద 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' పత్రిక భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) నుంచి ఈ వివరాలు రాబట్టింది. ఇలా బ్యాంకుల నెత్తిన టోపీ పెట్టిన బడా బాబులకు చెందిన టాప్ 100 కంపెనీల జాబితానూ ఆర్‌బీఐ వెల్లడించింది. ఉద్దేశపూర్వక ఎగవేతదారుల సంఖ్య కూడా 2020తో పోలిస్తే 2024 మార్చి నాటికి 2,154 నుంచి 2,664కు చేరినట్టు తెలిపింది.

ఐదేళ్లలో ఉద్దేశపూర్వక ఎగవేతలు

తేదీ	ఎగవేతలు	రూ.కోట్లలో
31-03-2020	2,154	1,52,860
31-03-2021	2,415	1,80,879
31-03-2022	2,553	2,15,710
31-03-2023	2,622	1,96,035
31-03-2024	2,664	1,96,441

ఎవరు వీరంతా..?

బ్యాంకుల నుంచి రుణాలు తీసుకోవడం తర్వాత వాటిని తమ ఖాతాల్లో వేసుకోవడంలో జువెలరీ, డైమండ్ వ్యాపారులే ముందున్నారు. మళ్లీ ఇందులో గీతాంజలి జెమ్స్ అధినేతలు మెహుల్ చోక్సీ, అతడి మేనల్లుడు నీరవ్ మోదీ అందరి కంటే ముందున్నారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)కి రూ.8,516 కోట్ల మేర టోపీ పెట్టి ఈ ఇద్దరు తమ బాగోతం బయట పడే ముందే దేశం నుంచి జారుకున్నారు. ఏబీజీ షిప్‌యార్డు అధినేత రిషి అగర్వాల్ (రూ.4,684 కోట్లు), కాన్‌కాస్ట్ స్టీల్ అధినేత సంజయ్ సురేఖ (రూ.4,305 కోట్లు), ఎరా ఇన్‌ఫ్రా ఇంజనీరింగ్ అధినేత హెచ్ఎస్ భరణ, (రూ.3,637 కోట్లు), ఆర్ఈఐ ఆగ్రో అధినేత సందీప్ ఝున్‌ఝున్‌వాలా (రూ.3,350 కోట్లు), విన్సమ్ డైమండ్స్ అధినేత జతిన్ మెహతా (రూ.2,927 కోట్లు), కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్ అధినేత విజయ్ మాల్యా (రూ.1,023 కోట్లు) కూడా ఈ జగత్ కిలాడీల జాబితాలో ఉన్నారు.

ఏడు హైదరాబాద్ కంపెనీలు

హైదరాబాద్‌కు చెందిన ఏడు కంపెనీలు కూడా బ్యాంకులకు పెద్ద మొత్తంలోనే టోపీ పెట్టాయి. ఈ ఏడు కంపెనీలు బ్యాంకులకు రూ.7,847 కోట్ల మేర ఎగనామం పెట్టినట్టు ఆర్‌బీఐ తెలిపింది. ఇందులో మాజీ ఎంపీ రాయపాటి సాంబశివ రావుకు చెందిన ట్రాన్స్‌ట్రాయ్ (ఇండియా) లిమిటెడ్ రూ.2,919 కోట్ల ఎగవేతతో అగ్రస్థానంలో ఉంది. దక్కన్ క్రానికల్ హోల్డింగ్స్ (రూ.1,960 కోట్లు), ఐవీఆర్‌సీఎల్ (రూ.842 కోట్లు), వీఎంసీ సిస్టమ్స్ (రూ.669 కోట్లు), సురానా ఇండస్ట్రీస్ (రూ.594 కోట్లు), టీఎస్ లిమిటెడ్ (రూ.477 కోట్లు), కోనసీమ గ్యాస్ పవర్ లిమిటెడ్ (రూ.386 కోట్లు) వరుసగా తర్వాతి స్థానాల్లో ఉన్నట్టు ఆర్‌బీఐ వెల్లడించింది.

23,900 పైన బుల్లిష్

(డిసెంబరు 23-27 తేదీల మధ్య వారా


డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

అమర్ శాస్త్రి

నిఫ్టీ గత వారం 24,781-23,808 పాయింట్ల మధ్యన కదలాడి 1,182 పాయింట్ల నష్టంతో 23,588 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 23,900 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 23,980, 24,316, 24,441, 24,176 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 50 డిఎంఎ 200 డిఎంఎ కన్నా పైకి రావడం దీర్ఘకాలిక బుల్లిష్ ట్రెండ్ సంకేతం.

బ్రేకౌట్ స్థాయి: 23,900 **బ్రేక్‌డౌన్ స్థాయి:** 23,300

నిరోధ స్థాయిలు: 23,800, 23,900, 24,000 (23,700 పైన బుల్లిష్)

మద్దతు స్థాయిలు: 23,475, 23,375, 23,275 (23,575 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



23వ తేదీ			
హైదరాబాద్	575	విజయవాడ	585
వరంగల్	577	గోదావరి	585
చిత్తూరు	583	విశాఖపట్నం	590
		డజను గుడ్లు రూ.	84

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	91	విజయవాడ	94
వరంగల్	91	గుంటూరు	97
కరీంనగర్	91	ఒంగోలు	97
మహబూబ్‌నగర్	91	చిత్తూరు	85
కర్నూలు	91	నెల్లూరు	85
విశాఖపట్నం	98	అనంతపురం	85
గోదావరి	94		

అప్రమత్తంగా ఉండటం బెటర్.!

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈ వారం మిశ్రమంగా చలించే అవకాశం ఉంది. గత వారం విపరీతంగా పతనమైన బెంచ్‌మార్క్ సూచీల్లో పుల్‌బ్యాక్ ర్యాలీకి ఆస్కారం కనిపిస్తోంది. ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించటం మంచిది. అమెరికా ఆర్థిక వ్యవస్థ, ద్రవ్యోల్బణం డేటా కీలకంగా ఉండనుంది. విదేశీ సంస్థాగత మదుపరులు.. పెట్టుబడుల ఉపసంహరణకు దిగటం, డాలర్ మరింత బలపడుతుండటం ఆందోళన కలిగించే అంశం. సూచీలు బాగా పడిపోవటంతో ఆకర్షణీయమైన ధరల్లో లభించే నాణ్యమైన షేర్లను కొనుగోలు చేయటం బెటర్.

స్టాక్ రికమండేషన్స్

రెలిగేర్: కొన్ని నెలలుగా ఈ షేరు అప్‌ట్రెండ్‌లో కొనసాగుతూ వస్తోంది. నిఫ్టీతో పోలిస్తే మెరుగ్గా కదలాడుతోంది. అమ్మకాలు, ఈపీఎస్ క్రమంగా పెరుగుతున్నాయి. బెంచ్‌మార్క్ సూచీలు పతనమవుతున్నప్పుడు ఈ షేరు లాభాలను నమోదు చేసింది. రూ.300 వద్ద కీలకమైన నిరోధాన్ని అధిగమించిన ఈ కౌంటర్ గత శుక్రవారం 272 శాతం లాభంతో రూ.309 వద్ద క్లోజైంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లో రూ.300 వద్ద పొజిషన్ తీసుకుని రూ.345 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.290 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

కార్‌ట్రేడ్: ఈ షేరు 2021 నాటి ఐపీఓ స్థాయికి చేరుకుంది. నిఫ్టీతో పోలిస్తే అత్యంత పటిష్ఠంగా ఉంది. కంపెనీ ఆర్థిక ఫలితాలు ప్రతి త్రైమాసికంలో మెరుగ్గా ఉంటుండటంతో ఇన్వెస్టర్లు ఆసక్తి చూపిస్తున్నారు. గత శుక్రవారం 5.08 శాతం లాభంతో రూ.1,551 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లోకి రూ.1,585 వద్ద ఎంటరై రూ.1,650/1,775 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,550 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

కేఈసీ ఇంటర్నేషనల్: ఫండమెంటల్స్, టెక్నికల్స్ మంచిగా ఉండటంతో ఈ షేరు దూకుడును ప్రదర్శిస్తోంది. రిలేటివ్ స్ట్రెంత్ చాలా ఎక్కువగా ఉంది. నష్టాల మార్కెట్లోనూ ఇవి బలం ప్రదర్శించాయి. చివరి మూడు సెషన్లలో 10 శాతం మేర పెరిగాయి. గత శుక్రవారం 2.78 శాతం లాభంతో రూ.1,236 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లోకి ఇన్వెస్టర్లు రూ.1,200 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.1,320/1,350 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,170 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

పెట్రోనెట్ ఎల్ఎన్‌జీ: ఆగస్టులో జీవితకాల గరిష్ఠాన్ని తాకిన ఈ కౌంటర్‌లో మంచి దిద్దుబాటు కనిపించింది. షేర్ల సరఫరా తగ్గటంతో డిమాండ్ పెరుగుతోంది. రిస్క్ రివార్డు నిష్పత్తి బాగుంది. గత శుక్రవారం ఈ షేరు రూ.336 వద్ద క్లోజైంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లో రూ.333 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.375 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.328 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

భారత్ డైనమిక్ లిమిటెడ్: జూలైలో జీవితకాల గరిష్ఠాన్ని తాకిన తర్వాత ఈ షేరు 50 శాతం మేర పతనమైంది. నవంబరు చివరి వారం నుంచి టర్న్ అరౌండ్ అయ్యింది. ప్రస్తుతం రిలేటివ్ స్ట్రెంత్ పెరుగుతోంది. మూమెంటమ్ పుంజుకుంటోంది. గత శుక్రవారం రూ.1,239 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.1,250 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.1,400 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,210 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

టెక్ వ్యూ

మద్దతు స్థాయి 23,500 చేరువలో...


వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం రియాక్షన్‌లో ప్రారంభమై అన్ని రోజులూ డౌన్ ట్రెండ్‌లోనే ట్రేడవుతూ చివరికి సుమారు 1,200 పాయింట్ల నష్టంతో వారం కనిష్ఠ స్థాయి 23,580 వద్ద ముగిసింది. రెండేళ్ల కాలంలో ఒక వారంలో ఏర్పడిన అత్యధిక నష్టం ఇదే. మొత్తం మీద నిఫ్టీ గత రెండు వారాల్లో 2,600 పాయింట్ల మేరకు నష్టపోయింది. అమెరికన్ మార్కెట్లు రికార్డు స్థాయిలో వరుసగా పది రోజుల పాటు నష్టాలు నమోదు చేయడం కూడా భారత స్టాక్ మార్కెట్‌పై ప్రభావం చూపింది. గత వారం మిడ్‌క్యాప్-100 సూచీ 2100 నష్టపోగా స్మాల్‌క్యాప్-100 సూచీ 690 పాయింట్లు నష్టపోయింది. టెక్నికల్‌గా మార్కెట్ కొద్ది కాలం క్రితం నమోదు చేసిన కనిష్ఠ స్థాయి 23,500 చేరువకు వస్తోంది. ఇదే గతంలో ఏర్పడిన మేజర్ బాటమ్. ఇక్కడి నుంచే మార్కెట్ తిరిగి అప్‌ట్రెండ్‌లో ప్రయాణం ప్రారంభించింది. గత శుక్రవారం నాటి ప్రపంచ మార్కెట్ల ధోరణిని బట్టి చూస్తే ఈ వారంలో రికవరీ ఏర్పడే అవకాశం ఉంది. అలాగే మార్కెట్ గత వారం నిట్టనిలువుగా పడిపోయినందు వల్ల సానుకూలత కోసం తొలుత కన్సాలిడేట్ కావాలి.

బుల్లిష్ స్థాయిలు: మార్కెట్లో ఆటుపోట్లు తీవ్రంగా ఉన్నాయి. పాజిటివ్‌గా ప్రారంభమైనా భద్రత కోసం నిరోధ స్థాయి 23,850 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధం 24,000. మార్కెట్ ఇక్కడ కన్సాలిడేట్ కావచ్చు.

బేరిష్ స్థాయిలు: బలహీనతను కొనసాగించినా ప్రధాన మద్దతు స్థాయి వద్ద కన్సాలిడేట్‌కు ఆస్కారం ఉంది. విఫలమైతే స్వల్పకాలిక బలహీనత ఏర్పడవచ్చు. స్వల్పకాలిక ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ఉండాలి. దిగువన మద్దతు స్థాయిలు 23,350, 23,200, 23,000.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ గత వారం భారీ స్థాయిలో 2,800 పాయింట్లు నష్టపోయి 50,750 వద్ద ముగిసింది. గత ఆరు నెలలుగా జీవితకాల గరిష్ఠ స్థాయి 54,000 వద్ద విఫలమవుతూ వస్తోంది. ప్రస్తుతం ఇటీవల ఏర్పడిన కనిష్ఠ స్థాయి 50,000కి చేరువవుతోంది. రికవరీ బాట పడితే ట్రెండ్‌లో సానుకూలత కోసం ప్రధాన నిరోధం 51,400 కన్నా పైన నిలదొక్కుకోవాలి. మరో ప్రధాన నిరోధం 52,000. మరింత బలహీనపడినా 50,000 వద్ద నిలదొక్కుకుని కన్సాలిడేట్ కావాలి.

పాటర్న్: గత వారం నిఫ్టీ 200 డిఎంఎ కన్నా స్వల్పంగా దిగజారింది. ఇప్పుడు స్వల్పకాలంలో అక్కడ పరీక్షకు గురి కావచ్చు. మార్కెట్‌కు 23,500 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" వద్ద ప్రధాన మద్దతు ఉంది. సానుకూలత కోసం ఇక్కడ కన్సాలిడేట్ కావాలి.

టైమ్: ఈ సూచీ ప్రకారం గురువారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	23,800, 23,850
మద్దతు	23,500, 23,430


ఐటీడీఏ కార్యాలయం ఎదుట పౌర హక్కుల సంఘాల నాయకుల దిష్టిబొమ్మను దహనం చేస్తున్న మావోయిస్టు బాధిత కుటుంబాలు

పౌరహక్కు నేతలపై మావోయిస్టు బాధిత కుటుంబాల భగ్గు

ఎన్‌కౌంటర్‌పై నిజనిర్ధారణకు వస్తున్నారని తెలిసి నిరసన

నక్సల్స్ తమ వారిని చంపినప్పుడు రాలేదెందుకని ఆగ్రహం

చల్పాక ఎన్‌కౌంటర్ బూటకం: పౌర హక్కుల సంఘం

ఏటూరునాగారం రూరల్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పౌరహక్కుల నేతల తీరుపై మావోయిస్టు బాధిత కుటుంబాలు భగ్గుమన్నాయి. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం చెల్పాక అడవుల్లో ఈ నెల 1న జరిగిన ఎన్‌కౌంటర్‌పై నిజనిర్ధారణకు వస్తున్నారని తెలిసి ఆగ్రహం వ్యక్తం చేశాయి. మావోయిస్టులు తమ వారిని చంపినప్పుడు ఎందుకు రాలేదని ప్రశ్నిస్తూ ఆదివారం ఏటూరునాగారం ఐటీడీఏ కార్యాలయం ఎదుట ధర్నా చేశాయి. ఈ సందర్భంగా మావోయిస్టు బాధిత కుటుంబసభ్యులు కొందరు మాట్లాడుతూ, చెల్పాక అడవుల్లో ఎన్‌కౌంటర్‌కు ముందు వాజేడు మండలంలో మావోయిస్టుల చేతిలో తమ వారు ఊకే రమేశ్, అర్జున్ హత్యకు గురయ్యారని, ఆ సమయంలో నిజనిర్ధారణకు రాని పౌరహక్కుల నేతలు మావోయిస్టుల ఎన్‌కౌంటర్ జరిగిందని తెలిసి రావడం ఏమిటని ప్రశ్నించారు. మావోయిస్టుల దుశ్చర్యల కారణంగా తాము రోడ్డున పడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇన్‌ఫార్మర్ల నెపంతో తమ వారిని మావోయిస్టులు చంపినప్పుడు పౌర హక్కుల నాయకులకు తాము ఎందుకు గుర్తుకు రాలేదని ప్రశ్నించారు. పౌర హక్కుల సంఘాల తీరును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని పేర్కొంటూ పౌరహక్కుల నేతల దిష్టిబొమ్మలను దహనం చేశారు. మరో వైపు ఆదివారం చల్పాక అటవీ ప్రాంతంలో ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతాన్ని పౌర హక్కుల సంఘం నాయకులు పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, ఎన్‌కౌంటర్ బూటకమని, కోవర్టు వ్యవస్థ ద్వారా విషయ ప్రయోగం చేసి మావోయిస్టులను పోలీసులు కాల్చి చంపారని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, రాష్ట్ర ప్రధానకార్యదర్శి నారాయణ ఆరోపించారు. ఎన్‌కౌంటర్‌పై తాము నిజనిర్ధాణ కోసం వస్తుంటే పోలీసులు అడుగడుగునా ఆటంకాలు సృష్టించారని మండిపడ్డారు. ఎన్‌కౌంటర్‌పై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని వారు డిమాండ్ చేశారు.

బెజవాడ దుర్గమ్మను దర్శించుకున్న సీతక్క

హైదరాబాద్/ఇబ్రహీంపట్నం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఏపీలోని విజయవాడ కనకదుర్గ అమ్మవారిని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సీతక్కను ఆలయ వేద పండితులు ఆశీర్వచనం చేయగా.. ఆలయ అధికారులు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రం, ప్రసాదాలు అందజేశారు.

కాబోయే ప్రధాని రాహుల్‌గాంధీనే..

ఈసారి కేంద్రంలో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, రాహుల్ గాంధీ ప్రధాని అవుతారని సీతక్క వ్యాఖ్యానించారు. ఎన్టీఆర్ జిల్లా గుంటుపల్లిలోని ఓ ప్రైవేట్ కార్యక్రమానికి హాజరైన ఆమెకు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బొర్రా కిరణ్ స్వాగతం పలికి కొండపల్లి బొమ్మను బహూకరించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. ఏపీలో పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి నేతృత్వంలో పార్టీకి పూర్వ వైభవం వస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

ప్రాథమిక పాఠశాలలకు నూతన ఉపాధ్యాయ సంఘం

» ఎస్‌జీటీ పేరును ప్రైమరీ గ్రేడ్ టీచర్స్‌గా మార్చాలని డిమాండ్

బర్కత్‌పుర, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయ సంఘం(పీఎస్‌టీయూ) నూతనంగా ఆవిర్భవించింది. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆవిర్భావ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా శిరందాసు రామదాసు, ప్రధాన కార్యదర్శిగా పి.రవికుమార్, కోశాధికారిగా పానుగంటి నర్సింహాచారి, ఉపాధ్యక్షుడిగా కె.విద్యాసాగర్‌రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడిగా డాక్టర్ వేద ప్రసాద్‌జోషి, మహిళా కార్యదర్శిగా ఎల్.భవాని, కార్యదర్శిగా కె.గిరిబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు శిరందాసు రామదాసు మాట్లాడుతూ.. ఎస్‌జీటీ పేరును ప్రైమరీ గ్రేడ్ టీచర్స్‌గా మార్చాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు ఓటు హక్కు కల్పించాలన్నారు.

రాష్ట్ర అస్తిత్వాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం దెబ్బతీస్తోంది

» తెలంగాణ తల్లి కోసం మరో పోరాటం: ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ అస్తిత్వాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం దెబ్బతీస్తోందని, ఈ చర్యలను తెలంగాణ సమాజం సమష్టిగా అడ్డుకోవాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. తెలంగాణ తల్లి నుంచి బతుకమ్మను దూరం చేసిన సీఎం రేవంత్ రెడ్డి.. ఈ ప్రాంత మహిళలను, పండుగలను అవమానించారని ఆరోపించారు. బీఆర్ఎస్, తెలంగాణ జాగృతి ఎన్ఆర్ఐ విభాగాల ప్రతినిధులతో ఆదివారం ఆమె జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్ణయించిన రూపం కాకుండా.. గతంలో రూపొందించిన విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని పలు గ్రామాల నుంచి విజ్ఞప్తులు వస్తున్నాయని తెలిపారు. కాంగ్రెస్ సర్కారు దుశ్చర్యతో.. ఉద్యమ తెలంగాణ తల్లి కోసం మరో పోరాటం చేయాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు.

నల్లగొండ ఫ్లోరైడ్ సమస్యను తీర్చిందే కేసీఆర్: బీఆర్ఎస్

బీఆర్ఎస్ పాలనలో నల్లగొండ జిల్లాకు కేసీఆర్ ఏం చేయలేదని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలు శుద్ధ అబద్ధాలని బీఆర్ఎస్ నేతలు గ్యాదరి కిషోర్‌కుమార్, కోటిరెడ్డి, బడుగుల లింగయ్యయాదవ్, బూడిద భిక్షమయ్యగౌడ్ అన్నారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో వారు మీడియాతో మాట్లాడుతూ.. యాదాద్రి థర్మల్ ప్లాంటు, సాగునీటి కాళేశ్వరం నీళ్లు తేవడమే కాకుండా కేసీఆర్ మిషన్ భగీరథ పథకం చేపట్టి ఏళ్ల తరబడి నల్లగొండ జిల్లాను పట్టి పీడిస్తున్న ఫ్లోరైడ్‌ను తరిమి కొట్టారని చెప్పారు. తుంగతుర్తికి కాళేశ్వరం నీళ్లు తెచ్చిన అంశంపై కోమటిరెడ్డి చర్చకు సిద్ధమా? అని ప్రశ్నించారు.

నేటి నుంచి ఏబీవీపీ 43వ రాష్ట్ర మహాసభలు

» సిద్దిపేటలో నిర్వహణ.. ఏర్పాట్లు పూర్తి

సిద్దిపేట క్రైం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా కేంద్రంలో మూడు రోజుల పాటు అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) 43వ రాష్ట్ర మహాసభలు జరగనున్నాయి. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి చింతకాయల ఝాన్సీ తెలిపారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం సమీపంలో జరిగే మహాసభలను రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సోమవారం ప్రారంభిస్తారని చెప్పారు. ఆదివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో విలేకరులతో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమానికి ఏబీవీపీ జాతీయ కార్యదర్శి ఆశిష్ చౌహా, రాష్ట్ర నలుమూలల నుంచి 1,500 మంది వరకు ప్రతినిధులు హాజరవుతారని పేర్కొన్నారు. ఈ మహాసభలలో మొదటి సెషన్‌లో డ్రగ్స్ ఫ్రీ క్యాంపస్ కార్యక్రమం పేరిట మత్తు పదార్థాల వల్ల కలుగుతున్న అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తారు. అలాగే గవర్నర్ ఆధ్వర్యంలో ఏబీవీపీ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులతో పాటు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంటారు.

ప్యాకేజ్డ్ విషం!



(మొదటిపేజీ తరువాయి)

గురించి డాక్టర్ విడమరచి చెప్పాల్సి వచ్చింది. చిన్నారుల విషయంలో తల్లిదండ్రులు చేస్తున్న పొరపాట్లు ఒక్క ఉద్యోగస్తులైన దంపతులకే పరిమితం కాలేదని, దాదాపుగా అందరూ ప్యాకేజ్డ్ ఆహారం వైపే మొగ్గుచూపుతున్నారని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బ్రాండెడ్ ఉత్పత్తులనే పిల్లలకు తినిపిస్తామని చెప్పే తల్లిదండ్రులు.. వాటి లేబుల్స్‌ను మాత్రం పరిశీలించడం లేదంటున్నారు. ఆయా ఆహార పదార్థాల్లో ఉండే చక్కెర, ఉప్పు, కొవ్వులు, పిండిపదార్థాలు పిల్లల్లోకి వెళ్లి.. వారు అనారోగ్యం బారిన పడుతున్నారని పేర్కొంటున్నారు. "చాలా మంది తల్లిదండ్రులు కార్న్‌ఫ్లేక్స్‌లో కొవ్వు తక్కువగా ఉంటుందనుకుంటారు. కానీ, చక్కెర, పిండిపదార్థాల గురించి పట్టించుకోరు. చక్కెర వల్ల కొవ్వు నిల్వ అయ్యే ప్రమాదాలున్నాయి. బ్రెడ్ కాకుండా చాలా మంది బ్రౌన్ బ్రెడ్ మంచిదనుకుంటారు. అందులోనూ రిఫైన్డ్ పిండిని వాడడం వల్ల క్యాలరీలు, కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉంటాయి. ఒంటికి అవసరమయ్యే మాంసకృత్తులు(ప్రొటీన్లు), పీచుపదార్థాలు(ఫైబర్) తక్కువగా ఉంటాయి. ఇలాంటి ఆహారం తినడం వల్ల చిన్నారుల్లో ఊబకాయం, మధుమేహం, గుండె సమస్యలు వస్తాయి" అని హెచ్చరిస్తున్నారు. 2017లో నిర్వహించిన ఓ సర్వే ప్రకారం.. దేశంలోని 93% మంది చిన్నారులు ప్యాకేజ్డ్ ఆహారం తింటున్నారు. చక్కెర ఎక్కువ మోతాదులో ఉండే పానీయాలను 68% మంది సేవిస్తున్నారని తేలింది. ఇంపీరియల్ కాలేజ్ ఆఫ్ లండన్ ప్రొఫెసర్ నీనా మోదీ కొవిడ్‌కు ముందు జరిపిన అధ్యయనంలో భారత్‌లో 10 ఏళ్లలోపు వారిలో ప్రతి ముగ్గురిలో ఒకరు ఊబకాయులని, ఐదేళ్లలోపు పిల్లల్లోనూ ప్రతి ముగ్గురిలో ఒకరికి దంతక్షయం ఉందని వెల్లడైంది. సాధారణం కంటే మూడు రెట్ల అధిక మోతాదులో చక్కెర తీసుకోవడమే ఇందుకు కారణమని ఆమె తన అధ్యయనంలో పేర్కొన్నారు. "చిన్నారులు రోజుకు మూడు లేదా నాలుగు టీస్పూన్ల(15-20 గ్రాములు)ను మించకుండా చక్కెర తీసుకోవచ్చు. అయితే.. 100 గ్రాముల కార్న్‌ఫ్లేక్స్ అల్పాహారంగా తీసుకుంటే.. అందులోనే 15-16 గ్రాముల వరకు చక్కెర, ఫ్రక్టోజ్, గ్లూకోజ్, మాల్టోజ్ ఉంటాయి. ఫ్లేవర్డ్ మిల్క్, ఇతర స్వీట్లు, చిరుతిళ్లను పరిగణనలోకి తీసుకుంటే..16 టీస్పూన్ల కంటే ఎక్కువ చక్కెర తీసుకుంటున్నట్లే"అని పోషకాహార నిపుణురాలు సాఫియా వివరించారు.

భారత్‌లో 'ప్యాకేజ్డ్' దారుణం

గత ఏడాది ఆక్స్‌ఫర్డ్ వర్సిటీ తరఫున న్యూట్రిషన్ విద్యార్థి శ్రీజ భారత్, అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా, చైనా, చిలీ వంటి 12 దేశాల్లో ప్యాకేజ్డ్ ఆహారం, పానీయాలపై అధ్యయనం చేశారు. భారత్‌లో అత్యంత అనారోగ్యకరమైన రీతిలో ప్యాకేజ్డ్ ఆహారాన్ని ఉత్పత్తి చేస్తున్నట్లు ఈ అధ్యయనంలో వెల్లడైంది. జార్జ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ గ్లోబల్ హెల్త్, ఆస్ట్రేలియన్ హెల్త్‌స్టార్ రేటింగ్ సిస్టమ్ ఫర్ అసెస్‌మెంట్‌తో కలిసి శ్రీజ ఇచ్చిన రేటింగ్స్‌లో.. భారత్ అట్టడుగున ఉండడం గమనార్హం..!

ఇంటి ఆహారమే మేలు



ఒక గ్రాము చక్కెరతో శరీరానికి 4కిలో క్యాలరీలు అందుతాయి. మనిషి ఎత్తు, బరువును బట్టి తీసుకునే చక్కెరను నియంత్రించుకోవాలి. వ్యాయామాలు, శారీరక శ్రమ ద్వారా తీసుకునే చక్కెరను కరిగించవచ్చు. కానీ, చిన్నారులు వీటికి దూరంగా ఉంటారు. అందుకే.. వారు రోజుకు 20 గ్రాములకు మించి చక్కెర తీసుకోకూడదు. స్వీట్ తినాలనిపించినప్పుడు వారికి తాజా పళ్లు, కిస్‌మిస్, ఖర్జూరం, అంజూర, డ్రైఫ్రూట్స్, అరటిపళ్లను ఇవ్వొచ్చు. ఇంట్లో తయారు చేసే ఆహారానికి ప్రాధాన్యం ఇవ్వాలి. ప్యాకేజ్డ్ ఆహారాన్ని త్యజించాలి.

- ఎం.గాయత్రి, డైటిషన్, అపోలో ఆస్పత్రి

జాగ్రత్తలే శ్రీరామ రక్ష



తీసుకునే ఆహారం విషయంలో జాగ్రత్తలే.. ఆరోగ్యం పాలిట శ్రీరామరక్షగా ఉంటాయి. ఇంట్లో తయారు చేసుకునే ఆహారంలో చక్కెర తక్కువగానే ఉంటుంది. ప్యాకేజ్డ్ ఆహారంలో నిగూఢ(హిడెన్/యాడెడ్) చక్కెర, ఉప్పు అధికంగా ఉంటాయి. ఇలా ఎక్కువ మొత్తంలో చక్కెర కారణంగా పిల్లల్లో హైపర్‌యాక్టివిటీ పెరిగి, ఏకాగ్రతను కోల్పోతారు. చిన్నారుల్లో ఊబకాయ లక్షణాలు మొదలయ్యాయంటే.. ఫ్యాటీలివర్ సమస్య, టైప్-2 మధుమేహం రిస్క్ పెరుగుతుందని అర్థం చేసుకోవచ్చు. కొవ్వు పదార్థాలు పేరుకుపోవడానికి చక్కెర ఓ కారణం కావడంతో గుండె సమస్యలు కూడా తలెత్తుతాయి.

- లీనతారెడ్డి, పెడియాట్రిక్ ఎండోక్రైనాలజీ కన్సల్టెంట్, రెయిన్‌బో ఆస్పత్రి

వ్యాధులను కొనితెచ్చుకుంటున్నారు

- చక్కెర ఎక్కువ మొత్తంలో తీసుకుంటే.. కాలేయంపై ఒత్తిడి పెరుగుతుంది. చిన్నారుల్లో ప్యాకేజ్డ్ ఆహారం వల్ల మధుమేహం వస్తుందనడానికి శాస్త్రీయ ఆధారాల్లేకున్నా.. ఫ్యాటీలివర్ వంటి సమస్యలు మాత్రం తీవ్రంగా ఉంటున్నాయని వైద్యులు చెబుతున్నారు
- అధిక చక్కెర శరీరంలో భౌతికంగా ప్రతికూలతలను చూపుతుంది. మెదడులో డోపమైన్ విడుదల పెరిగి, రక్తంలో చక్కెర స్థాయి నియంత్రణకు ఇన్సులిన్ కూడా ఎక్కువగా విడుదలవుతుంది. అధిక చక్కెరను తీసుకోవడానికి అడ్డుకట్ట వేయకుంటే.. 'ఇన్సులిన్ రెసిస్టెన్స్' పెరిగి, మధుమేహానికి కారణమవుతుంది
- చిన్నారుల్లో ఊబకాయానికి పరిమితికి మించిన చక్కెర ఓ కారణమని వైద్యులు చెబుతున్నారు
- ఒక చెంచా కెచప్‌లో.. ఒక చెంచా చక్కెర ఉంటుంది. నిజానికి రోజువారీ క్యాలరీల్లో చక్కెర వాటా 10శాతాన్ని మించకూడదు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఏకంగా దీన్ని 5శాతానికి పరిమితం చేయాలని సూచిస్తోంది.
- అధిక చక్కెర వల్ల పిల్లల్లో కడుపునొప్పి, అలర్జీలు, ఆస్తమా వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయి
- మెదడులో హిప్పోక్యాంపస్ దెబ్బతిని, బుద్ధిమాంద్యానికి దారితీస్తుంది. పిల్లల్లో జ్ఞాపకశక్తి తగ్గడం, త్వరగా నేర్చుకోలేకపోవడం వంటి దుష్పరిణామాలు ఎదురవుతాయి
- కంటి చూపు పైనా చక్కెర దుష్ప్రభావాలుంటాయి
డైట్ అత్యంత ముఖ్యం
- ఇండియన్ అకాడమీ ఆఫ్ పిడియాట్రిక్స్ ప్రకారం భోజనం ద్వారా లభించే క్యాలరీలను విభజిస్తే.. కొవ్వు పదార్థాలు 15-30%, పిండిపదార్థాలు 55-75% కంటే ఎక్కువగా ఉండకూడదు. ఇక మాంసకృత్తులు 10-15% తప్పనిసరిగా ఉండాలి. అంతకంటే 5-10% మించిన సమస్య ఉండదు. చక్కెర మాత్రం 5% కంటే తక్కువగా ఉండాలి.
- ఉప్పు విషయానికి వస్తే.. సంవత్సరం లోపు పిల్లలు రోజుకు ఒక గ్రాము లోపు మాత్రమే తీసుకోవాలి. 1-3 సంవత్సరాల పిల్లలకు 2 గ్రాముల్లోపు, 4-6 సంవత్సరాల పిల్లలకు 3 గ్రాముల్లోపు, 11 ఏళ్లు దాటిన పిల్లలకు 6 గ్రాముల వరకూ ఉప్పు అందవచ్చు.
- చిన్నవయసులో ఉప్పు, చక్కెరలను ఎంతగా తగ్గిస్తే.. భవిష్యత్ ఆరోగ్యం అంత బాగుంటుంది. లేకుంటే.. భావి పౌరులు అనారోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు

పీవీ సేవలు చిరస్మరణీయం

» సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వినూత్న సంస్కరణలతో దేశ ఆర్థిక ప్రగతికి దిశానిర్దేశం చేసిన బహుభాషా కోవిదుడు, మాజీ ప్రధాని పాములపర్తి వెంకట నరసింహారావు (పీవీ) చిరస్మరణీయులని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. సోమవారం పీవీ వర్ధంతిని పురస్కరించుకొని.. ఆదివారం 'ఎక్స్' వేదికగా ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ప్రధానిగా, ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రిగా, కేంద్రమంత్రిగా.. దేశ ప్రగతికి, రాష్ట్ర అభ్యున్నతికి ఆయన పాటుపడ్డారని వెల్లడించారు.

సమ్మక్క సారక్క ప్రాజెక్ట్ నిర్మాణానికి ఛత్తీస్‌గఢ్‌ను ఒప్పించండి

» అధికారులకు మంత్రి ఉత్తమ్ ఆదేశాలు

హైదరాబాద్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సమ్మక్క-సారక్క ప్రాజెక్టు నిర్మాణానికి ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాన్ని ఒప్పించాలని, ఇందుకోసం ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అధికారులకు సూచించారు. ఆదివారం ఉదయం జలసౌధలో ఆయన శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సమ్మక్క-సారక్క ప్రాజెక్టు విషయంలో కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ) లేవనెత్తిన అంశాలను సత్వరమే నివృత్తి చెయ్యాలని అధికారులకు సూచించారు. ఈ ప్రాజెక్టు కారణంగా ఛత్తీస్‌గఢ్‌లో ముంపు సమస్యను పరిష్కరించడానికి వీలుగా చెల్లించబోయే నష్ట పరిహారంపై ఆ ప్రభుత్వంతో సంప్రదింపులు జరపాలని ఆదేశించారు. ఆరు లక్షల కొత్త ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు చేపట్టిన ఈ ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన భూసేకరణను 2025 మార్చి నాటికి పూర్తి చేయాలన్నారు. అలాగే.. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం ప్రాజెక్టులపై జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ (ఎన్‌డీఎస్‌ఏ) నుంచి తుది నివేదికను త్వరితగతిన తెప్పించాలని అధికారులను ఆదేశించారు. కాగా, ఆనకట్టలు, కాలువల భద్రతకు అవసరమైన 1800 మంది లష్కరుల నియామకాలు వెంటనే పూర్తి చేయాలని మంత్రి ఉత్తమ్ సూచించారు. దీనిపై ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా స్పందిస్తూ.. ఈ ప్రక్రియను ఇప్పటికే పూర్తిచేశామని, ఆర్థికశాఖ అనుమతులు పొందాల్సి ఉందని చెప్పారు.

కొత్త పాఠకులు వస్తున్నారు..

ఆదివారం కిక్కిరిసిన హైదరాబాద్ పుస్తక ప్రదర్శన ప్రాంగణం

» ఒక్కరోజే 90వేలకు పైగా సందర్శకులు

» ఈ-కాలంలోనూ అచ్చు పుస్తకానికి 'జై' కొడుతున్న యువతరం

హైదరాబాద్ సిటీ, డిసెంబరు22(ఆంధ్రజ్యోతి): "ఈ కాలంలో పుస్తకాలు చదివే ఓపికెవరికుంది అండి.! కొన్నాళ్లపోతే అచ్చు పుస్తకాలను ఆర్కైవ్స్‌లో చూడాలేమో" లాంటి నిరాశ, నిస్పృహతో నిండిన వ్యాఖ్యానాలను తరుచుగా వినిపిస్తున్న ప్రస్తుత సమయంలో మరో వందేళ్లు అయినా 'పుస్తకం చిరంజీవి' అన్న ఆశావాహాన్ని కల్పిస్తోంది హైదరాబాద్ పుస్తక మహోత్సవం. అది ప్రారంభమైన మూడు రోజుల్లో 1.5లక్షలమంది సందర్శించారు. ఆదివారం పుస్తకాల పండుగ ప్రాంగణమంతా జనసందోహాన్ని తలపించింది. 300కుపైగా పుస్తక స్టాళ్లన్నీ పాఠకులతో కిక్కిరిశాయి. ఒక్కరోజే 90వేలమందికిపైగా బుక్ ఫెయిర్‌లో పాల్గొన్నట్లు ఆ సొసైటీ అధ్యక్షుడు యాకూబ్ చెప్పారు. సెలవు కావడంతో పిల్లలతో సహా సకుటుంబ సపరివార సమేతంగా పిక్నిక్‌కు తరలినట్టుగా ఎన్టీఆర్ మైదానంలోని దాశరథి ప్రాంగణంవైపు కదిలారు. స్టాళ్లలో పిల్లలకు తల్లిదండ్రులు దగ్గరుండిమరీ పుస్తకాలను పరిచయం చేస్తుండడం కనిపించింది.

విద్యార్థుల కోలాహలం

పుస్తకాల పండుగకు నగరం నలుమూలల నుంచి మాత్రమే కాదు, జిల్లాల నుంచి విద్యార్థులు తరలివచ్చారు. కల్వకుర్తి, జనగాము, నల్గొండ, మహబూబ్‌నగర్, కోదాడ తదితర ప్రాంతాలకు చెందిన ప్రైవేటు, ప్రభుత్వ, గురుకులాల విద్యార్థులు ప్రతి పుస్తకాల స్టాల్‌ను సందర్శించి, అందులో వారిని ఆకట్టుకున్న పుస్తకాల పేర్లతో సహా నోట్స్ తయారుచేసుకున్నారు. తర్వాత ఒకరికొకరు చర్చించుకొని మరీ పుస్తకాలు కొనుగోలుచేయడం విశేషం. అలా పుస్తక ప్రదర్శనలో కనిపించిన కల్వకుర్తి అక్షరవనం విద్యార్థినులను 'ఆంధ్రజ్యోతి' పలకరించగా... సుధామూర్తి రచనలకు తామంతా అభిమానులమని, ముఖ్యంగా 'ది మ్యాజిక్ ఆఫ్ ది లాస్ట్ టెంపుల్' ఆంగ్ల నవల చాలా ఇష్టమని వారంతా చెప్పారు. రస్కిన్ బాండ్ రచనలన్నా చాలా ఇష్టమని మరికొందరు వెల్లడించారు. నేషనల్ బుక్‌ట్రస్ట్, మంచిపుస్తకం తదితర తెలుగు ప్రచురణల స్టాళ్లతోపాటు కాల్పనిక ఆంగ్ల సాహిత్యంపట్ల ఎక్కువ మంది ఆసక్తి కనబరచడం విశేషం. కొత్తపాఠకులు వస్తున్నారనడానికి ఇంతకువించిన ఉదాహరణ మరొకటి ఉంటుందా.?


పుస్తక ప్రదర్శనకు వచ్చిన పాఠకులు

అమ్మకాలు ఊపందుకున్నాయి...

పుస్తక ప్రదర్శనకు వచ్చేవారిలో కొనేవారే ఎక్కువ అనడానికి, పుస్తకాల అమ్మకాలే సాక్ష్యం. రైటర్స్ హాల్లోని ఒక చిన్నటేబుల్ నిర్వాహకులు శనివారం రూ.5వేల విలువైన పుస్తకాలు విక్రయించినట్లు చెప్పారు. నవతెలంగాణ, నవోదయ, ఎమెస్కో వంటి స్టాళ్ల సంగతి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అయితే, మొత్తం అమ్మకాల శాతాన్ని పదిరోజుల తర్వాతే అంచనావేయగలమని నవోదయ కోటేశ్వరరావు చెబుతున్నారు. యోగద సత్సంగ సొసైటీ ఆఫ్ ఇండియా, శివానంద సుపథ ఫౌండేషన్, రామకృష్ణ మఠం తదితర ఆధ్యాత్మిక పుస్తకాలయాలు, జిడ్డు కృష్ణమూర్తి, విశ్వనాథ సత్యనారాయణ, చలం, బాలగోపాల్, కత్తిపద్మారావు తదితరుల రచనలకు ఆదరణ లభిస్తోంది. పుస్తక జ్ఞానాన్ని పొందాలన్న జిజ్ఞాస యువతరంలో ప్రబలంగా ఉన్నదనడానికి పుస్తక మహోత్సవానికి వస్తోన్న ఆదరణ ద్వారా నిరూపితమవుతుంది.

'డిజిటల్'తో వెసులుబాటున్నా..



మా అమ్మ మంచి సాహిత్యాభిమాని. దాంతో నాకు కూడా చిన్నప్పటి నుంచి పుస్తకాలు చదవడం చాలా ఇష్టం. ఏటా నాకు ఇష్టమైన పుస్తకాలు కొనడానికి వరంగల్ నుంచి హైదరాబాద్ బుక్‌ఫెయిర్‌కు కొంటున్నాను. ట్యాబ్ ఒక్కటి వెంట పెట్టుకుంటే, అందులో వెయ్యి పుస్తకాలు మనచేతిలో ఉన్నట్టేకదా.! అయినా, అచ్చు పుస్తకం చదవడానికే ఇష్టపడతాను. చేతిలో పుస్తకాన్ని పట్టుకున్నప్పుడు కలిగే అనుభూతి ఈ-బుక్స్ చదువుతున్నప్పుడు రాదు.

- మౌక్తిక, ఇంజనీరింగ్ విద్యార్థిని, వరంగల్

ఆలోచనా తీరులో మార్పు...



ఆరేళ్ల కిందట నేను ఈ బుక్ ఫెయిర్‌కు రాకముందు వరకు, నాకు కేవలం అతికొద్దిమంది రచయితలు, వారి రచనలు మాత్రమే తెలుసు. ఇక్కడికి రావడం ప్రారంభించాక నా ఆలోచనా తీరే మారింది. తాత్విక, మనోవైజ్ఞానిక, సామాజిక, ఆధ్యాత్మిక రచనలెన్నో నాకు ఇక్కడ పరిచయం అయ్యాయి. సంక్రాంతికి ఊరెళ్లడమైనా మానతానేమోగానీ, హైదరాబాద్ బుక్ ఫెయిర్‌కు మాత్రం రావడం మానను. ఇక్కడి వాతావరణం వృత్తిరీత్యా నాకెంతో దోహదపడింది కూడా.

- కిరణ్, వర్ధమాన సినిమా రచయిత

ఐఐటీహెచ్‌లో ఆవిష్కరణల సందడి

వినూత్న ప్రాజెక్టులు ప్రదర్శించిన ప్రముఖ విద్యాసంస్థల విద్యార్థులు

కంది, డిసెంబరు22 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీ హైదరాబాద్ (ఐఐటీహెచ్) వినూత్న ఆవిష్కరణల ప్రదర్శనకు వేదికైంది. మేకర్ భవన్ ఫౌండేషన్, ఐఐటీ హైదరాబాద్ స్టార్టప్ సంస్థ ఐటీఐసీ ఇంక్యుబేటర్ సంయుక్తంగా విశ్వకర్మ అవార్డ్స్-2024 అందజేసేందుకు నిర్వహించిన పోటీల్లో దేశవ్యాప్తంగా ప్రముఖ విద్యా సంస్థలకు చెందిన యువవిద్యార్థి ఆవిష్కర్తలు పాల్గొన్నారు. నీరు-పారిశుధ్యం, గ్రీన్-టెక్నాలజీ, స్మార్ట్-మొబిలిటీలపై తాము అభివృద్ధి చేసిన ప్రాజెక్టులను ఆదివారం ప్రదర్శించడంతో ఐఐటీహెచ్ ప్రాంగణం సందడిగా మారింది.


హైడ్రో పోనిక్ హార్వెస్టర్ గురించి వివరిస్తున్న చిట్కార యూనివర్సిటీ ఆవిష్కర్తలు

ఇంటిలోపలే కూరగాయలు పండించొచ్చు..

ఇంటి పరిసరాలు, కార్యాలయాల్లో ఎక్కడైనా కూరగాయలు పండించే హైడ్రోపోనిక్ హార్వెస్టర్‌ను చండీగఢ్‌కు చెందిన చిట్కార యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విద్యార్థులు హేమంత్, సర్దార్, కృషిస్‌లు రూపొందించారు. తక్కువ నీరు వినియోగించి ఎక్కువగా కూరగాయలు పండించేలా దీన్ని తయారుచేశారు. 10 గజాల స్థలంలో 100 కిలోల కూరగాయలు, ఆకుకూరలు పండేలా ప్లాంటేషన్ ప్రాజెక్టును రూపొందించారు. ప్లాస్టిక్ పైపులకు రంధ్రాలు చేసి వాటిలో మొక్కలునాటారు. పొలాల్లో కూరగాయల సాగుకు వినియోగించే నీటిలో 20శాతం మాత్రమే ఈ హైడ్రో పోనిక్ పద్ధతికి సరిపోతుందని వారు తెలిపారు. వంటింట్లో, బట్టలుతికిన తర్వాత పారబోసే మురికి నీటిని మళ్లీ వాడేలా శుద్ధి చేసే వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను ఒడిసా యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీలో సివిల్ ఇంజనీరింగ్ చదువుతున్న హరీష్ పండా, సరస్వాల్ దాస్‌లు అభివృద్ధి చేశారు. ఇది రోజుకు 2,400 లీటర్ల మురికి నీటిని శుద్ధి చేస్తుంది. దీని ధర రూ.15వేలు. ప్రస్తుతానికి ఇది ప్రయోగదశలో ఉందని, త్వరలోనే మార్కెట్లోకి తెస్తామన్నారు. మనుషుల అవసరంలేకుండా గోదాములు, ఇతర ప్రదేశాల్లో సామాన్లు, బరువైన వస్తువులను తీసుకెళ్లడానికి బ్యాటరీతో నడిచే ఆటోమెటిక్ అటానమస్ మొబైల్ రోబోను ఐఐటీ బాంబేలో మెకానికల్ ఇంజనీరింగ్ చదివే విద్యార్థులు ఐశ్వర్య, సానీ రూపొందించారు. ఇది ఒక్కసారి 100కిలోల వరకు బరువు మోయగలదు. ఇది రైతులకు పొలాల్లో ఎంతో ఉపయోగపడుతుందని విద్యార్థులు తెలిపారు. అపార్ట్‌మెంట్లలో ఏదైనా ప్రమాదం సంభవిస్తే అంతా భయపడుతుంటారు. లోపల ఏం జరుగుతుందో తెలియని, లోపలికి వెళ్లలేని పరిస్థితి నెలకొంటుంది. ఇలాంటప్పుడు మెట్లు ఎక్కుతూ ఫొటోలు తీస్తూ సమాచారాన్ని సేకరించే మినీ రోబోను కోయంబత్తూరుకు చెందిన అమృత విశ్వవిద్యాపీఠం మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులు శ్రావణ్, కీర్తి రూపొందించారు. జీపీఎస్ ఆధారంగా అడవుల్లో, ఎత్తైన కొండల్లో ఫొటోలు తీస్తూ సమాచారాన్ని సేకరించే జియో విజన్ డ్రోన్‌ను హిమాచల్‌ప్రదేశ్‌కు చెందిన జేపీ యూనివర్సిటీ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కంప్యూటర్ సైన్స్ విద్యార్థులు సౌరవ్‌కుమార్, యష్‌త్రిపాఠి రూపొందించారు. 12మీటర్ల ఎత్తు నుంచి కూడా స్పష్టంగా ఫొటోలను తీయడం దీని ప్రత్యేకత. ప్రస్తుతం ఇది ప్రయోగ దశలో ఉంది. తుఫాన్లు, వరదలు సంభవించినప్పుడు సాయం చేసేలా ఐఐటీ బాంబేలో సివిల్, ఏరోస్పేస్ ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థులు తహకచ్‌వాలా, ప్రణవ్ రాథీ, వరశ్రీనివాస్‌లు ఎయిర్‌షిప్ డ్రోన్ రూపొందించారు.

రైతు భరోసా ఎగవేతపై ఎదిరించండి

(మొదటిపేజీ తరువాయి)

ఎన్నికల గండాన్ని దాటడం కోసం.. మాయోపాయం చేసి మమ అనిపించి.. ఆ తర్వాత పెట్టుబడి సాయానికి పూర్తిగా సమాధి కట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పుడు మేల్కోకపోతే భరోసా ఉండదు గోస మాత్రమే మిగులుతుంది' అని అన్నారు. 'అధికారంలోకి వస్తే రైతు భరోసా పేరిట రూ.15 వేలు పెట్టుబడి ఇస్తామన్నారు. ఏడాది గడిచినా దాని జాడేలేదు. ఇక సంక్రాంతి తర్వాత వేస్తామంటున్న రైతు భరోసా కొలు రైతులకు వేస్తారా? లేదా చెప్పడం లేదు. ఈ వానాకాలం పూర్తిగా ఎగ్గొట్టారు. యాసంగికి రూ.2,500 కోత వేశారు. రేవంత్ సర్కారు ఒక్కో ఎకరానికి రూ.17,500 బాకీ పడ్డది.. ఆ డబ్బులను రైతులు వదులుకోవద్దు. రాష్ట్రంలో 70 లక్షలకు పీఎం కిసాన్ రావాల్సి ఉన్నా.. 30 లక్షల మందికి కూడా దక్కడం లేదు. ఏటా లబ్ధిదారుల సంఖ్య పడిపోతోంది. చైతన్యవంతమైన తెలంగాణ రైతాంగం ఇప్పటికైనా కాంగ్రెస్ సర్కారు ఎత్తులను తిప్పికొట్టాలి. గ్రామాల్లో కాంగ్రెస్ నేతలను గల్లాపట్టి నిలదీయాలి. మేమూ.. మీతో కలిసి నడుస్తాం.. మీ ఆందోళనకు అండగా ఉంటాం'అని పేర్కొన్నారు. పాలమూరు బిడ్డనని చెప్పుకొనే.. సీఎం రేవంత్.. కృష్ణాజలాల్లో తెలంగాణ నీటి వాటా గురించి నోరు తెరవడం లేదని 'ఎక్స్' వేదికగా కేటీఆర్ ఆరోపించారు. పోతిరెడ్డిపాడు ద్వారా వందల టీఎంసీలు ఎత్తుకెళ్లినా కాంగ్రెస్‌కు పట్టడం లేదని, కాళేశ్వరం నుంచి అదనపు టీఎంసీని తరలించేందుకు కేంద్రం ఆంక్షలు విధించినా చలనం లేదని విమర్శించారు.

నేటి నుంచి ట్రాన్స్‌జెండర్లు ట్రాఫిక్ విధుల్లోకి

(మొదటిపేజీ తరువాయి)

సీపీ ఆనంద్ మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా ట్రాన్స్‌జెండర్లకు శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పించామని, మీరు అంకిత భావంతో పనిచేస్తే రానున్న రోజుల్లో ఇతర శాఖల్లో ఉద్యోగాలు ఇచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ ప్రయోగం విజయవంతమైతే దేశంలోని వివిధ రాష్ట్రాలు కూడా ట్రాన్స్‌జెండర్లకు ఉద్యోగాలిస్తాయన్నారు. ట్రాన్స్‌జెండర్లు పెళ్లిళ్లలో, దుకాణాల వద్ద డబ్బులు డిమాండ్ చేయడం, వ్యభిచారం చేయడం గమనించామని, వారికి సరైన అవకాశాలు లేకపోవడం వల్లే ఇలాంటి పరిస్థితి వచ్చిందన్నారు. గౌరవప్రదంగా సంపాదించుకునే అవకాశం కల్పిస్తే వారు మారుతారని సీఎం రేవంత్ గుర్తించి, ప్రత్యేకంగా జీవో తెచ్చారన్నారు. ముందుగా ట్రాఫిక్ విభాగంలో హోంగార్డు స్థాయిలో వీరి సేవలను వినియోగించుకుంటున్నామని తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న ట్రాన్స్‌జెండర్లు సోమవారం నుంచి విధులకు హాజరవుతారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ట్రైనింగ్ సెంటర్ అధికారులను సీపీ అభినందించారు.


బోరబండలో అర్జున్ దిష్టిబొమ్మను తగలబెడుతున్న కాంగ్రెస్ కార్యకర్తలు

అల్లు అర్జున్ ఇంటిపై దాడి

- ఆయన ఇంటిని ముట్టడించిన ఓయూ జేఏసీ నేతలు
- లోపలికి వెళ్లేందుకు యత్నం.. అడ్డుకున్న సిబ్బంది
- జేఏసీ నేతలను ఠాణాకు తరలించిన పోలీసులు

బంజారాహిల్స్/బోరబండ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): అల్లు అర్జున్ వల్ల చనిపోయిన రేవతి కుటుంబానికి.. ఆయన తక్షణమే కోటి రూపాయలు చెల్లించాలని ఓయూ జేఏసీ డిమాండ్ చేసింది. ఈ మేరకు జేఏసీ ప్రతినిధులు జూబ్లీహిల్స్‌లోని అల్లు అర్జున్ నివాసానికి చేరుకొని ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. 'అల్లు అర్జున్ డౌన్ డౌన్' అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఆయన ఇంట్లోకి చొచ్చుకుపోయేందుకు ప్రయత్నించారు. అక్కడే ఉన్న అల్లు అర్జున్ వ్యక్తిగత సిబ్బంది వారిని అడ్డుకోవడంతో కొద్దిపాటి తోపులాట చోటు చేసుకుంది. ఓయూ జేఏసీ ప్రతినిధులు అర్జున్ ఇంటిపై టొమాటోలు విసరడంతో పాటు గేటులోపల ఉన్న పూల కుండీలను ధ్వంసం చేశారు. సమాచారం అందుకున్న జూబ్లీహిల్స్ పోలీసులు అక్కడకు చేరుకొని వారిని అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆ సమయంలో జేఏసీ నేతలు.. చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న శ్రీతేజ్‌ను మెరుగైన వైద్యం కోసం అమెరికాకు తరలించాలని డిమాండ్ చేశారు. అల్లు అర్జున్ స్పందించి రేవతి కుటుంబాన్ని ఆదుకోక పోతే పెద్దఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న తమ పట్ల అల్లు అర్జున్ సిబ్బంది దురుసుగా ప్రవర్తించడం వల్లే పూల కుండీలు పగలకొట్టినట్టు వెల్లడించారు. ఈ ఆందోళనలో బైరు నాగరాజు గౌడ్, రెడ్డి శ్రీను ముదిరాజ్, బోణాల నగేష్ తదితరులు పాల్గొన్నారు. వీరిలో రెడ్డి శ్రీనివాస్ కొడంగల్ నియోజకవర్గం యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉన్నారు. కాగా.. జేఏసీ నేతలపై అల్లు అరవింద్ ఇచ్చిన ఫిర్యాదు తీసుకున్న పోలీసులు, అక్కడ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో.. అందరూ సంయమనం పాటించాలని అల్లు అరవింద్ విజ్ఞప్తి చేశారు. మరోవైపు.. సీఎం రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన అల్లు అర్జున్ వెంటనే ఆయనకు క్షమాపణ చెప్పాలని బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ డిమాండ్ చేశారు. సైట్-3 అంబేడ్కర్ విగ్రహం వద్ద అల్లు అర్జున్ దిష్టి బొమ్మను కాంగ్రెస్ కార్యకర్తలు దహనం చేశారు.

సినీ ప్రముఖుల ఇళ్లపై దాడిని ఖండిస్తున్నా: సీఎం రేవంత్

హైదరాబాద్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): అల్లు అర్జున్ ఇంటిపై ఓయూ జేఏసీ నేతల దాడి నేపథ్యంలో సీఎం రేవంత్ 'ఎక్స్' వేదికగా స్పందించారు. సినీ ప్రముఖుల ఇళ్లపై దాడి ఘటనను ఖండిస్తున్నానని ట్వీట్ చేశారు. శాంతి భద్రతల విషయంలో కఠినంగా వ్యవహరించాలని డీజీపీ, నగర పోలీసు కమిషనర్‌ను ఆయన ఆదేశించారు. ఈ విషయంలో ఎలాంటి అలసత్వాన్నీ సహించేది లేదని హెచ్చరించారు. సంధ్య థియేటర్ ఘటనతో సంబంధం లేని పోలీసు సిబ్బంది స్పందించడం తగదని, అలా ఎవరూ స్పందించకుండా ఉండేలా పోలీసు ఉన్నతాధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం సూచించారు.

దాడి శాంతి భద్రతల వైఫల్యమే: కిషన్‌రెడ్డి

సినీ హీరో అల్లు అర్జున్ నివాసంపై రాళ్ల దాడి జరగడం శాంతి భద్రతల వైఫల్యమేనని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సినీ పరిశ్రమను, కళాకారులను లక్ష్యంగా చేసుకోవడం ఆందోళనకరమని వ్యాఖ్యానించారు. అల్లు అర్జున్ ఇంటిపై దాడిని కాంగ్రెస్ స్పాన్సర్ చేసిందా? లేక మద్దతు ఇచ్చిందా? అని కిషన్‌రెడ్డి ఆదివారం ఎక్స్‌లో ప్రశ్నించారు.

శాంతిభద్రతలపై చర్యలు చేపట్టాలి: హరీశ్

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి ఆందోళనకరంగా మారిందని, అల్లు అర్జున్ నివాసంపై జరిగిన రాళ్ల దాడి ఘటన పూర్తిగా పరిపాలనా వైఫల్యానికి నిదర్శనమని మాజీమంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. హోం శాఖను కూడా నిర్వహిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి అడుగంటుతున్న శాంతిభద్రతల పరిరక్షణకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆదివారం 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

అల్లు అర్జున్ అరెస్టు సరికాదు: పురందేశ్వరి

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): సినీ హీరో అల్లు అర్జున్‌ను అరెస్టు చేయడం సరికాదని బీజేపీ ఏపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి పేర్కొన్నారు. ఆదివారం ప్రకాశం జిల్లా ఒంగోలులో ఆమె విలేకరులతో మాట్లాడారు. పుష్ప-2 విడుదల సమయంలో అల్లు అర్జున్ హైదరాబాద్‌లోని సంధ్య థియేటర్‌కు వెళ్లారని, అక్కడ చోటుచేసుకున్న తొక్కిసలాట ఆయన ప్రేరేపించింది కాదని తెలిపారు. ఈ కేసులో మిగిలిన వారిని కాకుండా ఏ-11గా ఉన్న అల్లు అర్జున్‌ను అరెస్టు చేయడం సమంజసం కాదని ఆమె అన్నారు.

ఎన్టీఆర్‌ను విమర్శిస్తే పురందేశ్వరి ఊర్కుంటారా?

- అమిత్ షా.. అంబేడ్కర్‌ను విమర్శిస్తే పట్టదా?: పొన్నం

వేములవాడ టౌన్, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): పార్లమెంట్‌లో అంబేడ్కర్‌ను విమర్శించినట్లు ఎన్టీఆర్‌ను విమర్శిస్తే ఏపీ బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి ఊర్కుంటారా అని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు. ఆదివారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్లమెంట్ వేదికగా అంబేడ్కర్‌ను కేంద్ర హోంమంత్రి విమర్శించినా పురందేశ్వరి ఏమీ జరగనట్లు మాట్లాడుతున్నారన్నారు. రాహుల్‌గాంధీపై హత్యాయత్నం కేసు నమోదు చేయడం ప్రజాస్వామ్యమా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో కక్షసాధింపు ఉండదని, అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి సినిమా థియేటర్‌లో జరిగిన సంఘటనను వివరించారని చెప్పారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ అలా స్పందించడం సరికాదని ఆయన అన్నారు.

వైద్యసేవల హబ్‌గా నిజామాబాద్ జిల్లా

- ఎంసీహెచ్, క్రిటికల్ కేర్ యూనిట్‌లను ప్రారంభించిన మంత్రి దామోదర

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు22(ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ జిల్లాను వైద్యసేవల హబ్‌గా తీర్చిదిద్దాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలో రూ.38.75 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన ఎంసీహెచ్, క్రిటికల్ కేర్ యూనిట్లను ఆదివారం ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, ధన్‌పాల్, కలెక్టర్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో నిర్వహణ పరమైన లోపాలను సరిదిద్దుకొని వచ్చే ఉగాది నాటికి వంద రోజుల ప్రణాళికతో పని తీరులో స్పష్టమైన మార్పు కనిపించేలా పని చేయాలని అధికారులకు సూచించారు.

కౌశిక్‌రెడ్డీ.. దళిత స్పీకర్‌పై ప్లకార్డులు విసురుతావా?: బల్మూరి

జమ్మికుంట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): దళిత స్పీకర్‌పై ప్లకార్డులు విసిరేసిన ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డికి దళితులపై ప్రేమ ఎక్కడ ఉందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ప్రశ్నించారు. కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. హుజూరాబాద్ నియోజకవర్గ సమస్యలపై చర్చించేందుకు ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డికి స్పీకర్ సమయం ఇస్తే దాన్ని పక్కన పెట్టి, కేటీఆర్‌కు వత్తాసు పలుకుతూ స్పీకర్‌పై ప్లకార్డులు విసరడం సిగ్గుచేటని మండిపడ్డారు.

నిర్లక్ష్యానికి సాక్ష్యాలివిగో..!

అల్లు అర్జున్‌ను థియేటర్‌కు రానివ్వొద్దని ఆదేశిస్తూ సీపీ లేఖ.. అయినా పట్టించుకోని యాజమాన్యం

మహిళ చనిపోయిందని చెప్పినా స్పందించని అర్జున్

ఏసీపీ చెప్పినా అతని మేనేజర్ పట్టించుకోలేదు

సంధ్య థియేటర్ ఘటనపై వీడియోలతో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన సీపీ ఆనంద్





పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌లో మాట్లాడుతున్న సీపీ ఆనంద్; సంధ్య థియేటర్ ముందు అల్లు అర్జున్

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పుష్ప-2 సినిమా ప్రీమియర్ షో సందర్భంగా హైదరాబాద్‌లోని సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట, మహిళ మృతిపై ఎవరి వాదనలు వారు చెబుతున్నారు. థియేటర్ వద్ద తొక్కిసలాట జరిగి ఓ మహిళ మృతి చెందిందని, బాలుడి పరిస్థితి విషమంగా ఉందని, థియేటర్ నుంచి వెళ్లిపోవాలని స్వయంగా పోలీసు ఉన్నతాధికారులు వెళ్లి అల్లు అర్జున్‌కి చెప్పినా ఆయన అక్కడి నుంచి వెళ్లలేదని సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో చెప్పారు. చివరికి పోలీసు ఉన్నతాధికారులే వెళ్లి ఆయన్ను బయటకు తీసుకెళ్లాల్సి వచ్చిందన్నారు. అలాగే ఆయన వెళ్లిపోయేటప్పుడు కూడా కారు రూఫ్ నుంచి బయటకు వచ్చి చేతులు ఊపారని సీఎం వెల్లడించారు. కానీ, అల్లు అర్జున్ మాత్రం తనకు థియేటర్ వద్ద మహిళ చనిపోయిన సంగతి ఎవరూ చెప్పలేదని మీడియా సమావేశంలో తెలిపారు. మహిళ మరణించిన విషయం మరుసటి రోజు ఉదయం 10 గంటలకు తనకు తెలిసిందన్నారు. తనపై చేసిన ఆరోపణలన్నీ అవాస్తవమని, వ్యక్తిత్వ హననం చేస్తున్నారనీ చెప్పారు. ఈ నేపథ్యంలో ఈ నెల 4న రాత్రి సంధ్య థియేటర్ వద్ద అసలేం జరిగిందనే దానిపై ఆదివారం వీడియోలతో సహా 'మినిట్ టు మినిట్' వివరాలను హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ మీడియాకు చూపారు. ఆ రోజు రాత్రి 9 నుంచి 12 గంటల వరకు జరిగిన ఘటనలను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పుష్ప-2 ప్రీమియర్ షో చూడడానికి అల్లు అర్జున్ థియేటర్‌కు రావద్దని పోలీసులు స్పష్టంగా చెప్పారన్నారు. ఆయన రాకకు అనుమతి ఇవ్వలేదని.. ఈ విషయాన్ని థియేటర్ యాజమాన్యం అర్జున్‌కు చెప్పారో, లేదో తమకు తెలియదని అన్నారు. తొక్కిసలాట ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని, న్యాయపరమైన సలహాలు తీసుకొని ముందుకెళ్తామని తెలిపారు.

బౌన్సర్ల భరతం పడతాం

ప్రస్తుతం సంధ్య థియేటర్ కేసు కోర్టు పరిధిలో ఉన్నందున ఎక్కువగా మాట్లాడలేనని సీపీ ఆనంద్ అన్నారు. అయితే వీఐపీలు, వీవీఐపీల వద్ద ఉండే బౌన్సర్లు, బౌన్సర్లను సరఫరా చేసే ఏజెన్సీలను హెచ్చరించారు. జనాన్ని అడ్డగోలుగా తోసేస్తే తాట తీస్తామని హెచ్చరించారు. బౌన్సర్లను పెట్టుకున్న వారిదే పూర్తి బాధ్యత అని స్పష్టం చేశారు. విధుల్లో ఉన్న పోలీసులను తోసినా, వారిపై చెయ్యి వేసినా వదిలిపెట్టబోమన్నారు. సంధ్య థియేటర్‌లో పోలీసులను బౌన్సర్లు తోసేసినట్లు వీడియో ఫుటేజీలు ఉన్నాయన్నారు.

10 వేల కెమెరాల ఫుటేజీని పరిశీలించాం

'సంధ్య థియేటర్ ఘటనపై అనేక రకాల వాదనలు వచ్చాయి. మా సోషల్ మీడియా బృందం శోధన చేసింది. అల్లు అర్జున్ ప్రెస్ మీట్, అసెంబ్లీలో జరిగిన చర్చపైనా మేం స్పందించాం. దాదాపు వారం రోజులుగా 10 వేల కెమెరాలు, చాలా మంది ప్రజలు తమ సెల్‌ఫోన్లలోనూ వీడియోలు తీశారు. అక్కడ ఉన్న సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు, మీడియా చానెళ్ల ద్వారా వచ్చిన బైట్స్‌ను పరిశీలించాం. అన్నింటినీ క్రోడీకరించి పది నిమిషాల వీడియోను రూపొందించాం' అని సీపీ వివరించారు.

* ఈ నెల 2న సాయంత్రం 5.35 గంటలకు సంధ్య థియేటర్ మేనేజర్ నాగరాజు ఏసీపీ కార్యాలయంలో దరఖాస్తు అందజేసి, ఆ తర్వాత ఎస్‌హెచ్‌వోకి ఇచ్చారు. 3న థియేటర్‌ను సందర్శించిన ఎస్‌హెచ్‌వో.. అల్లు అర్జున్, చిత్ర బృందం వస్తే జనం గుమిగూడే పరిస్థితి వస్తుందని భావించారు. చిత్ర బృందాన్ని రానివ్వొద్దని ఆదేశిస్తూ 4న థియేటర్ యాజమాన్యానికి లెటర్ ఇచ్చారు. ఆ పత్రాలను పీపీటీలో చూపించారు.

ఆ రోజు జరిగింది ఇదీ..

* ఈ నెల 4న రాత్రి 9.15 గంటలకు అల్లు అర్జున్ మామ, కూతురు పార్చ్యూనర్ కారులో థియేటర్ లోపలికి వచ్చారు. (వీడియో చూపారు)

* ఆ తర్వాత అల్లు అర్జున్ కారు లోపలికి వచ్చేందుకు గేట్ తెరవడంతో జనం ఒక్కసారిగా లోపలికి వచ్చారు. దీంతో తొక్కిసలాట లాంటి పరిస్థితి నెలకొంది. (పోలీసులు వీడియో చూపారు)

* ఆ తర్వాత నల్లరంగు స్కార్పియో కారులో అల్లు అర్జున్ కొడుకు వచ్చాడు. (వీడియో ఉంది)

* రాత్రి 9.25 గంటల తర్వాత రేవతి, ఆమె కుమారుడు శ్రీతేజ థియేటర్ గేటు నుంచి లోపలికి వచ్చారు. (వీడియో ఉంది)

* సుమారు రాత్రి 9.28 నుంచి 9.34 గంటల సమయంలో ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని మెట్రో స్టేషన్, సంధ్య థియేటర్ వరకు కార్ సన్‌రూఫ్ నుంచి బయటకు వచ్చిన అల్లు అర్జున్ అక్కడి ప్రజలకు చేతులు ఊపుతూ, అభివాదం చేస్తూ ర్యాలీగా వచ్చారు. జన సమూహం సంధ్య థియేటర్ వైపు కదిలింది. (వీడియో చూపారు)

* 9.35 సమయంలో దాదాపు ప్రైవేట్ సెక్యూరిటీ (బౌన్సర్లు) 40-50 మంది థియేటర్ మెయిన్ గేట్ లోపలికి ప్రవేశించారు. (వీడియో ఉంది)

* 9.35-9.40 మధ్య లోయర్ బాల్కనీకి వెళ్లే గ్రిల్ గేట్ మార్గంలో జనం పెరగడంతో గేట్ విరిగి తొక్కిసలాటకు దారి తీసింది. (వీడియో ఉంది)

* 9.40 సమయంలో అర్జున్ బౌన్సర్లు అప్పర్ బాల్కనీకి వెళ్లే మార్గాన్ని అధీనంలోకి తీసుకొని ఆయన్ని పైకి తీసుకెళ్లారు. (వీడియో ఉంది)

* పెద్దఎత్తున ప్రేక్షకులు రావడంతో లోయర్ బాల్కనీ నిండిపోయింది. ఆ సమయంలో అదే ప్రాంతంలో ఉన్న రేవతి, ఆమె కుమారుడు శ్రీతేజ స్పృహ కోల్పోయారు. (అక్కడి వీడియో చూపలేదు). అల్లు అర్జున్ అప్పర్ బాల్కనీకి చేరడంతో అతన్ని చూసేందుకు కొందరు లోయర్ బాల్కనీ నుంచి పైకి ఎక్కేందుకు ప్రయత్నించారు. (వీడియో చూపారు)

* సుమారు 9.45-9.50 మధ్య అపస్మారక స్థితికి చేరిన రేవతి, శ్రీతేజలను గుర్తించిన పోలీసులు, జనం.. థియేటర్ బయటకు తీసుకొచ్చారు. వారికి పోలీసులు సీపీఆర్ చేసిఆస్పత్రికి తరలించారు.(వీడియో ఉంది)

* 10.45 గంటల సమయంలో ఏసీపీ ఆస్పత్రి నుంచి తిరిగి వచ్చాక.. థియేటర్ బయట పరిస్థితి, రేవతి చనిపోయిన విషయం, ఆమె కుమారుడు శ్రీతేజ పరిస్థితిపై అర్జున్‌కి తెలియజేయడానికి అనేకసార్లు ప్రయత్నించినా ఆయన మేనేజర్ సంతోష్ అడ్డుపడ్డాడు. తాను తెలియజేస్తానని చెప్పాడు. అర్జున్‌ని తీసుకెళ్లాలని అతనికి చెప్పారు. (వీడియో లేదు)

* సుమారు రాత్రి 11.45 వరకు మేనేజర్ అర్జున్‌ని బయటకు తీసుకొచ్చే ప్రయత్నం చేయలేదు. దీంతో ఏసీపీ నేరుగా అల్లు అర్జున్ దగ్గరకు వెళ్లి రేవతి, శ్రీతేజల పరిస్థితి, బయట రద్దీ ఉన్న జనం గురించి చెప్పి వెళ్లిపోవాలని సూచించారు. కానీ, అల్లు అర్జున్ తాను సినిమా పూర్తయిన తర్వాతే వెళ్తానని చెప్పారు. దీంతో సీరియస్ అయిన సెంట్రల్ జోన్ డీసీపీ.. అర్జున్‌ను తీసుకొని వెళ్లాలని అతని మేనేజర్‌కు గట్టిగా చెప్పారు. మేనేజర్ పది నిమిషాలు సమయం అడగ్గా, పోలీసులు ఆలోపు థియేటర్ రూట్ క్లియర్ చేశారు. (వీడియో లేదని, వెతుకుతున్నామని చెప్పారు)

* రాత్రి 12.05 గంటల సమయంలో డీసీపీ థియేటర్ లోపలికి వెళ్లి అల్లు అర్జున్‌ని బయటకు తీసుకొచ్చారు. థియేటర్ నుంచి ఇంటికి వెళుతున్న సమయంలోనూ కారు సన్‌రూఫ్ నుంచి పైకి వచ్చిన అర్జున్.. మళ్లీ చేతులు ఊపుతూ, అభివాదం చేస్తూ ముందుకు కదిలారు. ఆ సమయంలోనూ థియేటర్ ఎదురుగా రోడ్లపై విపరీతమైన రద్దీ నెలకొంది. (వీడియో ఉంది)

సినిమా చూశాకే వెళ్తానన్నారు: ఏసీపీ

అల్లు అర్జున్ మేనేజర్ సంతోష్ దగ్గరకెళ్లి తొక్కిసలాట విషయం చెప్పామని చిక్కడపల్లి ఏసీపీ రమేష్ కుమార్ తెలిపారు. 'మీరు థియేటర్‌కు వచ్చిన సమయంలో తొక్కిసలాట జరిగింది. దానివల్ల ఒక మహిళ చనిపోగా, బాలుడి పరిస్థితి విషమంగా ఉంది. ఇక్కడి నుంచి వెళ్లిపోవాలి' అని చెప్పామన్నారు. మేనేజర్ తమను అల్లు అర్జున్ వద్దకు వెళ్లనివ్వలేదని చెప్పారు. అతి కష్టం మీద వారిని నెట్టుకుంటూ వెళ్లి అల్లు అర్జున్‌కు విషయం చెప్పామని, అయినా సినిమా చూసిన తర్వాతే వెళ్తామని ఆయన చెప్పారని వెల్లడించారు. డీసీపీ ఆదేశాల మేరకు అల్లు అర్జున్‌ను థియేటర్ లోపలి నుంచి బయటకు తీసుకొచ్చినట్లు వివరించారు.

15 రోజులుగా మనశ్శాంతి లేదు

'తొక్కిసలాటలో రేవతి చనిపోవడం చాలా బాధాకరం. 15 రోజుల నుంచి దీని గురించే బాధ పడుతున్నా. మనఃశాంతి లేదు' అంటూ చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ సీఐ రాజునాయక్ కన్నీటిపర్యంతమయ్యారు. సంధ్య థియేటర్ వద్ద జరిగిన ఘటనలో ఒక ప్రాణాన్ని కాపాడలేకపోయాన్న బాధ ఉందన్నారు. తన చేతుల్లోనే ఆమె ప్రాణం పోయిందని వాపోయారు. తనకు ఇచ్చిన లేఖలోనే ప్రీమియర్ షోకు చిత్ర బృందం రావద్దని ఆదేశిస్తూ థియేటర్ యాజమాన్యానికి తెలియజేశానన్నారు.

సినిమా ప్రమోషన్ కాదు.. పౌరుల భద్రతే ముఖ్యం

- మేం ఎవరికీ వ్యతిరేకం కాదు: డీజీపీ



కరీంనగర్ క్రైం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పౌరుల భద్రత కంటే సినిమా ప్రమోషన్ ముఖ్యం కాదని రాష్ట్ర డీజీపీ జితేందర్ స్పష్టం చేశారు. ఆదివారం ఆయన కరీంనగర్‌లో పోలీసు శాఖ ఏర్పాటు చేసిన భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. అల్లు అర్జున్ సినిమా హీరో అయినప్పటికీ బయట సామాన్యుడేనని, క్షేత్ర స్థాయిలో పరిస్థితులను అర్థం చేసుకొని మసలుకోవాలని చెప్పారు. వ్యక్తిగతంగా తాము ఎవరికీ వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. పౌరుల భద్రత చాలా ముఖ్యమన్నారు. సంధ్య థియేటర్ ఘటన దురదృష్టకరమని, చట్ట ప్రకారం అల్లు అర్జున్‌పై చర్యలు తీసుకున్నామని తెలిపారు. సినీ నటుడు మంచు మోహన్‌బాబు కుటుంబ గొడవని, వారు కొంత మారారని చెప్పారు. జర్నలిస్టుపై దాడి ఘటనలో మోహన్‌బాబుపై కేసు నమోదు చేశామని, చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాష్ట్రంలో నక్సలిజం లేదని చెప్పలేదని, ఇటీవల రాష్ట్ర సరిహద్దులో ఇద్దరిని ఇన్‌ఫార్మర్ల పేరిట చంపేశారని పేర్కొన్నారు.

బెయిల్ రద్దు చేయండి!

- హైకోర్టులో నేడు పిటిషన్ వేయనున్న పోలీసులు
- అల్లు అర్జున్ విలేకరుల సమావేశం పెట్టడంపై సీరియస్
- సీఎం రేవంత్‌కు కౌంటర్.. అర్జున్‌కే తిప్పికొట్టిన ప్రెస్‌మీట్?

హైదరాబాద్, డిసెంబరు22 (ఆంధ్రజ్యోతి): సినీ హీరో అల్లు అర్జున్ పెట్టిన ప్రెస్‌మీట్ ఆయనకు చిక్కులు తెచ్చేలా కనిపిస్తోంది. సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాటలో మహిళ మృతి చెందిన కేసులో మధ్యంతర బెయిలుపై విడుదలైన అల్లుఅర్జున్ విలేకరుల సమావేశం నిర్వహించడాన్ని హైదరాబాద్ నగర పోలీసులు తీవ్రంగా పరిగణిస్తున్నారు. బెయిల్ నిబంధనలను ఉల్లంఘించి దర్యాప్తును ప్రభావితంచేసేలా మాట్లాడడంతో ఆయన బెయిలును రద్దు చేయాలంటూ హైకోర్టులో పిటిషన్ వేయడానికి పోలీసులు సిద్ధమయ్యారు. ఘటన జరిగాక ఏ పోలీసు అధికారీ తనతో మాట్లాడలేదన్న అర్జున్ వ్యాఖ్యలపైనా పూర్తి ఆధారాలను సేకరించారు. అర్జున్‌కు ఊరట లభించేలా వచ్చే నెల21వరకు మధ్యంతర బెయిల్ ఇస్తూ..విచారణలో పోలీసులకు సహకరించాలని అర్జున్‌ను హైకోర్టు ఆదేశించిన సంగతి తెలిసిందే. జ్యూడీషియల్ రిమాండ్‌లో ఉన్న అర్జున్ హైకోర్టు ఆదేశాలతో విడుదలైనప్పటికీ కేసుకు సంబంధించిన విషయాలను బహిరంగంగా మాట్లాడకూడదని న్యాయనిపుణులు చెబుతున్నారు. ఈకేసుకు సంబంధించి సీఎం రేవంత్‌రెడ్డి శాసనసభలో ఘాటుగా మాట్లాడిన తర్వాత అల్లుఅర్జున్ ఆగమేఘాల మీద విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. రేవతి మృతి విషయం ఎవరూ తనకు చెప్పలేదని, తన వ్యక్తిత్వ హననం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేసు విచారణలో ఉన్న సమయంలో దానికి సంబంధించిన విషయాలపై అర్జున్ బహిరంగంగా మాట్లాడడం తప్పని పోలీసు అధికారులు అంటున్నారు. ఈక్రమంలోనే అర్జున్‌కు ఇచ్చిన మధ్యంతర బెయిలును రద్దు చేయాలంటూ చిక్కడపల్లి పోలీసులు హైకోర్టులో సోమవారం పిటిషన్ దాఖలు చేయనున్నట్లు తెలిసింది. కాగా, అర్జున్ తన న్యాయ బృందానికి చెందిన నిరంజన్‌రెడ్డి, అశోక్‌రెడ్డి సలహామేరకే మీడియాతో మాట్లాడారని సమాచారం. శనివారం అర్జున్ మీడియాతో మాట్లాడినప్పుడు అతని పక్కనే హైకోర్టు న్యాయవాది అశోక్‌రెడ్డి కూర్చున్నారు. అసెంబ్లీలో సీఎం రేవంత్ మాట్లాడిన దానికి కౌంటర్ ఇవ్వాలని అర్జున్ పెట్టిన ప్రెస్‌మీట్ ఆయనకే తిప్పికొట్టిందని పోలీసులవర్గాల్లో చర్చ జరుగుతోంది.

శ్రీతేజ్ కోసం రూ.2 కోట్లతో ట్రస్టు!

సంధ్య థియేటర్ ఘటనలో ప్రాణాపాయ స్థితికి చేరి ప్రస్తుతం కోలుకుంటున్న శ్రీతేజ్‌ను కోసం అల్లుఅర్జున్ ఓ ట్రస్టు ఏర్పాటు చేయాలనుకుంటున్నట్లు తెలిసింది. అర్జున్, సుకుమార్, మైత్రి మూవీమేకర్స్ కలిసి దాదాపు రూ.2కోట్లను ట్రస్టులో జమచేసి అతని వైద్యం, భవిష్యత్తు కోసం ఖర్చు చేయాలనుకుంటున్నట్లు సమాచారం.

చిత్ర పరిశ్రమపై కక్ష సాధింపు సరికాదు

చట్టం చేతుల్లో ఉందని ఇష్టానుసారం వాడకూడదు


- ప్రజా సమస్యలను దారి మళ్లించేందుకే నటుడిపై సీఎం రేవంత్ వ్యాఖ్యలు
- మీ సోదరుల వల్లే చనిపోతున్నట్లు మాజీ సర్పంచి లేఖ రాసి ఆత్మహత్య చేసుకుంటే వారిని అరెస్టు చేయలేదేం?
- సీఎం రేవంత్‌ను ప్రశ్నించిన బండి సంజయ్
- ఆస్పత్రిలో శ్రీతేజ కుటుంబానికి పరామర్శ



శ్రీతేజ తండ్రి భాస్కర్‌తో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి బండి సంజయ్

హైదరాబాద్/రాంగోపాల్‌పేట, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): చిత్ర పరిశ్రమపై కక్షసాధింపు సరికాదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. సినీ హీరో అల్లు అర్జున్‌తోపాటు చిత్ర పరిశ్రమ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి కక్ష సాధింపు చర్యలను వీడాలని పేర్కొన్నారు. చట్టం చేతుల్లో ఉందని ఇష్టమొచ్చినట్లుగా వినియోగించాలని చూస్తే కేసీఆర్ ప్రభుత్వానికి పట్టిన గతే రేవంత్ సర్కారుకూ పడుతుందని హెచ్చరించారు. సీఎం వ్యాఖ్యలు అర్జున్ వ్యక్తిత్వాన్ని హననం చేసేలా, తెలుగు సినిమా పరిశ్రమను దెబ్బతీసేలా ఉన్నాయని చెప్పారు. సంధ్య థియేటర్ ఘటనలో మహిళ మరణించడాన్ని ప్రతిఒక్కరూ ఖండించారన్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమె కుమారుడు త్వరగా కోలుకోవాలని కోరుతూ ఆ కుటుంబానికి బాసటగా నిలిచారని తెలిపారు. ప్రజా సమస్యలను దారి మళ్లించేందుకు కావాలనే సీఎం ఆ సమస్యను మళ్లీ తెరపైకి తెచ్చారని ఆరోపించారు. రాజకీయ విలువలులేని మజ్లిస్ సభ్యులతో సభలో ప్రశ్న అడిగించుకుని మరీ సమాధానం ఇవ్వడం సిగ్గు చేటన్నారు. మజ్లిస్ ఐరన్ లెగ్ పార్టీ అని, అధికారంలో ఉన్న పార్టీతో అంటకాగి ఆర్థిక ప్రయోజనం పొందడం ఒవైసీ సోదరులకు అలవాటేనని చెప్పారు. బీఆర్ఎస్‌ని ఇలాగే నిండా ముంచారని, ఇప్పుడు కాంగ్రెస్‌తో జతకట్టారన్నారు. కాంగ్రెస్‌కూ బీఆర్ఎస్ గతే పడుతుందని సంజయ్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. "అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేయించిన సీఎంకు సూటి ప్రశ్న వేస్తున్నా. ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే గురుకులాల్లో విషాహారం తిని విద్యార్థులు చనిపోతుంటే మీరెందుకు బాధ్యత వహించడంలేదు? హాస్టళ్లలో పురుగుల అన్నం తిని, పాము కాటుకు గురై నిత్యం విద్యార్థులు ఆస్పత్రుల పాలవడంతోపాటు చనిపోతుంటే మీతోపాటు బాధ్యులైన వారిపై కేసులెందుకు పెట్టడం లేదు? సీఎం సోదరుల కారణంగానే ఆత్మహత్య చేసుకుంటున్నట్లు కొండారెడ్డిపల్లి మాజీ సర్పంచి లేఖ రాసి మరణించారు. మీ సోదరులను ఎందుకు అరెస్టు చేయలేదు? మీకు, మీ కుటుంబానికో న్యాయం.. ఇతరులకు మరో న్యాయమా?" అని సీఎంను సంజయ్ ప్రశ్నించారు. కాగా, కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారి శ్రీతేజను ఆదివారం సంజయ్ పరామర్శించారు. బాలుడి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. తండ్రి భాస్కర్‌తో మాట్లాడారు. చిన్నారి త్వరగా కోలుకోవాలని అమ్మవారిని కోరుకుంటున్నట్లు చెప్పారు. కాగా సినీ పరిశ్రమను అపఖ్యాతి పాల్జేసేందుకు కాంగ్రెస్, మజ్లిస్ కుట్రపన్నాయని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్ ఆరోపించారు. ఈ పార్టీలు అసెంబ్లీ వేదికగా సినిమా పరిశ్రమను అప్రతిష్టపాలుచేసేందుకు ప్రయత్నించాయన్నారు. సినీ పరిశ్రమపై సీఎం రేవంత్‌రెడ్డి విద్వేషపూరితంగా వ్యవహరించడాన్ని ఖండిస్తున్నట్టు ఓ ప్రకటనలో తెలిపారు.

రేవతి మృతికి అల్లు అర్జునే కారణం

- పోలీసులు విషయం చెప్పినా పట్టించుకోలేదు
- సీఎంకు అర్జున్ క్షమాపణ చెప్పాలి: కోమటిరెడ్డి
- సీఎంపై ఆరోపణలు తగవు: మహేశ్‌గౌడ్
- ప్రాణాల కంటే మీ ప్రతిష్ఠే ముఖ్యమా?: ఆది శ్రీనివాస్
- పేదలపై ఎందుకు ఇంత చిన్నచూపు?: ఎంపీ అనిల్
- ప్రజలకు ఏం చెబుతున్నారన్న ధ్యాసే లేదు: చామల





యాదగిరిగుట్ట రూరల్/నిజామాబాద్ అర్బన్/హైదరాబాద్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): "సినిమాహాల్‌లో జరిగిన తొక్కిసలాటలో రేవతి అనే మహిళ మృతి చెందడం బాధాకరం. రేవతి మరణించిన విషయాన్ని పోలీసులు అల్లు అర్జున్‌కు చెప్పినా పట్టించుకోకుండా సినిమా చూశారు. రేవతి మృతికి అల్లు అర్జునే కారణమయ్యారు" అని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆరోపించారు. ఈ ఘటనపై అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నది ఉన్నట్లుగా మాట్లాడితే, ఆ వ్యాఖ్యలను అల్లు అర్జున్ తప్పుపట్టడం విడ్డూరంగా ఉందన్నారు. వెంటనే ఆయన సీఎంకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. యాదగిరిగుట్టలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ఇక నుంచి సినిమా టికెట్ల ధరల పెంపు, బెనిఫిట్ షోలకు అనుమతులు ఉండవన్నారు. సినిమా థియేటర్‌లో గాయపడిన బాబును పరామర్శించేందుకు కూడా అల్లు అర్జున్ వెళ్లలేదని, పరామర్శకు లీగల్ సమస్య ఏముంటుందని ప్రశ్నించారు. చట్టం ముందు అందరూ సమానులేనని స్పష్టం చేశారు. అదే సమయంలో సినిమా పరిశ్రమకు ప్రభుత్వ సహకారం తప్పకుండా ఉంటుందన్నారు. చిత్ర పరిశ్రమను కాంగ్రెస్ పార్టీ ప్రోత్సహించిందని, అందువల్లే హైదరాబాద్‌లో పద్మాలయ, రామానాయుడు స్టూడియోలు ఏర్పాటయ్యాయని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. నిజామాబాద్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ చిత్ర పరిశ్రమపై రాష్ట్ర ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని బండి సంజయ్ వ్యాఖ్యానించడం విడ్డూరంగా ఉందని, అలాంటి ఉద్దేశం తమకు లేదన్నారు. ప్రజలను ఇబ్బందిపెడితే ఎంతటి వారైనా ప్రభుత్వం వదిలిపెట్టబోదని చెప్పారు.

ప్రాణాల కంటే పేరు, ప్రతిష్ఠలే ఎక్కువనా?

రేవతి కుటుంబంపై అల్లు అర్జున్ కనీసం సానుభూతి చూపలేదని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ధ్వజమెత్తారు. పైగా ఈ విషయంలో సీఎం రేవంత్ మాటలను తప్పు పట్టినట్లుగా అల్లు అర్జున్ తీరు ఉందని మండిపడ్డారు. అవతలి వారి ప్రాణాల కంటే ఆయనకు పేరు ప్రతిష్ఠలే ఎక్కువయ్యాయని విమర్శించారు. అల్లు అర్జున్ సినిమా చూస్తున్నప్పుడు బయట అంబులెన్స్ వచ్చి అంతా గందరగోళంగా ఉందని, అయినా ఆయనకు ఏం జరుగుతుందన్న ధ్యాస లేకుండా పోయిందని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ధ్వజమెత్తారు. పత్రికా సమావేశంలోనూ స్క్రిప్టు తీసుకుని వచ్చి చదివారని, ప్రజలకు ఏం చెబుతున్నారన్న సోయి కూడా లేదని విమర్శించారు. నిజాలు చెబితే వ్యక్తిత్వ హననం ఎలా అవుతుందని ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ ప్రశ్నించారు. అల్లు అర్జున్‌కు పేదలంటే ఎందుకంత చిన్న చూపు? అని నిలదీశారు. సినీ హీరో అంటే యువతకు రోల్ మోడల్‌గా ఉండాలని, సమాజానికి ఉపయోగపడే సినిమాలు తీయాలని హితవు పలికారు. అల్లు అర్జున్‌కు మద్దతు పలికిన కేటీఆర్.. బాధిత కుటుంబాన్ని ఎందుకు పరామర్శించలేదన్నారు. చేసిన తప్పును అల్లు అర్జున్ సరిదిద్దుకుంటే ఎవరైనా హర్షించేవారని, కానీ తనపై ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తుందంటూ హీరోయిజం చూపే ప్రయత్నం చేయడం బాధాకరమని కాంగ్రెస్ ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. కేసు కోర్టు పరిధిలో ఉన్నందున పరామర్శకు వెళ్లొద్దని చెప్పిన న్యాయ సలహాదారులు.. ప్రెస్‌మీట్ పెట్టవద్దని చెప్పలేదా? అని నిలదీశారు. ఘటనపై అల్లు అర్జున్ హావభావాల్లో ఎక్కడా బాధ కనిపించలేదని పేర్కొన్నారు. సినిమాల్లోనే కాదు.. నిజ జీవితంలోనూ హీరోలా వ్యవహరించాలని హితవు పలికారు. తెలుగోడి సత్తా చాటడమంటే.. అభిమానుల ప్రాణాలు పోయినా పట్టించుకోకపోవడమా? అని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ నిలదీశారు.



నరసింహతో కామినేని వైద్యుల బృందం

ఊపిరిపోశారు

» చిల్లుపడిన యువకుడి ఊపిరితిత్తులకు అరుదైన శస్త్రచికిత్స

» 6నెలలు వైద్యం అందించి ప్రాణదానం చేసిన కామినేని డాక్టర్లు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పక్కటెముకలు విరిగి ఊపిరితిత్తులకు చిల్లుపడటం వల్ల ప్రాణాపాయ స్థితికి చేరిన ఓ యువకుడికి కామినేని వైద్యులు ఊపిరిపోశారు. ఆరునెలల పాటు అరుదైన వైద్య చికిత్సలు అందించి రక్షించారు. ఆదివారం ఆస్పత్రి క్రిటికల్ కేర్, ఎక్మో సర్వీసెస్ నిపుణుడు డాక్టర్ బి. కిషన్ సింగ్ చికిత్స వివరాలను తెలిపారు. ఈవెంట్ మేనేజర్ అయిన నరసింహ 6నెలల క్రితం హయత్‌నగర్ సమీపంలో రోడ్డు దాటుతుండగా ఓ కారు వేగంగా వచ్చి అతడిని ఢీకొన్నది. ఈ ఘటనలో అతడి పక్కటెముకలు విరిగి ఊపిరితిత్తులకు చిల్లుపడింది. ఫలితంగా గాలి అందకపోవడంతో శరీరంలో ఆక్సిజన్ తగ్గింది. ప్రమాదంలో నరసింహ తలకు గాయాలయ్యాయి. తుంటి ఎముక కూడా విరిగింది. దీంతో నరసింహ బతికే అవకాశాలు తక్కువేనని చాలా ఆస్పత్రుల వైద్యులు చెప్పారు. చివరకు ఎల్బీనగర్‌లోని కామినేని ఆస్పత్రికి నరసింహను అతని భార్య స్వేచ్ఛ తీసుకువచ్చారు. అతన్ని పరిశీలించిన డాక్టర్లు.. ముందుగా విరిగిపోయిన ఐదారు పక్కటెముకలకు కార్డియోథొరాసిక్ శస్త్రచికిత్స చేశారు. తర్వాత మెదడుకు మూడో స్థాయి గాయాలు కావడంతో దాన్ని సరిచేయడానికి వెంటిలేటర్‌పై పెట్టి క్రిటికల్ కేర్ విభాగం నుంచి వైద్యం అందించారు. ఐసీయూలో ఉండగానే ఫిజియోథెరపీ కూడా మొదలు పెట్టి, తర్వాత పూర్తిస్థాయి రీహాబిలిటేషన్ ఇప్పించారు. ఈ చికిత్సలలో కన్సల్టెంట్ కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ రాజేశ్ దేశ్‌ముఖ్, కన్సల్టెంట్ న్యూరోసర్జన్లు డాక్టర్ జలీల్, డాక్టర్ ఎస్.రమేశ్ ఇతర బృందం పాల్గొన్నారు.

కలిసిపోయి ఉన్న కిడ్నీల మధ్యలో క్యాన్సర్ కణితి

» కీహోల్ సర్జరీతో తొలగించిన ఏఐఎన్‌యూ వైద్యులు

» ఇది అత్యంత అరుదైన శస్త్రచికిత్స అని ఆస్పత్రి వెల్లడి

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళకు పాన్‌కేక్ ఆకారంలో ఉన్న మూత్రపిండాల మధ్య ఏర్పడిన క్యాన్సర్ కణితిని కీహోల్ సర్జరీతో ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ(ఏఐఎన్‌యూ) వైద్యులు తొలగించారు. కొంపల్లి ప్రాంతానికి చెందిన 45 ఏళ్ల మహిళకు పుట్టుకతోనే రెండు కిడ్నీలు కలిసిపోయి ఉండడంతో పాటు.. వాటిలో కుడివైపు కిడ్నీ ఉండాల్సిన ప్రదేశంలో కాకుండా కింది భాగంలో ఏర్పడింది. పైగా మామూలుగా కిడ్నీ అంటే చిక్కుడు గింజ ఆకారంలో ఉంటుంది. కానీ ఈ కేసులో మాత్రం అవి పాన్‌కేక్ మాదిరిగా ఉన్నాయి. తాజాగా ఆ రెండింటికీ మధ్యలో క్యాన్సర్ కణితి ఏర్పడిందని, దానిని కీ హోల్ ప్రక్రియతో తొలగించినట్లు ఆస్పత్రికి చెందిన రోబోటిక్, యూరో ఆంకాలజీ విభాగం డైరెక్టర్ ఎస్ఎం గౌస్, ఎండీ మల్లికార్జున తెలిపారు. "కలిసిపోయిన కిడ్నీల మధ్యలో కణితి ఏర్పడితే దాన్ని కనిపెట్టడమే చాలా కష్టం. కిడ్నీలకు రక్తసరఫరా చేసే రక్తనాళాలు కూడా ఎక్కడున్నాయో గుర్తించాల్సి ఉంటుంది. ఏఐఎన్‌యూ వైద్యులు సీటీ స్కాన్ చేసి, దాన్ని ఒక సాఫ్ట్‌వేర్‌కు అనుసంధానించడం ద్వారా 3డీ ఇమేజ్ సృష్టించించారు. దాని సాయంతో అసలు కిడ్నీలు ఎక్కడెక్కడ ఉన్నాయి, వాటికి రక్తసరఫరా ఎటు నుంచి జరుగుతోంది, కణితి ఎక్కడుందన్న విషయాలను గుర్తించారు. అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగించి కీహోల్ ఆపరేషన్ చేయాలని నిర్ణయించారు" అని వివరించారు. 2వారాల క్రితం సర్జరీ చేశామని, రోగి పూర్తిగా కోలుకోవడంతో మూడో రోజునే ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేశామని తెలిపారు. పాన్‌కేక్ కిడ్నీలు ఉండడమే అరుదని, 3.75 లక్షల మందిలో ఒక్కరికి మాత్రమే ఇలా జరుగుతుందని తెలిపారు.



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న బీజేపీ ఎంపీ అరవింద్

నవోదయ స్కూళ్లకు స్థలం కేటాయించండి

» ముఖ్యమంత్రిని కోరిన బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్

» ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌తో సీఎంను కలిసిన ఎంపీ

హైదరాబాద్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్, జగిత్యాల జిల్లాల్లో నవోదయ స్కూళ్ల ఏర్పాటు కోసం 20 ఎకరాల చొప్పున స్థలాలు కేటాయించాలని సీఎం రేవంత్ రెడ్డిని బీజేపీ ఎంపీ ధర్మపురి అరవింద్ కోరారు. జూబ్లీహిల్స్‌లోని సీఎం రేవంత్ నివాసంలో ఆదివారం ఆయన్ను జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌తో పాటుగా ధర్మపురి అరవింద్ కలిశారు. ఇటీవల జగిత్యాల, నిజామాబాద్ జిల్లాల్లో నవోదయ స్కూళ్లను ఏర్పాటు చేయాలని కేంద్ర క్యాబినెట్ నిర్ణయించిన నేపథ్యంలో సీఎం రేవంత్‌ను వారు కలిసి 2 స్కూళ్లకు చెరి 20 ఎకరాల స్థలం కేటాయించాలని కోరారు. అదే విధంగా జగిత్యాలకు కేంద్రీయ విద్యాలయం మంజూరయ్యే దశలో ఉందని, దీనికి కూడా స్థల అన్వేషణ చేయాలని ముఖ్యమంత్రిని కోరారు. కాగా.. నిజామాబాద్ పరిధిలో కొనసాగుతున్న రైల్వే ప్రాజెక్టులపైనా సీఎం రేవంత్, ధర్మపురి అరవింద్ ఈ సందర్భంగా మాట్లాడుకున్నారు. మాధవ్‌నగర్ ఆర్వోబీని కేంద్రం మంజూరు చేసిందని, నిర్మాణ వ్యయాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చెరి సగం భరించాల్సి ఉందన్నారు. అడివి మామిడిపల్లి ఆర్వోబీ పూర్తిగా కేంద్ర ప్రభుత్వ నిధులతో మంజూరైందని, అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వ ఆ నిధులను ఇతర పనులకు మళ్లించారిని వివరించారు. కంట్రాక్టర్లకు బిల్లులు మంజూరు చేయాలని కోరారు. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, తాను చేసిన విజ్ఞప్తుల పట్ల సీఎం రేవంత్ సానుకూలంగా స్పందించారని ధర్మపురి అరవింద్ ఓ ప్రకటనలో వెల్లడించారు.

వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్‌ల జాబితా విడుదల

» జాతీయ స్థాయిలో వీఐటీకి 8వ ర్యాంక్

చెన్నై, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలు, విలువలు, ప్రతిభాపాటవాలతో కూడిన విద్యనందించటంలో సుస్థిరత్వాన్ని కలిగిన విశ్వవిద్యాలయాలలో వేలూరులోని వీఐటీ యూనివర్సిటీ జాతీయ స్థాయిలో ఎనిమిదో ర్యాంక్ సంపాదించుకుంది. ఇటీవల 'వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్: సస్టయినబిలిటీ 2025' పేరిట థర్డ్ ఎడిషన్ క్యూఎస్ (నాణ్యతా ప్రమాణాల) జాబితాను విడుదల చేసింది. భారతదేశం సహా ప్రపంచవ్యాప్తంగా ఉన్న 1744 విద్యాసంస్థలకు గాను వేలూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీఐటీ) 396వ ర్యాంక్ సంపాదించుకుంది. ఆ జాబితా ప్రకారం భారతదేశంలో ఈ యేడాది ఉత్తమ విద్యాసంస్థలుగా ఎంపికైన 78 విద్యాసంస్థలలో వీఐటీ 8వ అత్యుత్తమ విద్యాసంస్థగా నిలిచింది. గత ఏడాదితో పోల్చుకుంటే ప్రపంచవ్యాపంగా వీఐటీ ర్యాంక్ 53 స్థానాలను అధిగమించింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న విశ్వవిద్యాలయాలు ఐక్యరాజ్య సమితి సూచించిన 17 సుస్థిరమైన అభివృద్ధి లక్ష్యాల (ఎస్డీజీలు) సాధన దిశగా పురోగమిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా అలాంటి లక్ష్యాల దిశగా పయనిస్తున్న 400 విశ్వవిద్యాలయాలలో వీఐటీ విశ్వవిద్యాలయం కూడా ఒకటి. ఈ క్యూఎస్ సస్టయినబిలిటీ ర్యాంకింగ్ పర్యావరణ ప్రభావం, సామాజిక ప్రభావం, నిర్వహణ అనే మూడు ప్రధాన పరిమితులపై ఆధారపడి ఉంటుంది.

సంఘాలన్నీ సీపీఎస్ ఉద్యోగులను వాడుకున్నాయి

» సీపీఎస్ అంతమే టీఎస్‌సీపీఎస్‌ఈయూ పంతం

» సంఘం రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ

» సీపీఎస్ ఉద్యోగ సంఘం ఎమ్మెల్సీ అభ్యర్థిగా వెంకటస్వామి



సభలో మాట్లాడుతున్న స్థితప్రజ్ఞ

వరంగల్ ఎడ్యుకేషన్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 147 సంఘాలు ఉపాధ్యాయ, ఉద్యోగులను మోసం చేశాయని, తెలంగాణ రాష్ట్ర సీపీఎస్ ఉద్యోగుల సంఘం (టీఎస్‌సీపీఎస్‌ఈయూ)మాత్రమే సీపీఎస్ అంతమే పంతంగా ఉద్యమాలు చేస్తోందని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం స్థితప్రజ్ఞ అన్నారు. సీపీఎస్ ఉద్యోగుల సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో వరంగల్ జిల్లా కేంద్రంలోని ఇస్లామియా కళాశాల మైదానంలో కాకతి కదనభేరి బహిరంగ సభను ఆదివారం నిర్వహించారు. సభకు ముఖ్య అతిథిగా హాజరైన స్థితప్రజ్ఞ మాట్లాడుతూ... 2004 సెప్టెంబరు 1న నాటి ప్రభుత్వం సీపీఎస్ విధానాన్ని ప్రవేశపెట్టినప్పుడు అప్పటి సంఘాలు వ్యతిరేకించకపోవడంతోనే ఆ విధానం అమలైందన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత పెన్షన్ విధానం మార్పునకు అవకాశం ఉన్నా ఎమ్మెల్సీలు, వ్యవస్థీకృత సంఘాలు ప్రతిపాదనలు చేయకపోవడంతో సీపీఎస్‌నే కొత్తగా ఏర్పాటైన రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిందని తెలిపారు. 2025 ఏప్రిల్ 1న కేంద్ర ప్రభుత్వం ఉద్యోగుల నెత్తిన యూపీఎస్ భూతాన్ని ఎత్తనున్నందని, అప్పుడైనా ఉపాధ్యాయ, ఉద్యోగులు తీవ్రంగా వ్యతిరేకిస్తే పాత పెన్షన్ విధానం అమలయ్యే అవకాశముందన్నారు. ఇప్పటి వరకు రాష్ట్రంలోని అన్ని సంఘాలు సీపీఎస్ ఉద్యోగులను వాటి అవసరాలకు మాత్రమే వాడుకున్నాయని ఆరోపించారు. సీపీఎస్ విధానాన్ని, జీవో నంబరు 317 అన్యాయాన్ని వ్యవస్థీకృత సంఘాలు ఎందుకు వ్యతిరేకించలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో సీపీఎస్‌ను రద్దు చేస్తామని హామీ ఇచ్చిందని, దాన్ని అమలు చేస్తుందనే భావిస్తున్నామని చెప్పారు. ఉద్యోగుల గొంతుకను శాసనమండలిలో వినిపించేందుకు సీపీఎస్ ఉద్యోగుల సంఘం పక్షాన డాక్టర్ కొలిపాక వెంకటస్వామిని వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించారు.

నూరు వసంతాల శాంతి చిహ్నం!

శత జయంతి ఉత్సవాలకు మెదక్ చర్చి ముస్తాబు.. వేడుకలను ప్రారంభించిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

క్రిస్మస్ సంబరాల్లో పాల్గొననున్న సీఎం రేవంత్‌రెడ్డి

మెదక్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : ఖండాంతర ఖ్యాతిగాంచిన మెదక్ చర్చి నిర్మాణమై సరిగ్గా వందేళ్లు గడుస్తున్నాయి. ఈ సందర్భంగా చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా ఆధ్వర్యంలో శత జయంతి వేడుకలకు ఈ చర్చి ముస్తాబైంది. దేశ వ్యాప్తంగా పర్యాటకులను ఆకర్షించే ఈ చర్చిలో క్రిస్మస్ వేడుకలను జరుపుకోవడానికి విదేశాల నుంచి సైతం భక్తులు వస్తుంటారు.ఈ ఏడాది ఉత్సవాలకు సీఎం రేవంత్ రెడ్డి హాజరుకానున్నారు. దక్షిణ భారతదేశ వ్యాప్తంగా సీఎస్ఐ డయాసిస్ పరిధిలోని 15 మండలాల పీఠాధిపతులు మెదక్‌కు రానున్నారు. శతాబ్ది ఉత్సవాలను గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆదివారం ప్రారంభించారు.

చర్చి చరిత్ర ఇదీ..

1914లో ఇంగ్లండ్‌కు చెందిన క్రైస్తవ మత బోధకుడు చార్లెస్ వాకర్ పాస్నెట్ మెదక్‌లో చర్చి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇందుకోసం నాటి నిజాం రాజు 120 ఎకరాల స్థలం కేటాయించారు. ఆ కాలంలో స్థానికంగా కరువు తాండవిస్తోంది. తిండి, తిప్పలు లేక అల్లాడుతున్న ఇక్కడి ప్రజలను ఆదుకోవడానికి చర్చి నిర్మాణం చేపట్టి వందలాది మందికి ఉపాధి కల్పించారు. పది సంవత్సరాల పాటు ఈ చర్చి నిర్మాణం సాగింది. ఇంగ్లాండ్, ఇటలీ, జర్మనీ దేశాల నుంచి ఇంజనీర్లు, శిల్పులు వచ్చి చర్చి నిర్మాణంలో పాలుపంచుకున్నారు. ప్రస్తుతం మెదక్ చర్చి దేశంలోనే రెండో అతి పెద్ద చర్చిగా బాసిల్లుతోంది. 200 అడుగుల పొడవు, 100 అడుగుల వెడల్పుతో రూపుదిద్దుకున్న మెదక్ చర్చికి ఉన్న 175 అడుగుల టవర్(గోపురం) చూపరులను విశేషంగా ఆకట్టుకుంటుంది. నాడు సిమెంట్ బదులుగా డంగు సున్నం వినియోగిస్తూ పూర్తిగా రాళ్లతో దీన్ని కట్టారు. సుమారు 5 వేలమంది భక్తులు ఒకేసారి ప్రార్థనలు చేసేందుకు వీలుగా విశాలమైన ప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు. హాలులో ధ్వని ప్రతిధ్వనించకుండా అప్పట్లోనే పలు రసాయనాలను వినియోగించి నిర్మించడం విశేషం. ఈజిప్ట్‌కి చెందిన గోథిక్ శైలిలో ఈ చర్చిని నిర్మించడానికి ఇంగ్లండ్ ఇంజనీర్ బ్రాడ్‌షా ప్లాన్ రూపొందించారు. వాస్తు శిల్పి థామస్ ఎడ్వర్డ్ నగిషీలు చెక్కారు. చర్చి లోపల పైకప్పు శిలువ ఆకారంలో అందంగా నిర్మించారు. ఇటలీ దేశానికి చెందిన శాలిష్‌బరీ ఆధ్వర్యంలో గాజుముక్కలతో క్రీస్తు చరిత్ర చిత్రాలు, ఆయన జీవితంలో ప్రధాన ఘట్టాలను చర్చి హాలుకు మూడువైపులా రంగు రంగుల గాజు ముక్కలతో చిత్రించడం విశేషం. చర్చి ముఖ ద్వారానికి ఎదురుగా ఏసుప్రభువు పునరుత్థానం చెందిన దృశ్యం చూపరులను కట్టిపడేస్తుంది. ఆయన జన్మ వృత్తాంతం కనిపిస్తుంది. ఉత్తరం వైపున శిలువ వేయబడిన దృశ్యం ఎంతో సజీవంగా ఉండి భక్తులను కంటతడి పెట్టిస్తుంది. ఇందులోని ప్రత్యేకత కేవలం సూర్యకిరణాలు ప్రసరించడం ద్వారా మాత్రమే ఈ అపురూపమైన చిత్రాలు గోచరిస్తాయి.





ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న గవర్నర్, ప్రముఖులు

శాంతిని కోరేవారికి నిలువెత్తు సాక్ష్యం

» గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

» మెదక్ చర్చి శతాబ్ది ఉత్సవాలు ప్రారంభం

మెదక్, కొల్చారం, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సమాజంలో శాంతిని కోరేవారికి మెదక్ క్యాథడ్రల్ చర్చి నిలువెత్తు సాక్ష్యంగా నిలుస్తోందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ కొనియాడారు. మెదక్ క్యాథడ్రల్ సీఎస్ఐ చర్చి నిర్మాణం పూర్తయి వంద సంవత్సరాలు గడుస్తున్న సందర్భంగా నిర్వహిస్తున్న శతాబ్ది ఉత్సవాలను ఆదివారం ఆయన ప్రారంభించారు. సండే ప్రేయర్ అనంతరం క్రైస్తవ గురువులు నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వంద సంవత్సరాల సంబరాలు విశ్వాసం, తపన, భగవంతుడి ఆమోఘమైన కృపకు నిదర్శనంగా నిలిచే మహత్తర ఘట్టమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, చర్చి ప్రెసిబిటరి ఇన్‌చార్జి రెవరెండ్ శాంతయ్య తదితరులు పాల్గొన్నారు. మెదక్ జిల్లా పర్యటనలో భాగంగా గవర్నర్ ఆదివారం కొల్చారం మండల కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థినులతో ముఖాముఖి చర్చలో పాల్గొన్నారు. ప్రజాప్రతినిధులు విద్యార్థినులతో కలిసి ఆయన భోజనం చేశారు.

సాఫ్ట్‌వేర్‌పై తగ్గిన క్రేజ్.. సివిల్స్‌పై మోజు!

(మొదటిపేజీ తరువాయి)

పని విషయంలో అసంతృప్తిగా ఉంటున్నారు. మరోవైపు అమెరికా వంటి దేశాల్లో ఉద్యోగావకాశాలు తగ్గుతుండడంతో బీటెక్ విద్యార్థుల ఆలోచనా సరళిలో మార్పు కనిపిస్తోందని సివిల్ సర్వీసెస్ శిక్షణా కేంద్రాల నిర్వాహకులు చెప్తున్నారు. ప్రతీ ఏడాది దేశవ్యాప్తంగా సుమారు 7 నుంచి 8 లక్షల మంది అభ్యర్థులు సివిల్స్‌కు దరఖాస్తు చేసుకుంటున్నారు. ఇందులో 5 నుంచి 6 లక్షల మంది పరీక్షలకు హాజరవుతున్నారు. ఈ పరీక్షలు రాసే వారిలో తెలుగు రాష్ట్రాలకు చెందిన వారు 30-40 వేల మంది వరకు ఉంటున్నారు. దేశంలో ఏటా వెయ్యి వరకు అఖిల భారత సర్వీసులో పోస్టులను భర్తీ చేస్తున్నారు. ఇందులో 10 శాతం అంటే సుమారు 100 పోస్టుల వరకు తెలుగు వారు ఎంపికవుతున్నారు. వీటిలో కూడా 60 నుంచి 70 పోస్టులను తెలంగాణకు చెందిన అభ్యర్థులు పొందుతున్నారు. సివిల్స్‌కు తెలుగువారు ఎక్కువగా ఎంపిక కావడం కూడా అభ్యర్థుల ఆసక్తి పెరగడానికి కారణమవుతోంది. హైదరాబాద్‌లో నాణ్యమైన కోచింగ్ కేంద్రాలు ఉండడం కూడా అభ్యర్థులకు కలిసి వస్తోంది. సివిల్స్‌కు సన్నద్ధమయ్యే వారిలో ఎక్కువ మంది 24 నుంచి 28 ఏళ్ల లోపు వారే ఉంటున్నారు. గతంలో సివిల్స్‌కు ఎంపికయ్యేందుకు ఏళ్ల తరబడి ఎదురుచూసే ధోరణి ఉండేది. ఎంపిక కాకపోతే ప్రత్యామ్నాయ మార్గాల విషయంలో ఇబ్బందులు తలెత్తేవి. అయితే ఇప్పటి అభ్యర్థుల ఆలోచన గతానికి భిన్నంగా ఉంటున్నాయి. ముఖ్యంగా సివిల్స్ సన్నద్ధమయ్యేందుకు ఒకటి లేదా రెండేళ్ల సమయం మాత్రమే కేటాయిస్తున్నారు. ఎంపికయ్యే సామర్థ్యం ఉన్నట్టు భావిస్తే మరో ప్రయత్నం చేస్తున్నారు. లేదంటే ఇతర ఉద్యోగాల్లో స్థిరపడుతున్నారు. 30 ఏళ్లలోపే ఒక నిర్ణయానికి వస్తున్నారని, ఇది కూడా మంచి పరిణామమేనని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. సివిల్స్ విషయంలో గత ఐదారేళ్ల క్రితంతో పోలిస్తే ప్రస్తుతం తెలుగువారిలో ఈ మార్పు గణనీయంగా కనిపిస్తోందని సివిల్స్ మెంటార్ బాలలత తెలిపారు.

మెడికల్ పీజీ ప్రవేశాలు ఆలస్యం

(మొదటిపేజీ తరువాయి)

ఎంబీబీఎస్ పూర్తి చేసిన ఇతర రాష్ట్రాలకు చెందిన వారిని స్థానిక కోటా కింద పరిగణించాలని హైకోర్టు తాజాగా తీర్పు ఇచ్చింది. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం న్యాయ నిపుణులతో చర్చించి సుప్రీంకోర్టును ఆశ్రయించింది. హైకోర్టు తీర్పుపై స్టే ఇవ్వాలని సర్వోన్నత నాయ్యస్థానాన్ని కోరింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం కోరుకున్నట్లుగా సుప్రీంకోర్టు హైకోర్టు తీర్పుపై స్టే ఇవ్వలేదు. ఈ అంశంపై జనవరి 7న వాదనలు వింటామని వెల్లడించింది. సుప్రీంకోర్టుకు శనివారం నుంచి క్రిస్మస్, నూతన సంవత్సరం సందర్భంగా జనవరి 2 వరకు సెలవులున్నాయి. ఫలితంగా జనవరి 7 వరకు ఆగాల్సివచ్చింది. కాగా పీజీ ప్రవేశాలకు సంబంధించి అన్ని రకాల ప్రవేశాలను ఫిబ్రవరి 5లోగా పూర్తి చేయాలన్న నిబంధన ఉంది. సుప్రీం కోర్టు గతంలో ఇచ్చిన మార్గదర్శకాల మేరకు ఆలోగా ప్రవేశాల ప్రక్రియ పూర్తి చేయాలి. జనవరి 7న సుప్రీంకోర్టు తీర్పు వస్తే... అప్పటి నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభించినా ఫిబ్రవరి ఐదులోగా పూర్తి చేయడం సాధ్యంకాదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రవేశాలకు సంబంధించి మొత్తం నాలుగు రౌండ్స్ ఉంటాయి. కన్వీనర్‌కోటా, యాజమాన్య కోటా, ఎన్ఆర్ఐ (సీ కేటగిరి) కోటాతో పాటు స్ట్రే వెకెన్సీ ఉంటుంది. ఒక్కో విడతకు కనీసం వారంరోజుల సమయమివ్వాలి. ఎందుకంటే విద్యార్థికి సీటు కేటాయించిన తర్వాత వారు జాయిన్ అయ్యేవరకు ఆగాలి. అనంతరం మరోవిడత కౌన్సిలింగ్‌ను చేపట్టాలి. ఇలా తక్కువ సమయంలోనే అన్ని రకాల కౌన్సిలింగ్‌ను ఎలా చేపడతారని మెడికోలు ప్రశ్నిస్తున్నారు.

ఇలా చేస్తేనే సాధ్యం..

హైకోర్టు తీర్పు ప్రకారం కౌన్సెలింగ్ ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని వైద్య విద్య నిపుణులు చెబుతున్నారు. అయితే విద్యార్థులకు కేటాయించిన సీట్లు సుప్రీంకోర్టు ఇచ్చే తుది తీర్పు ఆధారంగా ఉంటాయని ముందే స్పష్టం చేయాలి. ఒకవేళ సుప్రీం కోర్టు హైకోర్టు తీర్పుపై స్టే ఇచ్చి, రాష్ట్ర ప్రభుత్వ వాదనను సమర్థిస్తే... ఇతర రాష్ట్రాలకు చెంది ఇక్కడ ఎంబీబీఎస్ చేసిన వారికి పీజీలో సీటు వస్తే అవి రద్దవుతాయి. ప్రస్తుతం తక్కువ సమయం ఉండటం వల్ల కోర్టు తీర్పు వచ్చేవరకు ఆగకుండా ప్రవేశాల ప్రక్రియను ప్రారంభించాలని మెడికోలు కోరుతున్నారు. మరోవైపు రెండు విడుతల ప్రవేశాల అనంతరం పీజీ వైద్యవిద్య తరగతులు ప్రారంభించాలని జాతీయ వైద్య కమిషన్ మార్గదర్శకాలు చెబుతున్నాయి. ఆ ప్రకారం చూస్తే జనవరి మొదటి వారం నుంచి పీజీ తరగతులు దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ మొదలవుతాయి. కానీ ఆసమయానికి మనదగ్గర కౌన్సెలింగ్ ప్రక్రియ కూడా మొదలుకాబోదని మెడికోలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా మన రాష్ట్ర విద్యార్థులు అఖిల భారత కోటా దరఖాస్తులో భాగంగా ఫీజు కింద రూ.25 వేల వరకు చెల్లిస్తారని, అవి కోల్పోయే ప్రమాదం ఉందని మెడికోలు చెబుతున్నారు. మనరాష్ట్రంలో 1300 వరకు పీజీ సీట్లున్నాయి. వాటిలో 50 శాతం ఆలిండియా కోటాకు వెళ్తాయి. ఆ కోటాలోని 650 సీట్లకు ఇప్పటికే మెడికల్ కౌన్సెలింగ్ కమిటీ(ఎంసీసీ) కౌన్సిలింగ్ ప్రక్రియను దాదాపు పూర్తి చేసింది. కాగా, మెడికల్ పీజీ ప్రవేశాల ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని లోకల్ పీజీ స్టూడెంట్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. కౌన్సెలింగ్ ప్రక్రియ జాప్యం వల్ల మెడికోలకు అన్యాయం జరుగుతోందని పేర్కొంది.

వైద్య శాఖకు ఇన్‌చార్జిల జాడ్యం!

» పదేళ్లు దాటినా రెగ్యులర్ హెచ్‌వోడీల్లేరు

» కీలక విభాగాలన్నింటిల్లో ఇదే పరిస్థితి

» 9నెలల క్రితం సీఎంవో చెప్పినా అదే తీరు



హైదరాబాద్, డిసెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఏర్పడి పదేళ్లు దాటినా కీలక విభాగాలకు ఇంకా ఇన్‌చార్జిలే దిక్కు అవుతున్నారు. ప్రధానంగా వైద్య ఆరోగ్య శాఖను ఇన్‌చార్జిల జాడ్యం వీడడం లేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం.. కనీసం విభాగాధిపతుల పోస్టులను క్రియేట్ చేయలేదు. పదేళ్లపాటు ఇన్‌చార్జి అధికారులతోనే కాలం వెళ్లదీసింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా.. ఆ పరిస్థితి మారలేదు. ఎట్టకేలకు హెచ్‌వోడీ పోస్టులను మంజూరు చేసినా.. కూడా రెగ్యులర్ విభాగాధిపతులను నియమించకపోవడం విమర్శలకు తావిస్తోంది. వైద్య ఆరోగ్య శాఖలోని వైద్య విద్య సంచాలకులు(డీఎంఈ), రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకులు(డీహెచ్), తెలంగాణ వైద్యవిధాన పరిషత్ కమిషనర్ పదవుల్లో ఇప్పటికీ ఇన్‌చార్జి అధికారులే కొనసాగుతుండడంపై సీనియర్ ఉద్యోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత బీఆర్ఎస్ హయంలో ఉన్న ఇన్‌చార్జిలను తొలగించింది. డీఎంఈగా పనిచేస్తున్న డాక్టర్ రమేశ్‌రెడ్డిని గత ఏడాది డిసెంబరు 20న తప్పించి.. డాక్టర్ త్రివేణికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించింది. ఫిబ్రవరి 20న ఆమె స్థానంలో డాక్టర్ వాణిని ఇన్‌చార్జి డీఎంఈగా నియమించింది. ఇప్పటికి పది నెలలు గడుస్తున్నా.. రెగ్యులర్ డీఎంఈని నియమించకపోవడం ఏంటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. డిపార్టమెంట్ ప్రమోషన్ కమిటీ (డీపీసీ) ఆమోదంతో రెగ్యులర్ డీఎంఈ నియామక ప్రక్రియ పూర్తయి నెలలు గడుస్తున్నా... ఇన్‌చార్జితోనే సర్కారు నెట్టుకొస్తోంది. మరోవైపు.. 2014 నుంచి నేటి దాకా ఇన్‌చార్జి డీహెచ్‌లుగా ఏడుగురు పనిచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత సీనియారిటీలో జాబితాలో ముందు ఉన్న డాక్టర్ రవీంద్రనాయక్‌కు ఆ పదవీ బాధ్యతలు అప్పగించింది. ఈ ఏడాది జరిగిన ఉద్యోగుల సాధారణ బదిలీల్లో ప్రజారోగ్య సంచాలకుల పరిధిలో భారీగా అక్రమాలు జరిగాయన్న ఆరోపణలు వచ్చాయి. బదిలీల్లో సీనియారిటీ పాటించలేదని, ఇష్టారాజ్యంగా ఉత్తర్వులు ఇవ్వడం వెనుక డబ్బులు చేతులు మారాయని విజిలెన్స్ కూడా సర్కారుకు నివేదించింది. దీంతో డీహెచ్‌తోపాటు కార్యాలయంలోని పలువురికి చార్జిమెమోలు జారీ అయ్యాయి. ఈ నేపథ్యంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిని డీహెచ్ పోస్టులో ఎలా కొనసాగిస్తార్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఇక నర్సింగ్ కౌన్సిల్‌ది మరీ దారుణం. రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి నేటి దాకా ఒక్కరే ఆ పోస్టులో కొనసాగుతున్నారు. అది కూడా ఇన్‌చార్జిగానే కావడం గమనార్హం. గత ప్రభుత్వం నియమించిన వారినే కాంగ్రెస్ సర్కారు కొనసాగించడంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి.

అప్పట్లోనే సీఎంవో వివరణ.. అయినా అదే తీరు

వైద్య శాఖకు ఇన్‌చార్జిలే దిక్కు అవుతున్నారంటూ ఈ ఏడాది మార్చి 24న 'ఆంధ్రజ్యోతి'లో 'వైద్యానికి ఇన్‌చార్జిలు' పేరిట కథనం ప్రచురితమైంది. దీనిపై సీఎంవో స్పందించింది. పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన వెంటనే వైద్య ఆరోగ్యశాఖలోని విభాగాధిపతుల పోస్టులను నియమిస్తామని ప్రకటించింది. జనవరి 29న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వైద్యశాఖపై సమీక్ష నిర్వహించారని వెల్లడించింది. అందులోనే ప్రజారోగ్య సంచాలకులు, టీవీవీపీ కమిషనర్, డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేటివ్ హెచ్‌వోడీ పోస్టులను క్రియేట్ చేయని విషయం సీఎం దృష్టికి వచ్చినట్లు తెలిపింది. అదే రోజు పోస్టులు క్రియేట్ చేయాలంటూ సీఎం ఆదేశాలు జారీ చేశారని వెల్లడించింది. ఇప్పటికే డీఎంఈ పోస్టును క్రియేట్ చేశామని, పదోన్నతి ద్వారా భర్తీ చేస్తామని పేర్కొంది. ఈ వివరణ ఇచ్చి కూడా సరిగ్గా తొమ్మిది నెలలు అవుతోంది. అయినప్పటికీ వైద్య ఆరోగ్య శాఖలో ఏ మార్పూ కనిపించడం లేదు. రెగ్యులర్ వద్దు... ఇన్‌చార్జిలే ముద్దు అన్న చందంగా వ్యవహరిస్తోంది.

ఢిల్లీలో టీడీపీ సభ్యత్వ నమోదు

అధిక సంఖ్యలో హాజరైన అభిమానులు

త్వరలో నోయిడా, గురుగ్రామ్‌లోనూ కార్యక్రమాలు

న్యూఢిల్లీ, డిసెంబరు 22(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ఢిల్లీలో మొట్టమొదటిసారిగా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించింది. ఆదివారం మసోనిక్ సెంటర్ ఆఫ్ ఇండియాలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పార్టీ మద్దతుదారులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకుడు కృష్ణమోహన్ ఆలపాటి మాట్లాడుతూ చంద్రబాబు సుపరిపాలన, దార్శనికత వల్ల అసంఖ్యక ప్రజలు పార్టీకి అండగా నిలిచారన్నారు. అభివృద్ధి, సంక్షేమంపై టీడీపీ ప్రభుత్వం దృష్టి సారించడం వల్ల పార్టీ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన లభిస్తోందని చెప్పారు. ఢిల్లీలోనూ వందలాది మంది టీడీపీ సభ్యత్వాన్ని తీసుకున్నారని తెలిపారు. రాబోయే రోజుల్లో నోయిడా, గురుగావ్‌లోనూ సభ్యత్వ నమోదు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో పార్టీ పార్లమెంటరీ కార్యాలయ కార్యదర్శి ఎస్.సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.